వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సంపుటి : 7 సంచిక : 10 హైదరాబాద్ 99 అక్టోబర్ 2009 పేజీలు : 60 రు. 10

- ఫోకస్ : అరవై ఏళ్ల చైనా విముక్తి పాఠాలూ - గుణపాఠాలూ
- రాష్ట్రాల నిలువు దోపిడీ
- ఆర్థిక విధానాలు - బోధనా మాధ్యమం
- విద్యా హక్కు బిల్లు
- ద్రవ్య సంక్షోభం సమసిపోతుందా?
- దళితులను దగా చేస్తున్న కాకినాడ సెజ్

వీక్షణం మీరు చదువుతున్నారా?వెంటనే చందాదారులు కండి !
మీరు చందాదారులేనా? కనీసం మరొకరి చందా చేర్పించండి!

మీ గ్రంథాలయానికి, కార్యాలయానికి, మీకు తెలిసిన ప్రజాసంఘాలకు
వీక్షణం ను పరిచయం చేయండి, వీక్షణం మీ పత్రిక, ప్రజల పత్రిక
నాలుగు కాలాలు నడిచేలా చూసే బాధ్యత మీదే

మీరు తప్పనిసరిగా తెలుసుకోవలసిన సమస్త సామాజిక, రాజకీయార్థిక
విషయాలను సమగ్రంగా, స్పష్టంగా వివరిస్తాయి **వీక్షణం** వ్యాసాలు

విడి ప్రతి కేవలం రు.10 మాత్రమే

చందా వివరాలు

సంవత్సర చందా	రు. 120
మూడు సంవత్సరాల చందా	రు. 350
ఐదు సంవత్సరాల చందా	రు. 550
పది సంవత్సరాల చందా	రు. 1000

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం

మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3 హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495,
ఇమెయిల్ : veekshanam2003@gmail.com, reachcdrc@yahoo.com
సర్క్యులేషన్ మేనేజర్ : 9949391028

వీక్షణం 99
రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక
అక్టోబర్ 2009
సంపుటి : 7
సంచిక : 10
సమతా పబ్లికేషన్స్, సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రిసర్చ్ అండ్ కమ్యూనికేషన్ ప్రచురణ

వీక్షణం చందా వివరాలు

సంవత్సర చందా	రు. 120
3 సంవత్సరాల చందా	రు. 350
5 సంవత్సరాల చందా	రు. 550
10 సంవత్సరాల చందా	రు. 1000

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు,
డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం
రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక
మైత్రి రెసిడెన్సీ, 3-6-394,
స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029.
ఫాక్స్, ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com
reachcdrc@yahoo.com

డిస్ట్రిబ్యూటర్స్
ఆనంద్ ఏజన్సీస్, హైదరాబాద్.
ఫోన్ : 98484 28516
98482 49695

ప్రింటర్స్
చరితా ఇంప్రెషన్స్,
ఆజామాబాద్, హైదరాబాద్
ఫోన్ : 040 - 27678411

సంపాదకీయం

విధానాల మీద పోరాడవలసిందే

ఐదు సంవత్సరాలకు పైగా ప్రజావ్యతిరేక విధానాల పరంపరను కొనసాగించిన ముఖ్యమంత్రి హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. రాష్ట్రవ్యాపిత పాదయాత్ర, ప్రపంచ బ్యాంకు నిర్దేశిత ఆర్థిక సంస్కరణలను వ్యతిరేకిస్తూ మాట్లాడడం, తెలంగాణ ప్రత్యేకరాష్ట్ర ఆకాంక్షలను గౌరవిస్తున్నట్టుగా తెలంగాణ రాష్ట్ర సమితితో పొత్తు కుదుర్చుకోవడం, విప్లవోద్యమంతో చర్చలు జరుపుతానని వాగ్దానం చేయడం, అంతకుముందరి పాలనలో విస్మరణకు గురయిన గ్రామీణ, వ్యవసాయ రంగాలపై శ్రద్ధ పెడతానని హామీ ఇవ్వడం వంటి కొన్ని ఆకర్షణీయమైన వాగ్దానాలతో ప్రారంభమైన రాజశేఖరరెడ్డి పాలన అతిత్వొందరలోనే ఆ వాగ్దానాలన్నిటికీ తూట్లు పొడిచింది. అంతకు ముందరి పాలనకంటె ఎక్కువ ప్రజాకంటక పాలనగా రుజువు చేసుకుంది. విప్లవోద్యమంతో చర్చలకు ముగింపు పలికి, నెత్తురుటేర్లు పారించి ఉద్యమాన్ని అణచివేయడం, తెలంగాణ ఆకాంక్షలకు ద్రోహం చేసి, తెలంగాణ మీద మరింత దుర్మార్గమైన దోపిడీ పాలనను రుద్దడం, అంతకుముందరి పాలకుడిని ప్రపంచబ్యాంకు పాలేరుగా విమర్శించిన తానే పెద్ద పాలేరుగా మారిపోవడం, ముదిగొండ కాల్పులు, వాకపల్లి అత్యాచారాలు, ప్రత్యేక ఆర్థిక మండలాలు, వాన్‌పిక్, యురేనియం, బాక్సైట్ గనులు, అవినీతి, కుంభకోణాలు నిండిన పాలన సాగించారు. ఒకవైపు ప్రజాఉద్యమాలను అణచివేస్తూ, మరొకవైపు సామాజిక సంక్షేమ, ప్రజానుకూల పథకాలను రద్దుచేస్తూ, ఇంకొకవైపు వ్యక్తిగత లబ్ధి చేకూర్చే కొన్ని ప్రజాకర్షక పథకాలను మాత్రం ప్రవేశపెట్టి కొన్ని వర్గాల ప్రజలలోనో, కొంతమంది లబ్ధిదారులలోనో భ్రమలు వ్యాపింపజేసిన చరిత్ర రాజశేఖరరెడ్డిది. ప్రజల మేలుగా కనబడేదానిలో కూడ సంపన్నుల, బలవంతుల ప్రయోజనాలు చేకూర్చిపెట్టడం ఆ విధానాల సారాంశం. ఉద్దేశిత, ప్రకటిత లక్ష్యాలు ఏవయినా ఆరోగ్యశ్రీ పేరిట కార్పొరేట్ ఆస్పత్రులు, జలయజ్ఞం పేరిట కాంట్రాక్టర్లు, ఇందిరమ్మ గృహాలు, పెన్షన్లు పేరిట శాసనసభ్యులు లాభపడ్డారు. మొత్తం మీద 2004-09 కాలంలో రాజశేఖరరెడ్డి ప్రభుత్వం కనీసం పార్లమెంటరీ ప్రజాస్వామిక, రాజ్యాంగ బద్ధ, సంక్షేమరాజ్య పరిమితులలోనైనా ప్రజానుకూలంగా పనిచేయలేదు. అయినా కొత్త వాగ్దానాలు చేయకుండానే, పాత భ్రమలవల్లనో, అంతకుముందరి ప్రభుత్వం మీద కోపం తగ్గకపోవడం వల్లనో, ప్రతిపక్షాల వ్యూహాలు సక్రమంగా లేకపోవడం వల్లనో, ప్రతిపక్షాల మధ్య వోట్లు చీలడం వల్లనో 2009 ఎన్నికలలో నెగ్గి రెండోసారి కాంగ్రెస్ అధికారం చేపట్టింది. రెండో దఫా పాలన ఎంత దుర్మార్గంగా ఉండబోతున్నదో సహకారసేద్యం, ప్రతిపక్ష రాజకీయ పార్టీల నోరు మూయించడం, ప్రజలమీద నిర్బంధం, పెరిగిన అవినీతి వంటి నిదర్శనాలు కనబడ్డాయి. ఈ విధానాలలో వ్యక్తిగా రాజశేఖరరెడ్డి పాత్ర ఎంత ఉన్నదో అది ఆయన దుర్మరణంతో రద్దవుతుంది. కాని పాలక రాజకీయార్థిక విధానాలుగా అవి కొనసాగుతూనే ఉంటాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యమనే కనీస ఆచ్ఛాదన కూడ లేకుండా రాచరికంలాగ వారసత్వాన్ని కొడుకుకు కట్టబెట్టాలనే డిమాండ్లు, కట్టబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి. రెండు పర్యాయాలు తెలుగుదేశం అధికారంలో కొనసాగినందువల్ల తమ ప్రయోజనాలు దెబ్బతిన్నాయని భావించిన పాలకవర్గ ముఠాలు, తెలుగుదేశం నుంచి కాంగ్రెస్ వైపు విధేయత మార్చుకున్న ముఠాలు, రెండు పాలనలలోనూ ప్రయోజనాలు పొందిన బహుళజాతి సంస్థలు, దేశదేశాల సంపన్నులు కలిసిన ఒక సామ్రాజ్యాన్ని రాజశేఖరరెడ్డి నిర్మించి కొనసాగించారు. ఆ సామ్రాజ్యాన్ని చెక్కుచెదరకుండా కాపాడడం, విస్తరించడం ఇవాళ ఆ పాలకవర్గ ముఠాలకు కావాలి. ఇప్పుడు ఎవరు ముఖ్యమంత్రి కావాలనే వాదనలన్నిటికీ మూలం ఆ రాజకీయార్థిక ప్రయోజనాలే. కాంగ్రెస్‌లోనే ఉన్న ముఠా తగాదాలు, జగన్ పట్ల రాజభక్తి, కాంగ్రెస్‌లోని భజనపరుల సంప్రదాయం వంటివన్నీ అదనపు కారణాలే గాని అసలు కారణాలు రాజకీయార్థిక ప్రయోజనాలే. ఆ ప్రయోజనాలను సమర్థంగా నెరవేర్చిన పాత ముఖ్యమంత్రి స్థానంలో రానున్న ముఖ్యమంత్రి యథాతథంగా సాగించగలరా లేదా అనేదే పాలకవర్గాల ప్రశ్న. పాలకవర్గ ప్రయోజనాలు నెరవేరుస్తూనే, ప్రజావ్యతిరేక పాలన సాగిస్తూనే, ప్రజలను ఆకట్టుకోగలిగిన నాయకులలో జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ తర్వాత రాజశేఖరరెడ్డి నిలుస్తారు. ఆ వారసత్వాన్ని ఎవరు కొనసాగించగలరా అని ఇప్పుడు వెతుకులాట సాగుతున్నది. ఎవరు పోయి ఎవరు వచ్చినా ప్రజల కడగండ్లకు అంతంలేదు. ఒకరి పాలనలో వీపుల మీద దెబ్బలు, మరొకరి పాలనలో కడుపు మీద దెబ్బలే తప్ప, రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా అనేదే ఎల్లప్పుడూ ప్రజల స్థితి. సంఘటిత ప్రతిఘటనా పోరాటం ఒక్కటే మార్గం. వీ

న్యాయమూర్తుల అక్రమ ఆస్తుల వివాదం

దేశంలో న్యాయవ్యవస్థ పనితీరులోని అక్రమాల గురించి చర్చ చాలకాలంగా సాగుతున్నది. ముఖ్యంగా కొందరు న్యాయమూర్తులయినా అవినీతికి పాల్పడుతున్నారనీ, వారు ఇచ్చే తీర్పులమీద ఆ అవినీతి ప్రభావం చూపుతున్నదనీ ఆరోపణలు పెద్ద ఎత్తునే వస్తున్నాయి. న్యాయమూర్తులు అధికార వర్గాలకు, సంపన్నవర్గాలకు అనుకూలంగా తీర్పులు ఇచ్చినప్పుడల్లా ప్రజలలో ఇటువంటి అనుమానాలు పొడసూపుతున్నాయి. ఈ అవినీతి ఆరోపణలనుంచి బయటపడడానికి న్యాయమూర్తులు తమ ఆస్తుల వివరాలను బహిరంగంగా ప్రకటించాలని సూచనలు కూడ వస్తున్నాయి. చిట్టచివరికి పార్లమెంటు గత సమావేశాలలో న్యాయమూర్తుల ఆస్తుల ప్రకటనను చట్టబద్ధం చేస్తూ ఒక బిల్లు తయారయింది. కాని ఆ ఆస్తుల ప్రకటనను రహస్యం చేశారు. హైకోర్టు న్యాయమూర్తులు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దగ్గర, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు రాష్ట్రపతి దగ్గర ఆస్తుల వివరాలు ఇస్తే సరిపోతుందన్నారు. ఈ ప్రకటనలను సమాచార హక్కు నిబంధనల నుంచి మినహాయించడంతో చర్చ సంచలనాత్మకంగా మారింది. బిల్లును తాత్కాలికంగా ఉపసంహరించి రానున్న సమావేశాల్లో సవరణలతో ప్రవేశపెడతామన్నారు. న్యాయమూర్తుల ఆస్తులను బహిరంగంగా ప్రకటిస్తే వారిమీద ఎవరయినా రాయి విసరడానికి అవకాశం ఇచ్చినట్టవుతుందని, కనుక సమాచార హక్కు చట్టం నుంచి మినహాయింపు అవసరమేనని స్వయంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించడంతో చర్చ మరింత గందరగోళానికి దారి తీసింది. ఈ వ్యాఖ్యకు ప్రతిస్పందనగా కర్నాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి వి శైలేంద్ర కుమార్ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ లో ఒక వ్యాసం రాశారు. న్యాయమూర్తులు ఆస్తుల ప్రకటనకు భయపడనక్కరలేదనీ, తమకు దాచుకోవలసిందేమీలేదని ఆయన అన్నారు. ఆయన తన ఆస్తుల వివరాలను కూడ ప్రకటించారు. మరికొందరు న్యాయమూర్తులు కూడ స్వచ్ఛందంగా తమ ఆస్తుల వివరాలను ప్రకటించారు. కాని ఆ వ్యాసాన్ని, ఆస్తుల ప్రకటనను 'పత్రికల్లో ప్రచారం కోసం చేసిన ఎత్తుగడ'గా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కొట్టిపారేశారు. తర్వాత కొద్దిరోజులకే సుప్రీంకోర్టు న్యాయమూర్తులందరూ తమ ఆస్తుల వివరాలను బహిరంగంగా సుప్రీంకోర్టు వెబ్‌సైట్ మీద ప్రకటించడానికి అంగీకరించారు. ప్రజాజీవనంలో పారదర్శకతకు, ముఖ్యంగా శాసననిర్మాణ, కార్యనిర్వాహక వ్యవస్థలను కూడ పర్యవేక్షించే అధికారం ఉన్న న్యాయవ్యవస్థ మెరుగైన పనితీరుకు ఈ చర్చ దోహదం చేయాలి. ఇది ఏదో న్యాయమూర్తులకూ, ప్రభుత్వానికీ సంబంధించిన సాంకేతిక వ్యవహారం కాదు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థకు ఉన్న కీలక స్థానం దృష్ట్యా ఆ వ్యవస్థ జవాబుదారీగా, సక్రమంగా, ప్రజోపయోగకరంగా ఉండడం సామాజిక అవసరం. అందువల్ల న్యాయమూర్తుల ఆస్తుల ప్రకటన విషయంలో సమాజం ఎక్కువ శ్రద్ధ వహించాలి.

సరిహద్దులలో సంచలనం వెనుక నిజాలు

చైనా సైనికులు సిక్కింలోకీ, అరుణాచలప్రదేశ్ లోకీ, లడాఖ్ లోకీ చొచ్చుకువస్తున్నారని భారతీయ పత్రికలలో వార్తల హోరు పెరిగింది. నిజానికి ఈ వార్తలలో నమ్మదగినవెన్నో, స్వార్థ ప్రయోజన శక్తుల కల్పనలెన్నో ఎవరూ చెప్పలేరు. ఇరుగుపొరుగు దేశాలతో కయ్యానికి కాలు దువ్వుతూ, తద్వారా కృత్రిమ దేశభక్తిని రెచ్చగొట్టి దేశప్రజలను తమ నిజమైన సమస్యలనుంచి ఏమార్చడానికీ, రహస్యంగా సాగే వేలకోట్ల రూపాయల ఆయుధ, సైనికావసరాల వ్యాపారాలు నిర్వహించడానికీ కొన్ని శక్తులు నిరంతరం ప్రయత్నిస్తుంటాయి. ఆ శక్తులు ప్రచార సాధనాలను వాడుకుని లేని బూచిని చూపడానికి ప్రయత్నిస్తుంటాయి. ఆ శక్తులలోనే కొన్ని, విభిన్న ప్రచారాలు కూడ చేస్తూ ప్రజలను గందరగోళంలో ముంచడానికి ప్రయత్నిస్తాయి. మొత్తం మీద విదేశీ సంబంధాలలో, సరిహద్దుల విషయంలో భారత పాలకులు మొదటినుంచీ అనుసరిస్తున్న వ్యూహం ఇదే. సమస్యలు ఉంటే చిత్తశుద్ధితో దౌత్యసంబంధాలద్వారా పరిష్కరించుకునే బదులు, వాటిని కూడ దేశంలోపలి సమస్యలను విస్మరింపజేయడానికి, ప్రజలను రెచ్చగొట్టడానికి వాడుకోవడం అనేది భారత పాలకులకు ఒక కళగా మారింది. అందుకే ఒకవైపు 'భారత సరిహద్దులు అత్యంత శాంతియుతంగా ఉన్నాయి, దానిమీద ఆందోళనపడవలసిందేమీలేదు' అని విదేశాంగశాఖ మంత్రి ఎస్ ఎం కృష్ణ అంటుండగా, ఆయా ప్రాంతాల సైనికాధికారులు, యుద్ధ సన్నాహాలవల్ల లాభపడే వ్యాపారులు చైనా సైనికుల చొరబాట్ల గురించి ధృవీకరించడానికి అవకాశం లేని ప్రకటనలు చేస్తున్నారు. భారతీయ జనతాపార్టీ, ఇండియన్ డిఫెన్స్ రివ్యూ లాంటి యుద్ధోన్మాదాన్ని రెచ్చగొట్టే పత్రికలు, కొన్ని సాధారణ పత్రికలు కూడ ఏదో జరిగిపోతున్నదన్నట్టు, వెంటనే యుద్ధానికి సర్వసన్నాహాలు చేయాలన్నట్టు హడావిడి చేస్తున్నాయి. భారత ప్రభుత్వం ఉండవలసినంత యుద్ధ సన్నద్ధతతో లేదని భారతీయ జనతా పార్టీ వ్యాఖ్యానించింది. వెంటనే ఒక శ్వేతపత్రాన్ని ప్రకటించాలని, చైనా చొరబాట్లను గట్టిగా తిప్పికొట్టాలనీ పిలుపునిచ్చింది. భారత ప్రభుత్వం అధికారికంగా చైనా ప్రభుత్వానికి కోపం తెప్పించే మాటలూ చేతలూ వద్దని, ఏ సమస్యనైనా దౌత్య పరంగానే పరిష్కరించుకోవాలని అంటూనే మరోవైపు ఈ యుద్ధోన్మాదాన్ని రాజేసే పనులు చేస్తోంది. సాధారణంగా ప్రభుత్వాలు, పాలకులు ప్రజలకు నిజాలు చెప్పరనీ, అబద్ధాలాడి మాయ చేస్తారనీ భావించే మేధావులు, పత్రికా వ్యాఖ్యాతలు కూడ సరిహద్దులు, విదేశీ సంబంధాల విషయంలో మాత్రం ప్రభుత్వం చెప్పే ప్రతి మాటనూ నమ్మడానికి సిద్ధంగా ఉంటారు. నిజానికి ఇది ప్రభుత్వాలకూ, సైన్యాలకూ, ప్రతిపక్షాలకూ, వ్యాఖ్యాతలకూ సంబంధించిన విషయం కాదు. ప్రజలకు సంబంధించిన విషయం. యుద్ధ సన్నాహాలు ప్రజా సంక్షేమానికి అందవలసిన నిధులను కొల్లగొట్టి ఆయుధవ్యాపారుల, రాజకీయప్రముఖుల బొక్కసాలు నింపుతాయి. యుద్ధం వస్తే అది ప్రజా జీవితాన్ని అల్లకల్లోలం చేస్తుంది. ఎంతో మంది అమాయకుల ప్రాణాలు బలిగొంటుంది. పాలకుల స్వార్థ ప్రయోజనాల కోసం సాగే యుద్ధంతో ప్రజలకేమీ నిమిత్తం లేదు. నిజంగా ఇరుగుపొరుగు దేశాలతో సమస్యలు ఉన్నా వాటిని సామరస్యంగా, చర్చలతో, దౌత్యపరంగా పరిష్కరించుకోవలసిందేననీ, తమ మీద అనవసరమైన యుద్ధాన్ని రుద్దగూడదనీ ఎలుగెత్తి యుద్ధవ్యతిరేక ఉద్యమం నిర్మించవలసినది ప్రజలే. వీ

లోపలి పేజీల్లో...

ఫోకస్ : చైనా విముక్తికి అరవై ఏళ్లు - పాఠాలూ, గుణపాఠాలూ

1949 అక్టోబర్‌లో చైనాలో విజయవంతమైన విప్లవం ప్రపంచ దేశాలన్నింటిలో, ముఖ్యంగా మూడవ ప్రపంచ దేశాల్లో ఎంతో ఆసక్తిని కలిగించింది. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన చైనాలో కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి రావడం దానంతటదే ఒక ఉత్తేజకరమైన అంశం. ఆ ప్రభుత్వం వివిధ పునాది ఉపరితల రంగాలలో చేపట్టబోయే విప్లవాత్మక మార్పుల పట్ల వెనుకబడిన దేశాల ప్రజల్లో, ఆలోచనాపరుల్లో ఆశావహ దృష్టి ఏర్పరిచింది. అరవై ఏళ్ల తరువాత ఆ చైనా గురించి వేయగల మదింపు ఏమిటి?

'వీక్షణం'లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమైన అభిప్రాయాలన్నిటితో సంపాదకులకు ఏకీభావం ఉండనవసరం లేదు.
'వీక్షణం'ను నిజమైన ప్రజాపక్ష రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణా వేదికగా తీర్చిదిద్దడంలో అన్నిరకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాల ఛాయలకు స్థానం కల్పించాలని సంపాదక వర్గం భావిస్తోంది.

రచయితలకు సూచన

ఏ పత్రికయినా తాను అచ్చువేసే రచనలు తనకే ప్రత్యేకంగా ఉండాలని కోరుకుంటుంది. 'వీక్షణం' కూడా అలానే భావిస్తోంది. ఇటీవల కొందరు రచయితలు తమ రచనలను ఒకేసారి అనేక పత్రికలకు పరిశీలన కోసం పంపుతున్నారు. 'వీక్షణం' పరిశీలనలో ఉన్న రచనలు, రాబోయే సంచికలలో అచ్చుకోసం ఎంపిక చేసి పెట్టుకున్న రచనలు ఇతర దినపత్రికలలోనో, వార పత్రికలలోనో వెలువడడం మా దృష్టికి వస్తోంది. ఇతర పత్రికలకు పంపిన రచనలను 'వీక్షణం'కు పంపించగూడదని రచయితలకు విజ్ఞప్తి చేస్తున్నాము.


– సంపాదకులు



చందాదారులకు విజ్ఞప్తి!


ఇటీవల కొంతమంది చందాదారులకు వీక్షణం సక్రమంగా అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. వీక్షణం ప్రతినెల 29వ తేదీన మరుసటి నెల సంచిక పోస్ట్ అవుతుంది. ఏ కారణం చేతనైనా మీకు వీక్షణం మొదటివారంలోపు అందనట్లయితే, వెంటనే ఆ విషయం మాకు తెలపగలరు.

మీ చిరునామా వివరంగా రాయండి. పిన్‌కోడ్ రాయడం మరిచిపోకండి. పత్రిక వచ్చిందా రాలేదా పోస్ట్‌మాన్‌తో నిర్ధారించుకోగలరు.

– సర్క్యులేషన్ మేనేజర్
9949391028













- **సచార్ చెప్పిన సత్యాలు** – భారత ముస్లింల స్థితిగతులపై వాస్తవ నివేదిక – మానవ హక్కుల వేదిక – 32 పేజీలు, 1/8 డెమీ, రు.5, ప్రతులకు : ఎస్. జీవన్‌కుమార్ 3-12-117/ఎ-2/1, పి.ఎస్. కాలనీ, గణేష్‌నగర్, రామంతాపూర్, హైదరాబాద్ – 500 013; ఫోన్ : 270395919, మా వెబ్‌సైట్ : www.humanrightsforum.org
- **ప్రత్యేక తెలంగాణ** – సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ వైఖరి – రాష్ట్ర కమిటీ సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ – 66 పేజీలు, 1/8 డెమీ, రు. 25, ప్రతులకు: ప్రజాపంథా; సహచర బుక్‌హౌస్; దిశ బుక్‌హౌస్; నవోదయ బుక్‌హౌస్; మైత్రి బుక్‌స్టాల్
- **మహాప్రస్థానం నుండి మరోప్రస్థానం దాకా** – వి. చెంచయ్య – విరసం ప్రచురణ – 44 పేజీలు, 1/8 డెమీ, రు. 15, ప్రతులకు : వి. చెంచయ్య, సాహితీ నిలయం, 10-40-15ఎ/1, జనతాపేట నార్త్, కావలి – 524 201, నెల్లూరు జిల్లా; ఫోన్ : 08626 – 242277, సెల్ : 94406 38035
- **దేశదేశాల హైకు** – పెన్నా శివరామకృష్ణ – 98 పేజీలు, 1/8 డెమీ, రు. 30, ప్రతులకు: పాలపిట్ట బుక్స్, 16-11-20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట్, హైదరాబాద్ – 500 036; ఫోన్ : 98487 87284
- **కొలిమి** – సాహిత్య వ్యాసాలు – షేక్ కరీముల్లా – ముస్లిం రచయితల సంఘం ప్రచురణ – 108 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు : షేక్ కరీముల్లా, 21-55, పెద్ద మసీదు బజారు, వినుకొండ – 522 647, గుంటూరు జిల్లా; ఫోన్ : 08646-275084, సెల్ : 9441502990; అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో
- **హిందుత్వ** – జ్యోతిర్మయ శర్మ – తెలుగుసేత : అనంతు – ఎమెస్కో ప్రచురణ – 199 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు : ఎమెస్కో బుక్స్, సూర్యారావు పేట, విజయవాడ – 2, ఫోన్ : 0866 – 2436643, సెల్ : 98499 92890; దోమలగూడ, హైదరాబాద్ – 500 029, ఫోన్ : 040 – 23264092, ఫ్యాక్స్ : 040-23264028, ఇమెయిల్ : emescobooks@yahoo.com, www.emescobooks.com
- **తెలంగాణ ముచ్చట** – సామాజిక, ఆర్థిక వ్యాసాలు – ఎం. కోదండరాం – రామయ్య విద్యాపీఠం – 151 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు: జూలూరు గౌరీశంకర్, జర్నలిస్ట్, సంపాదకుడు, 1-8-702/33/20ఎ, పద్మాకాలనీ, నల్లకుంట, హైదరాబాద్ – 500 044; రాష్ట్రంలోని అన్ని పెద్ద పుస్తక కేంద్రాలలో
- **2009 ఎన్నికలు – ప్రాంతీయ, బడుగు పార్టీలకు – హెచ్చరిక** – టంకశాల అశోక్ – హైదరాబాద్ బుక్ ట్రస్ట్ – 85 పేజీలు, 1/8 డెమీ, రు. 40,
- **చివరి గుడిసె** – డా. కేశవరెడ్డి – హైదరాబాద్ బుక్ ట్రస్ట్ – 158 పేజీలు, 1/8 డెమీ, రు. 80

  పై రెండు ప్రతులకు : హైదరాబాద్ బుక్ ట్రస్ట్, ఫ్లాట్ నెం. 85, బాలాజీనగర్, గుడిమల్కాపూర్, హైదరాబాద్ – 500 067, ఫోన్ : 040 – 23521849; www.hyderabadbooktrust.blogspot.com
- **నెమలి కనులు** – కవితా సంపుటి – దండిభొట్ల – స్వాతి ప్రచురణలు – 64 పేజీలు, 1/8 డెమీ, రు.50, ప్రతులకు: డి.వి. నారాయణమూర్తి, ఫ్లాట్ నెం. జి-10, సత్యసాయి నిలయం, ఓల్డ్ మల్కాజ్‌గిరి, రామాలయం ఎదురుగా, సికింద్రాబాద్ – 500 047, ఫోన్ : 97041 35350, 99634 49545











సెప్టెంబర్ 'వీక్షణం'లో ప్రచురించిన పిట్టల రవీందర్ 'ఓపెన్ కాస్ట్ ఉద్యమం– ఫూల్‌బరీ అనుభవం' వ్యాసం మార్గదర్శకంగా, దిశా నిర్దేశకంగా ఉంది. అలాగే ముదునూరి భారతి 'పేదరిక నిర్మూలన – ప్రపంచ బ్యాంక్ అవగాహన' వ్యాసం పేదరికం పూర్వపరాలను విడమర్చడమే కాకుండా, ప్రభుత్వ పరిశీలనల్లోని డొల్లతనాన్ని శాస్త్రీయంగా విశ్లేషిస్తూ, కనువిప్పు కలిగించేదిగా ఉంది. ఈ తరహా విశ్లేషణలే వీక్షణం స్థాయిని సమున్నతంగా నిలపగలుగుతాయి.

– కె.బి.
హైదరాబాద్

'మారిన ఉద్యోగాలు – కొత్త సమస్యలు' పేరిట కె.సుభాషిణి గారి వ్యాసంలో మారుతున్న పరిస్థితుల్లో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలు, విచ్ఛిన్నమవుతున్న కుటుంబ జీవితాలు, మానవ సంబంధాలు ఇలా ఎన్నో అంశాలను మన దృష్టికి తీసుకువచ్చారు. వ్యాసం బాగుంది.

– టి. కృష్ణవేణి
అనంతపురం

'వీక్షణం'లో మహిళల రచనలు తక్కువగా ఉంటున్నాయి. అయితే సెప్టెంబర్ సంచిక ప్రత్యేకించి మహిళా ఉద్యోగుల సమస్యలపై తేవడం ముదావహం. ఉద్యోగాలు చేస్తున్న మహిళలు వ్యాసాలన్నీ పలు అంశాలను చర్చకు పెట్టాయి. పనిచేసే స్థలంలోనూ, కుటుంబంలోనూ వివిధ స్థాయిల్లో ఎదుర్కొంటున్న సమస్యలన్నిటిని ఈ వ్యాసాల్లో విపులంగా చర్చించారు.

– డి. మాధురి
శనిగరం, కరీంనగర్

సహకార వ్యవసాయం గురించి సెప్టెంబర్ సంచికలో సంపాదకీయంతో పాటు, కరువు గురించి వాఖ్యలు ఆలోచించే విధంగా ఉన్నాయి. నిజానికి 'సహకార వ్యవసాయం' భూమిలేని కౌలు రైతుల జీవితాలతో పాటు, చిన్న, సన్నకారు రైతుల బతుకులను బలితీసికొనే రైతు వ్యతిరేక విధానమే అని ప్రజలు భావిస్తున్నారు. ఇప్పటి వరకు ప్రత్యేక ఆర్థిక మండలాల పేరుతో రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ భూములను కార్పొరేట్ సంస్థలకు, పరపతి, పలుకుబడి ఉన్న వ్యక్తులకు వందల ఎకరాలు సాగు, అటవీ భూములను అప్పగించడం వల్ల సంపద దిగుబడి తగ్గుదలతోపాటు, పర్యావరణ విధ్వంసానికి, కరువు కాటకాలకు కారణమైనదని ప్రజలు, పర్యావరణ శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

ప్రస్తుతం ప్రభుత్వం ఆలోచన చేస్తున్న ఈ సహకార వ్యవసాయం వల్ల – చిన్న చిన్న కమతాలతో, వాతావరణ, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయం చేసి జీవిస్తున్న చిన్న, సన్నకారు రైతులు, భూమిలేని కౌలురైతులు ఆందోళన చెందుతున్నారు. తరతరాలుగా భూమిని అంటిపెట్టుకొని మట్టి మనుషులుగా మారి మన్నుల నుండి అన్నం తీసి మనుషుల ఆకలి తీర్చే కర్షక జీవులు వారి భూములను సహకార వ్యవసాయం పేరుతో స్వాహా చేసి కార్పొరేట్ వ్యవసాయ విధానాన్ని వ్యతిరేకిస్తున్నారు. ప్రజా ఉపయోగకరమైన ఏ విధానాలు అయిన పిడికెడు జీవుల సౌఖ్యం కోసం పుట్టెడు ప్రజల జీవితాలను బలితీసుకొనే విధంగా కాకుండా మెజారిటీ ప్రజల కనీస అవసరాలను తీర్చే విధంగా భూమికి, రైతుకు ఉన్న సంబంధాన్ని పటిష్టపరిచే విధానాలను రూపొందించి, అమలు పర్చవలసిన అవసరం ఉంది. సంపన్నులకు కాకుండా సామాన్యులకు ఉపయోగకరంగా ఉన్నప్పుడే అవి సత్ఫలితాలను ఇచ్చే అవకాశం ఉంటుంది.

– బోరెడ్డి మధుసూదన్ రెడ్డి
సిద్ధిపేట్, మెదక్

మహిళా ఉద్యోగుల సమస్యలపై టి.ఎన్.జి.ఒ. మహిళల సమిష్టి రచన బాగుంది. వారు ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించి, తగిన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రచనలు సమష్టిగా చేయడం ఒక మంచి విలువ.

– కె. శ్యాంప్రసాద్
శ్రీకాకుళం

మహిళా ఉద్యోగుల సమస్యల మీద సంఘటిత రంగానికి సంబంధించిన వారి వ్యాసాలే వచ్చాయి. మన దేశంలో అత్యధికులు అసంఘటిత రంగంలో పని చేస్తున్నారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న మహిళల అభిప్రాయాలను, వారి సమస్యలను, కోరుకుంటున్న, సూచిస్తున్న పరిష్కారాలను వెలుగులోకి తీసుకువస్తే బాగుంటుంది. అలాంటి ప్రయత్నం రాబోయే సంచికల్లో తప్పకుండా చేస్తారని ఆశిస్తున్నాను.

– నూర్‌జహాన్
నల్లగొండ

బొగ్గగనుల్లో ఓపెన్ కాస్ట్ తవ్వకాన్ని వ్యతిరేకిస్తూ బంగ్లాదేశ్‌లో పెద్ద ఎత్తున జరిగిన ఉద్యమ విజయగాథను పిట్టల రవీందర్ చక్కగా వివరించారు. సంతాల్ తెగ గిరిజనుల న్యాయమైన పోరాటానికి మొత్తం బంగ్లాదేశ్ ప్రజానీకం సంఘీభావం ప్రకటించింది. ఎంతోమంది పౌరహక్కుల ఉద్యమకారులు తమ జీవితాలను బలిదానం ఇవ్వాల్సి వచ్చింది. పోరాటం ఆ ప్రాంతానికే పరిమితం కాకుండా దేశమంతటా కార్చిచ్చులా వ్యాపించి అందరినీ కదిలించి, కనువిప్పు తెప్పించగలిగింది. ప్రభుత్వం తప్పనిసరై ప్రజాభీష్టాన్ని ఆమోదించింది. కానీ మన దేశంలో పరిస్థితులు వేరు. మనవి దళసరి చర్మాలు. ఇక రాష్ట్రంలో మరీ విచిత్రమైన పరిస్థితి నెలకొనివుంది. సమస్యనుబట్టి కాకుండా, సమస్యను ప్రస్తావించిన రాజకీయ పార్టీలను బట్టి మొత్తంగా పత్రికలు, ప్రజాసంఘాలు, ప్రజలు పాయలు పాయలుగా చీలిపోతున్నారు. మరి మనం కరాలూ కలాలూ గళాలూ సమష్టి ప్రయోజనాలకోసం ఎలా సమీకరిస్తామో కదా!

– దుప్పల రవికుమార్
శ్రీకాకుళం

షష్టిపూర్తి సావనీర్‌కు రచనలకై విజ్ఞప్తి

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియం, 22 ఆగస్ట్ 2009, శనివారం సాయంత్రం నాంపల్లి, హైదరాబాద్‌లో సామాజిక తత్వవేత్త, సుప్రసిద్ధ రచయిత బి.ఎస్. రాములుగారి షష్టిపూర్తి సభ మూడు గంటలపాటు కథోత్సవంగా, తాత్విక సమాలోచనగా ఆత్మీయుల కలయికగా అపూర్వంగా సాగింది. షష్టిపూర్తి సందర్భంగా సావనీర్ వెలువరించాలనుకుంటున్నాం. బి.ఎస్. రాములు గారు పలు సామాజిక ఉద్యమాల్లో పనిచేశారు. ముందుకు నడిపారు. వారితో కలిసి పనిచేసిన వారి నుండి, స్నేహితులు, సహచరులు, అభిమానులు నుండి, సామాజిక శాస్త్రవేత్తల నుండి, మేధావుల నుండి, జర్నలిస్టుల నుండి, సాహితీవేత్తల నుండి సావనీర్‌కు వ్యాసాలను, కవితలను, పాటలను, సమీక్షలను పంపవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

సామాజిక, సాహిత్య, సాంస్కృతిక, రాజకీయ, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలలో; బిసి, ఎస్.సి., ఎస్.టి, మైనార్టీ ఉద్యమాలలో; భావజాల రంగాలలో; బి.ఎస్. రాములుగారు చేసిన కృషిని రికార్డు చేయడం అవసరం. తమకు తెలిసినవి, విన్నవి, కన్నవి, అధ్యయనం చేసినవి, కలిసి నడిచినవి అన్నిటిని గుర్తు చేసుకొని ఈ సావనీర్‌కు రాయవలసిందిగా కోరుతున్నాం. 50వ జన్మదిన సంచికలో రికార్డు కాని కొత్త విషయాలను వెలికి తీసుకురావడానికి మీ రచనల్లో ప్రాధాన్యత ఇవ్వాల్సిందిగా కోరుతున్నాం.

30 సెప్టెంబర్ 2009 లోగా మీ రచనలను పంపవల్సిందిగా కోరుతున్నాం. అక్టోబర్‌లో సావనీర్ వెలువడుతుంది. మీ రచనతో పాటు మీ పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోతో పాటు బి.ఎస్.రాములు గారితో కలిసి ఉన్న ఫోటో ఏవైనా ఉంటే వాటిని పంపించగలరు. వాటిని తిరిగి భద్రంగా ఇచ్చే ఏర్పాటు చేస్తాం.

వివరాలకు : **గూడూరి సీతారాం,** షష్టిపూర్తి ఆహ్వాన సంఘం అధ్యక్షులు, విశాల సాహిత్య అకాడమీ, సామాజిక తాత్విక విశ్వవిద్యాలయం
తెలంగాణ రాష్ట్ర రచయితల, కళాకారుల, మేధావుల ఐక్యవేదిక, సెల్ : 92475 23085, 93910 36987

జ్వరాలతో రాష్ట్రం అతలాకుతలం

రాష్ట్రాన్ని జ్వరాలు పట్టి పీడిస్తున్నాయి. వివిధ జిల్లాల్లో రకరకాల వ్యాధులు విజృంభిస్తున్నాయి. విషజ్వరాలు, అతిసారం, స్వైన్ ఫ్లూ, డెంగ్యూ, చికున్‌గున్యా, ఆంత్రాక్స్, మలేరియా, సెరిబ్రల్ మలేరియా ఇలా పలు రకాల జ్వరాలు జనాన్ని వణికిస్తున్నాయి. రాష్ట్రంలో ఇప్పటికే ఇరవై మందికి పైగా స్వైన్ ఫ్లూతో మరణించారు. ఇంకా రోజు రోజుకూ స్వైన్ ఫ్లూ బాధితుల సంఖ్య పెరుగుతోంది. ఆసుపత్రులు, డాక్టర్లు, వసతులు సరిపోక జనం పరిస్థితి దుర్భరంగా ఉంది.

విడుదలకు మార్గం సుగమం

సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదలకు మార్గం సుగమం అయింది. దీనికి సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన జి.ఒ. 338ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా ఖైదీలను విడుదల చేస్తున్నట్లు భావిస్తే హైకోర్టులో సవాల్ చేయవచ్చని సుప్రీం కోర్టు ధర్మాసనం ఆగస్ట్ 24న పేర్కొంది. జి.ఒ. 338 ప్రకారం విడుదలకు అర్హులైన 948 మంది ఖైదీల జాబితాను హోంశాఖ సిద్ధం చేసినట్లు తెలిపింది.

ఆర్డర్లీ ఇక రద్దు

కానిస్టేబుల్ మురళీనాథ్ మృతికేసులో ఆక్టోపస్ అదనపు డి.జి.పి. వివేక్ దూబే, సి.పి.ఎల్. కమాండెంట్ అబ్రహం లింకన్‌లను సస్పెండ్ చేస్తూ ఆగస్ట్ 25న ఉత్తర్వులు జారీ అయ్యాయి. నిబంధనలకు విరుద్ధంగా మురళీనాథ్‌ను నోయిడాలోని వివేక్ దూబే ఇంటికి పంపడంతోపాటు పరోక్షంగా మురళీనాథ్ మృతికి వీరిద్దరు కారకులయ్యారని ఉత్తర్వులలో పేర్కొన్నారు. పోలీస్ కానిస్టేబుళ్ల వెట్టి చాకిరీకి ప్రభుత్వం నిర్ణయించింది. ఆర్డర్లీ వ్యవస్థను రద్దు చేస్తు హోంశాఖ కార్యదర్శి సెప్టెంబర్ 17న జి.ఒ. 404ను జారీచేశారు.

ఎస్.సి. హోదా

దళితులైన క్రైస్తవులు, ముస్లింలకు ఎస్.సి. హోదా కల్పించే విధంగా రాజ్యాంగాన్ని సవరించాలని కోరుతూ రాష్ట్ర శాసనసభ ఆగస్ట్ 25న తీర్మానం చేసింది. 1950 నాటి చట్టం ప్రకారం క్రైస్తవ, ముస్లిం మతాలలోని దళితులకు ఎస్.సి. ప్రతిపత్తి లభించడం లేదు. గతంలో సిక్కు, బౌద్ధ మతస్తులు కూడా ఈ సమస్యను ఎదుర్కొన్నప్పటికీ ఆ తర్వాత కాలంలో ఎస్.సి.లుగా గుర్తింపు పొందారు. క్రైస్తవ, ముస్లిం మతాలలోని దళితులు ఎస్.సి. హోదా కోసం వివిధ వేదికలుగా ఏర్పడి పోరాడుతూనే ఉన్నారు.

మరింత దోపిడీకి గురవుతున్న తెలంగాణ

వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17న హైదరాబాద్ లోని ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ ఆత్మగౌరవ సభను నిర్వహించారు. ఈ సభలో తెలంగాణ విద్యావంతుల వేదిక, తెలంగాణ లాయర్స్ ఫోరం, తెలంగాణ విశ్వవిద్యాలయ అధ్యాపకుల వేదిక, తెలంగాణ లెక్చరర్స్ ఫోరం, తెలంగాణ జర్నలిస్టుల ఫోరం, తెలంగాణ సిటీ ఫోరం, తెలంగాణ ప్రైవేట్ సెక్టార్ ఎంప్లాయిస్ అసోసియేషన్, సింగిడి తెలంగాణ రచయితల వేదిక తరఫున నాయకులు, కార్యకర్తలు, మేధావులు, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

కల్లుపై నిషేధమా?

కల్తీ కల్లు పేరుతో గీత వృత్తిని నిషేధించాలని ప్రభుత్వం కుట్ర పన్నుతోందనీ, దీంతో అరవై లక్షల మంది గీత కార్మిక కుటుంబాలు రోడ్డున పడతాయనీ గీత కార్మికుల కమిటీ ఆధ్వర్యంలో, ఇతర గౌడ గీత సంఘాలతో కలిసి ఆగస్ట్ 31న అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేపట్టింది. నిషేధిత జాబితా నుంచి కల్లును తొలగించాలని ఆంధ్రప్రదేశ్ గౌడ కల్లు గీత వృత్తి పరిరక్షణ కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేశారు.

ప్రమాదంలో ముఖ్యమంత్రి మృతి

రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డి ఆగస్ట్ 2న తాను ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ప్రమాదానికి గురవడంతో మరణించారు. ఆయనతో పాటు ముఖ్యకార్యదర్శి పి.సుబ్రహ్మణ్యం, ముఖ్య భద్రతా అధికారి జాన్ వెస్లీ, పైలట్ సునీల్ కుమార్ భాటియా, తన కో-పైలట్ ఎం. సతీష్‌రెడ్డిలు ఉన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.ఆర్. 8 జూలై 1949లో వై.ఎస్. రాజారెడ్డి, జయమ్మ దంపతులకు జన్మించారు. ఆయన వైద్య విద్యను అభ్యసించాక, 1975లో రాజకీయ ప్రవేశం చేశారు. 1978లో తొలిసారి ఎం.ఎల్.ఎ.గా ఎంపికయ్యారు. ఆరుసార్లు శాసనసభ్యుడిగా, నాలుగు సార్లు ఎం.పి.గా గెలిచారు. 2004 ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయానికి కారకులయ్యారు. 14 మే 2004న తొలిసారి ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టారు. మళ్లీ 2009 ఎన్నికలలో కాంగ్రెస్ విజయానికి కీలకపాత్ర వహించి మే 20 రెండవసారి ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. ఆగస్ట్ 2న ఆయన అకాల మరణంతో ఆర్థిక శాఖ మంత్రి కె. రోశయ్య రాష్ట్ర పదిహేనవ ముఖ్యమంత్రిగా ఆగస్ట్ 3న పదవీ బాధ్యతలు చేపట్టారు.

కరువు ప్రకటన

ముఖ్యమంత్రి రోశయ్య బాధ్యతలు తీసుకున్న వెంటనే కరువు ప్రాంతాలపై ప్రకటన చేశారు. 21 జిల్లాల్లోని 971 మండలాలను ప్రభుత్వం కరువు ప్రాంతాలుగా ప్రకటించింది. దీంతో రాష్ట్రంలోని 86.9 శాతం కరువు ప్రాంతం కిందికి వచ్చింది. ఆగస్ట్ చివర్న, సెప్టెంబర్ మొదట్లో వర్షాలవల్ల రాష్ట్రంలో వర్షాభావం 57 నుంచి 32 శాతానికి తగ్గిపోయింది. అయితే అంతకు పూర్వస్థితినే ప్రాతిపదికగా తీసుకున్నారు.

దేవుడి నగలకీ లేదు భద్రత!

తిరుమల తిరుపతి దేవస్థానం, దాని అనుబంధ ఆలయాలకు రాష్ట్రంలో ఉన్న ఆస్తుల వివరాలు అక్టోబర్ 31లోగా, రాష్ట్రం వెలుపల ఉన్న ఆస్తుల వివరాలు నవంబర్ 30లోగా సమర్పించాలని టి.టి.డి. ఇ.ఒ. ను రాష్ట్ర హైకోర్టు ఆదేశించింది. బంగారు, వెండి నగలు, పూజా సామగ్రి, వజ్రాలు, ఇతర విలువైన రాళ్లు, వాటి స్వచ్ఛత, బరువు, స్థిర చరాస్తులతో కూడిన మాస్టర్ జాబితా సీల్డ్ కవర్‌లో ఇవ్వాలని సూచించింది. వీ

కేంద్ర, రాష్ట్ర అసమ సంబంధాల వల్ల బడ్జెట్ కేటాయింపులలో, విధాన నిర్ణయాలలో రాష్ట్రాలు ఎదుర్కొంటున్న వివక్ష గురించి వివరిస్తున్నారు **వి. హనుమంతరావు**

రాష్ట్రాల నిలువు దోపిడీ

ఫెడరల్ రాజ్యాంగ వ్యవస్థలో కేంద్రం, రాష్ట్రాల మధ్య బాధ్యతలు, ఆర్థిక వనరుల పంపిణీలో అసమానతలు చోటు చేసుకోవడం సహజం. రాజ్యాంగ రచయితలు ఈ పరిణామాలు ఉంటాయనే ముందు చూపుతో ఫైనాన్స్ కమిషన్ అనే వ్యవస్థనేర్పాటు చేసి, ప్రతి అయిదేళ్ల కొకసారి పునఃసమీక్షించాలని రాజ్యాంగంలో పొందుపరిచారు. అనుభవంలో, ముఖ్యంగా పంచాయతీ రాజ్ వ్యవస్థను ప్రవేశపెట్టిన తర్వాత అలాంటి వ్యవస్థ ప్రతి రాష్ట్రంలో ఏర్పాటు చేసి రాష్ట్ర స్థానిక సంస్థల మధ్య సంబంధాలను పునఃసమీక్షిస్తూ ఉండాలని కేంద్రం నిర్ణయించింది.

ప్రస్తుతం 13వ ఫైనాన్స్ కమిషన్ రాష్ట్రాల్లో పర్యటిస్తూ రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలను సేకరిస్తోంది. మన రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇటీవలే కమిషన్‌కు మెమోరాండంను సమర్పించింది. గత కమిషన్ల అనుభవమేమంటే, బాగా అభివృద్ధి చెందిన రాష్ట్రాలు మేము అభివృద్ధిని చూపిస్తున్నాం కాబట్టి మాకు ఎక్కువ నిధులు బదలాయించాలని అంటుండగా మరికొన్ని రాష్ట్రాలు వెనుకబడిన రాష్ట్రాలకు ఎక్కువ ఆర్థిక వనరులు సమకూర్చకపోతే, మా రాష్ట్ర వెనుకబాటుతనం నుంచి ఎలా బయటపడగలం, అందుచేత మాకు ప్రత్యేకంగా అదనపు నిధులు కేటాయించాలని కోరడం సహజం. కేంద్రం కూడా తన ఖర్చులు పెరిగాయని, రాష్ట్రాలకు ఏ కష్టాలు వచ్చినా వారిని ఆదుకోవాలని, అందుచేత తనకు కూడా అదనపు నిధులు కావాలని కోరుతోంది. అయితే, కమిషన్‌ను ఏర్పాటు చేసేది కేంద్రం కాబట్టి, కమిషన్ ఏయే విషయాలను పరిశీలించి సిఫార్సు చేయాలని ఇచ్చే ఆదేశంలో తనకనుకూలంగా, తనకు హెచ్చు నిధులు కేటాయించేలా 'టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్'ను రూపొందిస్తుందని రాష్ట్రాలు ఫిర్యాదు చేస్తుంటాయి. ఇంతవరకు ఏర్పాటు చేసిన కమిషన్‌లలో ఒకే ఒక్కసారి మన రాష్ట్రాన్నుంచి ఆర్థిక మంత్రిగా, ముఖ్యమంత్రిగా ఎంతో అనుభవాన్ని సంపాదించిన కాసు బ్రహ్మానందరెడ్డిని ఒక కమిషన్‌కు అధ్యక్షునిగా నియమించారు. ప్రతి రాష్ట్రం తన రెవెన్యూ, ఆదాయం, ఖర్చు వివరాలు, రుణాల పరిస్థితి, వేస్తున్న పన్నుల వివరాలు, పంచాయితీ వ్యవస్థకు ఇస్తున్న గ్రాంట్లు, కేంద్రం నుంచి వచ్చే నిధులు, గ్రాంట్లు వగైరా వివరాలు, వారి వారి కోర్కెలను కమిషన్‌కు అందచేయాలి. కమిషన్ కేంద్ర ప్రభుత్వానికి అందచేసిన సిఫార్సులను కేంద్రం విధిగా అమలు పరచాలి. ఈ ఉపోద్ఘాతం తర్వాత 13వ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వ నివేదికను విశ్లేషించుకుందాం.

2004లో వై.ఎస్. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థిక మంత్రి రోశయ్య ప్రవేశపెట్టిన బడ్జెట్‌లన్నింటిలో రాష్ట్ర ద్రవ్య స్థితి భేషుగ్గా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని చెబుతూ, దానికి ఉదాహరణగా రెవెన్యూ ఆదాయం గణనీయంగా పెరిగిందని, రిజర్వ్ బ్యాంక్ వద్దకు చేబదుళ్ల కోసం లేదా ఓవర్ డ్రాఫ్ట్‌ల కోసం ఒక్కసారి కూడా వెళ్లలేదని, అదంతా తమ ఘనతేనని చెబుతూ వచ్చారు. ఇది ఎంతవరకూ నిజం? మొత్తం రెవెన్యూ ఆదాయం, అంటే రాష్ట్ర సొంత రెవెన్యూ ఆదాయం, కేంద్రం నుంచి వచ్చే పన్నుల్లో వాటా, గ్రాంట్లు అన్నీ కలిపి చూస్తే పెరిగిన మాట వాస్తవం.

అలాగే రాష్ట్రం సొంత రెవెన్యూ ఆదాయం, పన్ను ఆదాయం పెరిగింది కూడా వాస్తవం. ఇదెలా సాధ్యమైందంటే, 1) దేశవ్యాప్తంగా జరిగినట్లే రాష్ట్రంలో వాట్ పన్ను విధానం ప్రవేశపెట్టడం, 12వ ఫైనాన్స్ కమిషన్ సిఫారసుల ప్రకారం కేంద్రం వసూలు చేసే పన్నులో రాష్ట్రం వాటా శాతం 29.5 శాతం నుంచి మరొక్క శాతం పెరగడం, కేంద్రంలో పన్నుల వసూళ్లు బాగా పెరగడంతో ఆ మేరకు రాష్ట్రం వాటా పెరగడం, గ్రాంట్ల రూపంలో ఎక్కువ నిధులు కేంద్రం నుంచి లభించడం, కేంద్రం ఇచ్చే రుణాన్ని తిరిగి చెల్లింపులను రద్దు చేయడం (రు. 2592 కోట్లు), తిరిగి చెల్లింపుల రద్దుతోపాటు వడ్డీ చెల్లింపులు కూడా రద్దు (రు. 2022 కోట్లు), ద్రవ్య సంస్కరణలు ప్రవేశపెడితే రాష్ట్రం తెచ్చిన రుణాల మీద హెచ్చు వడ్డీని తక్కువ వడ్డీకి బదలాయిస్తామనే పథకం కేంద్రం అమలు జరపడం ద్వారా సంపాదించిన వడ్డీ రాయితీ. ఎఫ్.ఆర్.బి.ఎం. చట్టం అమలుపరచాలనే 12వ ఫైనాన్స్ కమిషన్ సిఫార్సు మేరకు కొన్ని పద్ధతులు అమలు పరచడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం 13వ కమిషన్‌కు ఇచ్చిన నివేదిక ప్రకారమే 'పైచర్యల వల్ల రాష్ట్ర ద్రవ్య పరిస్థితి మెరుగు పడింది' అని అంగీకరించింది. కాగా, రాష్ట్ర ప్రభుత్వ ద్రవ్య పరిస్థితి 2003-04 నుంచి 2009-10 (బ.అం.) మధ్యకాలంలో పరిస్థితి మెరుగుపడిందంటే అందులో సుమారు ప్రతి మూడు రూపాయలలో ఒక రూపాయి కేంద్రం నుంచి వచ్చిందే. చేసిన అప్పుల మీద వడ్డీ సగటున ప్రతి రోజూ 25 కోట్లు చెల్లించాల్సి వస్తుంది. (2009-10 ఆఖరుకు). అయితే ఈ సంవత్సరం నుంచి ప్రపంచ ఆర్థిక మాంద్యం పుణ్యమా అంటూ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కూడా మందగమనంలో పడుతుందని కేంద్రం నుంచి వచ్చే వాటా కూడా తగ్గుతుందని, పన్నేతర ఆదాయం పెరిగే సూచనలు లాంఛనప్రాయంగానే ఉంటాయని, వచ్చే సంవత్సరాల్లో వడ్డీ భారం పెరుగుతుందని, వచ్చేది గడ్డు కాలం కాబోతుందని అందుచేత కేంద్రం మరిన్ని నిధులను రాష్ట్రానికి ఇవ్వాలని నివేదిక కమిషన్‌ను కోరింది.

పైన ఉదహరించినట్లు, ప్రతి కమిషన్ పరిశీలించాల్సిన విషయాలతోపాటు, ప్రతిసారి కేంద్రం అదనంగా ఒక కొత్త విషయాన్ని చేర్చడం, ఇది కేంద్రానికి, రాష్ట్రాలకు మధ్య వివాదాస్పద విషయం కావడం, ఆ కొత్త విషయాలను 'విధిగా' పరిశీలించాలని ఆదేశించడం రాష్ట్రాల అసంతృప్తికి కారణమవుతోంది. పరిస్థితులు మారుతున్నప్పుడు కొత్త విషయాలు చేర్చడం అవసరం కావచ్చు. కాని అలా చేర్చిన కొత్త విషయాలు ఉభయతారకంగా ఉండడం లేదు. ఉదాహరణకు ఈసారి కమిషన్‌కు ఇచ్చిన కొత్త విషయాల్లో కేంద్ర పరిపాలనా వ్యవస్థ, రక్షణ, అంతర్గత, సరిహద్దు రక్షణ, అప్పుల మీద వడ్డీ చెల్లింపులు, ఇతరంగా చేసే ఖర్చులు అన్నీ విధిగా గమనంలోకి తీసుకోవాలనడం అన్యాయం. ఎందుచేతనంటే ఈ సమస్యలన్ని రాష్ట్రాలు కూడా ఎదుర్కొంటున్నాయి. రాష్ట్రాల నిధుల నుంచి ఈ ఖర్చులన్నీ ఖర్చు చేయడం లేదా? కాగా, కేంద్రం చేసే ఖర్చులను మాత్రమే గమనంలోకి తీసుకోవాలనటం ఏం సబబు అని, ఇది ఆందోళన కలిగించే విషయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నించింది.

రాష్ట్రం అనేక ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టి పూర్తి చేసినా వాటి నిర్వహణ కొనసాగించాలి. అందుకు నియమించే జీత, భత్యాలను చెల్లిస్తుండాలి. కాని రాష్ట్ర ప్రభుత్వం చేసే ఖర్చుల్లో ఈ ఖర్చును చేర్చకుండా, కమిషన్ రాష్ట్ర ఆదాయ వ్యయాలను లెక్కించాలట. కేంద్రానికో పద్ధతి, రాష్ట్రాలకో పద్ధతా?

కమిషన్ సిఫార్సులను రూపొందించే క్రమంలో ఏ రాష్ట్రానికి ఎంత సహాయం చేయాలి అనే విషయం ఆ రాష్ట్ర ఆదాయ వ్యయాలను లెక్కవేసే పద్ధతిపై ఆధారపడి ఉంటుంది. మన ఆదాయాలు, వ్యయాలు ఎంతో మన బడ్జెట్‌లలో ఉంటాయి కదా అని అనుకుంటాం. కాని కమిషన్ లెక్క వేరుగా ఉంటుంది. కమిషన్ చేసే సిఫార్సులు, ప్రభుత్వ నిర్ణయాలు 2010-11 నుంచి ప్రారంభమై అయిదేళ్ల కాలానికి వర్తిస్తాయి. కాగా సిఫార్సులు అమలు అయ్యే సంవత్సరానికి ముందు సంవత్సరం అంటే 2009-10 లెక్కల ఆధారంగా ఆదాయ వ్యయాలను బేరీజు వేస్తాయి. ఈ సంవత్సరంలో ప్రముఖంగా రెండు సంఘటనలు చోటు చేసుకొన్నాయి. ప్రపంచ మాంద్యం మన రాష్ట్ర ఆదాయ వ్యయాలను నెగటివ్‌గా ప్రభావితం చేసింది. రెండవది ఆరవ ఫైనాన్స్ కమిషన్ సిఫార్సులను ఈ సంవత్సరంలో అమలు పరిచింది. కాని మన రాష్ట్రానికి సంబంధించినంత వరకు ఆ సిఫార్సుల అమలు, 13వ ఫైనాన్స్ కమిషన్ సిఫార్సుల అమలు కాలంలో అమలు చేయాల్సి రావచ్చు. అదీకాక రాష్ట్రమే ఏర్పాటు చేసిన పే రివిజన్ కమిషన్ సిఫార్సులు ప్రస్తుత సంవత్సరం ఆఖరులో రావచ్చు. ఈ సిఫార్సుల అమలు వల్ల వచ్చే సంవత్సరం నుంచి అదనపు ఖర్చు భారం పడుతుంది. కాగా కమిషన్ ఆనవాయితీ ప్రకారం 2009-10 లెక్కలు ఆధారంగా తీసుకొంటే రాష్ట్రం వచ్చే సంవత్సరం నుంచి అదనంగా చేసే ఖర్చు లెక్కల్లోకిరాదు. అందుచేత కమిషన్ ఈ ప్రత్యేక పరిస్థితిని గమనంలోకి తీసుకొని తదనుగుణంగా సిఫార్సు చేయాలని రాష్ట్రం కోరింది.

అలాగే రాష్ట్ర రెవెన్యూ ఆదాయం లెక్కవేసేటప్పుడు గత నాలుగైదు సంవత్సరాల్లో ఆదాయ ధోరణులెలా ఉన్నాయి, వచ్చే సంవత్సరాల్లో ధోరణులెలా ఉంటాయో గమనంలోకి తీసుకొంటాయి. మాంద్యానికి ముందు సంవత్సరాల్లో ఆదాయ ధోరణులు బాగానే ఉన్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం బాగా పుంజుకోవడంతో స్టాంపులు, రిజిస్ట్రేషన్ ఆదాయం పెరిగింది. అమ్మకం పన్ను కూడా పెరుగుదల ధోరణిని వ్యక్తం చేసింది. వ్యాట్ ప్రవేశపెట్టడంతో ఆదాయం బాగా పెరిగింది. మాంద్యం కారణంగా ఈ ధోరణులన్నీ అధోముఖం పట్టాయి. వచ్చే సంవత్సరాల్లో ఇది కొనసాగవచ్చు. అందుచేత రెవెన్యూ ఆదాయాన్ని లెక్కవేసేటప్పుడు గత సంవత్సరాల ధోరణులతోపాటు, రాబోయే కాలంలో అధోముఖ ధోరణులను కూడా గమనంలో ఉంచుకొని సిఫార్సు చేయాలని రాష్ట్రం కోరింది. వ్యయం విషయానికొస్తే 2004 నుంచి అనేక ప్రజానురంజకమైన సామాజిక సంక్షేమ పథకాలను ఆమ్ ఆద్మీ కోసం అమలు పరిచింది. ప్రధానంగా మెట్ట ప్రాంతాల్లో వెనుకబడిన ప్రాంతాల్లో జలయజ్ఞంతో నీటిపారుదల పథకాలను చేపట్టింది. ఈ ప్రాంతాల రైతాంగం ఇతర ప్రాంతాల రైతాంగంలా నీటిపన్ను చెల్లించలేవు. అనేక ప్రాంతాల్లో లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను చేపట్టడం వల్ల వాటి ఖర్చు ఎక్కువగా ఉంటుంది. అందుకనువైన నీటి తీరువాను వెనుకబడిన ప్రాంతాల రైతులు చెల్లించలేరు. ఈ ఖర్చును కొంతమేర రాష్ట్రమే భరించాల్సి రావచ్చు. రుణ భారం పెరుగుతూండడంతో వడ్డీ భారాన్ని రాష్ట్రం మోయాల్సి వస్తుంది. ప్రస్తుతం, ఇకముందు ప్రభుత్వం చేస్తున్న చేయబోయే అదనపు ఖర్చును గమనంలోకి తీసుకోవాలనేది రాష్ట్రం కోరిక.

ఫెడరల్ వ్యవస్థ పాలనలో చాలా దేశాల్లో కేంద్ర ప్రభుత్వాలకున్న బాధ్యతలను నెరవేర్చడానికవసరమైన దానికన్నా ఎక్కువ నిధులు కేంద్ర పరిధిలో ఉండటం కేంద్ర - రాష్ట్ర వివాదాలకు దారితీస్తుంది. దీనిని గమనించే రాజ్యాంగంలో ఫైనాన్స్ కమిషన్ అనే వ్యవస్థను ఏర్పాటు చేసింది. అయినా కేంద్ర - రాష్ట్రాల అసమానతలు పెరుగుతూ వస్తున్నాయని రాష్ట్ర ప్రభుత్వం తన ఆందోళనను వ్యక్తం చేసింది. నిధులను రాష్ట్రాలకు బట్వాడా చేయడంలో కేంద్ర ప్రణాళిక సంఘం కీలక పాత్ర వహిస్తుంది. ఈ పంపకంలో కేంద్రానికి ఎక్కువ, రాష్ట్రాలకు తక్కువ నిధులు కేటాయించడం జరుగుతూ వచ్చింది. మొదటి ప్రణాళిక (1951-56) కాలంలో రాష్ట్రాలకు 63 శాతం నిధులు కేటాయించగా, పదో ప్రణాళిక నాటికి ఈ కేటాయింపు 42 శాతానికి దిగజారిపోయింది. 11వ ప్రణాళిక కాలంలో (2007-12) ఇంకా తగ్గి 39 శాతానికి పడిపోతుందని అంచనా.

కేంద్రం వాటా 36.02 శాతం నుంచి 59.17 శాతానికి పెరగగా, రాష్ట్రాల వాటా 63.52 నుండి 39.27 శాతానికి పడిపోయింది. 'గజం మిథ్య, పలాయనం మిథ్య' అన్నట్లు ఎన్.టి. రామారావు కేంద్రం ఒక మిథ్య అన్నారు. కేంద్రానికి ఓ భౌగోళిక రూపమేలేదు, రాష్ట్రాల కలయికే కేంద్రం. కాగా ఉనికిలేని కేంద్రానికి ఎక్కువ కేటాయింపులు, రాష్ట్రాలకు తక్కువ కేటాయింపులు. దీనికి ప్రధాన కారణం కేంద్ర ప్రతిపాదిత పథకాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలు. ఇవి రాష్ట్రాల మెడకు కేంద్రం వేసిన గుదిబండలు. రాజ్యాంగం ప్రకారం ఈ పథకాల కార్యక్రమాలు రాష్ట్రాలకు కేటాయించిన అధికారాల పరిధిలోనివి. ఈ పథకాలు అమలు పరచాలని కేంద్రం కావాల్సిన నిధులను రాష్ట్రానికి అందచేయవచ్చు. కాని కేంద్రం ఆ పని చేయదు. మేము సగమో, మూడు వంతులో నిధులిస్తాం, మీరు మిగిలిన నిధులను మీ బడ్జెట్ల నుంచి కేటాయించండి అని ప్రపంచబ్యాంక్‌లా షరతులు విధిస్తుంది. ఇది ఫెడరల్ స్ఫూర్తికి

విరుద్ధం. ఈ పథకాలకు కేంద్రం కేటాయిస్తున్న నిధులు కాస్తా కూస్తా కాదు. కేంద్రం రాష్ట్రాలకు ప్రణాళికల కోసం చేసే కేటాయింపు 22 శాతం. ఇంకోలా చెప్పాలంటే ప్రణాళికలో రాష్ట్రాలకు కేంద్ర సహాయం రు. 78,487 కోట్లయితే, అందులో 22 శాతం నిధులు ఈ కేంద్ర పాలిత పథకాల కోసమే. కేంద్ర ప్రభుత్వం అనవసరంగా రాష్ట్రాల అధికారాలతో ఆడుకొనేవి కేంద్ర ప్రతిపాదిత పథకాలు. ఇవి కూడా ఏడాదికేడాది పెరిగిపోతున్నాయి. 1966లో జాతీయ అభివృద్ధి మండలిని ఈ ఫిర్యాదు దర్యాప్తు చేయమని కోరగా అప్పట్లో ఉన్న 92 కేంద్ర ప్రతిపాదిత పథకాల్లో 52 పథకాలు కొనసాగించి మిగతావాటిని రద్దు చేయమని సిఫార్సు చేసింది. వీలయినంత తక్కువగా ఇలాంటి పథకాలుండాలని చెప్పింది. ఈ సిఫార్సును కేంద్రం చెత్తబుట్టకు అంకితం చేసింది. ఆ తర్వాత మరో నాలుగు కమిటీలు వేయగా అదే విధమైన సిఫార్సులు చేయగా వాటికీ స్పందనలేదు.

రాష్ట్రాల అధికారాలను కేంద్రం హాంఫట్ చేసే మరో మార్గాన్ని చేపట్టింది. ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడినపుడు, అది తాత్కాలికమైనపుడు, అప్పటికే వసూలు చేస్తున్న ఏ పన్ను మీదో సెస్ అనో, సర్‌చార్జ్ అనో విధించడం, ఆ సెస్సుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని రాష్ట్రాలతో పంచుకోకపోవడం, ఆ అత్యవసర పరిస్థితి అంతమైనా, ఆ సెస్‌ను వసూలు చేస్తూనే ఉండడం, ఆ విధంగా ఆ నిధిని కేంద్రం కైంకర్యం చేసుకోవడం జరుగుతూ వస్తోంది. ఈ వసూళ్లు స్థూల కేంద్ర పన్ను వసూళ్లలో 15 శాతానికి చేరింది అంటే ఇంత మేరకు నిధులు రాష్ట్రాలకు రావాల్సింది రాకుండా పోయింది. అలాగే సేవల మీద పన్ను 80వ రాజ్యాంగ సవరణ ప్రకారం కేంద్రం, రాష్ట్రం పంచుకోవాలి. కాని 88వ సవరణ ప్రకారం మొత్తం సేవల పన్నును రాష్ట్రాలతో పంచుకొనే అవకాశం కోల్పోతుంది. రాష్ట్రాలు కోల్పోతున్న మరో ఆర్థిక వనరు ఖనిజ సంపదపై రాయల్టీ. ఈ పన్నును రాష్ట్రాలే వసూలు చేసి రాష్ట్రాలే తమ ఖజానాలో వేసుకోవచ్చు. అయితే ఈ పన్నును ప్రతి మూడేళ్లకొకసారి సవరించాల్సి ఉండగా, ఆ సవరణ 2004 తర్వాత జరగనేలేదు. అందువల్ల రాష్ట్రాలకు రావాల్సిన అదనపు ఆదాయం రాకుండా పోయింది. ప్రతి ఖనిజం మీద ఇంత రాయల్టీ విధించాలని కేంద్రం నిర్ణయిస్తుంది. కాని ప్రపంచ వ్యాపితంగా ఖనిజం విలువను బట్టి పన్ను విధించే పద్ధతి అమలులో ఉంది. సమయం గడిచిన కొద్దీ ఖనిజాల ఖరీదు పెరుగుతుంది కాబట్టి నిర్దిష్టంగా ఇంత పన్ను అని కాకుండా ధర పెరిగిన కొద్దీ పన్ను ఆదాయం పెరిగి రాష్ట్రాలకు అదనపు ఆదాయం వస్తుంది. ప్రస్తుత విధానం ఖనిజ వ్యాపారం చేసే వారికి లాభాలు కట్టబెట్టడమవుతుంది. కాగా ధర పెరిగిన కొద్దీ పన్ను పెరిగే పద్ధతి అమలులోకి తీసుకొనిరావాలి. ప్రస్తుత విధానం ప్రకారం భూమి మీద ఉన్న ఖనిజ సంపద మీద పన్ను మాత్రమే రాష్ట్రాలకు చెందుతుంది. సముద్రంలో లభించే చమురు, గ్యాస్ మీద రాయల్టీ వసూలు చేసే అధికారం రాష్ట్రాలకు లేదు. ఇది రాష్ట్రానికి చాలా అన్యాయం చేయడమవుతుందని నివేదికలో రాష్ట్ర ప్రభుత్వం విమర్శించింది.

రాజ్యాంగంలో ఫలానా ఫలానా విషయాలు పూర్తిగా రాష్ట్రాల పరిధిలో, ఫలానావి కేంద్రం పరిధిలో, ఫలానావి ఉమ్మడి పరిధిలో ఉంటాయని నిర్దేశించింది. కాని ఆచరణలో రాష్ట్రాల పరిధిలో ఉన్న విషయాల మీద కేంద్రం చేసే ఖర్చులో 15 శాతం రాష్ట్రాల పరిధిలో ఉన్న విషయాల మీదే జరగడమే కాక కేంద్ర ప్రతిపాదిక పథకాలు, కేంద్ర ప్రభుత్వ పథకాల పేరుతో రాష్ట్రాల అధికారాలను గుటకాయ స్వాహా చేయడం వికేంద్రీకరణ సిద్ధాంతానికే విరుద్ధం. ఈ పథకాల మీద చేసే ఖర్చు, అధికారం రాష్ట్రాలకు బదలాయించాలి. అంతేకాక ఈ పథకాల మీద కేంద్రం చేసే ఖర్చును రాష్ట్ర ప్రభుత్వాలకు కాకుండా నేరుగా ఆ పథకాలను అమలుపరిచే పరిపాలనా వ్యవస్థకు, అంటే జిల్లాల కలెక్టర్లకు బదిలీ చేయడం వల్ల, ఎంత సొమ్ము అలా బదలాయిస్తున్నారో, ఖర్చు అవుతుందా, మురిగిపోతుందా అని చూసే నాథుడే లేకుండాపోతోంది. ఇలా నేరుగా పంపిణీ అవుతున్న నిధులు 2007-08లో రు. 54,776 కోట్లు అయితే, అది 2009-10లో 95,667 కోట్లు కేటాయించింది. (అన్ని రాష్ట్రాలకు)

కేంద్రం రాష్ట్రాలకు బదలాయించే నిధులు ప్రస్తుతం నికర పన్ను ఆదాయంలో 30.5 శాతం ఉండగా, దీనిని 50 శాతానికి పెంచాలని అన్ని రాష్ట్రాలు కమిషన్‌లను కోరుతూ వచ్చాయి. కనీసం 40 శాతమైనా ఇవ్వాలని రాష్ట్రం కమిషన్‌ను కోరింది. కేంద్రం నుంచి రాష్ట్రాలకు వచ్చే ఆదాయం కేంద్రం వసూలు చేసే పన్నుల్లో శాతంగా, గ్రాంట్ల రూపంలో ఉంటుంది. ఎంత గ్రాంటు ఏ రాష్ట్రానికి ఇవ్వాలో కమిషన్ నిర్ణయిస్తుంది. కేంద్రం ఆదాయం పెరిగినా గ్రాంట్లతో స్థిరంగా ఉంటుంది. కాని పన్నుల విషయంలో రాష్ట్రాలతో ఎక్సైజ్, కార్పొరేటేతర ఆదాయపు పన్ను మాత్రమే పంచుకొంటుంది. సెస్సులు, సర్‌ఛార్జీల నుంచి వచ్చే ఆదాయం రాష్ట్రాలతో పంచుకోదు. కమిషన్ తర్వాత కమిషన్ నిర్ధారించిన ఆంధ్ర ప్రదేశ్ వాటా పదవ ప్రణాళికలో 7.91 శాతం నుంచి, 11వ ప్రణాళికలో 7.70 శాతానికి, 12వ కమిషన్‌లో 7.35 శాతానికి పడిపోతూ వచ్చింది. ఈ తగ్గింపు శాతాల్లో చూస్తే స్వల్పంగా కనిపిస్తుంది. కాని, మొత్తంగా చూస్తే మనకు రు. 822 కోట్లు తక్కువ వస్తుంది. జనాభా పెరుగుదల, రాష్ట్ర వైశాల్యం, తలసరి ఆదాయం పన్నుల వసూళ్ల పెరుగుదల, మౌలిక సౌకర్యాల మీద పెట్టే పెట్టుబడి - వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకొని కేంద్రం - రాష్ట్రాల మధ్య పునఃపంపిణీ జరగాలి.

పెరుగుతున్న రుణభారం గురించి పదేపదే విని మన శరీరాలు మొద్దుబారిపోయాయేమోనని అనిపిస్తుంది. తెచ్చుకొన్న రుణం కన్నా కంతులు కంతులుగా రుణం చెల్లింపు, వడ్డీ చెల్లింపు పెరిగిపోతోంది. ఫైనాన్స్ కమిషన్‌లు, కేంద్ర ప్రభుత్వం రుణభారాన్ని తగ్గించడానికి కొన్ని చర్యలు తీసుకొంటున్నా, ఆ వెసులుబాటు కేవలం కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రుణాలకే వర్తిస్తుంది. కాని దొరికిన చోటల్లా అప్పు చేసుకుంటూ పోతూంటే వాటి చెల్లింపుల నుంచి వెసులుబాటు లభించదు. ఇపుడదే జరుగుతోంది. ఉదాహరణకు 2005-06లో కేంద్రం నుంచి రు.522 కోట్లు రుణం తీసుకొంటే, అంతకు ముందు తీసుకున్న రుణాలు, వడ్డీలకు కేంద్రానికి చెల్లించింది రు. 2046 కోట్లు. అలాగే 2006-07లో రు.2438 కోట్లు, 2007-08లో రు.2096 కోట్లు చెల్లింపులు జరిగాయి. వడ్డీ చెల్లింపులే మనలను ముంచేస్తున్నాయి.

పైన ఉదహరించిన సంవత్సరాల్లోనే వరుసగా రు. 1439 కోట్లు, రు. 1247 కోట్లు, రు. 1313 కోట్లు వడ్డీ చెల్లింపులకే పోయింది. ఆయా సంవత్సరాల్లో కేంద్రం ఇచ్చిన రుణాల కన్నా వడ్డీయే రెండు మూడు రెట్లు ఎక్కువగా ఉంది. మొత్తం రాష్ట్ర రుణభారం ఎంత ఉందో కింది పట్టిక తెలియజేస్తుంది.

సంవత్సరం	రుణభారం (కోట్లలో)
1998-99	23904
1999-2000	29114
2000-01	35631
2001-02	42491
2002-03	50085
2003-04	58770
2004-05	66393
2005-06	70408
2006-07	75421
2007-08	82888
2008-09	93593

ఈ రుణభారంలో కేంద్ర రుణాలు, మార్కెట్ రుణాలు, చిన్న మొత్తాల పొదుపు నుంచి రుణం, ప్రావిడెంట్ ఫండ్ తదితర రుణాలు కలిసి ఉన్నాయి. మొత్తం రుణభారంలో కేంద్రం రుణాలు 18.43 శాతం మాత్రమే. కేంద్రం కొన్ని వెసులుబాట్లు కలిగించినా అది 18.43 శాతం రుణానికే వర్తిస్తుంది. మిగతా రుణభారం సంగతి? చెల్లించకపోతే పరువు పోతుంది. వాళ్లు మళ్లీ రుణాలివ్వరు.

1994లో కాబోలు 29 బాధ్యతలను పంచాయతీలకు బదిలీ చేయాలని కేంద్రం ఒక చట్టం చేసింది. ఇది 2009 సంవత్సరంలో బదిలీ చేసింది పది బాధ్యతలే. మిగతా బాధ్యతలను ఎప్పటికి బదిలీ చేస్తారో తెలియదు. ఆయా బాధ్యతలతోపాటు సిబ్బందిని, నిధులను కూడా బదిలీ చేయాలి. చేశారా? చెప్పలేదు. ఈ సమాచారం 13వ కమిషన్‌కు ఇచ్చిన నివేదికలో పొందుపరచలేదు. అయినా, మాకింత డబ్బు కావాలి, అంత కావాలంటూ కోర్కెల చిట్టా విప్పింది రాష్ట్ర ప్రభుత్వం.

రాష్ట్రంలో 22 జిల్లా పరిషత్తులు, 1097 మండల ప్రజా పరిషత్తులు, 21809 గ్రామ పంచాయతీలు, 2.60 లక్షల ఎన్నికైన ప్రజా ప్రతినిధులున్నారు. 22 జిల్లా ప్రణాళిక కమిటీలు ఏర్పాటయ్యాయి. వ్యవసాయం, పశుపోషణ, మత్స్య సంపద, గ్రామీణాభివృద్ధి, సామాజిక సంక్షేమం, గ్రామీణ మంచినీటి సరఫరా, పాఠశాల విద్య, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, వెనుకబడిన తరగతుల సంక్షేమం, స్త్రీ శిశు సంక్షేమం - ఇన్ని బాధ్యతలను పంచాయతీలకు అప్పగించారు. ఈ శాఖలన్నీ నిర్వర్తించాలంటే లక్షల రూపాయలు అవసరమవుతాయి. ఆ నిధులను రాష్ట్ర బడ్జెట్‌లో పొందుపరిచారా? రాష్ట్ర ప్రభుత్వం తాను బదలాయించాల్సిన నిధులను బదలాయించి, కమిషన్‌ను మాకింత కావాలి అని అడిగితే, సానుభూతితో పరిశీలించే అవకాశం ఉంటుంది. వచ్చే అయిదేళ్లలో పంచాయతీలకు రు. 14,884 కోట్లు కావాలని, ఇందులో రాష్ట్రం కేవలం రు. 2668 కోట్లు ఖర్చు చేస్తుందని, మిగతా రు.12,251 కోట్లు అవసరమవుతాయని నివేదిక తెలియజేస్తుంది. కమిషన్ ఏ మేరకు, ఎంత నిధులు సిఫార్సు చేస్తుందో మనం ఊహించలేని విషయం కాదు.

మునిసిపాలిటీలు, కార్పొరేషన్‌ల పరిస్థితీ అంతే. 15 కార్పొరేషన్‌లు, 103 మునిసిపాలిటీలు, ఆరు నగర పంచాయతీలు. రాష్ట్రంలో 30 శాతం ప్రజలు పట్టణాల్లో, నగరాల్లో నివసిస్తున్నారు. ఉన్నత మధ్య తరగతి, ధనిక వర్గాలు వీటిలో నివసిస్తుంటారు. వీరిలో చాలామందికి విశాలమైన భవంతులున్నాయి. బహుళ అంతస్తుల భవనాలన్నీ వీరివే. ఇలాంటి మిలియనీర్లు, బిలియనీర్లు చెల్లించే పన్ను రు. 806 కోట్లేనా? ఆస్తి పన్ను మదింపు ఎపుడో అక్టోబర్ 1993లో చేసి పన్ను రేట్లను సవరించారు. ఆ తర్వాత 15 సంవత్సరాలు గడిచాయి. రియల్ ఎస్టేట్ బూమ్‌ను నగరాలు రుచి చూసాయి. అయినా పన్నులు సవరించలేదు. తాజాగా ప్రపంచబ్యాంక్ పట్టణాల అభివృద్ధికి రుణం ఇచ్చి షరతులు విధించింది. (దీనినే జె.ఎన్.ఎన్.యు.ఆర్.ఎం. అంటారు.) అర్బన్ ల్యాండ్ సీలింగ్ రద్దు చేయమంది. స్టాంపు డ్యూటీ తగ్గించమంది. ప్రస్తుతం పేరుకు మునిసిపల్ కౌన్సిల్‌లు, కార్పొరేషన్‌లు పాలిస్తాయి గాని అవి పని చేసేది ప్రపంచ బ్యాంక్ గీసిన గీటు పరిధిలోనే ఆ బ్యాంక్ షరతులకు లోబడే పనిచేస్తున్నాయి.

ప్రస్తుతం మునిసిపాలిటీలు, కార్పొరేషన్‌లలో పరిస్థితులు అతి దీనావస్థలో ఉన్నాయని నివేదికలో ప్రభుత్వమే అంగీకరించింది. చిన్నపాటి పట్టణాల్లో దీనావస్థలోనే కాదు, దిగజారిపోతున్నాయని, కేంద్ర ప్రణాళికా సంఘం ఒక వర్కింగ్ గ్రూప్‌ను నియమించగా, కనీస సౌకర్యాలంటే ఏమిటో నిర్వచించింది. 1) పైపుల ద్వారా తాగునీటి సరఫరా, డ్రైనేజ్; 2) పెద్ద నగరాల్లో పూర్తి డ్రైనేజ్ సౌకర్యం, కమ్యూనిటీ మరుగుదొడ్లు; 3) మునిసిపల్ వేస్ట్‌ను నూరుశాతం పోగు చేసి, డిస్పోజ్ చేయడం; 4) రెండు కిలోమీటర్ల దూరంలో పాఠశాల, ఒక కిలోమీటర్ దూరంలో ప్రాథమిక విద్యాకేంద్రం; 5) ప్రాథమిక ఆరోగ్య కుటుంబ సంక్షేమ కేంద్రాలు ఒకటి నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో; 6) ప్రతి 20 వేల మంది జనాభాకు ఒక ఆరోగ్య కేంద్రం. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, వచ్చే అయిదేళ్లలో పై సౌకర్యాలు సమకూర్చడానికి రు. 76,613 కోట్లు అవసరమవుతాయని కమిషన్‌కు నివేదించింది. ఇందుకు గాను కేంద్రం నికర రెవెన్యూ ఆదాయంలో కొంత శాతం కేటాయించాలని కోరింది.

కేంద్రం నుంచి వచ్చే నిధులు కేంద్ర పన్నుల్లో వాటాగా, గ్రాంట్ల రూపంలో వస్తాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని, కొన్ని కొలబద్దల ఆధారంగా కమిషన్ సిఫార్సు చేస్తుంది. అలాగే ప్రత్యేక అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ సిఫార్సు చేస్తుంది. గత అయిదేళ్లలో ఉన్నంతలో ఆర్థికాభివృద్ధి సాధించడం మనకు వ్యతిరేకమై కూర్చొంది. మీ పరిస్థితి బాగానే ఉంది కదా అని కమిషన్ అంటే సమర్థవంతంగా పరిపాలించడమే నేరమైపోయిందా అని రాష్ట్రం అంటుంది. కమిషన్ అన్ని రాష్ట్రాలకు ఇచ్చే గ్రాంట్లలో రాష్ట్రం శాతం పదవ కమిషన్ కాలంలో 8.65 శాతం నుంచి 12వ కమిషన్ కాలంలో కేవలం 3.66 శాతానికి పడిపోయింది. అంతేకాక మానవాభివృద్ధి సూచి చాలా రాష్ట్రాల కన్నా కింది స్థాయిలో (పదవ స్థానం) ఉందన్న విషయాన్ని కమిషన్ గుర్తించాలని పేర్కొంది. రాష్ట్రంలో 55 శాతం జనవాసాల్లో మురికి నీరు ప్రవహించడానికి, 83 శాతం జనవాసాల్లో చెత్తా చెదారంను తొలగించడానికి సౌకర్యాలే లేవు. 'సంస్కరణలు ప్రవేశపెట్టిన తర్వాత సంవత్సరాల్లో, వ్యవసాయ రంగంలో తీసుకొన్న చొరవలన్నీ ఉపసంహరించింది. భారీ నీటిపారుదల ప్రాజెక్ట్‌లేమీ చేపట్టలేదు. సాంకేతికపరమైన చొరవలేమీ లేవు. దానితో వ్యవసాయాభివృద్ధి 2.2

రాజకీయార్థిక విధానాలలో భాగంగా అప్పు, సాంకేతిక పరిజ్ఞానాలతో పాటు ఆంగ్లభాష కూడా దిగుమతి అయిందనీ, తగిన రక్షణలు కల్పించి మాతృభాషను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందనీ అంటున్నారు **ఎన్. సోమశేఖర శర్మ**

భాషా మాధ్యమం - ప్రభుత్వ విధానాలు

గత సంవత్సరకాలంగా తెలుగు భాష అంతరిస్తోందనే భయాందోళనలు వ్యక్తమవుతూ చాలా మంది తెలుగు భాషాభిమానులు, వ్యాసాల, ఉపన్యాసాల ద్వారా ప్రజలను జాగృతం చేస్తున్నారు. మన భాష ఔన్నత్యాన్ని, ప్రాచీనతను, భాషకు సంస్కృతికి గల సంబంధాలను తెలియజేస్తూ, రాష్ట్ర ప్రభుత్వ భాషా విధానాలని ఎండగడుతున్నారు. అయినా, అటు విద్యార్థులు గాని, ఇటు వారి తలిదండ్రులు గాని ఎందుకు ఆంగ్ల భాషపై మోజు చూపుతున్నారు? వారికి తమ మాతృభాషపై ప్రేమలేకనా? ఆంగ్ల భాషపై విపరీతమైన మోజు పెరగడానికి గల కారణాలేమిటి? అనే వాటిని శాస్త్రీయంగా ఎవరూ ముందుకు తేలేకపోతున్నారు. రోగానికి మూలాలను కనుగొనకుండా, మందు వేయలేం గదా? కేవలం మన ఆదుర్దా, ఆవేశం ప్రభుత్వ విధానాలలో మార్పుతేలేదు. దానికి ప్రజల మద్దతు అవసరం. సరిగా ఆ మద్దతే తెలుగు భాషావాదులకు కరువయింది. చివరికది ఒక ఎమోషనల్ ఇష్యూగా పరిణమించింది.

నిజమే, మనలో చాలామందిమి తెలుగు మాధ్యమంలో చదివి ఉన్నతోద్యోగాలు చేసాం, చేస్తున్నాం. లచ్చయ్యగారు తెలిపినట్టు మాతృభాషలో విద్యనభ్యసించిన ఎందరో గొప్ప శాస్త్రవేత్తలుగా, ఇంజనీర్లుగా, ఆర్థిక శాస్త్రవేత్తలుగా రాణిస్తున్నారు కూడా. అంతెందుకు, ఆంగ్ల భాషా మాధ్యమం ఉండాలని వాదిస్తున్న ఐలయ్య లాంటి వారు వారి మాతృభాషలో విద్యనభ్యసించిన వారే. అయితే తెలుగు భాషా మాధ్యమం కోరుతున్న వారి వాదనలో ముఖ్యంగా నేటి పరిస్థితులలో బలహీనతలుగా కనపడే రెండు అంశాలున్నాయి. తెలుగు భాషా మాధ్యమాన్ని బలపరుస్తున్న వారిలో మెజారిటీ అగ్రవర్ణాలకు చెంది ఉండడం, రెండవది వారి పిల్లలు చాలా మటుకు ఆంగ్లభాషా మాధ్యమంలో విద్యనభ్యసించడం. ఈ రెండు ఐలయ్య లాంటి వారికి పై వాదనను దెబ్బతీయడానికి, మరీ ముఖ్యంగా, తెలుగు భాషా మాధ్యమం డిమాండ్ చేస్తున్న వారిని నైతికంగా బలహీనపరచడానికి మంచి ఉపకరణాలయ్యాయి.

అయితే, తెలుగు మాధ్యమ బోధన కోరేవారు, ఆంగ్ల మాధ్యమం వాదించేవారు, ప్రాంతీయ భాషల పట్టు సమాజంపై క్రమక్రమంగా సడలడానికి గల మౌలిక కారణాలు విస్మరించారు. 1970-80ల వరకు చాలా మటుకు ప్రభుత్వ, ప్రైవేట్‌రంగ పాఠశాలలు ఆయా ప్రాంతాల

శాతానికి పడిపోయింది. రైతులు ఇబ్బందుల్లో చిక్కుకొనిపోయారు. ఉత్పాదకత స్తంభించిపోయింది. రైతుల ఆదాయాలు కూడా పెరగలేదు. ధరల పెరుగుదలను పక్కనపెట్టి చూస్తే వారి ఆదాయాలు కుంచించుక పోయాయి. జనాభా దేశంలో ప్రతి ఏటా రెండు కోట్ల చొప్పున పెరుగుతోంది. ప్రపంచ వ్యాపితంగా చూస్తే తిండి గింజలను బయో-ఫ్యూయల్‌కు మళ్లించడంతో, మార్కెట్లో ఆహార ధాన్యాల కొరత ఏర్పడింది. ఈ అసంతృప్తికరమైన నేపథ్యంలో, 11వ ప్రణాళికలో దేశంలో మరో రెండు కోట్ల టన్నుల ఆహార ధాన్యాలను 2011-12 నాటికి అదనంగా పండించడానికి నిర్ణయించింది. ఆ లక్ష్యం దిశగా రాష్ట్రంలో జలయజ్ఞం చేపట్టింది. ఆంధ్రప్రదేశ్‌లో ఆహార ధాన్యాలు అదనంగా పండించాల్సిన అవసరం లేదు. కాని దేశావసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ యజ్ఞాన్ని తలపెట్టింది కనుక కేంద్రం ఈ భారాన్ని రాష్ట్రంతో పంచుకోవాలి. ఇందుకుగాను కేంద్రం రు. 20,000 కోట్లు గ్రాంటు ఇవ్వాలి.

భారత ప్రభుత్వం నిర్దేశించిన సూత్రాల ప్రకారం రాష్ట్రంలో 435 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రాష్ట్రం ప్రత్యేకావసరాలు, తదితర అభివృద్ధి పథకాల కోసం రు. 46,336 కోట్లు ప్రత్యేక గ్రాంట్లు సిఫార్సు చేయాలని రాష్ట్రం కోరింది.

ఇవన్నీ గొంతెమ్మ కోర్కెల్లా కనిపించవచ్చు. ప్రతిరాష్ట్రం ఇలా కోర్కెల చిట్టా విప్పుతుంది. వీరందరి కోర్కెలను కూడితే కొన్ని లక్షల కోట్లు అవుతుంది. కేంద్రం మాత్రం ఇంత డబ్బు ఎక్కడ నుంచి తెస్తుంది? అని పాఠకులకు అనిపించవచ్చు. కాని ఇలా కోర్కెల చిట్టాను విప్పాల్సిన పరిస్థితిని కేంద్రమే కల్పించింది. ఫెడరల్ వ్యవస్థను యూనిటరీ వ్యవస్థగా ఆచరణలో మార్చింది కేంద్రమే. ఫైనాన్స్ కమిషన్‌లు దేశాన్ని ఫెడరల్ వ్యవస్థలోకి తిరిగి వచ్చేలా, రాజ్యాంగం ఆదేశాలకు లోబడి వ్యవస్థను సరిదిద్దేలా చేయలేకపోయాయి. ఆర్థిక అధికారాలు కేంద్రానివి, గాడిద చాకిరీ రాష్ట్రాలది. కాని కమిషన్‌లు ఏయే విషయాలను అధ్యయనం చేసి సిఫార్సులు చేయాలో కేంద్రమే నిర్ణయించిన తర్వాత కమిషన్‌లు ఆ పరిధిని దాటిపోలేవు. కేంద్రంలో మంత్రులు, బ్యూరాక్రసీకి ఈ పద్ధతి మంచి వాటంగా ఉంటుంది. రాష్ట్రాల మీద పెత్తనం చలాయించవచ్చు. కాలికి వేస్తే మెడకు, మెడకు వేస్తే కాలికి పాల్పడుతూ సర్కస్ ఫీట్లు చేస్తుంది కేంద్రం. బూర్జువా పరిపాలనలు ఇలాగే తగలడతాయి. కేంద్ర-రాష్ట్ర ఆర్థిక సంబంధాలకు పరిమితమై రాజ్యాంగాన్ని సవరించడమే మిగిలిన ఏకైక మార్గం. రాష్ట్రాలు ఆ మేరకు కేంద్రం పై ఒత్తిడి తీసుకు రావాలి. ఓ

భాషల్లోనే విద్యను బోధించాయి. ఆ కాలం వరకు చదువుకున్నవారు కాలేజ్ స్థాయిలోనే ఇంగ్లిష్ మాధ్యమంలో విద్యనభ్యసించారు. ఉన్నత ఉద్యోగాలలో స్థిరపడ్డారు. దానికి కారణం ఆనాటి ఆర్థిక వ్యవస్థ. తద్వారా అందుబాటులో ఉన్న ఉద్యోగావకాశాలు. 1980ల తర్వాత మరీ ముఖ్యంగా, 1990 నుండి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నయా ఉదారవాద విధానాలు అవలంబించడం మొదలయ్యాయి. అందుకనుగుణంగా నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాలు రూపకల్పన చేయబడ్డాయి. ఆ విధానాల అమలుకు తగిన పరికరాలను విద్యారంగం ఉత్పత్తి చేయవలసిన అవసరం ఏర్పడింది. దాని పర్యావసనమే రాజీవ్ గాంధీ 'నూతన విద్యా విధానం' పారిశ్రామిక రంగం, పెట్టుబడి ప్రాధాన్యత గల రంగంగా అభివృద్ధి చేయబడింది. ఉత్పాదన దేశ ప్రజల కొరకు గాక, ఎగుమతుల కొరకు, సామ్రాజ్యవాద సంస్థల ప్రయోజనాల కొరకు జరగడం మొదలయింది. దీంతో, ఆయా సంస్థలకు, పరిశ్రమలకు అత్యంత నైపుణ్యం గల ఉద్యోగుల అవసరం ఏర్పడింది. విదేశీ పరిజ్ఞానం, విదేశీ పెట్టుబడులు దేశంలో ప్రవహిస్తూ దేశ ప్రకృతి, మానవ వనరుల దోపిడీ చేయడం మొదలైంది. దీనికి ఆంగ్ల భాష పరిజ్ఞానం ప్రాథమికమైంది. ఇప్పటి పరిశ్రమలకు రాళ్లెత్తే కూలీలు, కంప్యూటర్ ఇంజనీర్లు మాత్రమే అవసరం. రాళ్లెత్తే కూలీలకు సాంప్రదాయ విద్యతో పని లేదు. ఇక కంప్యూటర్ ఇంజనీర్లకు ఇంగ్లిష్ భాష పై పట్టు అవసరం. మరీ ముఖ్యంగా ఎగుమతి ప్రాధాన్యత గల పరిశ్రమలలో ఆంగ్లభాష అవసరం మరింత ప్రాముఖ్యత సంతరించుకుంది.

వ్యవసాయ రంగాన్ని క్రమంగా నీరుగార్చడం, పారిశ్రామిక రంగం పూర్తిగా పెట్టుబడి ప్రాధాన్యతగల రంగంగా అవతరించడంతో, దేశంలో ఉపాధి అవకాశాలు దెబ్బతిన్నాయి. ఇక సేవారంగం మధ్యతరగతికి ఆలంబన అయింది. కంప్యూటర్ చదువు తప్పనిసరైంది. ఇలాంటి పరిస్థితులలో ఆంగ్ల భాషపై పట్టు సంపాదించడమే ఉద్యోగాలకు మార్గమైంది. దీంతో తప్పనిసరి పరిస్థితులలో తల్లిదండ్రులు తమ పిల్లలను ఆంగ్లభాషా మాధ్యమ పాఠశాలలకు పంపడంతో ఆ పాఠశాలలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. అందువల్ల భాషా మాధ్యమానికి ప్రభుత్వ ఆర్థిక విధానాలకు గల లంకెను మనం అర్థం చేసుకోకపోతే, వేలం వెర్రిగా ఆంగ్ల భాషా మాధ్యమంపై సామాన్య ప్రజలకు ఎనలేని మక్కువ ఎలా ఏర్పడుతున్నది అర్థం కాదు. దానికి తోడు మీడియా, క్రికెట్ లాంటివి విదేశీవి ఏవైనా మన దేశపు సరుకుల కన్నా గొప్పవన్న ప్రచారం. మనం ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన విషయం మధ్యతరగతిలో వచ్చిన మార్పు. 1980ల వరకు మధ్యతరగతి అభివృద్ధికరమైన పాత్ర వహించింది. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టింది. కాని 1980ల తర్వాత ప్రభుత్వ నయా ఉదార విధానాలు మధ్యతరగతికి కింది మధ్య తరగతికి ప్రయోజనాలు చేకూర్చాయి. దీంతో, మధ్యతరగతి పాలకవర్గ భాషను అలవరచుకుంది. వినియోగ సంస్కృతికలవడి, తమ ప్రయోజనాలు, ఉన్నత వర్గ ప్రయోజనాలు మొత్తం దేశ ప్రయోజనాలుగా ప్రచారాలు మొదలెట్టింది. అది తన సామాజిక బాధ్యతను మరిచింది. ప్రపంచాన్ని శాసిస్తున్న అమెరికా ఆంగ్ల భాష కాబట్టి ఇప్పుడు మన దేశంలో ఆంగ్ల భాషా ప్రాముఖ్యత పెరిగింది. అదీ అమెరికన్ ఇంగ్లిష్. రెండవ ప్రపంచ యుద్ధంలో జపాన్ గెలిచి ఉంటే, నేడు దేశ పాలకవర్గానికి జపాన్ భాష అత్యంత ప్రియమైన భాషగా ఉండేది. ఏ ఎండకి ఆ గొడుగు పట్టడం మన దళారీ పాలకవర్గానికి అలవాటేననేది చరిత్ర చెబుతున్న సత్యం. తమ ప్రయోజనాలనే ప్రజల ప్రయోజనాలుగా ప్రచారం చేయడం పాలకవర్గాలకు అలవాటే. అందువల్ల పేదలతో సహా అన్ని వర్గాలవారు ఆంగ్ల భాషపై మోజు చూపుతున్నారంటే, అందుకు వారికి మాతృభాషపైన ప్రేమ లేదని కాదు. ఆంగ్ల భాషపై విపరీతమైన మోజు అని కూడా కాదు. అది ఉపాధి సమస్య. బతుకుతెరువు సమస్య. దాన్ని అర్థం చేసుకోకుండా మనం తెలుగు జాతి, తెలుగు సంస్కృతి, చరిత్ర అని ఎన్ని ఘనకీర్తులు చెప్పినా అర్థం ఉండదు. ఆంగ్ల భాషపై పట్టున్న వాళ్లకే ఉపాధి అవకాశాలు ఉండే ఆర్థిక వ్యవస్థ దీనికి పునాది. అయితే, ఇలాంటి ఆర్థిక వ్యవస్థకు మూలాలు మన దళారీ పాలకవర్గం అమలు చేస్తున్న నయా ఆర్థిక విధానాలు. అంటే ఈ ఆర్థిక వ్యవస్థలో మార్పు లేకుండా, ప్రాంతీయ భాషలకు గౌరవముండదు, ప్రగతి ఉండదు. అంటే, ప్రాంతీయ భాషల మన్ననకు, వికాసానికి ఈ వ్యవస్థే అడ్డంకి. దీనికి వ్యతిరేక పోరాటమంటే, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం. అది ఒక దీర్ఘకాలికమైంది. కేవలం తెలుగు భాషాభిమానాలేగాక, అన్ని ప్రాంతాల ప్రజలు, ఈ నయా ఉదారవాద విధానాల వల్ల ఇతరత్రా ఉపాధి కోల్పోయిన వారు, దోపిడీ, పీడనకు గురయిన వారంతా సమిష్టిగా పోరాటం చేయవలసిన సమస్య. అంతవరకు తెలుగు భాషామాధ్యమం వైపు విద్యార్థులను మళ్లించాలంటే మనం ప్రభుత్వం ముందు కొన్ని తక్షణ డిమాండ్లు ఉంచాల్సి ఉంది. అందులో ముఖ్యమైనది తెలుగు భాషా మాధ్యమంలో చదువుతున్న విద్యార్థులకు ఉపకారవేతనాలు, విద్యానంతరం ఉద్యోగ కల్పనలో రిజర్వేషన్‌లు సాధించుకోవాలి. ఆ విద్యార్థులు అంగ్ల భాష నేర్చుకోవడానికి, వారికి పాఠశాలల్లోనే ఆంగ్ల భాషా శిక్షణ కేంద్రాలను ఏర్పరచాలి. అప్పుడు మాత్రమే వారికి ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను తెలుగు మీడియం పాఠశాలలో చేరుస్తారు.

ఇక్కడ చర్చించవలసిన ఒక చిన్న అంశం ఉంది. తెలుగు భాషా అభిమానాలు, ఆంగ్లం రావాలనుకున్నవారు చాలామంది, ఆంగ్ల భాషను నేర్వడానికి, 'ఆంగ్ల భాషా మాధ్యమం'లో చదువుకొనడానికి మధ్య తేడాను గుర్తించడం లేదనిపిస్తుంది. తెలుగు భాష మాధ్యమంలో పాఠశాల విద్య ఉండాలని కోరేవారందరూ ఆంగ్ల భాషా వ్యతిరేకులు కారు. ఆంగ్ల భాష అవసరం గుర్తించి, దానికై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని 'డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్' లాంటి సంస్థలు కోరుతున్నాయి. అవి ప్రైమరీ విద్య నుండి గాక, ఆరవ తరగతి నుండి నేర్పాలని చాలా ఉపాధ్యాయ సంస్థలు కోరుతున్నాయి. దానికి కారణాలు లచ్చయ్యగారు తన వ్యాసంలో విశదీకరించారు కూడా. అయితే, పైన పేర్కొన్నట్టుగా ఏ భాష అయినా ప్రజలకు ఉపాధి అవకాశాలు పెంచే మాధ్యమంలో ఉన్నప్పుడే, విద్యార్థులను ఆకర్షిస్తుంది. నేడు ఆ అవకాశం ఆంగ్లానికి మన పాలకులు కల్పించారు. ఆ ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతూనే, తెలుగు భాష మాధ్యమంలో చదువుతున్న విద్యార్థులకు ఉద్యోగాలలో ప్రత్యేక రాయితీలు సాధించుకొనేందుకు మనం ఉద్యమాలు నిర్వహించాల్సి ఉంది. వీ

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మాంద్యం నుంచి తేరుకుంటున్నదని పెట్టుబడిదారీ వ్యాఖ్యాతలు చేస్తున్న విశ్లేషణలను సమీక్షిస్తున్నారు **ఇ.ఎస్. బ్రహ్మాచారి**

మాంద్యం నుంచి తేరుకోవడం నిజమేనా?

మహాసంక్షోభం తర్వాత ఇంత తీవ్రమైన మాంద్యం రాలేదని అందరూ అన్నవారే. మాంద్యాల్లో ఇది కత్రినా అంత భారీ స్థాయిది అన్నవారూ ఉన్నారు. ఈ ఆర్థిక మందగమనం 5-10 సంవత్సరాలుండ వచ్చని, రికవరీ ఎంతోనెమ్మదిగా నత్తనడకన సాగుతుందని, ఇంచుమించు మాంద్యంలోనే పడున్నామా అనిపిస్తుందని అన్నాడు పాల్ క్రుగ్మన్. ప్రపంచం జపాన్ తరహాలో దశాబ్దాన్ని కోల్పోవచ్చనే ఆర్థికవేత్తలూ ఉన్నారు. ఈ మాంద్యంలో ఇప్పటికి ప్రపంచంలో 50 లక్షల కోట్ల డాలర్ల సంపద అయిపులేకుండా పోయింది. అమెరికాలోనే 6 లక్షల కోట్ల గృహ ఆస్తులు ఆవిరయ్యాయి.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 1945 తర్వాత ఏ యేడూ క్షీణించిఎరగదు. జనవరిలో ఐ.ఎం.ఎఫ్. అంచనాని బట్టి ప్రపంచవృద్ధి ఈఏడు 0.5 శాతం. వర్ధమానదేశాలు 3.3 శాతం వృద్ధి అవుతాయి. వృద్ధి చెందిన దేశాలు 2 శాతం క్షీణిస్తాయి. సెప్టెంబర్ 16 న ప్రపంచబ్యాంక్ ఈ సంక్షోభం ప్రపంచంలో2010 చివరకి మరో 8.9 కోట్ల మందిని పేదరికంలోకి నెడుతుందని చెప్పింది.

అందుకే దీన్ని మహాసంక్షోభం అనకపోయినా మహా మాంద్యం అంటున్నారు. మహాసంక్షోభాన్ని మరపిస్తుందనే వాళ్ళెవరూ లేరు గాని, దాన్ని తలపిస్తున్నదనేవాళ్లు రోజురోజుకీ పెరుగుతున్నారు. దాన్ని గురించి వినని ఈతరం వాళ్లు కూడా దాన్ని గురించి క్షుణ్ణంగా తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు.

2009లో అడుగు తాకి 2010లో నిజమైన రికవరీ మొదలై, క్రమంగా పుంజుకుంటుందని బెర్నెంకె మార్చ్ 15 న సి.బి.ఎస్. ఇంటర్వ్యూలో చెప్పాడు. అవిగో పచ్చ చిగుళ్లు అన్నాడు. అన్నాడో లేదో ఒబామాతో సహా అందరూ అదే మాట. అన్ని దేశాల వాళ్లూ అదేపాట.

కార్పొరేట్ లాభాలు 2009 తొలి క్వార్టర్‌లో 3.4 శాతం (1307 బిలియన్లు) పెరిగాయి. 2008 నాల్గవ క్వార్టర్‌లో 16.5 శాతం పడ్డాయి. ఈ పెరుగుదలకి కారణం ద్రవ్యరంగంలో లాభాలు 94.9 శాతం పెరగటమే. స్టాక్ మార్కెట్లు జోరుమీదున్నాయి. నిరుద్యోగ భృతికి కొత్త దరఖాస్తులు ఒకవారం తగ్గుతున్నాయి. మరోవారం పెరుగుతున్నాయి. ఫ్యాక్టరీ ఆర్డర్లు కొద్దిగాపెరుగుతున్నాయి. అంటే మార్కెట్లు ఎంతోకొంత బలపడుతున్నాయి. వినియోగదారుల విశ్వాసం పెరిగింది. జనవరి, ఫిబ్రవరి నెలల్లో రిటైల్ అమ్మకాలు పెరిగాయి. కాని మార్చ్‌లో 1.3 శాతమూ, ఏప్రిల్‌లో 0.4 శాతమూ తగ్గాయి. దాంతో చిగురించటం అనుమానంలో పడింది. మేలో 0.5 శాతం పెరిగాయి. రిటైలర్‌లు ఎక్కువమంది ఆగస్ట్‌లో అమ్మకాలు తగ్గాయన్నారు.

ఉద్యోగాలు ఇంతకుముందు పోయినన్ని పోవటం లేదు. 20 నెలల్లో పోయినవి మొత్తం 69,29,000. సగటున నెలకి 346,000. ఆగస్ట్‌లో పోయినవి 2,16,000. సగటు కంటే చాలా తక్కువ. ఈ ఏడాదికివే తక్కువ. పోతూనేఉన్నా, ఇంతకుముందు పోయినన్ని పోవటంలేదు. వీటిని చూపి పాలకులు రికవరీ మినుకుమినుకుమంటూ కంపిస్తోంది చూడండంటున్నారు. మొదటి రెండూ తప్పిస్తే మిగిలిన వేవీ స్థిరంగా లేవు.

2,16,000 ఉద్యోగాలు పోవటం చిన్నదేమీ కాదు. 2001 జనవరి నుంచి 2003 జూన్ దాకా 30 నెలల్లో 26 నెలలు ఉద్యోగాలు పోయాయి. అయితే 2,16,000 కంటే ఎక్కువ పోయింది 4 నెలలే. 1990-91 మాంద్యంలో ఈ అంకెని మించింది ఒకే ఒక్క నెలలో. 1981-82 మాంద్యంలో ఉద్యోగాలు వరసగా 17 నెలలు పోతే దీన్ని దాటింది 6 సార్లు. గత మాంద్యాలతో పోలిస్తే 2,16,000 ఎంత ఎక్కువో తెలుస్తుంది. అంకెలగారడీలకి జనం మోసపోరు.

రికవరీ నిర్వచనం విషయంలో ఏకాభిప్రాయం లేదు - మాంద్యం గురించి లేనట్లే. ఉత్పత్తి పెరగటం అని కొందరి అభిప్రాయం. దీన్నిబట్టి అయితే కొన్నిదేశాలు అసలు మాంద్యంలో పడలేదు. పడిన సింగపూర్ హాంకాంగ్ లాంటివి బయటపడ్డాయి. నాలుగు క్వార్టర్ల క్షీణత తర్వాత 2009 రెండో క్వార్టర్‌లో 0.3 శాతం వృద్ధి సాధించింది. ఫ్రాన్స్ కూడా అంతే సాధించింది. కనక ఇవీ కోలుకుంటున్నట్లే. అందుకే ఐ.ఎం.ఎఫ్. ప్రధాన ఆర్థికవేత్త బ్లాంచార్డ్ రికవరీ మొదలైందన్నాడు. అమెరికా రికవరీ 2009 రెండో అర్నెలల్లో ఆరంభం అవుతుందని అనేకుల అభిప్రాయం.

ఎన్.బి.ఇ.ఆర్. ఉత్పత్తి వృద్ధితోపాటు అమ్మకాలూ, ఉద్యోగాలూ కూడా లెక్కలోకి తీసుకుంటుంది. దాని ప్రకారం 2001 మాంద్యం 8 నెలలకి ముగిసింది. అయితే ఆ తర్వాత మరో 24 నెలల పాటు ఉద్యోగాలు పోతూనే ఉన్నాయి. అంటే ఎన్.బి.ఇ.ఆర్. ఉద్యోగాలు పోతూనే ఉన్నా ఇతర పరిస్థితుల్నిబట్టి మాంద్యం ముగిసినట్లు తేలుస్తుంది. మరి కొందరు దీన్ని ఒప్పుకోరు. ఉద్యోగాలు పోవటం ఆగితేనే రికవరీ మొదలయినట్లు. కార్మికులూ, వాళ్లని దృష్టిలో పెట్టుకునే వాళ్లూ దీన్ని గీటురాయిగా తీసుకుంటారు. దీని ప్రకారం అయితే 2010 చివరలోనో 2011 మొదట్లోనో కుదుటబడటం మొదలవచ్చని క్రుగ్మన్ అభిప్రాయం.

ఫోర్ క్లోజర్స్ ఆగితేనే గాని తెప్పరిల్లుతున్నట్లు కాదు అనే వారూ ఉన్నారు. ఈసారి ఫోర్ క్లోజర్స్ ఆగితేనే అడుగు తాకినట్లు అంటాడు బిదర్మన్. ఫోర్ క్లోజర్స్ ఈ ఏడాది 11.5 లక్షలు. 2010 లో ఎప్పుడో ఇది జరుగుతుందని అన్నాడు. అక్కడనుంచీ రికవరీ మొదలని ఆయన అభిప్రాయం.

మాంద్యం ఎంతటిదయినా ఎప్పుడో ఒకప్పటికి అడుగు తాకుతుంది. అంటే ఇక అక్కడనుంచి కిందికి దిగదు. అలాగే ఎదుగూ బొదుగూ లేకుండా కొంతకాలం ఉండి నెమ్మదిగా పైకి లేవవచ్చు. దీన్ని ఎ–ఆకార మాంద్యం అంటారు. మరొకటి వి–ఆకార మాంద్యం. అడుగుతాకాక వేగంగా పుంజుకుంటుంది. ఇక మూడోది అడుగుతాకి కుదుటబడుతూ తిరిగి కుంగిపోతుంది ఇదే డబ్ల్యు – ఆకార మాంద్యం. డబల్ డిప్ మాంద్యం.

ఇప్పటి దాని ఆకారం గురించి అభిప్రాయాల్లో తేడాలున్నాయి. పాలకులు 'వి' అంటున్నారు. ఆర్థివేత్తలు కొందరు 'డబ్ల్యు' కి మొగ్గు చూపుతున్నారు. 'యు' అనేవాళ్ళూ ఉన్నారు. మేలో ఫెడ్ ఎకానమీ దిగబడేవేగం తగ్గుతోందనీ, మాంద్యం మెత్తబడుతున్న సూచనలున్నాయనీ అన్నది. అలాగే ద్రవ్యమార్కెట్లు బలపడుతున్నాయంది. వీళ్ళందరి చూపూ వాటిమీదేవుంది. వీళ్ళ దృష్టిలో ఉద్యోగాలు పోతున్నా రికవరీ సాధ్యమే. స్టాక్ మార్కెట్ బాగుంటేసరి. కార్పొరేట్ల లాభాలు పెరిగితే చాలు. ఉత్పత్తి పెరగటం,సరుకులకి కొత్త ఆర్డర్లు రావడం,అమ్మకాలు పెరగటం–ఇవీ కావలసింది.అంతేగాని కార్మికుల ఆదాయాలు తగ్గినా ఉద్యోగాలు ఊడినా లెక్కల్లోకి రావు. అంటే రికవరీని పెట్టుబడివైపునుంచే చూస్తున్నారు కాని కార్మికులవైపు కన్నెత్తయినా చూడటం లేదు. వర్గస్వభావంతో రికవరీకి అర్థం చెబుతున్నారు. నిర్వచిస్తున్నారు.

గడచిన రెండు మాంద్యాలకూ అంతకు ముందు వాటికీ ఒక తేడా ఉంది. ఈ రెంటిలో వృద్ధి వచ్చాక చాలా నెలలు ఉద్యోగాలు పోయాయి. 2001 మాంద్యం ఆర్థిక వృద్ధి 8 నెలలు క్షీణించింది. రికవరీ మొదలయ్యాక 3 సంవత్సరాలపాటు ఉద్యోగాలు రాలేదు. తొలి ఏడాదిలో 5,62,000 పోయాయి. రెండోఏడు 1,93,000 పోయాయి. మాంద్యం ముందు స్థాయికి ఉద్యోగాలు 2005 ఫిబ్రవరి దాకా చేరలేదు. బుష్ వచ్చినప్పుడున్న 4.2 శాతం రేటు ఆయన పోయేటప్పటికి అయినా రాలేదు. మూడీస్ ఎకానమీ డాట్‌కామ్ ప్రధాన ఆర్థికవేత్త పోయిన 69 లక్షల ఉద్యోగాలు 2010 దశకం మధ్య దాకా రావన్నాడు. అంతటితో ఆగకుండా మాంద్యం ముందున్న నిరుద్యోగం రేటు ఎప్పటికీ రాక పోవచ్చన్నాడు. అమెరికాకి వృద్ధి ఏటా 2–3 శాతం ఉండాలి.అంతకి తగ్గితే ఉద్యోగ కల్పన ఉండదు.2008 లో 0.5 శాతం, 2009 అంచనా మైనస్ 1.4 శాతం.

ఇటీవలి కాలంలో ఉద్యోగాలు పోతూనే ఉన్నా రికవరీ మొదలైనట్లు చెబుతున్నారు. ఇప్పుడు 1 కోటీ 50 లక్షలమంది నిరుద్యోగులున్నారు. 50 లక్షల మందికి 6 నెలలుదాటి పనిలేదు. వీళ్లందరికీ ఉద్యోగాలు రావటానికి ఎన్నో ఏళ్ళుపడతాయి.

ఆగస్ట్ మధ్యలో కాన్‌సాస్ సిటీ ఫెడరల్‌బ్యాంక్ అధ్యయనంలో 2011 అంతా నిరుద్యోగం 10 శాతం పైనే ఉంటుందని, 2016 లో కూడా 7 శాతానికి తగ్గదనీ తేలింది. అంతర్జాతీయ కార్మిక సంస్థ ప్రకారం 2009లో ప్రపంచంలో 5 కోట్ల మందికి ఉద్యోగాలు పోతాయి. ఆర్థిక పరిస్థితి దిగజారేకొద్దీ ప్రజలు ప్రభుత్వ విధానాల్ని వ్యతిరేకిస్తారని జాగ్రత్త చెప్పింది. నిరుద్యోగం ప్రబలితే సమాజంలో అశాంతి రగలొచ్చనీ, ప్రజాస్వామ్యానికి దెబ్బతగలొచ్చనీ ఐ.ఎం.ఎఫ్. డైరెక్టర్ స్ట్రాస్ కాన్ హెచ్చరించాడు. కొన్ని సందర్భాలలో యుద్ధంతో ముగియవచ్చని ఆందోళన వ్యక్తపరిచాడు.

ఊరికే అంకెలు చూస్తే సరిపోదు. ఉద్యోగాలు పోయిన వాళ్ళ వేదనని రిపోర్టులు చెప్పవు. బాధితులు చెప్పేవి వినాలి.పిల్లల్ని ఎక్కడికీ తీసుకు పోకుండా ఇళ్ళలోనే ఆడిస్తున్నామంటున్నారు. బయటకు పనిలేనిదే పోవటం లేదు. టూర్లు తగ్గాయి. బయట హోటళ్ళలో తినాలంటే ఖర్చుకి భయపడుతున్నారు. అద్దెకట్టేదెట్లా? పిల్లల బాగోగులకి డబ్బెలా? ఏఖర్చులు తగ్గించుకోవాలి? ఈ ఒత్తిడికీ, మనోవేదనకీ నిద్రపట్టటం లేదని చెప్పేవాళ్లు రోజురోజుకీ పెరుగుతున్నారు. మాకు ఉద్యోగాలెవరిస్తారు? ఎక్కడకివెళ్లి వెతుక్కోవాలి? ఏ ఉద్యోగాలకోసం దరఖాస్తులు పెట్టుకోవాలి? ఇదొక బ్లాక్‌హోల్ అంటున్నారు. విద్యార్థులు తమ భవిష్యత్తు పట్ల అపనమ్మకంతోఉన్నారు. మామూలుగా తల్లిదండ్రులు పిల్లల గురించి వర్రీ అవుతుంటారు. ప్రస్తుతం పిల్లలే తలిదండ్రుల గురించి ఆలోచిస్తున్నారు

ఇళ్ళు పోగొట్టుకున్నవాళ్లు కొందరు బంధువులతోనో స్నేహితుల తోనో ఉంటున్నారు. ఇతర కుటుంబాలతో కలసి కాలం వెళ్లదీస్తున్నారు. కొందరు తల్లిదండ్రుల నీడకు చేరుతున్నారు. కొందరు మోటల్స్‌లోనూ మరి కొందరు టెంట్ సిటీస్‌లోనూ గడుపుతున్నారు. అన్నం చీట్లు తీసుకునే వాళ్లు మార్చ్‌లో 3కోట్లా 30 లక్షలు మించారు. వాషింగ్టన్ డి.సి.లో నూటికి 17 మంది చీట్లతో వెళ్లబుచ్చుకుంటున్నారు. అమెరికా లో 2008 క్రిస్మస్ క్రిస్మస్ లా లేదని చాలామంది బాధపడ్డారు. ప్రజల సమస్యలు పట్టించుకునే పత్రికలు అవే సమస్యల్లో పడ్డాయి. బ్రిటన్‌లో 2009లో మరింతచౌకగా బతుకుతున్నామని నూటికి 86 మంది ఒక సర్వేలో వెల్లడించారు.

ప్రపంచంలో ఆకలి తీరని వాళ్లు ఈ ఏడు 10 కోట్లమంది పెరిగారు. మొత్తం 100 కోట్లు దాటారు. ఇందుకు ఒకకారణం ఆహార ధరలు పెరగడం, మరొకటి మాంద్యం అని ప్రపంచ ఆహారసంస్థ అభిప్రాయపడింది.

ప్రపంచబ్యాంక్ అభివృద్ధి చెందిన దేశాల్లో వృద్ధి 2010 లో మొదలవుతుంది అంది. రికవరీ బలంగా ఉండదన్నది. వర్ధమాన దేశాల మీద దాని ప్రభావం చాలా సంవత్సరాలు ఉంటుందన్నది. ప్రపంచ ఎకానమీ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నదని ఐ.ఎం.ఎఫ్. జూలై మొదట్లో చెప్పింది. అయితే రికవరీ నెమ్మదిగా ఉంటుందన్నది. 2009 క్షీణత 1.4 శాతం అని తేల్చింది. 2010లో వృద్ధి 2.5 శాతం ఉండొచ్చంది.

వర్ధమాన దేశాల వృద్ధి 2009లో 1.2 శాతాన్ని మించదనీ, చైనా, ఇండియాలని తొలగిస్తే 1.6 శాతం క్షీణతేననీ తూర్పు యూరప్ మధ్య ఆసియాలు 4.7 శాతం క్షీణిస్తాయని ప్రపంచ బ్యాంక్ అంది.

ఒక ప్రాంతం మాంద్యంలో పడ్డప్పుడు మరో ప్రాంతం బలంగా

ఉండేది. అది దిగబడుతున్న ప్రాంతాన్ని బయటకిలాగే ఇంజన్‌గా పనిచేసేది. అంటే అక్కడ తయారయిన సరుకుల్ని కొనేది. యూరప్ మందగిస్తే అక్కడ తయారయిన వాటిని అమెరికా కొనేది. 1970 దశకం మధ్యలో అమెరికా, యూరప్‌లు రెండూ దెబ్బతిన్నాయి. అప్పుడు కాడిని జపాన్ మెడమీద వేసుకుంది. 1990-91లో అమెరికా మెత్తబడితే జపాన్, జర్మనీ, తూర్పు ఆసియా దేశాలు కలిసి అడ్డుకున్నాయి. ఆవిధంగా ఒక ప్రాంతం కుంగినా మరొక ప్రాంతం దానికి మార్కెట్‌గా నిలబడేది. 2001 నుంచీ పరిస్థితి అలా లేదు. అప్పుడు అమెరికా మాంద్యంలో పడేటప్పటికే జపాన్ చతికిలబడి ఉంది. యూరప్ వాటి సరసన చేరేందుకు అంగలు వేస్తోంది. ప్రపంచ ఆర్థిక లావాదేవీ లకు ఊతమివ్వగల ప్రాంతమేదీ లేదని అన్నది. 2001 జూలైలో జరిగిన జి-7 దేశాల సమావేశంలో ఇంజన్‌గా ఏదేశం ఉండాలి అన్నప్పుడు నీవంటే నీవన్నాయి. పాల్ ఓనీల్ 'జపాన్, యూరప్‌లు ఇంజన్ పాత్ర పోషించాలి' అన్నాడు. అయితే జపాన్, యూరప్‌లు అమెరికావైపు దీనంగా చూడటం తప్ప ఏమీ చేయలేక పోయాయి.

ఈసారి పరిస్థితి దాన్ని ఎంతగానో మించిపోయింది. ఆ ప్రాంతాలే కాకుండా దాదాపు అన్ని దేశాలు కలిసికట్టుగా కుంగిపోయాయి. లేచేదే కష్టంగా ఉంది. మరొకదేశాన్ని ఎత్తుకొని మోసేసత్తా ఏదేశానికీ లేదు. జపాన్, యూరప్‌లు వెనకబడతాయనీ, ఇండియా, బ్రెజిల్ లాంటి ఎకానమీలు వచ్చే ఏటికి బలం పుంజుకుంటాయనీ, ఇంజన్‌గా ఉంటాయనీ ఒ.ఇ.సి.డి. పోయిన జూన్‌లో చెప్పింది. ఆ సమాఖ్య జనరల్ సెక్రెటరీ ఏంజల్ గురియ ఆదేశాలమీద భారం మోపగూడదనీ, అవి రికవరీకి తోడ్పడతాయేగాని , గోతిలోనించి బయటకి లాగలేవు అన్నారు.

వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సెప్టెంబర్‌లో చైనాలో జరిగింది. దేశ దేశాల నుంచి 1400 మంది ప్రభుత్వ అధికారులూ, వ్యాపారవేత్తలూ ఆర్థికవేత్తలూ పాల్గొని చర్చించారు. ప్రపంచవృద్ధికి చైనాయే ఇంజన్‌గా పనిచేస్తుందని తేల్చారు. రిటైల్ అమ్మకాలు జూన్లో నిరుటితో పోలిస్తే 15.2 శాతం (వార్షికరేటు) పెరిగాయి. అలాగే పారిశ్రామికభివృద్ధి 10.8 శాతం. తొలి క్వార్టర్లో 6.1. రెండో దాంట్లో 7.9 శాతం. ఈఏడు 8 శాతం వృద్ధి ఉండవచ్చు. పెరిగినదానిలో ఎక్కువభాగం ప్రభుత్వం ఇచ్చిన 585 బిలియన్ డాలర్ల ఉద్దీపన పథకం వల్లా, బ్యాంకులిచ్చిన లక్షకోట్ల పైచిలుకు రుణాలవల్లా.

వాస్తవానికి ఆ దేశం ఎన్నో సమస్యలతో సతమతమవుతోంది. ఉద్దీపన దబ్బు త్వరలో ఖర్చయిపోతుంది. బ్యాంకులు ఎంతోకాలం అప్పులిస్తూ ఉండలేవు. ఆ పరిస్థితుల్లో వృద్ధి నెమ్మదిస్తుంది. చైనావృద్ధి నిలకడయినదికాదని చైనా ప్రధానే చెప్పాడు.

గడచిన పదేళ్లు అమెరికా విదేశీ సరుకుల్ని విపరీతంగా కొనేది. అప్పుడు చైనా ఎగుమతులు పెరిగాయి. ఇటీవల అమెరికా దెబ్బతినడంతో చైనా ఎగుమతులు తగ్గాయి. యూరప్ చైనాకి అతిపెద్ద మార్కెట్. ఈ దేశాలు ప్రస్తుతం పెద్దగా కొనే స్థితిలోలేవు. 2009 ఆగస్టులో చైనా ఎగుమతులు 2008 ఆగస్ట్‌తో పోలిస్తే 23.4 శాతం తక్కువ. అమెరికా, ఐరోపాల్లో 2010లో వృద్ధి వచ్చేదాకా చైనా ఎగుమతులు పెరగవని చైనా ఆర్థికవేత్తలే చెబుతున్నారు.

పోనీ, ఎగుమతులు తగ్గినా ఆసరుకుల్ని చైనా ప్రజలే కొన్నా సమస్య ఉండదు. జనానికి అవన్నీ కొనే శక్తిలేదు. ఇప్పటికి 4 కోట్ల మంది ఉద్యోగాలు కోల్పోయారు.

1970 ల్లో సరళీకరణ తర్వాత పెరల్ రివర్ డెల్టా పెద్ద సరుకు తయారీ కేంద్రంగా మారింది. అయితే ఇప్పుడు అక్కడ వర్తకం 20.4 శాతం పడింది. వేల ఫ్యాక్టరీలు మూతబడ్డాయి. 2 కోట్ల 30 లక్షల మంది వలస కార్మికులకు పనులు పోయాయి. పట్టణాల్లో చిన్న, మధ్యస్థాయి పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగస్తులు పనిచేస్తుంటారు. వాటిలో నూటికి 40 మూతబడ్డాయి. మరో 40 చిక్కుల్లో కొట్టుమిట్టాడు తున్నాయి. ఈ పరిస్థితుల్లో చైనా ఇంజన్‌కి కావాల్సిన శక్తి ఉండదు. ముందు ముందు తనే మరింత దిగబడే ప్రమాదం ఉంది.

ఎగుమతులు తగ్గుతున్నా ఉద్దీపనవల్ల 2009 లో 8 శాతం వృద్ధి ఉంటుందని నమ్ముతున్నారు. సరే. ఈ ఉద్దీపన దీర్ఘకాలం ఉండదుకదా. ఆ దేశానికి 6 శాతం కంటే వృద్ధి తగ్గితే మాంద్యంలో పడ్డట్లే. 2010 చైనాకి పరీక్షా సమయం అని స్టీఫెన్ రోచ్ అభిప్రాయం. తనకు ఆదేశం మీద నమ్మకమనీ, అయితే ఇప్పుడు వర్రీ మొదలైందనీ అన్నాడు.

రికవరీకి అనేక ఆటంకాలున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలన్నింటిలో పరిస్థితులు కుడి ఎడంగా ఒకేలా ఉన్నాయి. మినహాయింపు లేకుండా మాంద్యంలో మగ్గుతూనే ఉన్నాయి.

జపాన్‌ది 5లక్షలకోట్ల డాలర్ల ఎకానమీ. అమెరికా తర్వాతి స్థానం దానిదే. అక్కడ నిరుద్యోగులు ఈ ఏప్రిల్‌లో 35 లక్షలమంది. నిరుడు ఇదే నెలలో కంటే 26 శాతం ఎక్కువ. అయినా పారిశ్రామికోత్పత్తి ఏప్రిల్‌లో 5.2 శాతం పెరిగింది. రికవరీ చిహ్నాలు కనబడుతున్నాయని మంత్రిమండలి మురిసిపోయింది.

టోకు ధరలు మే లో 5.4 శాతం తగ్గినా జనానికి కొనే సత్తాలేదు. ప్రతి ద్రవ్యోల్బణం పడుతుందేమోనని ఆర్థికవేత్తలు ఆందోళన పడుతున్నారు. నిరుద్యోగం 5.4 శాతం, వచ్చే ఏటికి 5.8 శాతం అవుతుందని అంచనా. రెండో క్వార్టర్ వృద్ధి 0.9 శాతం. 2010 మార్చ్‌తో ముగిసే ఆర్థిక సంవత్సరానికి 3.4 శాతం క్షీణత తప్పదని జపాన్ బ్యాంక్ చెప్పింది. వచ్చే ఏడు సరైన వృద్ధి రాకపోతే జపాన్ మరో దశాబ్దాన్ని కోల్పోవలసి వస్తుందని యుటాకా అనే ఆర్థికవేత్త అభిప్రాయపడ్డాడు.

2008 ఏప్రిల్ లో మాంద్యం సోకింది. 2009 ఏప్రిల్ కి 4 క్వార్టర్‌లు గడిచాయి. 4.9 శాతం ఉత్పత్తి తగ్గింది. 1980 మాంద్యంలో 4.6 శాతం తగ్గింది. 1990 మాంద్యంలో 2.5 శాతం తగ్గింది. ఇప్పటికిది ఎక్కువ. 2.5 శాతం వృద్ధి ఉంటేనేగాని కొత్త ఉద్యోగాలు రావు. అంతదాకా ఉద్యోగాలు పోతూనే ఉండవచ్చు. బ్రిటన్‌లో 2014 నాటికి ప్రభుత్వరంగ సంస్థల్లో 2,90,000 ఉద్యోగాలు పోవచ్చని ఒక రిసెర్చ్ సంస్థ చెప్పింది. ప్రభుత్వ వ్యయం తగ్గించాలనే నెపంతో. ఇంగ్లండ్ లో ఇళ్ల ధరలు ఒక ఏడాదిలో 12.5 శాతం పడ్డాయి.

ఆ దేశంలో గడిచిన రెండు మాంద్యాల్లో క్షీణత అయిదారు క్వార్టర్‌లు కొనసాగింది. ఆతర్వాత 2 సంవత్సరాలు 1 శాతం వృద్ధి మాత్రమే ఉంది. ఉద్యోగాలు మాంద్యం ముందున్న స్థాయి రావటానికి అయిదారేళ్ళు పట్టింది.

(ఇంకా ఉంది)

భూమి ఉన్నవారు కేవలం తమ ఆస్తి పరిరక్షణగా మాత్రమే సెజ్ పోరాటాన్ని నిర్మించలేరనీ, భూమిలేని దళిత రైతు కూలీల ప్రయోజనాలను కలుపుకుని ఉమ్మడిగా సాగితేనే ఉద్యమం సాధ్యమవుతుందనీ అంటున్నారు **నక్కా హేమా వెంకట్రావ్**

దళితులను దగా చేస్తున్న కాకినాడ సెజ్

2009 ఎన్నికల ముందు వరకు కాంగ్రెస్ ప్రజావ్యతిరేక ధోరణి, ప్రజారాజ్యం పార్టీ ఆవిర్భావం, మహాకూటమి ఏర్పాటు, వివిధ పార్టీల ప్రచార హోరు సెజ్ ప్రతిపాదిత ప్రాంతాలలో ఒక ఆశను రేకెత్తించింది. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పరచలేదని, తద్వారా కనీసం సెజ్‌ల ఏర్పాటు వేగం తగ్గుతుందని, ఆశ కలిగింది. ఈ ప్రాంతాలలో కాంగ్రెస్ వ్యతిరేక ఓటింగ్ కూడా ఎక్కువగా జరిగింది. ఎన్నికలు ముగిసి అటు కేంద్రంలోనూ ఇటు రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీయే అధికారాన్ని చేజిక్కించుకుంది. దానితో సెజ్ ఉద్యమాలలో ఒక్కసారిగా నిరాశ నిస్పృహలు ఆవహించినా, ఈ మధ్య మన రాష్ట్రంలో వాన్‌పిక్ ఆక్రమిత భూములపై హైకోర్టులో స్టే, కాకినాడ సెజ్ వ్యతిరేక పోరాట కమిటీ వేసిన వ్యాజ్యంలో రైతుల భూములను బలవంతంగా పోలీసు జోక్యంతో ఆక్రమించరాదనే హైకోర్టు ఆదేశం, మహారాష్ట్రలోని మహా ముంబయి, గుజరాత్‌లోని ముంద్రా ప్రాంత సెజ్ భూముల ఆక్రమణను ఆపవల్సిందిగా కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయటంతో సెజ్ పోరాటాలలో మళ్ళీ కదలిక మొదలయ్యింది. రాష్ట్రంలో ప్రతీ సెజ్ ఉద్యమం మరొక్కసారి సమీక్షించుకొని ముందుకు వెళ్లడానికి సమాయత్తమవుతోంది. ఈ సందర్భంలోనే కాకినాడ సెజ్ ఉద్యమ కార్యకర్తలు హైకోర్టు తీర్పుకు కట్టుబడి ఉన్నప్పటికి, అవసరమైతే పోరాటానికి సిద్ధం కావాలనే ఆలోచనలో ఉన్నారు. అయితే అందులో మెజారిటీ దళిత, పీడితవర్గాలు పోరాటపంథా నుంచి తప్పుకుంటు న్నాయి. ప్రతిఘటన రెండుగా చీలిపోనప్పటికీ పోరాట పరిణామ క్రమంలో దళిత, పీడిత (కులాల) ప్రజల పాత్ర, వారి ప్రాధాన్యతలను గుర్తించడం ఈనాటి ఉద్యమ అవసరంగా భావిస్తూ చేసిన పరిశీలనే ఈ వ్యాసం.

రాజ్యం, గ్రామాలకు గ్రామాలను బడా కంపెనీలకు ధారాదత్తం చేసి కట్టబెడుతుంటే భూమి(పొలం-పుట్ర) లేని పేద దళితులు అటు చేతిలో చారెడు భూమిలేక, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా సెజ్‌ను ఎదిరించే శక్తి లేదు అనుకొని, ప్రత్యామ్నాయం దిక్కు తోచక, ఉన్న ఊరిని వదిలి పోతూ ఎప్పటిలాగే ఇతర సామాజిక వర్గాల అవహేళనకు గురవుతున్నారు. ఒక మేరకు సెజ్ ఉద్యమం బలపడుతుంటే దళిత వాడలు కొన్ని ఉద్యమ సంఘంతో సంబంధాలు తెంచుకొని సెజ్ వర్గాలు చూపించే ఆశలకు, ప్రలోభాలకు ఎందుకు లోబడి పోతున్నారు?

కాకినాడ సెజ్ ప్రతిపాదిత గ్రామాలలో సుమారు 20-25 శాతం ఉన్న దళితులు మాత్రమే అభివృద్ధి పేరిట ఎందుకు బలవుతున్నారు? వీరి ఆర్థిక వెనకబాటుతనమా లేక సామాజిక కారణాలా? ఇతర సామాజిక వర్గాలలో పేదలు లేరా? ఇతర సామాజిక వర్గాల వారిని ఎందుకు ఖాళీ చేయించలేకపోతున్నారు? వీటి వెనుక వున్న దగాకోరు శక్తులు ఏమిటి? కాకినాడ సెజ్ వ్యతిరేక పోరాట నాయకత్వంలో దళితుల పాత్ర ఎంత? నాయకత్వ స్థాయిలలోని వారి నిర్ణయాత్మక శక్తి, వాస్తవ పరిస్థితులను పరిశీలించవలసి ఉంది. దళితులు దగాపడటానికి రాజ్యం, దాని అంగాలైన అధికార యంత్రాంగం, సెజ్ యాజమాన్యం యొక్క వ్యూహాత్మక ఎత్తుగడలలో భాగంగా దళితులలోని ఒక చిన్న వర్గాన్ని కూడా రాజ్యం ఎలా ఉపయోగించు కుంటుందో పరిశీలించాలి.

దళితులకు భూమి లేదు కాబట్టి భూమితో రైతులకు ఉన్న అనుబంధం వీరికి లేదనే వాదనలకు కాకినాడ సెజ్ పోరాట అనుభవాలు ఏమి చెబుతాయి? తరతరాలుగా ఉంటున్న గ్రామాల్ని దిక్కుతోచని పరిస్థితులలో వదలి, అభద్రతా భావంతోనే సెజ్ పునరావాస కాలనీలలోకి అడుగిడుతున్న వైనం, ఇన్నేళ్ళుగా తమతో సామాజికంగా ఓ మేరకు కలిసి ఉన్న ఆధిపత్య కులాల వారు అనే సూటిపోటి మాటలు దళితుల్ని క్షోభకు గురిచేస్తున్న సందర్భం ఉంది. ఈ వాస్తవాలపై సమాధానాలను వెతికి వివరించే ప్రయత్నంతో పాటు మొత్తం సెజ్ పోరాట క్రమంలో దళితులు నిర్ణయాత్మక శక్తిగా ఉద్యమాన్ని బలపరచడానికి ఎంత అవసరం అన్న ఆలోచనాత్మక అంశాన్ని తట్టిలేపడానికి చేసే ప్రయత్నమే ఈ వ్యాసం. ఇది కేవలం ప్రతిపాదిత కాకినాడ సెజ్ దళితుల పరిస్థితి మాత్రమే కాక దేశ రాజకీయ ఆర్థిక రంగాలలో దళితుల ఉనికి, వారి రాజకీయ ప్రాబల్యాల గురించి మనలను పునరాలోచింప చేస్తుంది. దళిత పీడిత కులాల సామాజిక స్థితిగతుల భిన్నత్వాన్ని, భూ పోరాటాల ఆవశ్యకతను, నయా సామ్రాజ్యవాద ప్రపంచీకరణను ఎదుర్కొనటానికి నిర్మించవలసిన పోరాటాల గురించి, నాయకత్వం సమస్య గురించి మరింత లోతుగా ఆలోచించవలసి ఉంది.

కాకినాడ సెజ్ కోసం నయానా, భయానా సుమారు ఎనిమిది వేల ఎకరాలు సెజ్ లెక్కల్లో చేర్చుకున్నారు. (కొన్ని ప్రత్యక్ష కొనుగోలు పేరిట, మరికొన్ని అవార్డులు ప్రకటించి, అసైన్డు భూములు లాక్కొని). ఇందులో పునరావాస కాలనీ కొరకు తీసుకొన్న భూమి, అక్కడక్కడ కొంత ఆక్రమించుకున్న భూమి తప్ప, మొత్తంగా భూమి అంతా ప్రజల ఆధీనంలోనే ఉంది. కాకినాడ సెజ్ యాజమాన్యం ఎన్నిసార్లు పాలక వర్గాల అండతో రైతులపై, మహిళలపై, న్యాయవాదిపై కేసులు పెట్టి బెదిరించినా భూమిని స్వాధీనపరుచుకోవాలనుకున్న ప్రతీసారి ప్రజల పోరాట పటిమను పరీక్షిస్తున్నట్టుగా ఒక్కసారిగా పోలీసులు ఊళ్లమీద

పడితే, అంతే తీవ్రంగా నిర్బంధాన్ని ఎదిరించి ప్రజలు తిరగబడ్డారు. మార్చి 2007లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల నాయకత్వంలో పునరావాస కాలనీలో కట్టడాలను ధ్వంసం చేసి, కంచె కోసం వేసిన స్తంభాలు పీకి వేశారు. డిసెంబర్ 24, 2008న వందలాది పోలీసులు భూ ఆక్రమణలకు పాల్పడబోతే ప్రజలు మూకుమ్మడిగా సెజ్‌కు వ్యతిరేకంగా నినదిస్తూ తిరగబడ్డారు. అందుకే ఎలక్షన్ల ముందు కాకినాడ మరో నందిగ్రాంగా మారితే మొదటికే మోసం వస్తుందని ప్రభుత్వం తాత్కాలికంగా వెనక్కి తగ్గింది.

ప్రజల నుంచి ఉద్యమ తీవ్రతను ఎదుర్కొనలేని సెజ్ యాజమాన్యం దృష్టి సామాజికంగా, ఆర్థికంగా వెనకబడిన దళిత వర్గాలపైన పడింది. సెజ్ పరిధిలోని గ్రామాలలో సుమారు మూడోవంతు దళిత వాడలే. తెల్లోడి పాలన పోయి ఆరు దశాబ్దాలు పైన గడచినా గ్రామాలలో దళిత వాడలు ఒక మూలకు విసిరివేయబడి ప్రత్యేక గ్రామాలుగా ఏర్పడ్డాయి. ఇలాంటి పరిస్థితులలోనే పేదరికం, సామాజిక వెనుకబాటులో కునారిల్లుతున్న దళిత వర్గాన్ని తమ స్వార్థ ప్రయోజనాల కోసం సెజ్ యాజమాన్యం వాడుకుంటోంది. పేద ప్రజల మధ్య విభేదాలు సృష్టించి, దళితవాడలలోని నాయకుల్ని నయానో భయానో లొంగ దీసుకొని, తమకనుకూలమైన వర్గాన్ని ఏర్పాటు చేసుకొంటున్నాయి. గ్రామంలోని దళితుల్నే కాదు దళిత కార్డును ఉపయోగించుకొని సొమ్ము చేసుకునే నాయకుల ద్వారా ఒక 'లాబీ'ని ఏర్పాటు చేసుకొని దళిత జాతి ప్రయోజనాలను దెబ్బతీస్తోంది. దుర్భర జీవితం గడుపుతున్న దళితుల బాగోగులు ఈ వర్గానికి అవసరం లేదు. ఈ దళారీలకు ఇంటికి ఇంత, ఊరుకు ఇంత అని సొమ్ము ముట్ట చెబుతున్నారు. ఉద్యోగాలు ఇస్తున్నారు. వారి పిల్లలకు అనేక రంగాలలో అవకాశాలు కల్పిస్తున్నారు. అదీగాక ఈ వర్గానికి డబ్బే కాదు సెజ్‌లో చిన్న చిన్న కాంట్రాక్టులు, కమిషన్‌లు ఇబ్బడి ముబ్బడిగా విసిరి వేస్తుంటారు. ఈ ప్రత్యేక వర్గమే దళితులకు, ఇతర సామాజిక వర్గాలకు మధ్య వైషమ్యాన్ని నింపుతుంది. ఈ వర్గమే సెజ్ మార్కెట్లో దళిత ప్రయోజనాలను అతి చవకగా అమ్మేస్తుంది. వర్గాల మధ్య పోటీని కూడా పెంచి మరింత లాభపడుతుంది సెజ్ యాజమాన్యం.

దళిత, బహుజన హక్కుల కోసం ఉద్యమిస్తున్నాం అంటున్న ప్రొ. కంచె ఐలయ్య, చంద్రభాన్ ప్రసాద్ లాంటి మేధావి వర్గం ఈ రోజున అమెరికా తరహా పెట్టుబడిదారీ వ్యవస్థను పొగిడి ఈ జాతుల అభివృద్ధికి భారతదేశంలో కూడా ఇదే విధానాన్ని ఆహ్వానిస్తున్నారు. తెలంగాణ సామాజిక చిత్రాన్ని అత్యద్భుతంగా ఆవిష్కరించి ప్రజల పక్షాన నిలబడ్డ రచయిత రఘోత్తమ రెడ్డి లాంటి వారు ఈ రోజున సెజ్‌లను సమర్థిస్తున్న వారి భావజాలానికి చేరువయ్యారు. ఇక సాధారణ దళితుల పరిస్థితి అర్థం చేసుకోవచ్చును.

అయితే ఇతర సామాజిక కులాలలోని వారు తమ భూములు, ఇళ్ళను అమ్మివేయలేదా? వారిలో దళారీ వర్గం లేదా అని చూస్తే ఇతర కులాలలోని రైతులు, మత్స్యకారులు, కులవృత్తి చేసుకునే కొంత మంది తమ ఇళ్లను అమ్మేసారు. కాని అమ్మకాలు సంఖ్యాపరంగా దళితుల అమ్మకాలతో పోలిస్తే తక్కువే. ఈ కులాలవారిలో కూడా సెజ్‌లో కాంట్రాక్టు పొందినవారున్నారు. అయినా సరే వారు తమ భూములను, ఇళ్లను సెజ్ యాజమాన్యానికి అప్పగించి పునరావాస కాలనీలకు తరలిపోవడం లేదు. ఇప్పటికి వీరు ఉద్యమ ఫలితాలను అనుభవిస్తూ, వచ్చిన కాంట్రాక్టులు చేసుకుంటున్నారే తప్ప, గ్రామాల ఎత్తివేతకు బలమైన దళారీ వర్గంగా తయారు కాలేదు.

కాకినాడ సెజ్ భూసేకరణ మొదలు పెట్టినప్పుడు మొట్టమొదటగా దళిత గ్రామాలే ప్రతిఘటించాయి. కొల్లవారి పాలెంకు చెందిన కొనాల సూరిబాయి నాయకత్వంలో ప్రభుత్వ, సెజ్ వాహనాలకు అడ్డం పడి ధర్నాలు చేశారు. అలాగే దడాలపాలెం మాజీ సర్పంచ్, పొన్నాడ పంచాయితీ వడ్డి నూకరాజు కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుడైనప్పటికి తమ గ్రామాలలోకి ప్రభుత్వ, సెజ్ అధికారులను రానివ్వలేదు. తెలుగుదేశానికి చెందిన మండలాధ్యక్షురాలు మాతా విజయకుమారి కూడా సెజ్ ప్రయత్నాలను నిలువరించి తమ సంబంధిత గ్రామాల్ని ఐక్యపరచడానికి ప్రయత్నించారు. అవసరమైతే వీరు సెజ్‌ను ఎదిరించి జైల్లకు పోవటానికి సైతం సిద్ధపడ్డారు. రావిపాడు గ్రామానికి చెందిన మత్స్య చందర్‌రావు, పెద్దబ్బాయిలను సెజ్ వ్యతిరేకంగా పని చేస్తున్నారని కేసులు బనాయించి జైల్లోకి తోసారు. కొంతమంది స్థానిక దళిత నాయకులు ప్రాణాలిచ్చి అయినా సరే సెజ్‌ను తరిమివేస్తామని పట్టుదలతోనే ఉన్నారు. సెజ్ వ్యతిరేక పోరాట కమిటీ ఏర్పడి గ్రామాలలో మీటింగ్‌లు పెట్టినప్పుడు సొంతానికి భూమిలేని దళిత పేటలకు వీరి మీటింగులు విస్తరించాయి. అయితే ఈ కమిటీ దళిత గ్రామాలలో కమిటీలు ఏర్పరచి, వాటిని సంఘటిత పరచలేకపోయింది. దళితుల సమస్యలు ప్రధాన ఎజెండాలోకి రాలేకపోయాయి. నాయకత్వ శ్రేణిలో వీరి పాత్ర చెప్పుకోదగ్గ స్థాయిలోను లేకపోయింది. సామాజిక వర్గాల చైతన్యస్థాయి రాజకీయాధికారాన్ని ఎలా నిర్దేశిస్తుందో, అదే విధంగా అట్టడుగువర్గాల చైతన్య స్థాయి, నాయకత్వం ఉద్యమ దిశను నిర్దేశిస్తుంది. ఏ ఉద్యమం అయినా సమాజంలోని అన్నివర్గాల ప్రయోజనాలను ముందుకు తీసుకొని వెళ్లినప్పుడే అది విజయవంతమవుతుంది. కాని సెజ్ ఉద్యమ నాయకత్వం ఎక్కువగా ఒసి, బిసి రైతుల చేతుల్లో ఉండటం చేత ఆస్తి పరిరక్షణగా మారిందన్న వాదన దళితులలో నెలకొంది.

భూమిని కోల్పోయిన రైతులు వేరొకచోట భూమిని సంపాదించ వచ్చును. అదే భూమి మీద ఆధారపడ్డ భూమి లేని భూమి పుత్రుల బతుకులకు ఆసరా ఏమిటన్నది ఒక ప్రశ్నగా వారిలో మిగిలిపోయింది. సెజ్ పోరాట ఉద్యమం వ్యక్తుల సొంత ఆస్తి పరిరక్షణ నుంచి భూమిలేని పేద దళితులకు భూపంపకం వైపు విస్తరించలేకపోయింది. అందుకే భూమిలేని నిరుపేద వర్గమైన దళితులు ఉద్యమంలో నిర్ణయాత్మకమైన పాత్ర వహించలేకపోతున్నారు. అత్యధిక శాతం వ్యవసాయ కూలీలు అయిన దళితులు ఈ రోజున అభివృద్ధి పేరిట వచ్చే సెజ్‌లలో కూలీలుగా వలసపోవడానికి సిద్ధపడుతున్నారు. ఏ ఆస్తి లేక, కులం కూడా ఆస్తి సంబంధాలకు ఉపయోగపడక సర్వం కోల్పోయి అభద్రతాభావంతో ముందుకు సాగుతున్నారే తప్ప సెజ్ స్థాపనలో భాగమై కాదు. వీరు మోసపోవడానికి వెనుక ఉన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను విశ్లేషించుకోవలసిన అవసరం ఉంది.

కారణాలు తెలుసుకొనే ముందు దళితులు అంటే ఎవరు, వీరి వెనుక ఉన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ కారణాలను విశ్లేషించవలసిన ఆవశ్యకత ఉంది. దళిత అనే పదం మొదటగా జ్యోతి బాపూలే ఉపయోగించారు. బహుళ ప్రాచుర్యంలోకి తీసుకువచ్చిన వారు డా.బాబా సాహెబ్ అంబేద్కర్. 'దళితం' అంటే గొలుసు నుంచి

విడగొట్టబడి, తెగగొట్టబడి వేరు చేయబడినది. అటువంటి వారే దళితులు. దళిత హక్కుల కోసం పోరాడే క్రమంలో కాంగ్రెస్ పార్టీ విదిలిస్తున్న ఎంగిలి మెతుకుల కోసం కాక ఆత్మగౌరవ పోరాటంగా రూపుదిద్దుకొనే క్రమంలో ఈ పదం మరింత స్థిరపడింది.

దళితులు అంటే సామాజికంగా ఆర్థికంగా, రాజకీయంగా అణచివేతకు గురి అవుతున్న వారని, ఒక విశాల అర్థంలో వాడటం జరుగుతున్నది. అయితే ఆర్థిక అణచివేతకు గురి అవుతున్న కులాలు కొన్ని సామాజిక, రాజకీయ అణచివేతకు ప్రత్యేకంగా గురి కావటం లేదు. కాని సామాజిక అణచివేతకు ప్రత్యేకంగా గురి అవుతున్న కులాలు ఆర్థిక, రాజకీయ అణచివేతకూ గురి అవుతున్నాయి. అందుకనే వాటికి ఒక ప్రత్యేకత ఉంది. సామాజిక అణచివేతకు, ఆర్థిక దోపిడికి, రాజకీయ నిర్లక్ష్యానికి గురి అవుతున్న కులాలను దళితులుగా గుర్తించడం జరుగుతోంది. అందులో కుల పరంగా, వర్ణ పరంగాను దోచుకోబడుతున్న వాళ్లే దళితులు.

భారతదేశ జనాభాలో 16 శాతంగా ఉండి అస్పృశ్యతకు గురవుతున్నది దళితులే. అందులో 90 శాతం పేదరికానికి చెందినవారే. 80 శాతం గ్రామీణ ప్రాంతంలో ఉంటున్నారు. వీరిలో 86 శాతం భూమి లేనివారు, 60 శాతం రోజువారీ కూలీలు, 37 శాతం చదువుకున్న వారు (అనగా సంతకం చేయగల్గిన వారు). ప్రతి పదిమందిలో ముగ్గురు దళిత స్త్రీలు అత్యాచారానికి గురవుతున్నారు. ప్రతి 18 నిమిషాలకు దళితుల మీద దాడి జరుగుతోంది. నేషనల్ క్రైమ్ బ్యూరో రిపోర్ట్ ప్రకారం 1999 లో 25,445 నేరాలు నమోదు అయ్యాయి. ప్రతి గంటలో ఇద్దరిపైన దాడి జరుగుతోంది. ఇద్దరు దళితులు హత్యకు గురవుతున్నారు. వారి నివాసాలు ధ్వంసం కాబడుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం స్వాతంత్ర్యం తెచ్చిన ఫలాలు దళితులకు అందకపోవడమే. భూ సంస్కరణలు, వ్యవసాయంలో వచ్చిన విప్లవాత్మక మార్పులు కేవలం ఆధిపత్య కులాలకు, ఓ మేరకు వెనుకబడ్డ కులాలకు అందుబాటులోకి వచ్చాయి. భూమిలేని నిరుపేద దళితులకు మిగిలింది ఇందిరమ్మ పథకాల కింద ఇళ్లు, చారెడు భూమి, కూలీ డబ్బులు తప్ప, వేరే విధంగా లబ్ది పొందడం జరగలేదు. గ్రామాల్లోని 80-90 శాతానికి పైగా భూమి ఆధిపత్య కులాల చేతుల్లో ఉంది. వీరిలో మోతుబరి, సన్నకారు వ్యవసాయ కూలీలు ఉన్నారు. వ్యవసాయ కూలీల శాతం దళిత వర్గాలతో పోల్చితే చాలా తక్కువే. అందుకే ఓసి, బిసి కులాలవారు ఈనాడు తమ సామాజిక, శ్రామిక వర్గాన్ని అదుపులో ఉంచగల్గుతున్నారు. భూమి, వనరులు వీరి చేతుల్లో ఉన్నాయి కాబట్టి ఒక విధమైన సామాజిక కట్టుబాటు చేయగలిగారు. తమ వర్గం వారికి భరోసా ఇవ్వగలిగారు. దళితులు ఇప్పటికీ తమ బతుకుదెరువు కోసం శూద్ర కులాల మీద ఆధార పడవలసిందే. ఈ వర్గాలు దళితుల్ని తమలో కలుపుకోలేకపోయారు.

దళిత పిల్లలు ప్రభుత్వం పెట్టిన ఉప్మా బడిలోను, (అంగన్‌వాడీలు) బోర్డు స్కూలులో (ప్రభుత్వ పాఠశాల) చదువుకోవాలి తప్ప పిల్లల్ని పట్నాలకు పంపి ఇంగ్లిష్ చదువు చెప్పించలేరు. తమ పిల్లలు పెద్ద పెద్ద దొరబాబుల్లాగా ఉద్యోగాలు చేసుకుంటారన్న గ్యారంటీ లేదు. తరాలుగా డాబా ఇల్లు చూసింది లేదు. వాటిలో బతికిందిలేదు. ఒక్కసారిగా వేల రూపాయలు వారి చేతిలో ఆడింది లేదు. ఈ రోజుకూ ఆధిపత్య కులాల ముందు చేతులు కట్టుకు నిలబడవలసిందే. వారి భూములపైన ఆధారపడవలసిందే. భౌతిక వనరులు, డబ్బు లేక సామాజికంగా వెనుకబడ్డ దళితుల్ని అర్థం చేసుకోవాలంటే పైన చెప్పిన కోణాల నుండి కూడా పరిశీలించాలి. సరిగ్గా ఈ దళితుల మనోభావాలపైన, సామాజిక ఆర్థిక స్థితిగతుల పైన దెబ్బకొట్టి సెజ్ యాజమాన్యం లాభపడుతోంది.

ధనిక, ఆధిపత్య కులాల్లో నాయకత్వం తమ భూమి కోసం పోరాడుతున్నారు తప్ప భూమి లేని నిరుపేద దళితులు ఈ పోరాటంతో నష్టపోతారని సెజ్ యాజమాన్యం చెపుతున్నారు. ఇల్లు, వాకిలి, ఉపాధి లేని దళితులకు (లేక ఉన్నా కూడా) పూరిపాకల స్థానంలో సెజ్ డాబా ఇల్లు కట్టిస్తుందని, ఇది గిట్టని రైతులు దళితులను అడ్డుకుంటున్నారని దళితవాడలలో ప్రచారం చేస్తున్నారు. సెజ్ రావడం ఎలాగూ తప్పదు కాబట్టి దీన్ని వ్యతిరేకిస్తే నష్టపోయేది దళితులేనని బెంబేలెత్తిస్తున్నారు. జాతి భవిష్యత్తుకు సెజ్ తప్పనిసరి వాస్తవికత అని నమ్మబలుకుతున్నారు. అసలు కార్పొరేట్ శక్తుల ప్రైవేటీకరణ దళిత జనాభ్యుదయానికేనని వక్కాణిస్తున్నారు. తమ పొలాల్లో కూలీలుగా పని చేయించుకోవటానికే ధనిక రైతులు దళితుల అభివృద్ధిని అడ్డుకుంటున్నారని సెజ్ యాజమాన్యం వాదిస్తోంది.

ఇంతేనా? డబ్బున్న రైతుల పిల్లలు ఇంగ్లిష్ కాన్వెంటులకు వెళుతున్నారని కానీ దళితుల పిల్లలు మాత్రం ఉప్మాబడిలోనో, బోర్డు స్కూలులోనో చదువుకోవలసిన స్థితి వున్నదని, ఇలాంటి స్థితిగతులను గమనించే కాకినాడ సెజ్ యాజమాన్యం ప్రతి ఇంటికీ, ముఖ్యంగా దళితులకు ఉపాధి కల్పించి వారి పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు కల్పిస్తుందని అసత్య ప్రచారాలతో ఊదరకొడుతున్నారు. అసలు కార్పొరేట్ స్కూల్స్ అన్ని దళితవాడల ముంగిట్లోకి వచ్చేస్తున్నాయనే భ్రమల్లో దళితుల్ని ముంచి తేల్చుతున్నారు. రేపో మాపో కంపెనీ అధికార్లుగా దళిత పిల్లల్ని చూడవచ్చని ఊరిస్తున్నారు.

ఈ అభివృద్ధి ప్రచారకులైన ప్రభుత్వం కానీ, అభివృద్ధి కోసం కృషి చేస్తామంటున్న పెట్టుబడిదారీ వర్గం కాని కాకినాడ సెజ్‌లో ఏమి చేస్తున్నారో దళిత ప్రయోజనాలను ఎలా పరిరక్షిస్తున్నారో చూద్దాం. అన్నింటికన్న మిన్నగా అభివృద్ధి పేరిట భూస్వామ్య విలువలను కాపాడుతూ, కులం మూలాల్ని ఎలా వేళ్ళూనుకునేలా చేస్తున్నారో ఒక్కసారి గమనిస్తే తెలుస్తుంది.

(ఇంకా ఉంది) వీ

స్థూలంగా చైనా చరిత్రను, వారి ఆరాట పోరాటాలను వివరిస్తూ, అక్కడి విప్లవాచరణలోని వైఫల్యాలను గ్రహించి ముందుకు సాగాల్సిన అవసరాన్ని చెబుతున్నారు **వరవరరావు**

చైనా విప్లవం - విహంగ వీక్షణం

చైనా ప్రజావిప్లవం విజయవంతమై ఈ అక్టోబర్ 1కి అరవయ్యేళ్లు పూర్తవుతుంది. 1949 అక్టోబర్ 1న తీన్ మీన్ స్క్వేర్ దగ్గర విజయోత్సవం జరుపుకోవడానికి వచ్చిన లక్షలాది మందిని చూసి వేదిక మీద ఉన్న మావో కంటనీరు పెట్టుకొని చౌ ఎన్ లై తో 'గొడుగు పట్టుకుని నడుస్తున్న ఒంటరి ప్రయాణీకులుగా మనం మిగిలి పోయామా?' అని విప్లవోద్యమంలో అమరులను ఎందరినో స్మరించుకున్నాడట. ఆ జన సమూహంలో ఆయనకు ఎందరో సహచరులను కోల్పోయిన ప్రజలు తమకు ఆయనతో ఉన్న సమీప అనుబంధంతో కనిపించారు. 'మనం నడవాల్సిన సుదూర ప్రయాణంలో ఒక లిప్త మాత్రం నడిచి వచ్చాం' అని కూడా అన్నాడు.

చైనా ప్రజావిప్లవ విజయం బీటలువారడం ప్రారంభమై కూడా ముప్పై ఏళ్లు దాటింది. అట్లని మావో బతికున్నంత కాలమే చైనా సామ్యవాద దేశంగా ఉందని కాదు. మావో 1976 సెప్టెంబర్ 9న మరణించాడు. చైనాలో పెట్టుబడిదారీ విధానం వైపు చూపు మళ్లడం 1971లోనే ప్రారంభమైంది. బహుశా అది 1976కు ఒకదారిగా మారి ఉంటుంది.

కనుక విప్లవ విజయానికి, క్రమంగా రివిజనిజానికి దారితీసిన చైనా విప్లవం నుంచి విహంగ వీక్షణంగానైనా గుణపాఠం తీసుకోవడం భారత విప్లవానికి చాల అవసరం. రష్యా వలె యూరేషియా కాకపోవడం వల్ల, చైనా విప్లవం రష్యా విప్లవం వలె సాయుధ తిరుగుబాటుగా కూడా వచ్చింది కాకపోవడం వల్ల కూడ మనకు పొరుగున ఉన్న చైనా అనుభవమే అన్ని విధాల సన్నిహితమైనదవుతుంది. అందులోని పోలికలు, తేడాలు కూడ చర్చించుకుందాం.

ఇరాక్ (మెసపటోమియా), ఈజిప్ట్ నాగరికతల వలెనే చైనా భారత నాగరికతలు కూడా అత్యంత ప్రాచీనమైనవి. కనీసం ఐదు వేల సంవత్సరాల క్రితమే నదీ పరీవాహక ప్రాంతాల్లో వ్యవసాయం చేయ నేర్చినవి. బట్ట నేసి కట్టడం నేర్చినవి. వ్యవసాయిక దేశాలుగా రూపొందినవి. భౌగోళికంగానూ, జనాభా రీత్యానూ ప్రపంచంలో కొన్ని ఖండాలను మించినవి. ఆసియా ఖండంలో సింహభాగాన్ని ఆక్రమించినవి. మొదటి ప్రపంచ యుద్ధం ముగిసే నాటికి చైనా, ఇండియా రెండూ ప్రజాస్వామ్య ఆకాంక్షతో ఉద్యమదారినెంచుకున్నవి. ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత 1920లలో రెండు దేశాలలో కూడా ప్రజాస్వామ్య ఉద్యమాలు అశేష ప్రజానీకాన్ని ఆకర్షించినవి. ఇండియాలో 1857ను మనం ఒక ప్రజాస్వామిక విప్లవ ప్రారంభ సంవత్సరంగా పేర్కొంటున్నాం. అట్లే చైనాలో సన్‌యెట్ సేన్ నాయకత్వంలో సాగిన ప్రజాస్వామిక ఉద్యమం మే 4 విద్యార్థి ఉద్యమంతో ఒక ప్రభావశీలమైన వెల్లువయింది. చైనాలో 1921లో, ఇండియాలో 1925లో కమ్యూనిస్టు పార్టీలు ఏర్పడినాయి. కాని ఈ కాలానికే ఇండియాలో గాంధీ నాయకత్వంలోని జాతీయోద్యమానికి ఎక్కువ ఆకర్షణ ఏర్పడింది. ఆయన నాయకత్వంలో ఇచ్చిన పిలుపు – సహాయ నిరాకరణ, శాసనోల్లంఘన, విదేశీ వస్తు (వస్త్ర) బహిష్కరణలలో ప్రజలు లక్షల సంఖ్యలో పాల్గొన్నారు. అయితే భారతదేశం వలె చైనా బ్రిటన్‌కు గానీ మరే సామ్రాజ్యవాద దేశానికి గానీ ప్రత్యక్ష వలసగా లేదు. అట్లే భారతదేశంలో వలె చైనాలో చప్పన్నారు జాతులు లేవు. హాన్ జాతియే చైనాలో అతిపెద్ద జాతి. ఇక్కడ బ్రిటిషిండియా వెలుపల ఐదు వందల సంస్థానాలు ఉన్నాయి. కాని టిపుసుల్తాన్, వీరపాండ్య కట్టబొమ్మన్ వంటి కొన్ని మినహాయింపులు తప్ప సంస్థానాధీశ్వరులందరూ బ్రిటిష్ తొత్తులుగానే కొనసాగారు. 1857 ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామ పరాజయం తర్వాత ప్రజలు సామ్రాజ్యవాద వ్యతిరేకులుగా, ప్రభువులు అనుకూలురుగా మారిన స్థితి ఆయా వర్గ స్వభావాలను బట్టి ఏర్పడింది. చైనాలో బలమైన కేంద్ర ప్రభుత్వం లేదు. ఎక్కడికక్కడ యుద్ధ ప్రభువుల పరిపాలన. వారిలో పేర్కొనదగిన సంపన్న యుద్ధ ప్రభువు చాంగ్ కై షేక్. తైవాన్ (ఫార్మోజా) గా పిలుచుకునే చైనా భూభాగాన్ని పరిపాలిస్తూ సామ్రాజ్యవాద అనుకూల వైఖరి తీసుకుని జపాను దురాక్రమణ కాలానికి పూర్తిగా అటు వైపు మిలాఖతయినవాడు. స్థూలంగా ఈ నేపథ్యం నుంచి చైనా విప్లవ విశ్లేషణకు పూనుకుందాం. ఆయా సందర్భాలను బట్టి మనతో పోలికలు, తేడాలు చూడవచ్చు.

కొన్ని వేల సంవత్సరాల ఫ్యూడల్ రాచరికాల పరిపాలన అణచివేతల వలన రెండు దేశాల్లోను ప్రజా చైతన్యం అణగారిపోయింది. కర్మ సిద్ధాంతానికి లోనయింది. చైనాలో ప్రజలు నల్లమందు భాయిల్లు అని పిలుచుకునే స్థితి ఏర్పడింది. ఫ్యూడల్ సమాజంలో స్త్రీలపై ఉండే అణచివేత రెట్టింపుగా ఉండడం వల్ల పుట్టగానే పసిపాపల పాదాలు కట్టివేసి పెరుగుదల లేకుండా చేసే స్థితి ఉండేది. అట్లే కష్టం చేసుకుని బతికే స్త్రీలు సంపన్నుల కోసం పిల్లలను కని, పెంచే అమానవీయ ఆచరణలు కూడా ఉండేవి. అయితే ఇది నాణానికి ఒకవైపే. మరొకవైపు చిరకాలం నుంచే చైనాలోను ఎన్నో రైతాంగ పోరాటాలు వెల్లువెత్తినవి.

చైనా, ఇండియా రెండు చోట్లా కమ్యూనిస్ట్ పార్టీ 1921, 25 ప్రాంతాల్లో ఏర్పడినప్పటికీ చైనాలో మావో సె టుంగ్ నాయకత్వంలో ఈ వేల సంవత్సరాల చైనా రైతాంగ పోరాట చరిత్ర అధ్యయనం జరిగింది. చైనా ప్రజా జీవితాన్ని, చివరకు చైనా హాన్ రాజ్యవంశ చరిత్రను కూడా మావో నాయకత్వంలో చైనా కమ్యూనిస్టు పార్టీ క్షుణ్ణంగా అధ్యయనం చేసింది. దీనికి తోడు ఫ్రాన్స్‌లో ఉన్నత విద్యలను అభ్యసించిన చౌ ఎన్ లై ఫ్రెంచ్ విప్లవ చరిత్రతో ఉత్తేజితుడై చైనా తిరిగి వచ్చి మావో సె టుంగ్ కు కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో తోడు నిలిచాడు. చైనా ప్రజా జీవిత, పోరాట అధ్యయనం ఒకవైపు, ఫ్రెంచ్ విప్లవంలో పెల్లుబికిన సమానత్వ, సౌభ్రాతృత్వ, స్వేచ్ఛా భావనల ప్రజాస్వామ్య భావన ఒకవైపు చైనాకు అనుగుణమైన ఒక విప్లవ పంథాను ఏర్పర్చుకోవడానికి దోహదం చేసినవి. అప్పటికే సన్‌యట్ సేన్ నాయకత్వంలో ఒక ప్రజాస్వామిక ఉద్యమం చైనాలో కొనసాగుతున్నది. బహుశా ప్రత్యక్ష వలసపాలన లేకపోవడం, భారతదేశం వంటి వర్ణ వ్యవస్థ లేకపోవడం ఇది సరైన దారిలో పయనించడానికి దోహదం చేసి ఉంటుంది.

భారతదేశంలో ఫ్యూడలిజానికి వర్ణ వ్యవస్థ ఒక బలమైన భావజాలాన్ని, ఆవరణను అమర్చి పెట్టింది. వలస పాలన, దానితో వచ్చిన భావజాలం 1857 తర్వాత చాలా తెలివిగా కుట్రపూరితంగానూ, ఉద్దేశపూరితంగానూ, ఈ వ్యవస్థతోనూ, ఈ భావజాలంతోనూ కుమ్మక్కైనవి. సంస్కృతం, ఇంగ్లీష్ ఆయా భావజాలాలకు వ్యక్తీకరణలుగా మారి న్యాయం, శాస్త్రం అన్నీ పరస్పర ఆధారాలయినవి. ఇక్కడి రాజకీయ ఉద్యమాలు అన్నీ తెలిసో తెలియకో ఈ పాశ్చాత్య దేశాలనుంచి వచ్చిన భావజాలం ప్రభావంలో పనిచేసినవి. కమ్యూనిస్టు పార్టీ కూడా బ్రిటిష్ కమ్యూనిస్టు రజనీ పామీ దత్ ప్రభావంతో ఏర్పడి, డాంగే మొదలైనవారు వేదాలలో కమ్యూనిజం చూసే భావజాలంతో సమన్వయమైనవి. ఆ తర్వాత కాలంలోనైనా రష్యాలో వాన పడితే ఇక్కడ కమ్యూనిస్టులు గొడుగు పట్టారని జనం చెప్పుకునేంతగా మన నాయకత్వం రష్యా కమ్యూనిస్టు నాయకత్వం వైపు మార్గదర్శకత్వం కోసం చూసింది. ఈ స్థితిని నలభై నాటికే కింది నుంచి ప్రజలే బద్దలు చేయవలసి వచ్చింది. అది తెభాగా కావచ్చు, పున్నప్రావైలార్ కావచ్చు, శిఖరాయమానంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం కావచ్చు.

తర్వాత కాలంలో చైనీకరణగా బాగా వాడుకలోకి వచ్చినట్టుగా మార్క్సిజం-లెనినిజాన్ని తాత్విక దర్శనంగా స్వీకరిస్తూనే మావో సె టుంగ్ చైనా దేశ కాల పాత్రకనుకూలంగా ఆ సిద్ధాంతాన్ని అన్వయించాడు. సాయుధ తిరుగుబాటు స్థానంలో దీర్ఘకాల సాయుధ పోరాటంగా ఉంటుందని, రష్యాలో వలె బూర్జువా వర్గం విజయవంతం అయిన కొద్ది నెలల్లోనే (1917 ఫిబ్రవరి - అక్టోబర్) సామ్యవాద దశలో వెళ్లడం సాధ్యంకాకపోవచ్చునని, నూతన ప్రజాస్వామ్యం అని సిద్ధాంత గ్రంథంలో మావో ప్రకటించాడు. అంటే, వ్యవసాయ దేశంలో విప్లవం నూతన ప్రజాస్వామికం, సామ్యవాదం అనే రెండు దశలుగా ఉంటుందని, ఇది దీర్ఘకాలికంగా భూ పోరాటం అనే ఆర్థిక పోరాటం, వ్యవసాయ విప్లవం ఇరుసుగా సాగుతుందని దీనికి సాయుధ పోరాట రూపం ప్రధానంగా ఉంటుందని పేర్కొన్నాడు. మావో సె టుంగ్ చెప్పినట్టుగా చైనా విప్లవ క్రమంలో అక్కడి కమ్యూనిస్టు పార్టీకి మూడు మంత్రదండాలు లభించాయి. అవి, కమ్యూనిస్టు పార్టీ అనే ఉక్కు క్రమ శిక్షణ కలిగిన నిర్మాణం. ఐక్య సంఘటన, భూస్వామ్య సామ్రాజ్యవాద దోపిడీకి గురవుతున్న అన్ని వర్గాలు, కార్మిక వర్గ నాయకత్వంలో సంఘటితం కావడం, ప్రజా సైన్యం. ప్రజల నుంచే విప్లవాన్ని గ్రహించే సైన్యాన్ని ఏర్పాటు చేసుకోవడం. రష్యా విప్లవంలో కార్మిక వర్గానికి తోడుగా జార్ సైన్యం నుంచే విడివడి వచ్చిన ఒక సెక్షన్ సహకరించింది. చైనాలో పాలక వర్గాలకు కళ్లూ, చెవులూ లాంటి పోలీసు వ్యవస్థపై ఆధార పడకుండా మన సైన్యాన్ని మనం తయారు చేసుకోవాలనే అనుభవం చైనా విప్లవం నేర్పింది. ప్రజా సైన్యం లేకుండా ప్రజలకు ఒరిగేదేమీలేదు అనే అవగాహన విస్తృత ప్రచారాన్ని పొందింది. ఈ మూడు మంత్రదండాలతో మూడు దోపిడీ పర్వతాలను కూల్చవచ్చునని మావో సె టుంగ్ ప్రజలకు చాలా సులభంగా అర్థమయ్యే భాషలో ఏ పరిభాషా భారం లేకుండా ముసలి మూర్ఖులు కొండను తవ్వుతున్నారని ప్రజలు చెప్పుకునే జానపద గాథల అనుభవం నుంచి విడమర్చి చెప్పాడు.

సామ్రాజ్యవాదం, భూస్వామ్యం ఈ రెండింటికీ ఊడిగం చేసే దళారీ నిరంకుశ పరిపాలనలు అనే దోపిడీ కొండలు ప్రజల మార్గానికి అడ్డు నిలిచాయని తవ్వితే పెల్లపెల్లగానైనా కొండ విరిగి పడక తప్పదని ప్రజలకు విశ్వాసం కలిగించాడు. ఇందుకొరకు ఒక 'లాంగ్ మార్చ్' నిర్వహించాడు. ఇది అధ్యయనానికీ, పోరాటానికీ ఒక చలన శిక్షణా శిబిరంగా పనిచేసింది. విప్లవం కీలక విజయానికి చేరుకునే సమయంలో ప్రజల త్యాగానికి శిఖరాయమానంగా టాటూ నదిని దాటడానికి ప్రజలే వంతెనగా ఏర్పడినారు. కమ్యూనిస్టులు కష్టమైన పనులు ఎంచుకోవడంలో, త్యాగాలు చేయడంలో పోటీపడడాన్ని చైనా విప్లవం నేర్పింది. ఈ లాంగ్ మార్చ్ పొడుగునా భూస్వాధీనం, విప్లవ భూసంస్కరణలు, వరదలూ, తుఫానుల నుంచి ప్రజలను కాపాడడం, ఆరోగ్యం, విద్య, వంటి అన్ని ప్రాథమిక అవసరాల్లో ప్రజలకు తోడ్పడుతూ కమ్యూనిస్టు పార్టీ, ప్రజాసైన్యం నడిచింది.

'ప్రజలకు సేవ చేయండి. ఎవరి నుంచి సూదీ దారం, పడుకోవడానికి ఒక చాప తీసుకున్నా తిరిగి అప్పగించండి. తీసుకున్న వస్తువు తీసుకున్న చోట జాగ్రత్తగా ఉంచండి' వంటి అతి చిన్న జాగ్రత్తలు కూడా మావో సె టుంగ్ ఒక బాధ్యతగా కమ్యూనిస్టులకు చెప్పాడు. వ్యవసాయ కూలీ, భూమి లేని నిరుపేద మొదలు ధనిక రైతు వరకు భూస్వామ్య సామ్రాజ్యవాద దళారీ దోపిడీకి గురవుతున్నారు గనుక ఈ వర్గాల మధ్య ఐక్య సంఘటన కట్టాడు. ఈ వర్గ విశ్లేషణను యెనాన్ వంటి ప్రాంతాలెంచుకొని క్షుణ్ణంగా భూసంబంధాలు అధ్యయనం చేసి చెప్పాడు. దర్యాప్తు, విచారణ (ఇన్వెస్టిగేషన్) లేకుండా ఏ ప్రతిపాదనా చేయవద్దని, సిద్ధాంతం కోసం ప్రతిపాదన కాకుండా వాస్తవాల మీద ఆధారపడి సైద్ధాంతిక విశ్లేషణతో ప్రతిపాదన చేయాలని మావో సూచించాడు.

జపాన్ సామ్రాజ్యవాద దాడి సమయానికి ఈ ఐక్య సంఘటన చైనా విప్లవంలో ఎంత అమోఘమైన ఫలితాలనిచ్చిందంటే జపాన్ వ్యతిరేక యుద్ధ కాలంలో దేశభక్తులైన భూస్వాములకు భూముల స్వాధీనాన్ని కూడా మినహాయించి, చాంగ్ కై షేక్ ను కూడా బందీ చేసి పోరాడే చైనా ప్రజల ముందర నిలబెట్టి ఎండగట్టే విధంగా పోరాడే నైతిక, రాజకీయ స్థైర్యం విప్లవానికి అబ్బింది. అందుకే జపాన్ వ్యతిరేక యుద్ధం ముగిసేనాటికి జపాన్ సామ్రాజ్యవాదం ఓడిపోవడమే కాకుండా

చైనా విముక్తం కావడం మాత్రమేకాదు చైనా విప్లవం విజయవంతమైంది. దేశాలు స్వాతంత్ర్యాన్ని కోరుతున్నాయి, జాతులు విముక్తిని కోరుతున్నాయి, ప్రజలు విప్లవాన్ని కోరుతున్నారు. ఈ మూడు దశల్లోను కమ్యూనిస్టు విప్లవానికి నాయకత్వం వహిస్తే ఇవి క్రమంగా ప్రజల విప్లవంలో ఫలిస్తాయి అని మావో సె టుంగ్ చెప్పింది జపాన్ దాడి సందర్భంగా చైనాలో రుజువయింది. ఆ తర్వాత వియత్నాం లోనూ రుజువయింది.

అటువంటి అనుభవమే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో మనకు అందివచ్చింది. నైజాం ఫ్యూడల్ పాలన నుంచి, జమీందారీ, జాగీర్దారీ వ్యవస్థ నుంచి విముక్తి మాత్రమే కాకుండా తెలుగు ప్రజల ఐక్యత ఈ క్రమంలో ప్రజల చేతికి అధికారం తెచ్చే ఒక పోరాటాన్ని ఆంధ్ర మహాసభ అనే ఒక ఐక్య సంఘటన నాయకత్వంలో తెలంగాణలో ప్రజలు ఇదే కాలంలో ప్రారంభించారు. 1948లో చైనా విప్లవం విజయవంతం అయ్యేనాటికి తెలంగాణలో మూడు వేల గ్రామాల్లో ప్రజలు పది లక్షల ఎకరాల భూమి స్వాధీనం చేసుకుని బీజప్రాయంలో ఎర్రరాజ్యాన్ని చవిచూసారు. కాని అప్పటికే చైనా అనుభవం నుంచి నేర్చుకున్న ఢిల్లీలోని పాలకవర్గాలు ఇది ప్రజా విప్లవంగా ఫలించక ముందే సైనిక దాడి చేసి హైదరాబాద్ సంస్థానాన్ని ఇండియన్ యూనియన్‌లో కలిపేసుకున్నారు (ఎన్నెక్స్‌డ్).

రెండో ప్రపంచ యుద్ధ కాలంలో వాస్తవానికి డిమిట్రోవ్ ప్రతిపాదించిన ఐక్య సంఘటనా సిద్ధాంతం మూడు సందర్భాల్లో విజయవంతం కావడాన్ని మనం ఇక్కడ గమనించవచ్చు. ఫాసిజాన్ని, నాజీజాన్ని ఎదుర్కొనే క్రమంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్నైనా కాపాడు కోవడానికైనా, సామ్యవాద ప్రజాస్వామ్య శక్తులు ముందుకు వచ్చి ఐక్య సంఘటనకు నాయకత్వం వహించి, విజయాన్ని సాధించడం రెండో ప్రపంచ యుద్ధంలో చూడవచ్చు. అట్లే చైనా విప్లవం, అట్లే తెలంగాణ. కాని తెలంగాణలో మాత్రం అప్పటికే ఢిల్లీలో ఏర్పడిన దళారీ పాలకవర్గం దాన్ని కొనసాగకుండా తుంచి వేసింది. కొనసాగుతున్న విప్లవాలకు ఈ మూడు మంత్రదండాలు, ముఖ్యంగా, మళ్లీ 1930 నుండి 1945 ల నాటి పరిస్థితులు ఏర్పడి అమెరికన్ సామ్రాజ్యవాదం అఫ్ఘన్, ఇరాక్ దాడుల తర్వాత ఫాసిస్ట్, టెర్రరిస్ట్ స్వభావాన్ని పొందిన తర్వాత, ఇటువంటి ఐక్య సంఘటన ఆవశ్యకత ఇదివరకెప్పుడూ లేనంత పెరిగింది. దేశభక్తులు, ప్రజల సార్వభౌమాధికారం మిగలాలని కోరుకునేవారు జాతి విముక్తి పోరాటాలు, ప్రజాస్వామ్య శక్తులు, విప్లవోద్యమం కలిసి బలమైన ఐక్య సంఘటనగా సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రతిఘటన పోరాటాలు నిర్వహించాల్సిన దశలో మనం ఇప్పుడు ఉన్నాం.

1949లో చైనాలో విప్లవం విజయవంతం అయిన తర్వాత 1956 వరకు సామ్యవాద దశవైపు ప్రయాణం చేసింది. ఈ క్రమమంతా విప్లవ భూసంస్కరణలు చేస్తూ అందుకనుగుణమైన పరిశ్రమలు ఏర్పాటు చేస్తూ, మావో సె టుంగ్ రెండు కాళ్లపై నడవాలి అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. చైనా వంటి వ్యవసాయ దేశానికి వ్యవసాయం, పరిశ్రమ రెండు కాళ్లవంటివని, చైనా సమాజం ఈ రెండు కాళ్ల మీద నడవాలని, అయితే, పరిశ్రమ అనే కాలు వ్యవసాయం అనే కాలుకు బలం ఇవ్వడానికి, లేపి వేయవలసిన అడుగుగా ఉండాలని ఆయన చెప్పాడు. ఆయన ఎప్పుడూ రైతులకు, ప్రజలకు అర్థమయ్యే భాష మాట్లాడాడు. ఎనిమిది కాళ్ల పరిభాషను ఆయన తిరస్కరించాడు. ఈ సందర్భంగానే అభివృద్ధికి సంబంధించి ఆయన ఒక మౌలికమైన అవగాహన ముందుకు తెచ్చాడు. వర్గ సమాజంలో ఎల్లకాలాలకు వర్గపోరాటం భూమికగా ఉంటుంది. ఉత్పత్తి, ఉత్పత్తిలో అభివృద్ధి, ప్రయోగం దానికి కోణాలుగా ఉంటాయి. వర్గపోరాటాన్ని విస్మరించిన ఉత్పత్తిలో అభివృద్ధి గానీ, ప్రయోగం గానీ విప్లవ ప్రయోజనానికి హానికరం అని ఆయన ప్రతిపాదించాడు. కమ్యూనిస్టులు పరిశ్రమలకు, అభివృద్ధికి, ప్రయోగాలకు వ్యతిరేకులు అని ప్రచారం చేసే వాళ్లు వర్గపోరాటాన్ని విస్మరించి, లేదా ఉద్దేశపూర్వకంగా పక్కదారి పట్టించి అభివృద్ధి పేరిట పెట్టుబడిదారీ పంథాలోకి ప్రయాణించాలని అనుకునేవాళ్లే.

వర్గపోరాటాన్ని నిర్వహిస్తూనే మావో సె టుంగ్ అభివృద్ధి విషయంలోగానీ, ప్రయోగం విషయంలోగానీ ఎంత ఆసక్తి కనబరిచారంటే, 1956లో సామ్యవాద దశలోకి ప్రయాణించామని అనుకున్నప్పుడు ఇంతవరకూ రెండు కాళ్లతో నడుస్తూ వచ్చాం, ఇప్పుడింక ఒక పెద్ద అంగతో గెంతు వేయవచ్చు (గ్రేట్ లీప్ ఫార్వర్డ్) అని చెపుతూ ఇందుకనుగుణంగా చర్చలో పాల్గొనవలసిందిగా ప్రజలకు పిలుపునిచ్చాడు. 'నూరు పూలు వికసించనీ, వెయ్యి ఆలోచనలు ఘర్షణ పడనీ' అని చెప్పింది అదే సందర్భం. ఈ సామ్యవాద దశ ప్రయోగం చైనాలో జరుగుతున్న కాలం సరిగ్గా ప్రపంచంలో కృశ్చేవ్ నాయకత్వంలో ప్రపంచ కమ్యూనిస్టు పార్టీలు వర్గపోరాటానికి చెల్లుచీటీ రాసిన కాలం. అంతర్జాతీయ కమ్యూనిస్టు పార్టీ సమావేశంలో కృశ్చేవ్ శాంతియుత సహజీవనం, శాంతియుత పరివర్తన, శాంతియుత పోటీ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు.

ప్రపంచంలో ఒక సువిశాలమైనటువంటి భూఖండంలో గణనీయమైన సంఖ్య కలిగిన రష్యా, చైనాలలో విప్లవం విజయవంతమై సామ్యవాద ప్రభుత్వాలు ఏర్పడినవి గనుక ఇంక వర్గపోరాటం అవసరం లేదని, సామ్యవాదం దిశగా పోరాడుతున్న దేశాల్లోకి శాంతియుతంగానే సామ్యవాదాన్ని దిగుమతి చేయవచ్చునని, అట్లే సామ్రాజ్యవాద మార్కెట్‌తోటి సామ్యవాద మార్కెట్ పోటీపడి సహజీవనం చేయవచ్చునని ప్రతిపాదించాడు. ఆ తర్వాత కాలంలో గోర్బచేవ్ ప్రతిపాదించిన 'గ్లాస్‌నాస్త్ –పెరిస్ట్రోయికా' సిద్ధాంతాలైనా, అంతకు ఐదేళ్ల ముందే 1951 అక్టోబర్‌లో తెలంగాణలో సాయుధ పోరాట విరమణ చేసిన కమ్యూనిస్టు పార్టీ 1952లో ఎన్నికల రాజకీయాలలో ప్రవేశించడమైనా ఈ రివిజనిస్టు రాజకీయాల ముందూ వెనకలే. కాకపోతే 1951లో తెలంగాణలో 56లో ప్రపంచవ్యాప్తంగా కృశ్చేవ్ నాయకత్వంలో రంగుమార్చకుండా దిక్కుమార్చిన కమ్యూనిస్టు పార్టీలు గోర్బచేవ్ సిద్ధాంతాలతో 1991 నాటికి రంగు బహిరంగమై బయటపడ్డాయి.

1956 నుంచి 66 వరకు కమ్యూనిస్టు ఉద్యమంలోని అంతర్జాతీయ పరిణామాలు చైనాలోని సామ్యవాద ప్రయోగం పై తమ ప్రభావం చూపాయి. మావో నాయకత్వంలో కృశ్చేవ్‌తో వర్గపోరాట సిద్ధాంతపు గ్రేట్ డిబేట్ ఈ కాలమంతా నడిచింది. కాని, రెండు పంథాల మధ్య పోరాటంలో చైనాలో విద్యాలయాల్లోనూ అన్నిటికి మించి

కమ్యూనిస్టు పార్టీలోనే అన్యవర్గ భావజాలం చోటుచేసుకుంది. అందుకే 1966లో గ్రేట్ డిబేట్ ముగిసి వర్గ సమాజం ఉన్నంతకాలం వర్గపోరాటం ఉంటుంది అని అంతర్జాతీయంగా మార్క్సిస్ట్ – లెనినిస్ట్ లందరూ సైద్ధాంతిక విజయాన్ని సాధించినప్పటికీ చైనాలో జరగవలసిన నష్టం జరిగింది.

కమ్యూనిస్టు పార్టీ కేంద్ర నాయకత్వంలోనే బూర్జువా వర్గ ధోరణులు పొడసూపాయి. అప్పుడు సృజనాత్మకంగా మార్క్సిజం – లెనినిజాన్ని మావో అన్వయించి వర్గాలు మరెక్కడో బయట సమాజంలోనే కాదు, కమ్యూనిస్టు పార్టీలోనే ఉండవచ్చు. అందుకే రెండు పంథాల మధ్య పోరాటం (టూ లైన్ స్ట్రగుల్) అని ప్రతిపాదించాడు. దానికనుగుణమైన సూత్రీకరణలు కొన్ని చేశాడు. కమ్యూనిస్టు పార్టీకి కేంద్రీకృత ప్రజాస్వామ్యం ఒక నిర్మాణ సూత్రం. పునాదిలో నిర్ద్వాక్షిణ్యమైన ప్రజాస్వామ్య చర్చ జరిగి ఒక నిర్ణయం తీసుకున్నాక కేంద్రం నుండి అమలు కావాలి. కాని ఆ కేంద్రం స్థితిస్థాపకమైనప్పుడు, సృజనాత్మకత కోల్పోయినప్పుడు కేంద్రాన్ని ప్రశ్నించాల్సి రావచ్చు. అందుకు కేంద్రాన్నే బద్దలుకొట్టండి (బంబార్డ్ ది హెడ్‌క్వార్టర్స్) అని పిలుపునిచ్చాడు. అందుకోసం ఆలోచించడానికి సాహసించమన్నాడు (డేర్ టు థింక్). ఏటికి ఎదురీదమన్నాడు (స్విమ్ అగెనెస్ట్ ది టైడ్). ఇందుకోసం రెడ్ గార్డ్స్‌ను ఏర్పాటు చేశాడు.

అయితే సామ్యవాద వ్యవస్థలో అన్యవర్గ ధోరణుల మీద పోరాటం గనుక ఇది చాలా ఓపికతోనూ, శాంతియుతంగానూ రెడ్ గార్డ్స్ నిర్వహించాల్సిన పోరాటంగానూ ఉంటుందని అన్నారు. 1966 నుంచి ప్రారంభమైన ఈ విప్లవాన్ని శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవం అని పిలిచారు. అంటే ఇది భావజాలానికీ, సంస్కృతికీ సంబంధించిన పోరాటమైనా దీని భూమిక శ్రామికవర్గ పోరాటమే. బూర్జువా వర్గం పై శ్రామికవర్గ పోరాటమే. అందుకే దీనితో ఉత్తేజితుడై నక్సల్బరీ పోరాటాన్ని ప్రారంభించిన చారు మజుందార్, బోల్షివిక్ విప్లవం, చైనా విప్లవాల తరువాత ఇది మూడవ విప్లవం అన్నాడు. ఈ విప్లవానికి ప్రపంచ వ్యాప్తంగానే ఎంత ప్రభావం వచ్చిందంటే ప్రపంచం అంతటా మార్క్సిస్ట్ లెనినిస్ట్ పార్టీలు ఏర్పడ్డాయి. ఇవన్నీ వర్గ పోరాట ఆవశ్యకతను గుర్తించడమే కాదు, వర్గపోరాటాలు ప్రారంభించాయి.

థాయ్‌లాండ్‌లో విద్యార్థి పోరాటం, మహత్తర ఫ్రెంచ్ విద్యార్థి విప్లవం ఈ సాంస్కృతిక విప్లవ ప్రభావంలో ప్రారంభమైనవే. ఇక మనదేశంలో నక్సల్బరీ విప్లవానికి బలమైన బాహిర ప్రేరణ చైనా శ్రామికవర్గ విప్లవమేనని చారు మజుందార్ మాటలను బట్టి తెలుసుకోవచ్చు. ఈ శ్రామికవర్గ విప్లవం పదేళ్లపాటు నడిచింది. చైనా సమాజంలో నూతన మానవ ఆవిష్కరణ కొరకు ఈ విప్లవం సాగుతున్నదని, ఇటువంటి మరెన్నో విప్లవాల ఆవశ్యకత ముందుముందు అవసరమవుతుందని చెపుతూ మావో సె టుంగ్ ఇది ఒకచోట, ఒకకాలంలో ముగిసేది కాదనీ, రోజూ ఉదయం మొహం కడుక్కున్నట్టు గానే, రోజూ రెండు పూటలా ఇల్లు ఊడ్చుకున్నట్టుగానే ఇది ఒక నిరంతర ప్రక్రియ అని చెప్పాడు. సాంస్కృతిక విప్లవ విజయంలో కూడా ఇది అనుభవానికి వచ్చింది. ఇది 1971 నాటికి వామపక్ష అతివాదా (లెఫ్ట్ సెక్టేరియనిజం)నికి దారి తీసింది. మావో సూక్తులు (రెడ్ బుక్) చదివితే చాలునని, మావో విగ్రహాలు (హోర్డింగ్‌లు) పెద్ద పెద్దవి పెట్టి ఒక వ్యక్తి పూజ వైపు తీసుకుపోవడమే కాకుండా, మావో ప్రస్తావన వచ్చిన చోటల్లా సాహిత్యంలో ఆయనకు రెండు పంక్తుల విశేషణాలు తగిలించే స్థితికి వెళ్లింది.

సామ్యవాదానికి అడుగు పెట్టే దశలో ఉత్పత్తిలో అభివృద్ధి, ప్రయోగాల కొరకు మావో సె టుంగ్ దేశీయ ప్రజల అనుభవంలో ఉన్న జ్ఞానాన్ని, వివేకాన్ని అన్ని రంగాల్లో ఉపయోగించుకోవాలని ప్రతిపాదించాడు. దీన్నే ప్రజల సాంకేతికత (ఇండీజినస్ టెక్నాలజి) అన్నాడు. ఆక్యుపంక్చర్, బేర్‌ఫుట్ డాక్టర్ వంటి ఆరోగ్యం, వైద్యంలో చైనా ప్రజల అనుభవంలో ఉన్న ఎంతో శాస్త్రవిజ్ఞానం ఈ కాలం వెలుగులోకి వచ్చింది. అట్లే సంగీతంలో, ఇతర రంగాలలో. కాని, దీనిని రెడ్ బుక్ పట్టుకుని శస్త్ర చికిత్సలు చేయవచ్చు అన్న వామపక్ష చాదస్తంగా ప్రచారం చేయడం జరిగింది. షేక్స్పియర్ నాటకాల వంటివి నిషేధించడం, ఒక మూస కళా సాహిత్యాలను ప్రచారం చేయడం అనే స్థాయికి కుదించబడింది. అప్పుడు చైనా కమ్యూనిస్టు పదవ కాంగ్రెస్ (1973)లో ఒక పెడధోరణిని సవరించే ప్రయత్నంలో ఏమాత్రం సమతూకం తప్పినా మరొక పెడధోరణికి దారితీస్తుందని, కుట్రలూ కుహకాలూ చేయవద్దని, ఐక్యంగానూ, పారదర్శకంగానూ ఉండాలని కమ్యూనిస్టు శ్రేణులకు పిలుపునివ్వాల్సి వచ్చింది.

కమ్యూనిస్టు దేశాల బయటి మీడియా ఆ దేశాల సమాచారానికి సంబంధించిన ఉన్న ఇబ్బందులకు కొన్ని మాటలు రూపొందిస్తూ ఉంటుంది. స్టాలిన్ కాలంలో బయటి ప్రపంచానికి ఇనుప తెర అడ్డంగా ఉందని, 1971 వరకు చైనాకు బయటి ప్రపంచానికి వెదురు తడక అడ్డంగా ఉందని రాస్తూ ఉండేది. 1971లో అమెరికా అధ్యక్షుడు నిక్సన్ మొదటిసారిగా అధికారికంగా చైనా వెళ్లాడు. అంటే చైనాకు బయటి ప్రపంచానికి ఉన్న వెదురు తడక పక్కకు జరిగిందన్న మాట. అప్పటి వరకు అమెరికా, రష్యాల గుప్పెట్లో ఉన్న ఐక్యరాజ్య సమితికి, ప్రపంచ మార్కెట్‌కు చైనా వెలిగా ఉన్నది. 1971లోనే బ్రిటిష్ చరిత్రకారుడూ, పత్రికా రచయిత మాక్స్‌వెల్ కూడా నిక్సన్ పర్యటన సందర్భంగా చైనాకు వెళ్లాడు. అప్పటి చైనా సమాజం గురించి మాక్స్‌వెల్ కొన్ని పరిశీలనలు రాశాడు. నిక్సన్ పెకింగ్ విమానాశ్రయంలో దిగగానే పెద్ద పెద్ద ప్రకటనలు (హోర్డింగ్) చూశాడట. వాటి మీద 'బూర్జువా వర్గపు భావజాలం నశించాలి. శ్రామిక వర్గపు భావజాలం వర్ధిల్లాలి' అనే నినాదాలు ఉన్నాయట. నిక్సన్ వెంట ఉన్నవాళ్లు, తన పర్యటనలో మాక్స్‌వెల్ కూడా కమ్యూన్‌లలోకి వెళ్లి అక్కడ పనిచేసుకుంటున్న వాళ్లను ఈ మాటలకు అర్థమేమిటని అడిగారట. వాళ్లు ఒకరి ముఖాలు ఒకరు చూసుకొని, తేరుకొని చర్చించుకొని స్వార్థం నశించాలి, సేవాభావం వర్ధిల్లాలి అని అర్థం వచ్చే సామాన్య భాషలో జవాబు చెప్పారట. మాక్స్‌వెల్‌కు పెట్టుబడిదారీ మార్కెట్ అంటే స్వార్థం అని, కమ్యూన్ అన్నా సోవియట్ అన్నా పరస్పర సహకార సేవ అని మనం అర్థం చేసుకోవచ్చు అని రాస్తాడు.

(చైనా భారత యుద్ధం సందర్భంగా ఇండియాస్ చైనా వార్ అనే చరిత్ర గ్రంథాన్ని రచించింది ఈ చరిత్రకారుడే. మన ప్రభుత్వం ఈ పుస్తకాన్ని నిషేధించింది.) 1971 నాటికి శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవ ప్రభావం వల్ల చైనా ప్రజల చైతన్య స్థాయి చూపడానికి ఇదొక

నిదర్శనం. అయితే బహుశా ఈ తొలగిన వెదురు తడక ప్రపంచ మార్కెట్ నుంచి వచ్చే దుమ్మూ ధూళి నుంచి చైనాను కాపాడలేకపోయిందనేది కాలం గడిచాక మనం గ్రహించవచ్చు. చైనా కమ్యునిస్టు పార్టీ ఎప్పుడూ రెండుపంథాల మధ్య పోరాటాన్ని అనుమతించింది, కొనసాగించింది. హునాన్ భూసంబంధాల విశ్లేషణ కాలం నాటికి మావో సె టుంగ్ పార్టీలో మైనారిటీలో ఉన్నాడు. ఆయనకు పార్టీ ఆ విశ్లేషణకు అవకాశమిచ్చి, ఆయన పోరాటాన్ని కొనసాగనిచ్చి, గుర్తించడంతో ఆయనకు నాయకత్వం వచ్చింది. అట్లే లిన్ పియావో తో 1971-73 కాలం, డెంగ్ సియావో పింగ్ తో 1973-76 కాలంలో రెండు పంథాల మధ్య పోరాటం సాగింది. కాని 1971లో తెరుచుకున్న వెదురు తలుపులు 1976 నాటికి డెంగ్ సియావో పింగ్ పంథాకు విజయాన్ని సాధించి పెట్టింది. శ్రామికవర్గ విప్లవ కాలంలో అనామకుడైన డెంగ్ సియావో పింగ్ 1973 తర్వాత క్రమంగా కమ్యూనిస్టు పార్టీ పైనా, ఎర్రసైన్యం పైనా తన పట్టు సాధించుకున్నాడు. 1976 తో పెట్టుబడిదారీ పంథా పునరుద్ధరణ ప్రారంభమైంది. వర్గపోరాటమూ, ఉత్పత్తి ప్రయోగమూ అనే సిద్ధాంతం స్థానంలో ఏ పిల్లి అయితేనేమీ ఎలుకను పట్టడానికి అనే సిద్ధాంతం ముందుకు వచ్చింది. అభివృద్ధి, అభివృద్ధి కొరకు ప్రయోగం మాత్రమే గీటురాయి అయ్యాయి.

1971లో నిక్సన్ చైనాకు రావడానికి ముందే అటు రష్యాలో రివిజనిజం తారాస్థాయికి వెళ్లిపోయి సోషల్ సామ్రాజ్యవాద స్థాయికి చేరుకున్నది. 1968లో జెకొస్లొవేకియాపై దురాక్రమణ చేసింది. ఒకవైపు చైనా సరిహద్దు దేశం అని చెపుతూనే చైనాతో సరిహద్దు యుద్ధాలకు దిగింది. వియత్నాంలో అమెరికాకు వ్యతిరేక సహాయం పేరుతో జోక్యానికి పూనుకున్నది. ఈజిప్ట్‌లో సైనికస్థావరం ఏర్పాటు చేసుకున్నది. మూడో ప్రపంచ దేశాల్లో సామ్రాజ్యవాద మార్కెట్‌కు పోటీ అనే పేరుతో తన మార్కెట్‌ను ఏర్పాటు చేసుకోవడం మాత్రమే కాకుండా రాజకీయ సైనిక జోక్యాలకు పూనుకున్నది. భారతదేశంతో సైనిక ఒప్పందం చేసుకున్నది. ఒకవిధంగా మూడో ప్రపంచ దేశాలతో అలీన విధానం అనే నెపంతో తన ఉపగ్రహ రాజ్యాలను ఏర్పాటు చేసుకున్నది.

భారతదేశంలో పబ్లిక్ సెక్టర్ ఉంటే సోషలిజం అమలైనట్లు, రష్యా, తూర్పు యూరప్ దేశాల నుంచి దిగుమతులు చేసుకుంటే అది సోషలిజం దిగుమతి చేసుకున్నట్టు ఇక్కడి కమ్యూనిస్టు పార్టీలు నెహ్రూ, ఇందిరలతోపాటు ఒక యాంత్రిక నిర్వచనం ఇచ్చే స్థితి వచ్చింది. సామ్రాజ్యవాదంతో పోటీ అనేది మరొక సామ్రాజ్యవాద మార్కెట్ ఏర్పాటుకు దారితీసింది. అదే సోషల్ సామ్రాజ్యవాదం. మాటల్లో సోషలిజం, చేతల్లో పెట్టుబడిదారీ పంథానే సోషల్ సామ్రాజ్యవాదం అంటారని లెనిన్ ఏనాడో చెప్పాడు. రెండో ప్రపంచ యుద్ధం కాలంలో ఫాసిజానికీ, నాజీజానికీ ప్రత్యక్షంగా అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్‌లకు పరోక్షంగా సాధ్యంకాని సామ్యవాద శిబిరం కూల్చివేత చెట్టులోపల పుట్టిన వేరు పురుగు తొలిచినట్టుగా 1956లో కృశ్చేవ్ సిద్ధాంతంతో మొదలయి 1968 నాటికి సోషల్ సామ్రాజ్యవాదంగా పరిణమించింది.

1966 శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవం, 1969లో ప్రపంచ వ్యాప్తంగా మార్క్సిస్ట్ - లెనినిస్ట్ పార్టీలు ఏర్పడే నాటికి అంటే లెనిన్ శతజయంతి నాటికి సోవియట్ రష్యా కాస్తా సోషల్ సామ్రాజ్యవాదంగా మారింది. అందుకే ప్రపంచవ్యాప్తంగా సోషల్ సామ్రాజ్యవాదం, దాని నాయకత్వంలోని రివిజనిజం ప్రపంచ విప్లవానికి ప్రధాన శత్రువుగా మారారని, మావో నాయకత్వంలో ప్రపంచంలోని మార్క్సిస్ట్ - లెనినిస్ట్ పార్టీలన్నీ గ్రహించి ప్రకటించాయి. ఇది సాకుగా చైనా ప్రభుత్వం ఇటు బంగ్లాదేశ్ జాతివిముక్తి పోరాటాన్ని, పాకిస్తాన్ రష్యా వ్యతిరేక కూటమిలో భాగంగా భావించి వ్యతిరేకించడమైనా, శ్రీలంకలో తిరుగుబాటుకు వ్యతిరేకంగా ప్రభుత్వాన్ని సమర్థించడమైనా చేసింది. 1976లో డెంగ్‌కు పూర్తిగా పట్టు లభించినప్పటికి ఇది ఒక సూత్రీకరణగా సోషల్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అమెరికన్ సామ్రాజ్యవాదంతో కూడా కలిసి పనిచేయడంగా ముందుకు వచ్చింది.

ఆసియా ఖండంలో ఆయా చోట్ల ప్రభుత్వ వ్యతిరేక విప్లవోద్యమాలకు అది గీటురాయిగా చైనా సహకరించడమో, సహకరించక పోవడమో జరిగింది. ఫిలిప్పైన్స్, మలయా, మలేసియా మొదలైన దేశాలలో ఉవ్వెత్తున వచ్చిన విప్లవాలు అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకమైనవి గనుక చైనా సహకారాన్ని పొందలేకపోయాయి. మన దేశంలో ఇదే కాలంలో వచ్చిన ఎమర్జెన్సీని వ్యతిరేకించడంలో ఒకటి రెండు విప్లవ పార్టీలు అమెరికాకు అనుకూలమైన మొరార్జీ దేశాయితో పొత్తు కట్టడం వరకు ఇది కార్యరూపం దాల్చింది. ఈ విధంగా 1971 నుంచి 1990-91 దాకా అమెరికన్ సామ్రాజ్యవాదం, యూరపియన్ సామ్రాజ్యవాదాలు బలపడే స్థితి వచ్చింది. 1991 తూర్పు యూరప్ పరిణామాలు, సోవియట్ పరిణామాలతో ప్రపంచమంతా సామ్రాజ్యవాద ప్రపంచీకరణలో భాగంగా అమెరికన్ సామ్రాజ్యవాదానికి లోబడిపోయినవి. చైనాలో పెట్టుబడిదారీ పంథాలో ప్రయాణం ఇంక నల్లేరు మీది బండి నడక అయ్యింది.

కాకపోతే 1956 నుంచి 1991 వరకు రష్యన్ సామ్రాజ్యవాద మార్కెట్ అమెరికన్ సామ్రాజ్యవాద మార్కెట్‌తో పోటీపడ్డట్టుగా ఇప్పుడు చైనా మార్కెట్ అమెరికా మార్కెట్‌తో పోటీ పడుతూ సమఉజ్జీగా ఉండవచ్చు. భారతదేశం వలె చేయి కిందయి దేబిరించే స్థితి ఉండక పోవచ్చు. కాని రష్యాలో 1956 నుంచి 1991 వరకు జరిగిన పరిణామాలు చూస్తే రానున్న కాలంలో చైనా కూడా ఏం కాబోతున్నదో ఊహించడం కష్టం కాదు. అది గతితార్కికంగా ఊహిస్తున్న విప్లవ శక్తులు మళ్లీ అక్కడ వర్గ పోరాటానికి ఆయత్తం చేస్తున్న వార్తలు వస్తూనే ఉన్నాయి. ఇటీవలే చైనాలో జరిగిన ఒలింపిక్స్‌లో 'మా స్వప్నం ఒకే ప్రపంచం' అనే నినాదం తీసుకున్నారు. ఆ నినాదం 1991లోనే అమెరికా ఇచ్చింది. 'మా స్వప్నం మరో ప్రపంచం' అని ఉండవలసిన కమ్యూనిస్టు నినాదం 'మా స్వప్నం ఒకే ప్రపంచం' అనే ప్రపంచ మార్కెట్ నినాదంగా మారిపోయింది. అయితే కొందరికి ఇప్పటికిప్పుడు చైనా అమెరికాను కూడా భయపెట్టగల బలవత్తరమైన శక్తిగా కనిపించవచ్చు. కాని, ఆ బలం చైనా విప్లవ మహత్తర త్యాగాల మీద, సామ్యవాద నిర్మాణం మీద, శ్రామిక వర్గ సాంస్కృతిక విప్లవ పోరాటం మీద వచ్చినబలం కాని పెట్టుబడిదారీ పంథాను అవలంబించడం వల్ల వచ్చింది కాదు.

నిరంతర శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవాల నిర్వహణ ఆగిపోయి, వర్గపోరాటం భూమికగా ఉత్పత్తిలో అభివృద్ధి, ప్రయోగాలను నిర్వహించకపోవడం చైనా విప్లవానికి విఘాతం కలిగించాయని గ్రహించడమే భారత విప్లవానికైనా, ఇతర ప్రపంచ దేశాల విప్లవాలకైనా గుణపాఠం అవుతుంది. వీ

వ్యవసాయ ప్రధానమైన దేశంలో భూమితో సంబంధంలేని సేవారంగం, పరిశ్రమలు విస్తరించినా అవి మనుగడ సాగించలేవని అంటూ రష్యా, చైనా అనుభవాల ఆధారంగా విశ్లేషిస్తున్నారు **ఎం. కోదండరాం**

చైనా ఆర్థికాభివృద్ధి నమూనా

1950, 60 దశకాలలో చైనాలో ఆర్థికాభివృద్ధిపై జరిగిన చర్చకు, ఇప్పటికి చాలా మంది మరిచిపోయినా, ఎంతో ప్రాధాన్యత ఉంది. ఆర్థికాభివృద్ధిని అప్పటిదాకా ఆర్థిక నిపుణులు మాత్రమే పరిశీలించగల అంశంగా చూశారు. చైనాలో తలెత్తిన వివాదాల తరువాత సాధారణ ప్రజలు కూడా మాట్లాడుకునే విషయంగా మారిపోయింది.

చైనా సామ్రాజ్యవాదుల నుండి, వారి ఏజెంట్ల నుండి విముక్తి చెందిన తరువాత సోవియట్ యూనియన్ నమూనానే అనుసరించాలని నిర్ణయించుకుంది. సోవియట్ ఆర్థికాభివృద్ధి నమూనా పారిశ్రామికాభివృద్ధి ద్వారానే సోషలిస్ట్ నిర్మాణం సాధ్యమన్న ఆలోచన ఆధారంగా తయారైంది. పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేయడానికి సోవియట్ ప్రభుత్వం భారీ పరిశ్రమల నిర్మాణానికి వనరులను కేటాయించింది. వినియోగ వస్తువుల రంగాన్ని, వ్యవసాయ రంగాన్ని ఎండగట్టి సోవియట్ ప్రభుత్వం వనరులన్నింటిని భారీ పరిశ్రమల రంగానికే ఖర్చుచేసింది. వినియోగ వస్తువుల ఉత్పత్తి ప్రజల అవసరాలను తీర్చగల స్థాయికి పెరగలేదు. వ్యవసాయరంగం కూడా వనరులు లేక కుంటుబడిపోయింది. ఈ పరిస్థితిలో భారీ పరిశ్రమలకు మార్కెట్ సమస్య వచ్చింది. వినియోగ వస్తువుల రంగం అభివృద్ధి చెందితే భారీ పరిశ్రమలకు గిరాకీ పెరుగుతుంది. ఎందుకంటే వినియోగ వస్తువుల రంగం కావలసిన యంత్ర పరికరాలను కొనుగోలు చేసి భారీ పరిశ్రమల రంగానికి మార్కెట్‌ను కల్పిస్తుంది. వినియోగ వస్తువులు అమ్ముడు పోవాలంటే వ్యవసాయం అభివృద్ధి చెందాలి. వ్యవసాయరంగం బాగుపడితే గ్రామీణ ప్రజలు వినియోగ వస్తువులను కొంటారు. ట్రాక్టర్లు, మరనాగళ్లను కొని భారీ పరిశ్రమలకు గిరాకీని కల్పిస్తారు. సోవియట్ యూనియన్ తనకున్న వనరులను భారీ పరిశ్రమల రంగంలో కేంద్రీకరించింది. అమెరికా నుండి వచ్చిన ప్రమాదం కారణంగా మిలిటరీ మీద కూడా సోవియట్ యూనియన్ బాగానే ఖర్చు చేయవలసి వచ్చింది. ఈ కారణాల వల్ల వినియోగ వస్తువుల రంగం, వ్యవసాయం నిర్లక్ష్యానికి గురైనాయి.

సోవియట్ నమూనాలో మరొక లోపం కూడా ఉంది. భారీ పరిశ్రమల వికాసం పైన దృష్టి పెట్టడం వలన, భారీ పరిశ్రమల అభివృద్ధిని తక్షణ లక్ష్యంగా ఎంచుకోవడం వలన కేంద్రీకృతమైన రాజ్యవ్యవస్థ ఏర్పడింది. మొత్తం వనరులను సమీకరించి, భారీ పరిశ్రమల నిర్మాణాన్ని చేయడానికి బలమైన, కేంద్రీకృతమైన ప్రభుత్వ యంత్రాంగం అవసరమైంది. ఈ యంత్రాంగం నిరంకుశంగా గ్రామాల నుండి పట్టణాలకు వనరులను తరలించింది. వ్యవసాయంలోని మిగులు మొత్తాన్ని బలవంతంగా సేకరించి పారిశ్రామికాభివృద్ధికి, మిలిటరీ అవసరాలకు ఉపయోగించింది. దీనివలన గ్రామాలకు, పట్టణాలకు మధ్య వ్యత్యాసాలు పెరిగాయి. వ్యవసాయానికి, పారిశ్రామిక రంగానికి మధ్య వైరుధ్యాలు తలెత్తాయి. పరిశ్రమలలోనూ మొత్తం అధికారం మేనేజర్ల, ఇంజనీర్ల చేతుల్లోనే ఉండేది. ఉత్పత్తికి సంబంధించిన అన్ని నిర్ణయాలూ మేనేజర్లు తీసుకునేవారు. కంపెనీల్లోనూ కార్మికుల పరిస్థితులలో ఏమార్పు రాలేదు. కార్మికులకు నిర్ణయాధికారంలో భాగస్వామ్యం ఉండేది కాదు.

1952 నుండి అమలైన మొదటి పంచవర్ష ప్రణాళికా కాలంలో సోవియట్ నమూనాను అనుసరించడం వలన పైన వివరించిన సమస్యలను చైనా కూడా ఎదుర్కొన్నది. ఈ ఆర్థిక సమస్యలను అధిగమించడానికి ప్రయత్నిస్తున్న తరుణంలోనే 1956లో సోవియట్ కమ్యూనిస్ట్ పార్టీ 20వ మహాసభ జరిగింది. ఈ సభలో కృశ్చేవ్ స్టాలిన్‌ను తీవ్రంగా విమర్శించాడు. స్టాలిన్ నిరంకుశంగా వ్యవహరించాడనీ, ప్రజాస్వామిక పద్ధతిలో పార్టీలో చర్చకే అవకాశమివ్వలేదనీ అన్నాడు. స్టాలిన్ అనుసరించిన పద్ధతులను చైనా కమ్యూనిస్ట్ పార్టీ కూడా వ్యతిరేకించింది.

స్టాలిన్ చేసిన తప్పిదాలను కృశ్చేవ్ మూల్యాంకనం చేసిన పద్ధతి మార్క్సిస్టు మూల సూత్రాలకు విరుద్ధమని కూడా చైనా కమ్యూనిస్ట్ పార్టీ భావించింది. స్టాలిన్ చర్యలను కృశ్చేవ్ వ్యక్తిగత చర్యలుగా చూసినాడు. స్టాలిన్ వ్యవహార శైలిని సోవియట్ యూనియన్‌లో తలెత్తిన సామాజిక – ఆర్థిక పరిణామాలలో అంతర్భాగంగా చూడాలని చైనా కమ్యూనిస్ట్ పార్టీ విశ్లేషించింది.

చైనా కమ్యూనిస్ట్ పార్టీ, ఆ పార్టీ నాయకుడైన మావో సోషలిస్ట్ సమాజాలలో పార్టీ పాత్ర ఎట్లా ఉండాలి, సోషలిస్ట్ అభివృద్ధి ఏ విధంగా సాధ్యమౌతుందన్న మౌలిక ప్రశ్నలను లేవనెత్తాడు. 1956 నుండి 1965 మధ్యకాలంలో చేసిన రచనలన్నింటిలోనూ మావో ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతికే ప్రయత్నం చేశాడు. అసలు సోషలిస్ట్ వ్యవస్థల నిర్మాణాలపైన సమగ్ర గ్రంథం రాయాలనుకున్నాడు. కానీ రాజకీయ

కార్యకలాపాల కారణంగా ఆ పని పూర్తి చేయలేకపోయాడు. సోషలిస్ట్ సమాజాలలో వైరుధ్యాలు ఉండవని స్టాలిన్ చేసిన సూత్రీకరణతో మావో విభేదించాడు. గతితార్కిక భౌతికవాదం ప్రకారం వైరుధ్యాలు ఎల్లకాలం ఉంటాయి. వైరుధ్యాల స్వభావం మాత్రం మారుతుంది. సోషలిస్ట్ సమాజాలలోనూ వైరుధ్యాలు ఉంటాయి. కాకపోతే సోషలిస్ట్ సమాజాలలో వైరుధ్యాలను శాంతియుతంగా పరిష్కరించుకోవడానికి అవకాశం ఉంది.

వైరుధ్యాలు సమసిపోతాయి కనుక పెట్టుబడిని పెంచగలిగితే, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించగలిగితే అభివృద్ధిని సాధించవచ్చునన్న స్టాలిన్ రెండవ సూత్రీకరణనూ మావో తిరస్కరించాడు. ఉత్పత్తిని సాధించేది మానవ శ్రమ. కనుక ఉత్పత్తిని పెంచాలంటే మానవ కృషి ఉండాలి. పెట్టుబడిని కుమ్మరించినా, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడినా మనిషి పూనుకోకపోతే, శ్రమ చేయకపోతే ఉత్పత్తి జరగదు. మనిషి లేకుండా ఉత్పత్తి జరగదు. మంత్రాలకు చింతకాయలు రాలుతాయా? సమాజం ఏర్పరిచిన ప్రతిబంధకాలను తొలగించకుండా మనుషులందరూ ఉత్పత్తిలో పాల్గొనడం సాధ్యం కాదు. సోషలిస్ట్ సమాజాలలోనూ వైరుధ్యాలుంటాయని అంగీకరిస్తే తప్ప ఉత్పత్తి క్రమంలో మనుషులందరు పాల్గొనడానికి ఏర్పడే అవరోధాలను చూడలేం. మావో ఆలోచనల ప్రకారం వ్యవసాయానికి – పారిశ్రామిక రంగానికి, భారీ పరిశ్రమలకు – చిన్నతరహా పరిశ్రమలకు; అభివృద్ధి చెందిన కోస్తా ప్రాంతాలకు – వెనుకబడిన లోతట్టు ప్రాంతాలకు; మెజారిటీ హాన్ తెగకు – ఇతర జాతులకు; నిపుణులకు – కార్మికులకు; పార్టీకి – ప్రజలకు మధ్య వైరుధ్యాలుంటాయి. ఈ వైరుధ్యాలను పరిష్కరించకపోతే సమాజ నిర్మాణంలో, ఉత్పత్తి క్రమంలో అందరికీ సమాన భాగస్వామ్యం దొరకదు. జరిగిన ఉత్పత్తి అందరికీ సమానంగా పంపిణీ కాదు. ఉత్పత్తి ఫలితాలు అందరికీ సమానంగా ఇవ్వగలిగినప్పుడు, ఉత్పత్తికి సంబంధించిన నిర్ణయాలలో శ్రమచేసేవారికి భాగస్వామ్యం దొరికినప్పుడు ప్రజలంతా ఉత్సాహంగా ఉత్పత్తిలో పాల్గొంటారు.

మావో దృష్టిలో చైనాకు ప్రధానమైన వనరు ప్రజలు. ప్రజలు చైతన్యవంతులై ఉత్పత్తిలో పాల్గొనకుండా ఆర్థికాభివృద్ధి సాధ్యం కాదని మావో వివరించాడు. అందుకుగాను ప్రజలకు వనరులపై అధికారాన్ని కల్పించాలి. స్థానిక పరిజ్ఞానంతో వాటిని వినియోగించి ఉత్పత్తి చేసుకోవడానికి కావలసిన వ్యవస్థలను నిర్మించాలి. ఈ మార్పులు రావడానికి అప్పటికి చైనాలో ఆటంకంగా నిలిచిన శక్తులను గుర్తించడానికి మావో ప్రయత్నించారు.

ఆనాటికి చైనాలో సోవియట్ నమూనాను అనుసరించారు కాబట్టి ఫ్యాక్టరీలలో మేనేజర్లు బలపడిపోయారు. గ్రామీణ వ్యవస్థ నిర్లక్ష్యానికి గురైంది. ఈ స్థితిలో ముందు వ్యవసాయం అభివృద్ధి చెందకుండా చైనా ఆర్థిక ప్రగతిని సాధించలేదని మావో గ్రహించాడు. అయితే వ్యవసాయాభివృద్ధికి మానవ శ్రమనే పెట్టుబడిగా పెట్టాలని, సాంప్రదాయిక పరిజ్ఞానాన్నే ఉపయోగించాలని మావో భావించాడు. కానీ చైనాలో విప్లవం తరువాత ఏర్పడిన పరిస్థితులు అందుకు అడ్డు తగిలాయి. విప్లవం విజయవంతమై కమ్యూనిస్ట్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత భూ సంస్కరణలు అమలయ్యాయి. భూస్వాముల భూమిని ప్రజలకు పంచారు. ఈ మార్పుల తరువాత పశుసంపద, పనిముట్లు కలిగిన వారు ధనిక రైతులుగా ఎదిగారు. కానీ ఈ పెట్టుబడి లేనివారి స్థితి దిగజారిపోయింది.

ఈ పరిస్థితిని మార్చకుండా వ్యవసాయాభివృద్ధి సాధ్యం కాదని మావో గ్రహించాడు. సమస్యకు సహకార వ్యవసాయమే పరిష్కారమని ముందుకు తెచ్చినాడు. రైతులందరూ సహకార వ్యవస్థగా ఏర్పడి పరిశ్రమను, అందుబాటులో ఉన్న పనిముట్లను, పశువులను సమిష్టిగా వాడుకోగలిగితే వ్యవసాయాభివృద్ధిని సాధించవచ్చని మావో ప్రతిపాదించాడు. కమ్యూనిస్ట్ పార్టీ జాతీయ సమావేశాలలో ఘర్షణ పడి తన ప్రతిపాదనకు ఆమోదం పొందాడు. రైతులు సహకార సంస్థలుగా ఏర్పడ్డారు. వేగంగా అభివృద్ధిని సాధించగలిగారు. ఆ తరువాత ఈ సహకార సంస్థలే సాగునీటి సౌకర్యాన్ని పెంపొందించాయి. స్థానిక వనరులతో వినియోగ వస్తువుల ఉత్పత్తికి చిన్న తరహా పరిశ్రమలను నెలకొల్పాయి. అదనంగా పెట్టుబడి లేకుండానే చైనాలో వ్యవసాయం అభివృద్ధి చెందింది. పారిశ్రామిక ఉత్పత్తులకు మార్కెట్‌ను కల్పించింది. అంతర్జాతీయ రంగంలో చైనా ఎదగడానికి ఈ సంస్కరణలే మూలకారణమయ్యాయి.

ఇవ్వాళ భారతదేశంలో దాదాపు 1950లలో చైనాలో తలెత్తిన పరిస్థితి కనబడుతున్నది. మన దేశంలో సరళీకరణ యుగంలో ప్రభుత్వం సేవారంగం, పారిశ్రామిక రంగాలకే ప్రాధాన్యతనిచ్చింది. మొత్తం నిధుల కేటాయింపులు ఈ రంగాలకే జరిగాయి. వ్యవసాయం నిధులు దక్కక చితికిపోయింది. చిన్న, సన్నకారు రైతులే ఇవ్వాళ వ్యవసాయ రంగంలో 80 శాతం ఉన్నారు. తగిన మద్దతు లభించక రైతులు వ్యవసాయం చేయలేక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారు.

దాదాపు దశాబ్దకాలం తరువాత ఇవ్వాళ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు, పారిశ్రామికవేత్తలకు వ్యవసాయ సంక్షోభం వలన తలెత్తిన అనర్థాలు అర్థమవుతున్నాయి. ఆహారధాన్యాల ఉత్పత్తి రేటు పెరుగుదలకు, నానాటికి కుదించుకొని పోతున్న మార్కెట్ విస్తరణకు, గ్రామీణ ప్రాంతాలలో తలెత్తిన అస్థిరత నివారణకు వ్యవసాయాభివృద్ధే ఏకైక పరిష్కార మార్గం. ఆ రోజు చైనా ఇదే రకమైన ఆర్థిక స్థితిలో ఉంది. కానీ అక్కడి రాజకీయ పరిస్థితులు వేరు. కనుకనే భూసంస్కరణలు అమలయ్యాయి. ప్రజలకూ నిర్ణయాధికారం దక్కింది. భారతదేశంలో అధికారం ఉత్పత్తితో సంబంధంలేని దళారీ వర్గం చేతుల్లో ఉంది. రాజ్యానికి జూదరి స్వభావం ఏర్పడింది. ఆర్థికాభివృద్ధి నుండి రాజ్యం దూరంగా ఉండాలని ఆర్థిక సంస్కరణలు చెపుతున్నాయి. కానీ అందుకు భిన్నంగా రాజ్యం సంపన్న వర్గాలకు వనరులను తరలించే సంస్థగా రూపాంతరం చెందింది. ఈ వర్గానికి భూమి అమ్మకం సరుకు. చిన్న రైతులను బేదఖలు చేసి కంపెనీలు పెట్టి, అమెరికాలో చేసినట్టు వ్యవసాయం చేయాలన్న ఆలోచనే చేస్తున్నారు. ఈ విషయాలన్నింటిని పరిశీలించినప్పుడు ఆర్థికాభివృద్ధి పంథా రాజకీయ పరిస్థితులను బట్టి నిర్ణయమౌతుంది. చైనా చరిత్ర భారతదేశ వ్యవసాయ రంగ సమస్యలకు ప్రత్యామ్నాయ పరిష్కారాన్ని వెతుక్కోవటానికి తోడ్పడగలదు. వీ

చైనా సెజ్‌లలో, మొత్తంగా కార్మిక వ్యతిరేక విధానాల అమలువల్ల అక్కడి కార్మికులు ఎదుర్కొంటున్న సవాళ్లను వివరిస్తున్నారు **డయానా బిమోన్ట్**

చైనా తొలి సెజ్‌లో కార్మికుల దుస్థితి

పారిశ్రామిక ఉత్పత్తికి మారుపేరుగా నిలిచిన సెజ్ షాన్‌జెన్. మొదటి నాలుగు సెజ్‌లలో ఇది ఒకటి. స్వేచ్ఛా విపణి సంస్కరణలకు, విదేశీ పెట్టుబడులకు సెజ్‌లు ప్రయోగశాలలు. ఇవి సోషలిస్టు ఆర్థిక వ్యవస్థకు భిన్నంగా చైనా వేసిన తొలి అడుగులు. 1979లో సెజ్ హోదా కల్పించాక షాన్‌జెన్‌లో దాదాపు రెండు దశాబ్దాల పాటు వస్తు రవాణా, ప్రజల రాకపోకలు నిషేధించబడ్డాయి. వస్తువుల ఎగుమతి, విదేశీ పెట్టుబడులు, పన్ను రాయితీల భూమికపై స్వేచ్ఛా విపణి నగరంగా విలసిల్లింది. ప్రస్తుతం షాన్‌జెన్ ఇతర పారిశ్రామిక మండలాల కన్నా భిన్నంగా లేదు. ప్రజా రాకపోకలు, వస్తు రవాణా సేవలపై నిషేధం తొలగించారు. చైనా పారిశ్రామిక మండలాలలో ఇబ్బడిముబ్బడిగా విదేశీ పెట్టుబడులు, కార్మిక వలసలు నేడు సర్వ సామాన్యం. సర్వ వ్యాప్తం.

విదేశీ పెట్టుబడికి, పారిశ్రామిక వస్తు తయారీ కేంద్రంగా షాన్‌జెన్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. కానీ ఇప్పుడు విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం లేదు. భూమి ధరలకు రెక్కలు రావడం, కార్మికుల జీతాలు పెరగడం ఇందుకు కారణాలు. షాన్‌జెన్ స్థానిక ప్రభుత్వం ప్రస్తుతం సేవా రంగంపైకి తన దృష్టిని మరల్చింది. టెలికమ్యూనికేషన్స్, ఎలక్ట్రానిక్ రంగాలు ఊపు అందుకొన్నాయి. హైటెక్ సెంటర్స్ వెలుస్తున్నాయి. ప్రజలు షాన్‌జెన్ సెజ్ గురించి మాట్లాడేటప్పుడు కొత్తగా అభివృద్ధి చెందిన బఓ, లాంగాంగ్ పారిశ్రామిక నగరాల గురించి కూడా చర్చించుకొంటున్నారు. నా వ్యాసంలో షాన్‌జెన్‌కు ఉత్తరాన వెలసిన ఈ రెండు పారిశ్రామిక నగరాలను కూడా పరిగణనలోకి తీసుకొంటాను.

పాతికేళ్ల క్రితం షాన్‌జెన్ వెనుకబడ్డ పల్లె ప్రాంతం. నేడది వలస కార్మికులతో నిర్మింపబడిన పారిశ్రామిక నగరం. వలస వచ్చిన వారిలో నిపుణులు మొదలుకొని సామాన్య కాంట్రాక్ట్ కూలీల వరకు ఉన్నారు. కాంట్రాక్ట్ కూలీలు ఎక్కువగా నిర్మాణరంగం, చిల్లర వ్యాపారం, వస్తువుల తయారీ, రవాణా, సేవా రంగాల్లో కనిపిస్తారు. పట్టణ శివారు ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్, టెలికమ్యూనికేషన్స్ ఫ్యాక్టరీలున్నాయి. ముద్రణ, బొమ్మల తయారీ, రెడిమేడ్ దుస్తులు, లోహ వస్తువుల తయారీ వీటిలో మరికొన్ని.

చైనాలోని బాగా వెనుకబడిన ప్రాంతాల నుండి వలస వచ్చిన కార్మికులు ఇక్కడి కర్మాగారాల్లో పనిచేస్తున్నారు. వీరి వలసలు సాధారణంగా స్వల్పకాలికం. స్థానిక ప్రభుత్వం వీరు నివాసం ఉండడానికి వసతి కల్పించదు. అందువలన ఆరోగ్య సేవలకు, పిల్లల చదువుల కోసం ఎక్కువ డబ్బులు ఖర్చు చేయవలసి వస్తుంది. ఈ ప్రభుత్వ విధానం సాధారణ వలస కార్మికులను ఇబ్బందుల పాలుజేస్తుంది. దీనికి తోడు తక్కువ జీతాలు. ఈ పరిస్థితులు చాలా కుటుంబాలను వేరుచేస్తున్నాయి. పిల్లలను తమ సొంత గ్రామాల్లో పెద్దవారి దగ్గర ఉంచుతున్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యాలు డార్మెటరీలను కార్మికులకు ఉచితంగా లేదా కొద్ది మొత్తం వసూలు చేసో ఇస్తున్నాయి. ఈ డార్మెటరీల్లో వసతులు స్వల్పం. ఎక్కువ మంది భార్యాభర్తలు విడివిడిగా డార్మెటరీల్లో కాలం వెళ్లబుచ్చుతుంటారు.

వలస కార్మికుల దుస్థితికి ప్రధాన కారణం ఇక్కడి ఫ్యాక్టరీల్లో కార్మిక చట్టాలను యథేచ్ఛగా ఉల్లంఘించడమే. కార్మికులు తక్కువ జీతాలకు పని చేయడమో, ఎక్కువ గంటలు పని చేయడమో, పని చేసే చోట గాయాలు తగలడమో, అనారోగ్యం పాలుకావడమో వంటివి ఏదో ఒకటి ప్రతి వలస కార్మికుడు, కార్మికురాలు చవి చూస్తారు. యజమాన్యం నిర్లక్ష్యం వలన. కార్పొరేట్ యాజమాన్యాల కార్మిక వ్యతిరేక ప్రవర్తనను పసిగట్టలేకపోతున్నారు కార్మిక శాఖ ఇన్‌స్పెక్టర్లు. అంతేగాదు యాజమాన్యాలకు కొమ్ముకాస్తున్నారనే అపవాదును మూటగట్టుకొంటున్నారు. చైనాలో స్వతంత్ర కార్మిక సంఘాల ఏర్పాటుకు స్థానం లేదు. అఖిల చైనా కార్మిక సమాఖ్యలో భాగం కావడం మినహా. స్థానిక కార్మిక శాఖలు స్థానిక ప్రభుత్వాలు, కమ్యూనిస్టు పార్టీ కనుసన్నలలో పనిచేస్తాయి. ఈ రెండు సంస్థలు పైవారికి స్థానికంగా జరుగుతున్న పరిణామాలు వివరించే స్థితిలో లేవు. నిర్ణయాలు చేసే శక్తీ లేదు.

దేశంలో ఇతర ప్రాంతాల కంటే ఎక్కువ వేతనాలు చెల్లించే ప్రాంతంగా షాన్‌జెన్‌కు పేరుంది. ఇక్కడి అధిక జీవన వ్యయం, ద్రవ్యోల్బణాల వలన జీతం విలువ నిజరూపంలో చాల తక్కువగా ఉంటుంది. యాంగ్సీ నదీ తీర ఎగుమతి ప్రధాన ఉత్పత్తి కేంద్రాల్లో ఉండే పని వాతావరణం కన్నా షాన్‌జెన్‌లో ఘోరం అని చెప్పుకొంటారు. ఇక్కడి కార్మికుల్లో నిరాశ పెరిగి పెరిగి రోడ్డెక్కుతున్నారు. తరచు సమ్మెలు ఇక్కడ సాధారణమైనవి. కాని సమ్మెలు ఎప్పుడూ రాజకీయ రంగు పులుముకోవు. ఫ్యాక్టరీల్లో యాజమాన్య సిబ్బంది ప్రవర్తనా తీరుపైన, కంపెనీ కెంటీన్‌లో రేట్లు తగ్గించమని కార్మికులు సమ్మె చేస్తారు. చాలా చిన్న విషయాల కోసం కార్మికులు రోడెక్కుతున్నారు అంటే షాన్‌జెన్‌లో కార్మిక యాజమాన్య సంబంధాలు ఎంత అధ్వాన్నంగా ఉన్నాయో ప్రత్యేకంగా చెప్పక్కరలేదు.

యాజమాన్య నిర్లక్ష్య వైఖరితో విసిగిన కార్మికులు న్యాయం కోసం

చైనాలో విద్య, సాంస్కృతిక విప్లవ స్పృహ సాధించిన విజయాలు నిలదొక్కుకునే లోపే మారిన రాజకీయార్థిక పరిస్థితులలో తిరోగమనానికి గురైన వైనాన్ని వివరిస్తున్నారు **సి.ఎస్.ఆర్. ప్రసాద్**

చైనాలో విద్య - మొన్న, నిన్న, నేడు

1949 అక్టోబర్‌లో చైనాలో విజయమంతమైన విప్లవం ప్రపంచ దేశాలన్నింటిలో, ముఖ్యంగా మూడవ ప్రపంచ దేశాల్లో ఎంతో ఆసక్తిని కలిగించింది. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన చైనాలో కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి రావడం దానంతట అదే ఒక ఉత్తేజకరమైన అంశం. ఆ ప్రభుత్వం వివిధ పునాది ఉపరితల రంగాలలో చేపట్టబోయే విప్లవాత్మక మార్పుల పట్ల వెనుకబడిన దేశాల ప్రజల్లో, ఆలోచనాపరుల్లో ఆశావహ దృష్టి ఏర్పరిచింది. ఆర్థిక, రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక వెనుకబాటుతనాన్ని నిర్మూలించి, సమిష్టితత్వం, సామాజిక న్యాయం అనే సూత్రాల ప్రాతిపదిక మీద నూతన సమాజ ఆవిర్భావం చైనాలో సాధ్యమవుతుందని, తద్వారా అది నూతన ప్రజాస్వామిక సమాజ స్థాపన దిశగా ఉద్యమిస్తున్న ప్రజలకు ఆశాజ్యోతిగా, ఆదర్శ నమూనాగా ఉంటుందని అందరూ భావించారు.

అయితే అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే చైనా కమ్యూనిస్ట్ పార్టీ నాయకత్వంలో తలెత్తిన పెడధోరణుల కారణంగా మావో ఆశించిన నూతన సమాజ సృష్టికి విఘాతం కలిగింది. అవకాశవాద నాయకత్వం పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ తిష్టవేసుకుంది. ప్రజాసేవకు అంకితం కావలసిన పార్టీ యంత్రాంగం నిరంకుశ ప్రభుత్వ యంత్రాంగ స్వభావాన్ని సంతరించుకుంది. ఫలితం ప్రజాశ్రేణుల నుండి పార్టీ, ప్రభుత్వం దూరం కావడం, రెంటి మధ్య వైరుధ్యం తీవ్రం అయింది.

ఈ దశలో మావో జోక్యంతో 1966లో ప్రారంభమైన సాంస్కృతిక విప్లవం 1976 దాకా కొనసాగింది. ఇటు పార్టీలోనూ, అటు ప్రభుత్వం లోనూ పేరుకుపోయిన రివిజనిజాన్ని, పెత్తందారీతనాన్ని బద్దలుకొట్టే నూతన శకానికి నాంది పలికింది. పాలకులను ప్రజలు ప్రశ్నించడం, బహిరంగంగా విమర్శించడం పెద్ద ఎత్తున ప్రారంభమై ఒక నూతన మార్క్సిస్ట్ చైతన్యం వెల్లివిరిసింది. గ్రామీణ ప్రాంత ప్రజలు నూతన నిర్ణయాధికార శక్తిగా ఎదిగే క్రమం ప్రారంభమై బలం పుంజుకుంది. విప్లవ వ్యతిరేకులు, రివిజనిస్టులు, సామ్రాజ్యవాదులు సాంస్కృతిక విప్లవాన్ని తీవ్రవాద పెడధోరణిగా, దుందుడుకు చర్యగా, అరాచకవాద తిరుగుబాటుగా విమర్శించినా, అది ఒక నూతన సోషలిస్ట్ మానవున్ని రూపొందించడంలో, నూతన చోదకశక్తుల్ని ఆవిష్కరించడంలో, ప్రజలకే అంతిమ అధికారం అనే నూతన ప్రజాస్వామిక నినాదాన్ని ఆచరణ సాధ్యం చెయ్యడంలో కొన్ని అద్భుత విజయాలను సాధించిందనేది చారిత్రక సత్యం.

అయితే శైశవ దశలో ఉన్న ఈ చారిత్రక విజయాలను సమన్వయ పరచుకోవడం, పటిష్టవంతం చేసుకొనక పూర్వమే మావో మరణానం తరం డెంగ్ అధికారంలోకి రావడంతో సాంస్కృతిక విప్లవం తిరోగమన బాట పట్టింది. పారిశ్రామికీకరణ, ఆధునికీకరణ, మార్కెటీకరణల ద్వారా చైనాను అగ్రరాజ్యంగా చేయాలన్న నెపంతో కొత్త నాయకత్వం సాంస్కృతిక విప్లవకాలంలో ప్రజలు సాధించుకున్న విజయాలకు తూట్లు పొడిచింది. దాని కారణంగానే చైనా ఒక అద్భుతమైన పారిశ్రామిక శక్తిగా అభివృద్ధి చెందుతూ ఉన్నట్లు కనిపిస్తున్నా నిజానికి నిరుద్యోగం, పేదరికం, అనారోగ్యం, పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య అసమానతలు పెచ్చు పెరిగిపోయాయి. అదే నేటి చైనా నిజమైన చిత్రపటం.

ఈ నేపథ్యంలో చైనాలో సాంస్కృతిక విప్లవానికి ముందు, సాంస్కృతిక విప్లవ కాలంలో, సాంస్కృతిక విప్లవానంతర కాలంలో విద్యారంగంలో వచ్చిన మార్పుల్ని పరిశీలిద్దాం.

కమ్యూనిస్ట్ పార్టీ అధికారంలోకి రావడానికి ముందే 1926లో హునాన్ ప్రకటనలో, ఆ పార్టీ విద్యారంగంలో గ్రామీణ ప్రాంతాలు

కోర్టులను ఆశ్రయిస్తున్నారు. ఇక్కడి కోర్టులు కార్మికుల నష్టపరిహారం కోసం వేసిన ఫిర్యాదులతో నిండిపోయాయి. కొన్ని కేసుల్లో కోర్టు తీర్పులు కార్మికులకు ఊరట కలిగిస్తున్నాయి. నష్టపరిహారాలుగా మంచి మొత్తాలు ముడుతున్నాయి. ఇదొక శుభ పరిణామం. నష్టపరిహారం కోసం కార్మికుల దావాలు పెరగడం వలన యాజమాన్యాల వైఖరిలో మార్పు వచ్చే వీలుంది.

చట్టాలపై కార్మికులకు అవగాహన పెరుగుతుందనడానికి కోర్టుల్లో దావాల సంఖ్య పెరగడమే. శ్రామికుల సమస్యలపై మీడియాలో సానుభూతి కథనాలు, కొత్త కార్మిక చట్టాలు చేయడం, కార్మిక శ్రేయస్సు కోసం పని చేసే స్వచ్ఛంద సేవా సంస్థలు, పక్కనే ఉన్న హాంకాంగ్ నగర ప్రభావం కార్మిక చైతన్యాన్ని పదునెక్కిస్తున్నాయి.

కాని వలస కార్మికుల సమస్యలు భుజాన వేసుకొని పని చేసే కార్మిక సంఘం ఇంతవరకు ఆవిర్భవించకపోవడం తీరని లోటు. కార్మికులంతా చైనా కార్మిక సమాఖ్యలో భాగమనే స్పృహ కార్మికుల్లోలేదు. చైనా దేశ కార్మిక సమాఖ్యను తమ ఆధీనంలోకి తెచ్చుకోవడం లేదా తమ బాగు కోసం కొత్త కార్మిక సంఘాన్ని నిర్మించుకోవడం చైనా వలస కార్మిక వర్గం ముందున్న పెను సవాలు.

*(తెలుగు అనువాదం : **వి. వరదరాజు**)* వీ

పాలకుల నిర్లక్ష్యానికి గురవుతున్నాయని, పట్టణ ప్రాంతాలకు చెందిన ఒక శిష్ట మేధావివర్గం రూపొంది గ్రామీణ ప్రజల మీద సవారీ చేయడానికి, ఆనాటి విద్యా విధానం దోహదం చేస్తున్నదని విమర్శించింది. గ్రామీణ పేద ప్రజలందరికి ఉచిత సార్వజనీన విద్యను ఒక హక్కుగా గుర్తించి అమలుపరచాలని పార్టీ ఆనాడు డిమాండ్ చేసింది. అయితే 1949లో అధికారంలోకి వచ్చిన కమ్యూనిస్ట్ పార్టీ ప్రభుత్వం విద్యారంగంలో గత సమాజపు వారసత్వాన్ని కొనసాగించింది. గ్రామీణ ప్రాంత ప్రజల విద్యావసరాలను నిర్లక్ష్యం చేసి, పట్టణ ప్రాంతాల్లో పార్టీలోనూ ప్రభుత్వంలోనూ అధికార స్థానాలకు దగ్గరగా ఉన్న కుటుంబాల పిల్లల్ని మేధావులుగా తయారు చేసే పాత పద్ధతి కొనసాగింది. బడ్జెట్ కేటాయింపులలో సింహభాగం పట్టణ ప్రాంతాల్లో విద్యావకాశాలను విస్తృతం చేయడానికి, పటిష్టవంతం చేయడానికి వినియోగించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య విద్యా సంబంధమైన వ్యత్యాసాలు క్రమక్రమంగా పెరిగిపోయాయి.

ప్రజలందర్నీ విద్యావంతుల్ని చేయడానికి బదులు, దక్షులైన ఒక మేధావి వర్గాన్ని రూపొందించే ఉద్దేశ్యంతో పట్టణ ప్రాంతాలలో 'ఆదర్శ నమూనా విద్యా సంస్థలు' ఏర్పడ్డాయి. ప్రజాబలం మీదనే జాతి పునర్నిర్మాణం ఆధారపడి ఉంటుందనే సూత్రాన్ని విస్మరించి అన్ని వ్యవహారాలను చక్కదిద్దగలిగిన 'నిపుణుల్ని' తయారు చేయడం మీద పార్టీ, ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించాయి. సహజంగానే ఇలాంటి విద్యాలయాల్లో రూపొందిన ఈ నిపుణులు శిష్టులు, విప్లవ పూర్వకాలపు రాజవంశీకుల పిల్లల్లాగా ప్రత్యేక సౌకర్యాలను అనుభవించే వర్గంగా ఎదిగారు. తమ చుట్టూ ఉన్న సమాజం గురించి, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల గురించి అవగాహన లేకుండా ఎదిగిన ఈ వర్గమే తదనంతర కాలంలో అధికారంలోకి చొరబారింది.

1949 నుండి సాంస్కృతిక విప్లవ ప్రారంభ కాలం వరకు చైనా లోని గ్రామీణ ప్రాంతాలలో విద్యారంగ స్థితిగతుల్ని పరిశీలించినప్పుడు ఎవరికైనా అర్థమయ్యే అంశాలు: 1) గ్రామీణ ప్రాంతాలలో పాఠశాలల స్థాపనకు గాని, వసతులను మెరుగుపరచడానికి గాని, సుశిక్షితులైన ఉపాధ్యాయులను నియమించడానికి గాని తగిన శ్రద్ధను ప్రభుత్వం చూపెట్టలేదు. 1958లో ప్రారంభమైన 'గొప్ప ముందడుగు' కాలంలో ఈ స్థితిని చక్కదిద్దడానికి కొంత ప్రయత్నం జరిగినప్పటికీ అది అర, కొరగానే మిగిలిపోయింది. 2) గ్రామీణ పాఠశాలల్లో పిల్లలు చేరడం, చేరిన వాళ్లు చివరి దాకా కొనసాగడం నామమాత్రంగానే ఉండింది. దీనికొక ప్రధాన కారణం బడిలో చేరడానికి ముందు పిల్లలు ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణులవ్వాలనే నిబంధన ఉండడం. విద్యా సౌకర్యం ఏ మాత్రం లేని గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఈ ప్రవేశ పరీక్షల్లో విజయం సాధించడం అతి దుర్లభంగా ఉండేది. దీనికి తోడు ఒక తరగతి నుండి పై తరగతికి ప్రమోట్ చేయడానికి అధికారులు అనుసరించిన కఠినమైన వడపోత పద్ధతి కారణంగా చాలా పాఠశాలల్లో పై తరగతుల్లో పిల్లలుండేవాళ్లే కాదు. ఈ వడపోతలో ఒక విచిత్రమైన పద్ధతి కూడా ఉండేది. ఒక తరగతిలో ఎంతమంది చదువునభ్యసించడానికి అవసరమైన వసతి ఉంటుందో అంతమందిని మాత్రమే ప్రమోట్ చేసేవారు. అంతేగాని ప్రజల విద్యావసరాల దృష్టితో వసతులను విస్తృతం చేయడం గాని, ఉపాధ్యాయుల సంఖ్యను పెంచడం గాని చేసేవారు కాదు. 3) గ్రామీణ ప్రాంతాల తల్లిదండ్రులు పేదరికం కారణంగా ఫీజులు కట్టలేని స్థితిలో పిల్లల్ని బడికి పంపే వాళ్లుకాదు. ఉచిత విద్యలేదు. పైగా ఏ గ్రామానికా గ్రామంలో విద్యావసతి లేకపోవడంతో పిల్లలు ఎక్కువ దూరం కాలినడకన వెళ్లి చదువుకోవాల్సి వచ్చేది. అలా చదువుకుంటున్న పిల్లలు అలిసిపోయి ఇంటి పనుల్లో గాని, పొలం పనుల్లో గాని సహాయ పడటానికి అవకాశం లేదు. పిల్లలు ఇంటి వద్దే ఉంటే కుటుంబాల ఉత్పాదక శక్తి పెరుగుతుందనే నమ్మకం ప్రజల్లో బలంగా ఉండేది. 4) దేశవ్యాప్తంగా ఒకేరకమైన పాఠ్య ప్రణాళిక, పాఠ్యపుస్తకాలు అమలులో ఉండేవి. అనేక సందర్భాలలో ఈ పాఠ్యాంశాల నుండి పిల్లలు పొందిన జ్ఞానం పరీక్షల్లో గట్టెక్కడానికి ఉపయోగపడేదే గాని, నిజజీవితానికి సంబంధించిన జ్ఞానాన్ని సంపాదించడానికి ఉపకరించేది కాదు. గ్రామీణ జీవితానికనుగుణమైన నైపుణ్యాల్ని పెంచుకోవడానికే గాని, వారిలో ఊహాశక్తిని, సృజనాత్మకతను పెంచడానికి గాని ఏ మాత్రం దోహదపడేవి కావు. 5) అటు తల్లిదండ్రులకు, ఇటు ఉపాధ్యాయులకు కూడా పిల్లల్ని చదివించడమంటే ప్రవేశ పరీక్షల్లో అందరికంటే ఉన్నతమైన ర్యాంకుల్ని సంపాదించి కుటుంబ ప్రతిష్ఠని, ఉపాధ్యాయుల ప్రతిష్ఠని కాపాడ్డమే. పిల్లల వయస్సునీ, మెదడు వికాసాన్ని పట్టించుకోకుండా విపరీతమైన మానసిక ఒత్తిడికి గురిచేసే వాళ్లు. ఇది పిల్లల మానసిక ఎదుగుదలపై తీవ్రమైన దుష్ప్రభావం చూపేది. 6) పాఠశాలల్లోని తరగతి గదుల్లో ఉపాధ్యాయులు నిరంకుశంగా వ్యవహరించే వాళ్లు. ప్రశ్నించడానికి, సొంత ఆలోచనలను వెల్లడి చేయడానికి విద్యార్థులకేమాత్రం అవకాశం ఉండేది కాదు. ఉపాధ్యాయుల దగ్గర అత్యంత విధేయతతో ఉంటే తప్ప చదువు రాదనే నమ్మకం తల్లిదండ్రుల్లో బలంగా నాటుకుపోయి ఉంది. పాఠశాలల్లో పిల్లల్ని శారీరకంగా శిక్షించినా, తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేసే వాళ్లు కాదు. ఇలాంటి వాతావరణం వెన్నెముకలేని యువతను మాత్రమే తయారు చేసేది. సవాళ్లను ఎదుర్కోవడం, ప్రయోగాలు చేయడం, నూతన పద్ధతుల్ని అన్వేషించడం వంటి ప్రజాస్వామిక లక్షణాలకు ఆనాటి విద్యా వ్యవస్థలో అవకాశమే ఉండేది కాదు.

ఈ విధంగా విద్యారంగానికి సంబంధించిన సాంస్కృతిక విప్లవానికి ముందు కాలంలో పాలకులు అనుసరించిన లోప భూయిష్టమైన విధానాల ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లో నిబిడీకృతమై ఉన్న మానవ వనరులు వినియోగంలోకి రాకుండా పోయాయి. సమాజాన్ని విద్యావంతం చేయడమంటే వ్యక్తుల్ని ఉన్నతుల్ని చేయడం కాదని, సమాజ సేవకుల్ని తయారు చేయడం అనే సత్యాన్ని వాళ్లు విస్మరించారు. ఆ కాలంలో చైనా అనుసరించిన అన్ని అభివృద్ధి వ్యూహాల్లాగానే విద్యా వ్యూహం కూడా ప్రతికూల ఫలితాల్నిచ్చిందని గ్రహించిన మావో సాంస్కృతిక విప్లవాన్ని ప్రారంభించారు.

సాంస్కృతిక విప్లవకాలంలో విద్యారంగం

సాంస్కృతిక విప్లవ కాలంలో చైనా కమ్యూనిస్ట్ పార్టీ విద్యారంగం మీద ప్రధానంగా దృష్టి కేంద్రీకరించింది. మావో సారథ్యంలో పార్టీ కేంద్ర కమిటీ, 16 మే 1966న విడుదల చేసిన ప్రకటనలో 'పాత

విద్యా వ్యవస్థను, విద్యా సంబంధమైన దృక్పథాన్ని, పద్ధతుల్ని సంస్కరించడం సాంస్కృతిక విప్లవ కర్తవ్యం' అని పేర్కొన్నది. అంతక్రితం వరకు విద్యారంగ విధి విధానాలకు సంబంధించిన చర్చలు, పార్టీ నిర్మాణంలోగాని, బయటగాని అంతగా జరిగేవి కావు. 'ప్రతిదాన్ని ప్రశ్నించండి' అన్న మావో సూక్తి ఆధారంగా సాంస్కృతిక విప్లవకాలంలో విద్యారంగంలో సమూలమైన మార్పులకు అవకాశం కలిగింది. విద్యార్థుల్ని బడిలో చేర్చుకోవడానికి అనుసరించే విధానాల గురించి, బడిలో ఉపయోగించవలసిన బోధనా పరికరాల్ని గురించి, ఎలాంటి విద్యార్థుల్ని రూపొందించడం మీద దృష్టి కేంద్రీకరించాలనే దాన్ని గురించి – మొత్తం మీద విద్యా దృక్పథం గురించిన ప్రశ్నలు, చర్చలు గ్రామీణ ప్రాంతాల్లో తీవ్రంగా జరిగాయి. పట్టణాల నుండి సాంస్కృతిక విప్లవ ప్రారంభంలో గ్రామాలకు తిరిగి వచ్చిన యువత విద్యా వ్యవస్థలోని లోపాలను ప్రశ్నించడానికి నాయకత్వం వహించింది. అలా చేయడంలో వాళ్లకు వ్యక్తిగత ప్రయజనాలేమీ లేకపోవడంతో ప్రజల మద్దతు లభించింది. కమ్యూనిస్ట్‌లుగా, తాము విశ్వసించిన సామాజిక సమానత్వానికి అప్పటి విద్యావిధానం ప్రతిబంధకంగా ఉండడంతో వాళ్లు దాన్ని సవాల్ చేశారు. అభివద్ధికి దూరంగా ఉంచబడిన పేద, మధ్యతరగతి రైతాంగం, కార్మికుల పిల్లల విద్యా ప్రయోజనాలను కాపాడడం కోసం విద్యావ్యవస్థను సమూలంగా మార్పు చేయాలని వాళ్లు డిమాండ్ చేశారు. పట్టణ ప్రాంతాలకూ, గ్రామీణ ప్రాంతాలకూ, మానసిక శ్రమకూ, శారీరక శ్రమకూ, కార్మికులకూ, రైతాంగానికీ మధ్య ఉన్న అసమానతలను తొలిగించడం 'గొప్ప ముందడుగు ఉద్యమానికి' లక్ష్యంగా ఉన్నప్పటికీ అది నినాదప్రాయంగా మాత్రమే ఉండిపోయింది. సాంస్కృతిక విప్లవ కాలంలో విద్యార్థులు ఆ లక్ష్యాన్ని సాధించడం ఒక నిర్దిష్ట అంశంగా భావించారు. ప్రభుత్వ విద్యావిధానం ఈ అసమానతలను తగ్గించడానికి బదులు స్థిరపడడానికే తోడ్పడుతున్నదని వాళ్లు గ్రహించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న 'ఆదర్శ విద్యా సంస్థల్లో' చదువుకున్న శిష్టులు, గ్రామాల్లో పనిచేయడానికి ఇష్టపడకపోవడాన్ని, శారీరక శ్రమ చేసేవారిని ఈసడించుకోవడాన్ని వాళ్లు గమనిస్తూనే ఉన్నారు.

7 మే 1966న మావో లిన్ పియావో కు రాసిన ఒక ఉత్తరంలో 'మే 7 సూచన' అనే అంశం ఒకటుంది. అది సాంస్కృతిక విప్లవ కాలంలో విద్యా సంస్కరణలకు తాత్విక భూమికను సమకూర్చింది. అందులో మావో విద్యాభ్యాసన దశల కాలాన్ని తగ్గించాలని, విద్యా వ్యవస్థపై బూర్జువా మేధావుల ఆధిపత్యానికి చరమగీతం పాడాలని సూచించారు. ఈ ఉత్తరం సాంస్కృతిక విప్లవ కార్యకర్తలైన కార్మికుల్ని, రైతుల్ని, సైనికుల్ని, విద్యార్థుల్ని, అధ్యాపకుల్ని ఉత్తేజపరిచింది. ప్రవేశ పరీక్షలు రద్దుకావాలని, ప్రతి గ్రామం ఒక ప్రాథమిక విద్యా కేంద్రాన్ని ఏర్పాటు చేసుకోవాలని, ప్రాథమిక విద్యాభ్యసన కాలం ఆరు సంవత్సరాల నుండి ఐదు సంవత్సరాలకు, మాధ్యమిక ఉన్నత విద్యాభ్యసన కాలం మూడు సంవత్సరాల నుండి రెండు సంవత్సరాలకు తగ్గించాలని డిమాండ్ చేశారు. స్థానిక అవసరాలు, ప్రత్యేకతలను దృష్టిలో ఉంచుకొని కొత్త పాఠ్యపుస్తకాలను తయారు చేయాలనీ, నూతన బోధనా పద్ధతులను అనుసరించాలనీ, తరగతి గదుల్లో ప్రజాస్వామిక వాతావరణాన్ని రూపొందించాలనీ, తద్వారా విద్యార్థులలో సృజనాత్మకత వెల్లి విరియడానికి మార్గం సుగమం అవుతుందనీ సాంస్కృతిక విప్లవ కార్యకర్తలు పేర్కొన్నారు.

ఈ స్ఫూర్తితో వివిధ గ్రామాల్లో ఉండే రైతాంగం 1969 నాటికి తమ స్వంతశ్రమతో, స్థానికంగా లభ్యమయ్యే వనరులను ఉపయోగించుకొని, ప్రాథమిక విద్యా కేంద్రాలు ఏర్పరచుకున్నారు. దీనిమూలంగా వసతుల లేమి నెపంతో కొంతమందిని మాత్రమే బడిలో చేర్చుకునే పద్ధతి రద్దయి, పిల్లలందరికీ తమ గ్రామంలోనే తాము చదువుకునే అవకాశం కలిగింది. పిల్లలు తమ కళ్లముందే ఉంటారు కాబట్టి, చదువు కోసం ఇతర గ్రామాలకు నడిచి వెళ్లి రావడానికి వెచ్చించే సమయాన్ని ఇంటి పనుల్లో సహాయపడడానికి ఉపయోగిస్తారు కాబట్టి తల్లిదండ్రులందరూ పిల్లలందర్నీ బడిలో చేర్చడానికి ముందుకు వచ్చారు.

వాళ్లు పరిష్కరించుకున్న రెండవ సమస్య అధ్యాపకుల కొరత. గతంలో శిక్షణ పొందిన అధ్యాపకులెవ్వరూ గ్రామీణ ప్రాంతాల్లో పనిచెయ్యడానికి సిద్ధమయ్యే వారు కాదు. ఉపాధ్యాయుల కొరత సాకుతో ప్రభుత్వం అలాంటి ప్రాంతాల్లో బడులు తెరిచేది కాదు. సాంస్కృతిక విప్లవ కాలంలో ప్రాథమిక, మాధ్యమిక విద్యను అభ్యసించిన గ్రామీణ ప్రాంతాలకే చెందిన యువతను సుశిక్షితులు కాకపోయినప్పటికీ, ప్రజలు తాము ఏర్పాటు చేసుకున్న ప్రాథమిక విద్యా కేంద్రాలలో అధ్యాపకులుగా నియమించుకున్నారు. వాళ్లు తమకున్న పరిజ్ఞానంతో పిల్లలకు భాషలోనూ, గణితంలోనూ ప్రాథమిక పరిజ్ఞానాన్ని అందించేవారు. దాంతో పాటు పాడడం, బొమ్మలు గీయడం, వ్యాయామం కూడా బడి దినచర్యల్లో భాగమయ్యాయి. ఇలాంటి బడుల్లో చదువుకుంటే వచ్చే జ్ఞానం ఏపాటిదనీ, వాళ్లెందుకు పనికొస్తారనీ విమర్శకులు ఈసడించుకునే వారు. అలాంటి వాళ్లకు గ్రామీణులు చెప్పిన సమాధానం ఒక్కటే. 'అయ్యా! ఏ మనిషికైనా జీవితంలో చదువు నేర్చుకునే అవకాశం కొద్దికాలమే ఉంటుంది. అప్పుడు కాకపోతే ఇంకెప్పుడూ నేర్చుకోలేరు. మీలాంటి మేధావులు కనికరించి, మాలాంటి గ్రామాలకు వచ్చే దాకా అజ్ఞానులుగానే ఉండి పొమ్మంటారా?' అని.

ఈ గ్రామీణ విద్యాలయ్యాల్లో బడి పని గంటలు చాలా సరళంగా ఉండేవి. వ్యవసాయం పనులు ముమ్మరంగా ఉన్న రోజుల్లో ఉపాధ్యాయులు, పిల్లల్ని పొలాలకు తీసుకుని వెళ్లేవాళ్లు. అక్కడ వాళ్లు, పొలాల్ని పరిశీలించేందుకు, చేతనైన రీతిలో సహాయం చేయడం, రైతులు విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో పాటలు పాడి వాళ్లను ఉత్సాహపరచడం చేసేవాళ్లు. 4, 5 తరగతులకు చెందిన విద్యార్థులు కవర్లు, కాగితపు పెట్టెలు తయారు చేసి, వాటిని అమ్మగా వచ్చిన పైకంతో తమ బడి తరఫున సినిమాలు చూడడం, లేదా వస్తు సామాగ్రిని కొనడం చేసేవారు.

సాంస్కృతిక విప్లవ కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో వచ్చిన మరొక ముఖ్యమైన మార్పు, అక్కడి బడులలో పనిచేసే అధ్యాపకులకు కూడా, కార్మికులకీ, రైతులకీ ఇచ్చినట్లు గానే పనికి తగిన పాయింట్లను ఇవ్వడం. ఇది కాక ఆ కమ్యూన్ ఉపాధ్యాయులకు అదనంగా రెండు యువాన్లు సబ్సిడీగా చెల్లించేది. స్కూలు ఏర్పాటు, వనరుల తోడ్పాటు, అధ్యాపకులకు

వేతనాల చెల్లింపు అంతా కమ్యూనే భరించడంతో ఏ ఒక్కరికీ కష్టమనిపించేది కాదు.

ఈ దశలో జరిగిన ఒక గొప్ప గుణాత్మకమైన ప్రయోగం, విద్యాలయాల నిర్వహణలో కార్మికుల్ని, సైనికుల్ని, రైతుల్ని భాగస్వాములను చేయడం. సాంస్కృతిక విప్లవ తొలి దినాల్లో బీజింగ్, క్వింగ్ హువా విశ్వవిద్యాలయాలు ఇలాంటి ప్రయోగాన్నే ప్రారంభించాయి. దేశవ్యాప్తంగా దీన్ని అమలుపరచమని మావో 1968లో పిలుపునిచ్చారు. దీనికి విశేషమైన స్పందన లభించింది. విద్యాగంధం ఏమాత్రం లేని నిరక్షర కుక్షులైన ఇలాంటి వాళ్లని విద్యాలయాల నిర్వహణలో భాగస్వాముల్ని చేయడం పట్ల శిష్టవర్గాల మేధావులు పెదవులు విరిచారు. హేళన చేశారు. తీవ్రంగా విమర్శించారు. ఇలాంటి వాళ్లు జ్ఞానవంతులైన అధ్యాపకుల్ని ఎట్లా అజమాయిషీ చేస్తారని ప్రశ్నించారు. ఆ విమర్శలన్నీ శిష్టుల వదరుబోతుతనానికి సూచికలు. ప్రాథమికంగా చూస్తే ఇది 'జ్ఞానం అంటే ఏమిటి?' అనే ఒక తాత్విక ప్రశ్న. కార్మికులకి, రైతులకి లాంఛనప్రాయమైన చదువులు లేకపోయినా వారివద్ద అపారమైన అనుభవం, ఆచరణశీలమైన జ్ఞానం పుష్కలంగా ఉన్నాయి. విద్య గురించిన స్పష్టమైన దృక్పథం కూడా వాళ్లకున్నది. అయితే దీన్నంతటినీ జ్ఞానంలో భాగంగా అంగీకరించే విశాల దృక్పథం లేని నూతిలో కప్పలాంటి వాళ్లు, శిష్టమేధావులు. విద్యాలయాల నిర్వహణలో భాగస్వాములైన ఈ నూతన సామాజిక బృందాలు దాన్నొక ఉన్నత సామాజిక లక్ష్యంగా భావించి, చిత్తశుద్ధితో వ్యవహరించాయి. ప్రారంభంలో వాళ్లకి భాషరాదని, మర్యాదలు తెలియవని నవ్వుకున్న వాళ్లే, వాళ్ల ఆచరణ, నిజాయితీలను బట్టి వాళ్లను గౌరవించడం, వాళ్లతో సహకరించడం ప్రారంభమైంది. ఈ కార్మికులు, రైతులు విద్యార్థులతో కలిసి కూరగాయ మొక్కలు పెంచడం వంటి శారీరక కార్యకలాపాల్లో పాల్గొనేవారు. ఆ క్రమంలో ఎలాంటి తక్కువస్థాయి పనినైనా చేయడానికి వాళ్లు సిద్ధపడడం, పిల్లలకు వాళ్ల పట్ల గౌరవాన్ని పెంచింది. ఆ కార్మికులు, రైతులు, ఆ గ్రామానికే చెందినవారు కావడంతో ఏ పిల్లవాళ్లైనా సక్రమంగా పాఠశాలకు హాజరు కాకపోతే ఉపాధ్యాయుల్ని వెంటబెట్టుకుని వాళ్ల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి, వాళ్ల సమస్యలేమిటో తెలుసుకుని పరిష్కరించేవారు. కేవలం పిల్లల సమస్యలే కాదు, అధ్యాపకుల వ్యక్తిగత, కుటుంబ సంబంధమైన సమస్యల పరిష్కారంలో కూడా ఈ విద్యా కమిటీ బాధ్యులు చొరవ చూపేవారు. ఒక ఉపాధ్యాయురాలు కుటుంబ సంబంధమైన సమస్యల ఫలితంగా మానసిక ఒత్తిడికి గురి అవుతూ ఉంటే ఈ విద్యా కమిటీ సభ్యులు, బడిలో ఆమె పని భారాన్ని కొంత తగ్గించారు. అదే విధంగా ఉపాధ్యాయుల కుటుంబాలలో ఉండే భార్యా భర్తల, అత్తాకోడళ్ల సమస్యలను, ఉపాధ్యాయుల మధ్య తలెత్తే విభేదాలను రైతులుగా తమకుండే లోకానుభవంతో సామరస్యంగా పరిష్కరించి బడి బాధ్యతల పట్ల వారి శ్రద్ధ ఇనుమడించేలా చేసేవారు.

ఈ పై అంశాలన్నింటినీ బట్టి కార్మికులూ, రైతులూ ఇటు విద్యార్థులకీ, అటు ఉపాధ్యాయులకీ సలహాదారులుగా వ్యవహరిస్తూనే విద్యా సంబంధమైన నాయకత్వాన్ని కూడా అందిస్తున్నారని అర్థమవుతుంది. చైనా సమాజంలో నాయకత్వపు స్థానంలో ఉండడమంటే కేవలం వృత్తి సంబంధమైన బాధ్యతలు నిర్వహించడమొక్కటే కాదు, ప్రజలకు క్లిష్ట సమయాల్లో సహాయకులుగా, స్నేహితులుగా, తీర్పరులుగా వ్యవహరించడం కూడా. ఈ అర్థంలో చూస్తే కార్మికులు, రైతులు, సమర్థులైన నాయకులుగా అందరి మన్ననలను పొందారు. మార్క్సిజం, లెనినిజం సిద్ధాంత సూత్రాల్ని ఔపోసన పట్టకపోయినా, శిష్ట మేధావుల్లాగా పుస్తకాల పురుగులు కాకపోయినా తమ నిజాయితీ, ఆచరణ శీలత, లక్ష్యశుద్ధిల కారణంగా వాళ్లు గ్రామీణ చైనాలో నూతన నాయకులుగా ఎదిగారు. శిష్టులకుండే ఈ సాంప్రదాయిక వైఖరే చైనా ఆధునికీకరణ క్రమానికి, అభివృద్ధి క్రమానికి ఆటంకమని భావించిన మావో శిష్ట మేధావుల్ని సంస్కరించవలసిన అవసరమెంతైనా ఉందని అభిప్రాయపడ్డారు.

మంచి విద్య అంటే ఏమిటి? విద్య ఉపాధ్యాయ కేంద్రంగా ఉండాలా? విద్యార్థి కేంద్రంగా ఉండాలా? పాఠ్యాంశాలను ఎలా నిర్మించాలి? దేశవ్యాప్తంగా ఒకే రకమైన సిలబస్ ఉండాలా? వద్దా? విద్యార్థుల జ్ఞానాన్నీ, తెలివితేటల్నీ పరీక్షించడమెలా? మొదలైన అనేక మౌలిక ప్రశ్నల మీద సాంస్కృతిక విప్లవ దశలో తీవ్రమైన చర్చలు జరిగాయి.

విద్య సమగ్రంగానూ, పరిపూర్ణమైంది గానూ ఉండాలని, పుస్తక పరిజ్ఞానంతో పాటు, విద్యార్థులకు పారిశ్రామిక, వ్యవసాయిక నైపుణ్యాలు కూడా నేర్పించాలని, అన్నింటికంటే ముఖ్యంగా వాళ్లలో విమర్శనాత్మక, పరిశోధనాత్మక దృక్పథాన్ని పెంపొందించాలని సాంస్కృతిక విప్లవ వాదులు భావించారు. ఈ కారణంగానే దాదాపుగా అన్ని స్కూళ్లల్లోనూ చిన్న చిన్న యంత్రాలను నడపడం, నమూనాలను తయారుచేయడం, కంకర రాళ్లు పగులగొట్టడం, పొలం పనులూ, తోటపనులూ చేయడం వంటి కార్యకలాపాల్లో, అధ్యాపకులూ, విద్యార్థులూ పాల్గొనేవాళ్లు. దీని మూలంగా మూడు మంచి ఫలితాలు ఒనగూరేవి. 1) పిల్లల్లో శారీరక శ్రమ పట్ల గౌరవం పెంపొందడం; 2) తరగతి గదుల్లో నేర్చుకున్న దాన్ని క్షేత్రంలో పరిశీలించుకోవడం; 3) బడి వార్షికాదాయం పెరగడం. ఈ విధంగా బడి సమయంలో 1/6వ వంతు సమయం పాఠ్యేతర అంశాలకు కేటాయించేవారు. విద్యార్థులు కర్మాగారాల్లో, పొలాల్లో పనిచేయడమే గాక అనుభవజ్ఞులైన కార్మికుల్నీ, రైతుల్నీ బడికి పిలిపించుకుని, వాళ్లవద్ద పాఠాలు వినేవారు. అంతేకాకుండా బడి ఆవరణలోనే తోటలు పెంచేవారు. చిన్న చిన్న వస్తువులు తయారు చేసే వర్క్‌షాపులు నిర్వహించేవారు. ఈ విధంగా మానసిక శ్రమకూ, శారీరక శ్రమకూ మధ్య వైరుధ్యాన్ని పరిష్కరించుకోగలిగారు.

అధ్యాపక కేంద్రంగా ఉండే విద్యా వ్యవస్థ విద్యార్థి కేంద్రంగా ఉండాలని, పాత పాఠ్యాంశాలన్నింటినీ సంస్కరించి తిరగ రాయాలనీ, బోధనా పద్ధతుల్ని వాస్తవ పరిస్థితుల కనుగుణంగా మార్చాలని కూడా సాంస్కృతిక విప్లవ కాలంలో ప్రయత్నించారు. గ్రామీణ ప్రాంతాల ప్రత్యేకతలు, అక్కడి ప్రజల ప్రత్యేక అవసరాలు గమనంలో లేని పట్టణ ప్రాంతాల నిపుణులు తయారు చేసిన పాఠ్య పుస్తకాలనే దేశమంతటా అమలు పరచేవారు. వీటిల్లో నేర్పే సూత్రాలూ, సిద్ధాంతాలూ అనిర్దిష్టంగానూ, అగమ్యగోచరంగానూ ఉండి గ్రామీణ విద్యార్థులకు ఏమాత్రం ఉపకరించేవి కావు. ఇలాంటి పాఠ్యపుస్తకాలన్నింటినీ రద్దు

చేశారు. ఏ ప్రాంతానికా ప్రాంతంలో అధ్యాపకులూ, విద్యార్థులూ, కార్మికులూ, రైతుల ప్రతినిధులతో కూడిన బృందాలు పాఠ్య పుస్తకాలు తయారు చేసేవి. సైనికులు శారీరక దారుఢ్యానికి, దేశరక్షణకూ అవసరమైన శిక్షణ నిచ్చేవారు. ఈ విధంగా జ్ఞానపరంగానూ, ఆచరణ పరంగానూ, శారీరకారోగ్యపరంగానూ సుశిక్షితులైన సమగ్రమైన ఆచరణశీలమైన జ్ఞాన సంపద కలిగిన విద్యార్థులు రూపొందేవారు.

షాన్షే అనే ఒక గ్రామీణ ప్రాంతంలో సాంస్కృతిక విప్లవ కాలంలో 1500 మంది హైస్కూలు విద్యార్థులు డీజిల్ ఇంజన్లు, ఎలక్ట్రిక్ మోటార్లు, నీళ్ల పంపుల రిపేర్లు నేర్చుకున్నారనీ, 1800 మంది కొత్త విత్తనాల తయారీ తదితర వ్యవసాయ మెళకువలు నేర్చుకున్నారనీ, 4000 మంది పశువులకు వచ్చే సాధారణ జబ్బుల్ని నయం చేయడంలో శిక్షణ పొందారనీ, ఇవన్నీ చేస్తూనే నిర్ణీత సమయంలో పాఠ్యాంశాల అధ్యయనం కూడా పూర్తి చేశారనీ తెలిసింది. అదే గ్రామీణ ప్రాంతంలో బడి ఆవరణలో ఏర్పాటు చేసిన కర్మాగారాలూ, పొలాల్లో 1970-81 మధ్య కాలంలో విద్యార్థులు 13 మిలియన్ యువాన్ల విలువైన ఉత్పత్తిని సాధించారనీ తెలుస్తోంది. అందులో నుండి వాళ్లు స్కూలు భవనాల విస్తృతి, టీచర్ల జీతభత్యాలు, పిల్లలకవసరమైన పాఠ్యపుస్తకాలు, కలాలు వంటి వస్తువుల కొనుగోలు చేయగలిగారు. దీని ఫలితంగా తమ పిల్లల విద్యకోసం తల్లిదండ్రులు పైసా ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదు. దాదాపుగా నూటికి నూరు శాతం పిల్లలు విద్యావంతులయ్యారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకి చదువుకున్న వాళ్లపట్ల గతంలో ఉన్న నిరసన వైఖరి పూర్తిగా తొలగిపోయింది. అదే విధంగా ఉపాధ్యాయులకు కూడా శ్రమజీవుల పట్ల ఉండే చులకన భావం పోయి శ్రమను గౌరవించడం నేర్చుకున్నారు. ఈ మేళవింపుతో గ్రామీణ ప్రాంతాలలో ఒక నూతన, సమర్థవంతమైన, శాస్త్రీయ దృష్టిగల, సమగ్రతను సంతరించుకున్న నూతన నాయకత్వం రూపొందింది.

అదే విధంగా తరగతి గదుల్లో కూడా ఒక నిశ్శబ్ద విప్లవానికి అంకురార్పణ జరిగింది. గతంలో ఉపాధ్యాయులు విధించే కఠిన శిక్షలకి సామాజిక ఆమోదం కూడా ఉండడంతో బడులు పిల్లలకు నరకప్రాయంగా తోచేవి. ఆ వాతావరణం పూర్తిగా మారిపోయింది. నూతన ప్రజాస్వామిక వాతావరణం తరగతి గదుల్లో నెలకొంది. పిల్లల మనోభావాలను అధ్యాపకులు గౌరవించడం నేర్చుకున్నారు. అలానే పిల్లలు ప్రశ్నించడాన్ని, ప్రతిదాన్ని చర్చించడాన్ని, పిల్లలతో కలిసి నిర్ణయాలు చేయడాన్ని అధ్యాపకులు ప్రోత్సహించారు. కొత్తగా లభించిన ఈ స్వేచ్ఛను ప్రారంభకాలంలో కొందరు విద్యార్థులు దుర్వినియోగం చేసినా, చుట్టుపక్కల వాతావరణంలో వచ్చిన మార్పులు వాళ్లను ప్రభావితం చేశాయి. స్వేచ్ఛ నుండి వచ్చే బాధ్యతలను వాళ్ల చేత గుర్తింపజేశాయి. ఈ ప్రజాస్వామికీకరణ కారణంగా నంగి నంగిగా అందరికీ వంగి దండాలు పెట్టే, అధికారం అంటే హడలిపోయే మానసిక స్థితి నుండి బయటపడి విద్యార్థులు నిటారుగా నిలబడగలిగారు. ఎవరినైనా ప్రశ్నించగలిగారు. నిర్మొహమాటంగా, ఆత్మస్థైర్యంతో తమ అభిప్రాయాలు వెల్లడి చేయగలిగారు. ఈ ప్రక్రియ బడిలో, తద్వారా గ్రామాల్లో ప్రజల సాధికారతకు దారితీసింది. మావో ఆశించిన నూతన మానవుడి ఆవిష్కరణకు అనుకూలమైన పూర్వరంగం సిద్ధమయింది.

సాంస్కృతిక విప్లవానంతర స్థితి

ఏ సమాజంలోనైనా అణగారిన వర్గాలకు సాధికారికతను లభింప జేయడం ఒక సుదీర్ఘమైన ప్రక్రియ. వేల సంవత్సరాల దోపిడీ, పీడన, అణచివేతల నుండి రాజకీయ స్వాతంత్ర్యం సాధించుకోవడం ఒకెత్తు. కాని అలాంటి భావజాలం నుండి, సంస్కృతి నుండి విముక్తి పొందడం మరొకెత్తు. ఇదే నిజమైన విముక్తి. దీన్ని సాధించడానికి అనుసరించాల్సిన మార్గం రాజకీయ విముక్తి మార్గంకంటే దీర్ఘకాలికమైంది. దుర్భరమైంది. కంటకావృతమైంది. మావో యే చెప్పినట్లు అలాంటి విముక్తి మార్గంలో పయనించడానికి సాంస్కృతిక విప్లవం ఒక తొలి ప్రయత్నం మాత్రమే. అందుచేతనే ఆ చిన్న ప్రయత్నం స్వల్ప విజయాలను సాధించింది.

ఈమాత్రం విజయం కూడా కమ్యూనిస్ట్ పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ పాతుకుపోయిన పెత్తందార్లకు మింగుడుపడలేదు. గాలివాటం తమకనుకూలంగా లేదు కాబట్టి సాంస్కృతిక విప్లవ కాలంలో వాళ్లు నాయకుడి పట్ల ఆషాడభూతుల్లాగా వ్యవహరించారు. మావో మరణానంతరం 1978లో డెంగ్ అధికారంలోకి రావడంతో సాంస్కృతిక విప్లవ విజయాలను అభావం చేసి, తమ ఆధిపత్యాన్ని పునరుద్ధరించు కోవడానికి ఈ ప్రతీప శక్తులకు అవకాశం కలిగింది. ఆధునికీకరణ, పారిశ్రామికీకరణ పేరుతో డెంగ్ ప్రారంభించిన సంస్కరణలు సాంస్కృతిక విప్లవం సాధించిన విజయాలను వమ్ముజేశాయి. దాని దుష్ప్రభావం విద్యారంగం మీద, ప్రధానంగా గ్రామీణ విద్యారంగం మీద పడింది. చైనా పారిశ్రామిక అగ్రరాజ్యంగా ఎదగాలంటే శిష్ట మేధావులు, ప్రత్యేక నిపుణులు అవసరమని, అలాంటి మేధావుల్ని, శాస్త్రవేత్తల్ని తయారు చేయడమే విద్యాలక్ష్యంగా ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కారణంగా విద్యారంగంలో సాంస్కృతిక విప్లవానికి ముందున్న పరిస్థితులు తిరిగి తలెత్తాయి. పోటీ పరీక్షలు, చదువులు కొనుక్కోవలసి రావడం, మేధావుల తయారీ మీద దృష్టి కేంద్రీకరణ, గ్రామీణ విద్యను నిర్లక్ష్యం చేసి పట్టణ ప్రాంత విద్యావకాశాలను మెరుగుపరచడం వంటి అవలక్షణాలన్నీ చోటు చేసుకున్నాయి. ఏదో ఒక విధంగా వృత్తి కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో సీట్లు సంపాదించు కోవడం, తద్వారా ఉన్నత స్థానాలకు ఎగబాకగలకడమే విద్యకు లక్ష్యంగా మారింది. ఏది ఎంత నేర్చుకున్నాం, నేర్చుకున్నది సమాజాని కెంత ఉపయోగపడుతున్నదనే ఆలోచన మృగ్యమైంది. సాంస్కృతిక విప్లవ కాలంలో ఒకానొక సామాజికాంశంగా ఉండిన విద్య పూర్తిగా వ్యక్తిగతమై పోయింది. చైనా సమాజం మళ్లీ అంతరాల దొంతర్ల సమాజంగా పరిణమించింది. ఈ చైనా అనుభవం నుండి నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతమై, నూతన మానవ సంబంధాలు, మానవీయ సంస్కృతి రూపొందాలని కోరుకునే శక్తులు గుణపాఠం తీసుకోవాలి. రాజకీయాధికారం కమ్యూనిస్ట్ పార్టీ హస్తగతమైనంత మాత్రాన అది సమాజంలో విప్లవాత్మకమైన, గుణాత్మకమైన మార్పులకు దానంతటది కారణభూతం కాలేదని, అధికారం నిజంగా దక్కవలసింది అణగారిన ప్రజలకేనని, అప్పుడే ప్రజలు తమదైన నూతన సమాజాన్ని నిర్మించుకుని, చరిత్ర నిర్మాతలు కాగలుగుతారని మనం తెలుసుకోవాలి. వీ

విప్లవ విజయాల పతనానంతరం మారిన పరిస్థితుల్లో చైనా వివిధ రంగాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను, అక్కడి జీవన స్థితిగతులను, పెరుగుతున్న అసమానతలను వివరిస్తున్నారు **ఘంటా చక్రపాణి**

చైనాలో ఏం జరిగింది?

'సంపద సరిపోయేంతగా లేకపోతే చింతించాల్సిన పనిలేదు. కానీ అది అందరికీ సమానంగా అందకపోతే మాత్రం కచ్చితంగా ఆలోచించాలి' అన్నది చైనాలో బాగా ప్రాచుర్యంలో ఉన్న పాత సామెతల్లో ఒకటి. బహుశా అలాంటి ఆలోచనే మావో సె టుంగ్‌ని మహనీయుడిని చేసి ఉంటుంది. సమానత్వమే పరమావధిగా ఆయన నిర్మించిన 'నవచైనా'లో ఇప్పుడు సంపదకు కొదువలేదు. ప్రపంచంలోనే అత్యంత సంపద ఉన్న దేశాల్లో చైనా ఒకటి. ఇప్పుడు ఆ దేశ ప్రజల అవసరాలకు మించిన సంపద అక్కడ కేంద్రీకృతమై ఉంది. కానీ విచిత్రమేమిటంటే అంతే స్థాయిలో అక్కడ అసమానతలు పేరుకుపోయి ఉన్నాయి. ప్రజల మధ్య అంతరాలు సంపద పెరిగిన కొద్దీ అంతకంతకూ పెరిగి పోతున్నాయి. మార్కెట్‌నే నమ్మి నడిచిన అక్కడి పాలకులు కూడా ఈ పరిణామాల పట్ల కలవరపడుతున్నారు. ప్రజల్లో వివిధ ప్రాంతాల మధ్య సామరస్యం నెలకొల్పడానికి, సామాజిక, ఆర్థిక వ్యత్యాసాల్ని అధిగమించడానికి కన్నాలు పూడ్చే పనికి పూనుకుంటున్నారు. 'హార్మోనియస్ సొసైటీ' పేరుతో ఒక కొత్త నినాదాన్ని తీసుకుని ప్రజల మధ్య సామరస్యం సాధించే చికిత్స చేపట్టారు. సామరస్యం సాధించడానికి సమానత్వమే మూలం కావాలన్న ప్రాథమిక సూత్రాన్ని మరిచి పై పై మెరుగులు దిద్దే చర్యలు చేపట్టడం వల్ల ప్రయోజనం లేదన్న సంగతి గుర్తించకపోవడం అక్కడి విషాదం.

బయటి నుంచి చూసే వారిలో చాలామందికి చైనా ఒక భూతల స్వర్గం. ముఖ్యంగా ప్రపంచబ్యాంక్ నివేదికలు, చైనా పారిశ్రామిక ఉత్పత్తులు, కుప్పలు తెప్పలుగా పేరుకుపోయిన విదేశీ మారకద్రవ్య నిల్వలు, దూసుకుపోతున్న స్థూల జాతీయ వృద్ధి సూచికలు, ఫోర్బ్స్ సంపన్నుల జాబితాలు చూసి అభివృద్ధిని అంచనా వేసే వారికి చైనా తిరుగులేని ఆర్థిక శక్తి. మార్కెట్ కనికట్టు చూపే ఈ అంకెలు చూసి మురిసిపోయే అనేకమంది ఆర్థికవేత్తలు చైనాను రేపటి 'సూపర్ పవర్'గా భవిష్యత్ ప్రపంచాన్ని శాసించే శక్తిగా కీర్తిస్తున్నారు. కానీ చైనాలో ప్రజల జీవన విధానంలో అడుగడుగునా కనిపించే అసమానతలు, గ్రామాలు – నగరాల మధ్య పెరిగిపోతోన్న వ్యత్యాసాలు, ప్రాంతాల మధ్య వైరుధ్యాలు చైనాలోని అస్తవ్యస్త పరిస్థితికి అద్దం పడతాయి. గ్రామీణ, వ్యవసాయ రంగం ఎదుర్కొంటోన్న సంక్షోభం, మారుమూల తెగలు, జాతుల్లో పెరిగిపోతోన్న అసహనం, నిరుద్యోగుల ఆగ్రహం, చివరకు ఉద్యోగుల్లో పెల్లుబుకుతున్న అసంతృప్తిని గమనిస్తే చైనా ఒక నరక కూపం అనిపిస్తుంది.

జన చైనా తన అరవై సంవత్సరాల ప్రస్థానంలో మొదటి మూడు దశాబ్దాలు వెలుతురు వైపు పయనిస్తే, గడచిన మూడు దశాబ్దాలు చీకటి వైపు పరుగెడుతున్నట్టు కనిపిస్తుంది. చైనా విముక్తి తరువాత మావో నాయకత్వంలోని కమ్యూనిస్టు పార్టీ అసమానతలు తొలగించే పని చేసింది. అప్పటి గ్రామీణ వ్యవస్థలో పేరుకుపోయి ఉన్న సాంప్రదాయిక విలువలు, చాదస్త ప్రభావాలు, ఫ్యూడల్ సంస్కృతి, సాంఘిక దురాచారాలు ఇట్లా ఒక్కొక్కటిగా అసమానతలన్నీ తొలగించే పనిని వివిధ దశల్లో పూర్తి చేసింది. మరోవైపు సమగ్ర అభివృద్ధి, సమతుల వికాసం కోసం శాస్త్ర బద్ధమైన ప్రణాళికలు రూపొందించి ప్రజల అవసరాలు దృష్టిలో ఉంచుకొని పరిశ్రమలు, భారీ కర్మాగారాలు నిర్మించి కొత్త ఆర్థిక వ్యవస్థకు రూపకల్పన చేసింది. సహజ వనరులన్నిటినీ సమాజపరం చేసి సంపదను సృష్టించడం అంటే ప్రజల జీవితాలను సుసంపన్నం చేయడమేనని భావించింది. 1970 నాటికి చైనాను స్వయం సమృద్ధికి, సమతుల అభివృద్ధికి చిరునామాగా మార్చివేసింది. అయితే 80వ దశకం ఆరంభంలో ప్రవేశించిన సంస్కరణలు చైనాను ఇవాళ అసమానతలకు, ఆర్థిక దోపిడీకి, అసంతృప్తికి, అశాంతికి నిలయంగా చేశాయి. స్థూల జాతీయోత్పత్తి సూచిలో అప్రతిహతంగా దూసుకుపోతోన్న చైనా స్థూల జాతీయ సంతృప్తిలో మాత్రం దిన దినం దిగజారిపోతోంది.

ఒక అడుగు ముందుకు – మూడు అడుగులు వెనక్కు

చైనా విముక్తి 1949లోనే జరిగినా ఒక నిర్దిష్టమైన ప్రణాళిక రూపొందించుకొని కమ్యూనిస్టు పంథాలో సాగింది 1952 నుంచి. 1952–78 కాలాన్ని చైనా అభివృద్ధి పంథాలో తొలి అడుగుగా పేర్కొంటారు. సోవియట్ నమూనాలో ప్రణాళికలు రూపొందించుకుని ప్రజల అవసరాలను బట్టి ప్రాధాన్యతలను ఎంచుకున్న ఈ కాలంలో చైనా గ్రామీణాభివృద్ధితో సరిసమానంగా పారిశ్రామిక అభివృద్ధిపై దృష్టి నిలిపింది. సోవియట్ తరహాలోనే భారీ పరిశ్రమలకు రూపకల్పన చేసి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలోని మిగులును పారిశ్రామికీకరణ వైపు మళ్లించింది. తద్వారా భూమి మీద ఆధారపడిన చైనా ప్రజానీకాన్ని కొత్త సాంకేతిక ఉత్పాదక రంగం వైపు మళ్లించే ప్రయత్నం చేసింది. ఉమ్మడి వ్యవసాయక్షేత్రాలు, కమ్యూన్‌లు ఏర్పాటు చేసి వ్యవసాయోత్పత్తులు భారీగా పెంచడంతోపాటు పారిశ్రామిక నగరాల ద్వారా ఉపాధి అవకాశాలు, సాంకేతిక అభివృద్ధి, సరుకుల ఉత్పత్తి తద్వారా స్వయం సమృద్ధి సాధించే ప్రయత్నం ఈ దశలో జరిగింది.

ఇదే కాలంలో చైనా 'హూకో' పేరుతో కుటుంబాల నమోదు కార్యక్రమాన్ని చేపట్టింది. 'హూకో' నిబంధనల ప్రకారం ప్రతి కుటుంబానికి ఒక గుర్తింపు కార్డు ఉంటుంది. ఆ కుటుంబం స్థానిక

కమ్యూన్‌లో భాగంగా ఉండి పనిచేస్తుంది. తమ కమ్యూన్ లేదా ఆ గ్రామంలోనే ఆ కుటుంబానికి ఉపాధి అవకాశాలు, విద్య, వైద్య సౌకర్యాలు కల్పిస్తారు. అలాగే అప్పటి కమ్యూనిస్టు ప్రభుత్వం ఉత్పాదక శక్తి (భూమి)ని, ఇతర వనరులన్నీ జాతీయ వనరులుగా పరిగణించిన దరిమిలా గ్రామీణ ఉత్పత్తులన్నిటినీ ప్రభుత్వమే సేకరించి ప్రజల అవసరాలకు వీలుగా కోటా నిర్ణయించేది. దానికి ఈ 'హూకో' గుర్తింపు కార్డే ప్రధాన ప్రాతిపదికగా ఉండేది. అలాగే ప్రజలు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వలస వెళ్లడం తమకు తోచిన పని చేసుకోవడం వీలయ్యేది కాదు.

మరోవైపు నగరాల్లో, పారిశ్రామిక రంగంలో ఉన్న కార్మికులు 'ప్రభుత్వరంగం'లో పనిచేసేవారు. వారి అవసరాలను బట్టి జీతభత్యాలు, సరుకుల పంపిణీ ఉండేది. పెరుగుతున్న జనాభా, అవసరాలను వ్యవసాయ రంగం ఎంతో కాలం తీర్చలేదని భావించిన మావో రెండో ప్రణాళిక (1958-63) కాలంలో పారిశ్రామికరంగంపై దృష్టి సారించారు. కేవలం భారీ పరిశ్రమలే కాకుండా స్థానిక వనరులను ఉపయోగించి గ్రామీణ, కుటీర పరిశ్రమలను ప్రోత్సహించడానికి 'గ్రేట్ లీప్ ఫార్వర్డ్' పేరుతో ఒక కొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. కమ్యూన్లను పునర్ వ్యవస్థీకరించి ప్రతి కమ్యూన్‌కు ఒక 'పెరటి పరిశ్రమను' ఏర్పాటు చేశారు. గ్రామాల్లో దొరికే కలప, ఇనుము, బొగ్గు, నూలు ఆధారంగా వివిధ పరికరాలు, పనిముట్లు తయారు చేసే పరిశ్రమలు విస్తరించారు. ఈ క్రమంలో గ్రామాల్లో ఇనుము కరిగించి పనిముట్లు తయారు చేయడానికి దాదాపు ఆరు లక్షల కొలుములు ఏర్పాటు చేశారు. చేనేతరంగం, కర్ర పరికరాలు తయారు చేసే పరిశ్రమలు ఏర్పడ్డాయి. ఇదొక కొత్త ఆర్థిక వ్యవస్థాపనకు దోపదపడు తుందని మావో భావించారు. కానీ అప్పటికే వరుసగా ఉన్న దుర్భిక్ష పరిస్థితులు, దానికి తోడు వ్యవసాయరంగం నుంచి ప్రజలను మళ్లించడం దేశ ఆహారోత్పత్తిని దెబ్బతీసింది. ఉత్పాదకత భారీగా పడిపోయి, తిండి దొరకక కోట్లాది మంది మృత్యువాత పడ్డారు. 1958-60 మధ్యకాలంలో దేశంలో ప్రకృతి బీభత్సం సృష్టించింది. కొన్ని ప్రాంతాలు వరదలతో జలమయమై పోతే మరికొన్ని ప్రాంతాల్లో కరువు విలయతాండవం చేసింది. ఇదంతా ప్రణాళికలో లోపమని కొందరు, వ్యవసాయరంగం నుంచి ప్రజలను మళ్లించడం వల్లేనని మరికొందరు విమర్శలు కురిపించడంతో చివరకు మావో దేశాధినేత పదవి నుంచి తప్పుకోవాల్సి వచ్చింది.

చైనాలో అసమానతలకు ఈ దశలోనే అంకురార్పణ జరిగిందని భావించే వారూ ఉన్నారు. పారిశ్రామికరంగానికి 'అవసరానికి మించిన ప్రాధాన్యత' ఇచ్చి కోట్లాది మందిని వ్యవసారంగం నుంచి తరలించడం వల్ల సంక్షోభం తలెత్తిందని, పారిశ్రామిక రంగంలో ఉన్న వారికి ఉన్న భద్రత, వ్యవసాయ రంగంలో ఉన్నవారికి లేకుండా పోయిందన్న విమర్శలు ఉన్నాయి. అయితే చైనా ప్రస్తుతం ప్రదర్శిస్తున్న సుస్థిర ఉత్పాదక సామర్థ్యం వెనుక ఆ కాలంలో చేపట్టిన చర్యల ప్రభావం ఎంతగానో ఉందని వాదించే వారూ ఉన్నారు. చైనాలో వ్యవసాయ యోగ్యమైన భూమి తక్కువ, జనాభా ఎక్కువ కాబట్టి జనాభా అవసరాల దృష్ట్యా బలవంతంగానైనా ప్రజలను పారిశ్రామిక రంగం వైపు, వృత్తి నైపుణ్యతలు పెంపొందించే పనుల వైపు, సాంకేతిక పరిజ్ఞానం వైపు మళ్లించడం వల్లనే చైనా ఇప్పుడు వస్తూత్పత్తికి కేంద్ర స్థానంగా మారిందన్న అభిప్రాయంలో కూడా నిజముంది.

మావో అనంతరం అధికారం చేపట్టిన నాయకత్వం అవే విధానాలు కొనసాగించినప్పటికీ కొన్ని దిద్దుబాటు చర్యలు కూడా చేపట్టారు. అయితే 1979లో తొలి సంస్కరణలు చేపట్టేదాకా చైనాలో సంపద పెద్దగా సమకూరకపోయినా అసమానతలు గణనీయంగా తొలగిపోయాయి. కోట్లాదిమంది గ్రామీణులు అప్పటిదాకా భూమికి బానిసలుగా బతికిన వాళ్లు చదువుకోగలిగారు. సాంకేతిక పరిజ్ఞానం అందుకోగలిగారు. కొత్త నైపుణ్యతలు సాధించి, కొత్త వృత్తులు స్వీకరించగలిగారు. విద్య, వైద్యం పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే ఉండేది. సంపూర్ణ అక్షరాస్యత, సమగ్ర ఆరోగ్య విధానం మెరుగైన ఫలితాల్ని ఇచ్చాయి.

చైనా విముక్తి కాలం నాటికి కేవలం ఇరవై శాతం మాత్రమే ఉన్న అక్షరాస్యత మూడింతలు పెరిగింది. కేవలం పాఠశాలలు, పిల్లల విద్యపైనే కాక చైనా 'పనికొచ్చే చదువుల'పై దృష్టి పెట్టి కోట్లాది మంది వయోజనులను అక్షరాస్యుల్ని చేసి, ఆయారంగాల్లో వృత్తి నైపుణ్యాలు మెరుగుపరుచుకునే విధంగా విద్యాకార్యక్రమాలు రూపొందించింది. ప్రజారోగ్యం విషయంలో కూడా అప్పటి ప్రభుత్వం ఇటువంటి ప్రయత్నమే చేసింది. ఉచిత వైద్య సౌకర్యాలతోపాటు పారిశుధ్యం, పరిశుభ్రతపై దృష్టి సారించి మొదటి పదేళ్లలో గ్రామాల్లో సైతం ఆరోగ్య పరిరక్షణ చర్యల పట్ల అవగాహన కల్పించింది. కమ్యూనిస్టు విధానాలు అమలైన తొలి మూడు దశాబ్దాల కాలంలో ప్రజల జీవన ప్రమాణం 35 సంవత్సరాల నుంచి 65 సంవత్సరాలకు పెరగడం, శిశు మరణాల రేటు 200 నుంచి 40కి పడిపోవడం ఆ కాలంలో ఒక సంచలనం. జాతీయ, స్థానిక స్థాయిలో 'సంక్షేమ ఆరోగ్య నిధి'ని సహకార వైద్య సేవా కేంద్రాలను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ప్రవేశపెట్టిన చైనా ప్రభుత్వం ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించే ప్రయత్నం చేసింది. ఈ చర్యలన్నిటి ఫలితంగా చైనాలో స్థూలంగా సమానత్వంతో కూడిన అభివృద్ధికి ఒక రూపం వచ్చినట్టయింది.

చైనా అభివృద్ధిలో రెండో దశలో తొలి సంస్కరణలు వెలుగు చూశాయి. సంస్కరణలు తొలినాళ్లలో గ్రామీణ వ్యవస్థపై దృష్టి నిలిపి వ్యవసాయరంగ రూపురేఖల మార్చేసాయి. అప్పటిదాకా కొనసాగిన సమిష్టి వ్యవసాయ క్షేత్రాలు, కమ్యూన్‌ల పద్ధతికి స్వస్తిపలికి వ్యవసాయ కుటుంబాలకు భూములు కేటాయిస్తూ చైనా 'హౌస్ హోల్డ్ రెస్పాన్సిబిలిటీ సిస్టం'ను (1978) రూపొందించింది. క్రమక్రమంగా 1983 నాటికి ఇదొక కౌలుదారు విధానంగా మారిపోయి కమ్యూన్లు పూర్తిగా అంతరించాయి. దీనికితోడు పరిపాలన వికేంద్రీకరణ చర్యలతో ప్రాంతీయ స్థాయి 'కౌంటీ', 'టౌన్‌షిప్' ప్రభుత్వాలు ఏర్పడ్డాయి.

వ్యవసాయరంగ సంస్కరణల్లో కుటుంబాలు యూనిట్‌గా భూములు కేటాయించడం, ఉత్పత్తులను నేరుగా ప్రభుత్వం తీసుకోకుండా కనీస సేకరణ ధరలు ప్రకటించి మార్కెట్ యార్డులలో అమ్ముకునే అవకాశాలు కల్పించడం, ఉత్పత్తులను తమ ప్రాంతాల్లోనే కాకుండా పరిమిత మోతాదుల్లో దూర ప్రాంత మార్కెట్లకు తరలించే అవకాశాలివ్వడం, గ్రామీణ ప్రాంతాల్లో ప్రైవేట్ పెట్టుబడులు, వ్యాపారాలకు వెసులుబాటు కల్పించడం వంటి చర్యలు ముఖ్యమైనవి. మరోవైపు స్థానిక ప్రభుత్వాల అజమాయిషీలో ఏర్పాటైన టౌన్‌షిప్ అండ్ విలేజ్ ఎంటర్‌ప్రైజెస్ (టి.వి.ఇ.) సరికొత్త పారిశ్రామిక, ఆర్థిక మార్పులకు శ్రీకారం చుట్టాయి. ప్రతి పట్టణంలో, పెద్ద కౌంటీలలో పారిశ్రామిక వాడలుగా మొదలైన టి.వి.ఇ.లు దాదాపు పదికోట్లకు పైగా ఉద్యోగాలు

సృష్టించాయని, వీటి ఉత్పాదకత మూలంగా చైనా జిడిపిలో కనీసం మూడో వంతు వీటి నుంచి వచ్చిందేనని అంచనా. టి.వి.ఇ.లు ఆయా ప్రాంతీయ ప్రభుత్వాలు, నగరపాలక వ్యవస్థలు ఏర్పాటు చేసే సహకార పారిశ్రామిక కేంద్రాలు. స్థానికంగా లభ్యమయ్యే వనరులను ఆధారంగా చేసుకుని, ప్రజల నుంచి వాటాలుగా పెట్టుబడులు, మరికొంత స్థానిక సంస్థల పెట్టుబడులతో నడిచే ఈ చిన్నతరహా పరిశ్రమలు ఉపాధి అవకాశాలతో పాటు స్థానిక సంస్థల పరిపుష్టికి చాలావరకు దోహదపడ్డాయి.

ఇట్లా గ్రామాలు, పట్టణాలను ఆర్థికంగా బలోపేతం చేసిన సంస్కరణలు అక్కడితో ఆగిపోలేదు. సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వం విద్య, పారిశుధ్యం, వైద్యం వంటి కీలక సేవారంగాల బాధ్యతను, భారాన్ని పూర్తిగా కౌంటీ ప్రభుత్వాలకు, టౌన్‌షిప్‌లకు అప్పగించింది. ఇది చైనా ప్రజల మీద ప్రత్యక్ష భారంగా మారిపోవడమే కాక పెద్ద ఎత్తున అసమానతలకు కారణమయ్యింది. వనరులు ఎక్కువగా ఉండి, స్థానిక పరిశ్రమలు, వ్యవసాయం అభివృద్ధి చెందిన గ్రామాలు, టౌన్‌షిప్పులకు వెనుకబడిన ప్రాంతాలు, మారుమూల పల్లెలకు మధ్య మానవాభివృద్ధి సూచిలో వ్యత్యాసాలను తీవ్రంగా పెంచేసింది. పట్టణాల్లో, అందులో ఆర్థిక పరిపుష్టి పొందిన పట్టణాల్లో పాఠశాలల భవనాలు ఫైవ్‌స్టార్ హోటళ్లను తలపిస్తుంటాయి. అందులోని వసతులు, సాంకేతిక బోధనా సామాగ్రి అమెరికాలోని పాఠశాలల స్థాయిలో ఉంటుంది. ప్రతి తరగతి గదిలో డిజిటల్ స్క్రీన్‌లు, ఇంటర్నెట్ కనెక్టివిటీ, ఇంటరాక్టివ్ పరికరాలు ఒకటేమిటి సకల సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. బోధనా సిబ్బందిని కూడా స్థానికంగానే ఏర్పాటు చేసుకోవాలి కాబట్టి సంపద సమకూర్చుకున్న ప్రాంతాల్లో సుశిక్షితులైన సిబ్బందిని నియమించి వారికి నివాస వసతి కూడా అదే ఆవరణలో ఏర్పాటు చేసిన పాఠశాలలు కోకొల్లలు. మరికొన్ని పాఠశాలల్లో అదనంగా ఇంగ్లిష్ భాషా బోధనా, కంప్యూటర్ శిక్షణ కూడా అందుబాటులోకి తెచ్చారు. వీటికి కావాల్సిన ఆర్థిక వనరుల్ని స్థానిక పాలనా యంత్రాంగం సమకూర్చి పెడుతుంది. వీటిని 'స్పాన్సర్డ్ స్కూల్స్' అంటుంటారు. గ్రామాల్లో కూడా ఇటువంటి స్పాన్సర్డ్ స్కూళ్లే ఉంటాయి. కానీ స్పాన్సరర్‌లే పేదలు. పేద గ్రామాల్లో వీటి నిర్వహణ భారం ప్రజలే విరాళాల పేర వసూలు చేసే పన్నుల రూపంలో భరించాల్సి ఉంటుంది. సంపన్న గ్రామాల్లోని స్కూళ్లలో పెట్టే మధ్యాహ్న భోజనానికి పేద గ్రామాల్లో మధ్యాహ్న భోజనానికీ మధ్య మన కార్పొరేట్ స్కూళ్లకూ, సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లకూ మధ్య ఉన్నంత వ్యత్యాసం ఉంటుంది. వైద్యరంగం పరిస్థితి కూడా ఇదే తరహాలో మారుతూ వచ్చి ఇప్పుడు ప్రజల వైద్య వ్యయంలో దాదాపు అరవై శాతం ఎవరికి వారే చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మూడో దశ చైనా 'అభివృద్ధి పథం'లో ముళ్లబాటగా పేర్కొనవచ్చు. అప్పటిదాకా గ్రామాలను 'పునర్వ్యవస్థీకరించిన' ప్రభుత్వం దృష్టి, నగరాల మీద, పారిశ్రామిక రంగం మీద పడింది. 1984-87 మధ్యకాలంలో కమ్యూనిస్టు పార్టీ పూర్తిగా మార్కెట్ ఎకానమీకి ద్వారాలు తెరిచే ప్రధాన సంస్కరణలు చేపట్టింది. ఇందులో భాగంగా మూడు దశల్లో చైనా కొత్త ఆర్థిక వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. అందులో మొదటిది ప్రభుత్వ రంగ సంస్థలను 'సంస్కరించడం'. అప్పటిదాకా స్వతంత్రంగా నడుస్తోన్న ప్రభుత్వరంగ సంస్థల లాభనష్టాల చిట్టా తయారు చేసి 'అనవసరం' అనుకున్న వందలాది కంపెనీలను మూసివేసింది. ఇందులో లాభాలు తేనటువంటివి, ఆధునికంగా లేనివి, భవిష్యత్ అవసరాలకు పనికి రానివి, ప్రభుత్వం నిర్వహించవలసిన అవసరం లేదని భావించినవి, నిర్వహణే తలకుమించిన భారంగా మారినవి, సమస్యాత్మక మైనవి'- ఇలా అనేక కారణాల ఆధారంగా ఈ పరిశ్రమల్లోంచి 'పెట్టుబడులు ఉపసంహరించి', కొన్ని వాటాలు అమ్మేసి మరికొన్ని మూసివేయగా మిగిలిన వాటిలో 'లాభాలతో నడుస్తోన్న' కంపెనీల నుంచి కూడా ప్రభుత్వ మూలధనాన్ని ఉపసంహరించి, బ్యాంక్ రుణాలను సమకూర్చుకొనే విధంగా చైనా బ్యాంకింగ్ సంస్కరణలను 1980 మధ్య కాలంలో చేపట్టింది. ఇదంతా అప్పటిదాకా 'విలువల చట్రం'లో ఉన్న చైనాలో భారీగా అవినీతికి ఆస్కారం కలిగించింది. పార్టీ ప్రముఖులు, వారి పిల్లలు, ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు కొన్ని చోట్ల ట్రేడ్ యూనియన్ లీడర్లు ఈ అవినీతిలో, వాటాల అమ్మకాల్లో, కేటాయింపుల్లో భాగస్వాములయ్యారు. కొన్నిచోట్ల వాళ్లే బ్రోకర్లుగా, మరికొన్ని చోట్ల స్వయంగా ఓనర్లుగా కూడా మారిపోయారు. ఈ క్రయవిక్రయాలు చైనాలో అంతర్గత పెట్టుబడిదారీ వర్గానికి అంకురార్పణ చేస్తే అదే కాలంలో తీరప్రాంతాల తలుపులు తెరిచి చైనా విదేశీ పెట్టుబడులను ప్రత్యక్షంగానే ఆహ్వానించింది.

చైనాపై ప్రపంచీకరణ ప్రభావం ప్రత్యక్షంగా కనిపించింది. తూర్పు ప్రావిన్సులు, దక్షిణాది ప్రాంతాల్లోని తీర పట్టణాలను 'మౌలిక సౌకర్యాల'తో ముస్తాబు చేసి తొలుత నాలుగు కోస్తా నగరాల్లో 'ప్రత్యేక ఆర్థిక మండలాల'ను రూపొందించింది. 1980 ఆగస్టులో జరిగిన కమ్యూనిస్టు పార్టీ జాతీయ మహాసభలు 'సెజ్'లకు పచ్చజెండా ఊపాయి. ఆ తరువాత నాలుగేళ్లకు 14 కోస్తా పట్టణాలను విదేశీ పెట్టుబడుల కోసం బార్లా తెరిచింది. అక్కడితో ఆగకుండా ఈ తతంగం మెయిన్‌లాండ్ చైనాలోని అనేక ప్రధాన పట్టణాలకు విస్తరించి ఇప్పుడు 15 ఫ్రీ ట్రేడ్ జోన్‌లు, 32 స్టేట్ లెవల్ ఎకనమిక్ అండ్ టెక్నాలజికల్ జోన్‌లు, 53 హైటెక్ సిటీలు - ఇట్లా చైనా ప్రపంచీకరణ ప్రయోగశాల అయిపోయింది. ఇది మూడో తిరోగమన దశ.

చైనా సంపదను, ఆర్థికాభివృద్ధి రేట్లను లెక్కగట్టడానికి ఇవాళ ప్రపంచవ్యాప్తంగా ఆర్థికవేత్తలు తలమునకలైపోయారు. సంస్కరణలు మొదలైనప్పటి నుంచి చైనా అడ్డూ అదుపూ లేని సంపద సాధించిందని అబ్బుర పడిపోతున్నారు. ఈ లెక్కల మాస్టార్ల ప్రకారం 1978 నుంచి గడచిన ఏడాది దాకా చైనా జి.డి.పి. సాలీనా 9.6 శాతం పెరుగుతూనే ఉంది. వాస్తవిక తలసరి జి.డి.పి. తొమ్మిది రెట్లు పెరుగుతుంటే తలసరి ఆదాయం ఆరురెట్లు పెరుగుతుందని అంటున్నారు. ఇక చైనాలో విదేశీ పెట్టుబడులకు అంతేలేకుండా పోతోంది. ఇప్పటికే చైనా ప్రపంచంలో అత్యధిక విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులున్న దేశాల్లో అగ్రగామి అంటున్నారు. ప్రపంచంలోని కనీసం రెండు వందల దేశాలు చైనాలో ఏదో రకంగా పెట్టుబడులు పెట్టినట్టు చెపుతున్నారు. వీటి విలువ 2006 నాటికి 704 బిలియన్ డాలర్లు, అంటే చైనా సంపద లెక్కించడానికి మనకు ఎన్ని రోజులు పడుతుందో ఊహించుకోవచ్చు.

సంపద సంగతి అలా ఉంచితే చైనాలో సామాన్యుడి జీవనం మాత్రం సంకట స్థితిలోనే ఉంది. రోజురోజుకూ పేదరికం, శ్రమదోపిడీ, మానవ హక్కుల ఉల్లంఘన పెరిగిపోతున్నాయి. నిరసన తెలియజేసే హక్కు కూడా లేని ఈ దేశంలో ఏటా దాదాపు 80 వేల నుంచి లక్ష నిరసన ప్రదర్శనలు (చట్టాన్ని ఉల్లంఘించి) జరుగుతున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో ఆలోచించవచ్చు. అసలు చైనాలో పేదలెవరు? ఎందుకున్నారు? ఎందుకు పెరుగుతున్నారు? అన్న ప్రశ్నలకు

సమాధానాలు వెతుకుతూనే ఉన్నారు. వీటన్నిటికీ సమాధానాలు సంస్కరణల్లో, అవి సృష్టించిన సంపదలోనే కనిపిస్తున్నాయి.

సంపద సృష్టిస్తోన్న సామాజిక విధ్వంసం

చైనా ప్రజల్లో పెరిగిపోతోన్న అసమానతలు ప్రజల్ని కుదురుగా ఉండనీయడం లేదు. 'ఇది పేదరికం కంటే బాధాకరంగా ఉంటుంద'ని సిచువాన్ ప్రావిన్స్‌లో ఒక రైతు వాపోయాడు. చైనాలో సంపన్నులై పోతున్న వర్గం తమ సంపదను అడుగడుగునా ప్రదర్శిస్తుంటుంది. చైనా పట్టణాల్లో, నగరాల్లో సంపన్నులు అధికంగా కనిపిస్తే గ్రామాల్లో, మారుమూల పల్లెల్లో పేదలు ఎక్కువ. అయితే ధనికులెవరు, పేదలెవరు అన్న విషయంలో ఎవరి లెక్కలు వారికున్నాయి. 'ఇక్కడ తిండికి లేక చచ్చిపోతున్న వాళ్లు లేరు. అప్పులతో ఆత్మహత్యలు చేసుకోవడం కూడా నేనెప్పుడూ చూడలేదు. కానీ అసంతృప్తి మాత్రం మా ఊళ్లో అందరి ఇళ్లలో ఉంది' అని ఆ రైతు పేర్కొన్నాడు. అసంతృప్తి ఎందుకు అని అడిగితే 'మీరు చంగ్డూ (సిచువాన్‌లో ప్రధాన నగరం)లో చూడండి ప్రజలెంత నిశ్చింతగా కనిపిస్తారో. హాయిగా, ప్రతి సాయంకాలం భార్యాపిల్లల్తో ఏ రెస్టారెంట్‌లోనో గడిపేస్తారు' అన్నాడు. నిజానికి సిచువాన్ చైనాలోని పేద ప్రావిన్సుల్లో ఒకటి. ఆ ప్రావిన్స్‌లో ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న నగరం చెంగ్డూ. నిజంగానే చెంగ్డూ ప్రజలు ప్రశాంతంగా ఉన్నట్టు కనిపిస్తారు. కానీ ఎవరైనా అసూయపడేంత సంపన్నులు కారు.

చైనాలో ప్రధానంగా అసమానతలు ప్రాంతాల (ప్రావిన్స్‌ల) మధ్య కనిపిస్తాయి. చెంగ్డూ రాజధానిగా ఉన్న సిచువాన్ పశ్చిమ ప్రావిన్స్‌లో ఒకటి. మంగోలియా, టిబెట్, యున్నాన్‌లతో సహా 12 ప్రావిన్స్‌లు పశ్చిమ ప్రావిన్స్‌లలో భాగం. ప్రధానంగా వ్యవసాయంపైనే ఆధారపడ్డ ప్రజలు. 30-40 శాతం మంది ఉద్యోగులు, ఎక్కువగా మైనారిటీ తెగలు జాతులుండేది ఈ ప్రాంతంలోనే. ఈ 12 పశ్చిమ ప్రావిన్స్‌లను పోలి మరో ఆరు సెంట్రల్ ప్రావిన్స్‌లు కూడా ఇదే తరహా ఆర్థిక, సామాజిక పరిస్థితులతో ఉంటాయి. తలసరి ఆదాయం, వ్యయం లెక్కలు ఇతరత్రా అర్థశాస్త్ర సూచికల ప్రకారం ఇవి వెనుకబడ్డ ప్రాంతాలు.

ఇక రెండో తరహా అభివృద్ధిలో ఏడు కోస్తా ప్రావిన్స్‌లను పరిగణిస్తారు. ఇవి సంస్కరణల తరువాత పెట్టుబడులను ఆకర్షించేందుకు ముస్తాబు చేసిన తీరప్రాంతాలు. ఇక్కడి ప్రజల ఆదాయం జాతీయ సరాసరి ఆదాయంకంటే ఎక్కువ. గ్రామీణ పరిశ్రమలకు నిలయాలుగా ఉన్న ఈ ప్రావిన్స్‌లు జపాన్, కొరియా, హాంగ్‌కాంగ్, తైవాన్, ప్రవాస చైనీయుల పెట్టుబడులతో 1978 నుంచి ఒక వెలుగు వెలుగుతున్నాయి.

మూడో కోవలోకి మావో కాలంలో భారీ పరిశ్రమలకు నిలయాలుగా మారిన హైలాంగ్ చింగ్, జిలిన్, లియోనింగ్‌లు వస్తాయి. ఇవి చైనా ఈశాన్య ప్రాంతంలో సోవియట్ నమూనాలో అభివృద్ధి పరిచిన నగరాలు. భారీ పరిశ్రమలు, ఆయుధ కర్మాగారాలు, ఖనిజ సంపదకు నిలయాలు. వీటినింకా ప్రైవేట్ పెట్టుబడులు తాకకపోయినప్పటికీ ఎక్కువగా ప్రభుత్వరంగ సంస్థలు ఈ ప్రాంతంలోనే ఉన్నాయి.

ఇక నాలుగోవి సిటి ప్రావిన్సెస్. బీజింగ్, షాంఘై, తియాన్‌చిన్ వంటి సంపన్న నగరాలు ఈ అగ్రశ్రేణిని అలంకరిస్తాయి. ఇవి వాణిజ్య వ్యాపార కేంద్రాలుగా విలసిల్లుతున్నాయి. దాదాపు 85 శాతం ద్వితీయ, తృతీయ రంగాల్లో ఉద్యోగులుగా, వ్యాపారులుగా, పాలకులుగా ఉన్న ప్రాంతాలు. ఇవి చైనాలో సంపన్నులుండే ప్రాంతాలు. ఈ ప్రావిన్స్‌ల మధ్య దేశాల మధ్య ఉన్నంత అంతరాలుండడం అక్కడి ప్రజల కలవరానికి కారణం అవుతోంది. ఒక ప్రాంతానికి మరో ప్రాంతానికి ఆదాయ, వ్యయాల్లో పోల్చలేనంత అంతరం ఉంటుంది. అభివృద్ధి విషయంలో కూడా అదే స్థాయి తారతమ్యాలు కనిపిస్తాయి. రోడ్లు, భవనాలు, హోటళ్ల వంటివే కాకుండా ప్రజలకు అందుబాటులో ఉండే విద్య, వైద్యం వంటి ప్రాథమిక సేవల్లో పోలికలే కనిపించవు. దీనికంతటికీ అక్కడ పేరుకుపోతున్న సంపద కారణమవుతోంది. పెట్టుబడులు కారణమవుతున్నాయి. తలసరి ఆదాయం పెరుగుదలలో ప్రావిన్సుల మధ్య, ప్రాంతాలమధ్య కొన్నిసార్లు మూడురెట్ల తేడా కనిపిస్తుంటుంది. ముఖ్యంగా దేశంలోకి వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో 85 శాతం కోస్తా ప్రాంతంలో కేంద్రీకృతమైందంటే అక్కడి సంపద ఎలా ఉంటుందో ఊహించవచ్చు. అలాగే దాదాపు చైనాలోని పేదల్లో సగం మంది పశ్చిమ ప్రాంతాల్లో ఉండడం అక్కడి అభివృద్ధిలో కనిపించే చీకటి పార్శ్వం.

ప్రాంతీయ అసమానతలే కాక చైనాలో పట్టణాలు - గ్రామాల మధ్య అసమానతలు కూడా ప్రస్ఫుటంగా కనిపిస్తుంటాయి. పట్టణాలు వ్యాపార, వాణిజ్య కేంద్రాలై వెలిగి పోతుంటే, గ్రామాలు మాత్రం చిన్న కమతాలు, చాలీచాలని ఉత్పాదకత, పెరిగిపోతున్న వ్యవసాయరంగ వ్యయంతో వెలవెలపోతున్నాయి. కొన్నిచోట్ల వ్యవసాయం బాగానే ఉన్నా ప్రభుత్వం పెరుగుతున్న అవసరాలను అధిగమించడం కోసం కొత్త నగరాల ఏర్పాటు పై దృష్టి సారించి పెద్ద ఎత్తున 'భూ సేకరణ' సాగిస్తున్నది. ఇది రైతులకు మరింత భయానికి, భారానికి కారణమవుతోంది. చైనాలో రైతులకు సొంత భూమి లేకపోవడంతో ప్రభుత్వం లీజుకిచ్చిన భూమిలోనే సేద్యం చేయాలి. అదికూడా నగర అవసరాల కోసం, ఫ్యాక్టరీల కోసం సేకరించడం ఈ మధ్యకాలంలో పెరిగిపోయింది. ఉన్న భూమి లాక్కొని నగరాలు నిర్మించడంతో లక్షలాది మంది రైతులు ఉపాధి కోల్పోవలసి వస్తోంది. అయితే చైనాలో భారతదేశంతో పోల్చితే పరిహారం, పునరావాసానికి సంబంధించి పటిష్టమైన చట్టాలే ఉన్నప్పటికీ రైతుల నుంచి భూములు సేకరించడం పట్ల పెద్ద ఎత్తున అసంతృప్తి వ్యక్తం అవుతోంది.

ఇక నగరాల్లో మరీ ముఖ్యంగా సెజ్‌లు, వాణిజ్య మండలాలు, ఎగుమతుల కోసం నిర్దేశించిన పారిశ్రామిక ప్రాంతాల్లో కార్మికుల పరిస్థితి అధ్వాన్నంగా మారుతోంది. పని గంటల ప్రమేయం లేకుండా శ్రామికులను బానిసలుగా బంధించి పని చేయించుకోవడం సర్వసాధారణం అయిపోయింది. పనిచేసే పరిస్థితులు, పరిసరాలు కూడా అత్యంత ప్రమాదకరంగా, అమానవీయంగా ఉంటాయి. అడిగే అధికారం, సంఘటితం అయ్యే అవకాశం, పోరాడే స్వేచ్ఛ అక్కడి కార్మికులకు లేక విలవిలలాడుతుంటారు. మరోవైపు గ్రామాల నుంచి నగరాలకు దొంగచాటుగా వచ్చే వలస కార్మికులు, ప్రతిరోజు గ్రామాల నుంచి నగరాలకు వెళ్లివచ్చే దినసరి కూలీల సంఖ్య పెరిగిపోతోంది. వేతన కార్మికులకు తోడు చైనా నగరాల్లో ఇలాంటి ఫ్లోటింగ్ పాపులేషన్ ఇరవై కోట్లు ఉంటుందని అంచనా. ఇట్లా ప్రజలు దొంగ చాటుగా వెళ్లి, తక్కువ జీతాలకు పనిచేయడానికి చైనాలో ఉన్న నివాస నిబంధనలు, హూకో (నివాస పత్రం) కారణం అవుతున్నాయి.

అసమానతలకు తోడు చైనాలో తాము కూడా అలా అభివృద్ధి చెందే అవకాశం లేకపోవడం ప్రధాన సమస్యగా వ్యక్తం అవుతోంది. ప్రజలు తమ పల్లెనో, ప్రాంతాన్నో విడిచి పనిదొరికే చోటుకి, వేరే ప్రాంతానికి, నగరానికి వలస వెళ్లే వీలులేదు. ఒకవేళ ఎవరైనా అలా

వెళ్లాలనుకుంటే అక్కడ పనికి కుదిరినట్టు యజమాన్యం నుంచి నియామక పత్రం ఉండాలి. కార్మికుడికి అతని కుటుంబానికి కావల్సిన అన్ని వసతులు, సౌకర్యాలు ఆ యజమాని కల్పించాలి. విద్య, వైద్యం, నివాసం సంబంధిత సౌకర్యాలకు గాను కొంత మొత్తం చెల్లించాలి. ఇవన్నీ ఉండి వలసవెళ్లాలనుకుంటే ప్రస్తుతం నివాసం ఉన్న ప్రాంతంలో ఉన్న హూకో కార్డ్, అతని కుటుంబానికి ఉన్న భూమి స్థానిక పాలనా సంస్థకు అప్పగించి వలసవెళ్లాలి. అలాంటి వసతి సౌకర్యాలు కల్పించకుండా యాజమాన్యాలు దొంగతనంగా పనిచేయించుకోవడానికి మొగ్గు చూపుతున్నాయి. ఇది నగరాల్లో సమస్యలకు కారణం అవుతోంది.

చైనా సంస్కరణలు దేశంలో ఒక సంపన్న వర్గాన్ని ఇప్పటికే సృష్టించాయి. అలాగే భద్రజీవులూ ఉన్నారు. ఈ రెండు వర్గాలను మించి ఇప్పుడు బతుకులు చిందరవందరగా మారిపోయిన నిరుపేదలు భారీగా పెరుగుతున్నారు. అయితే ఈ పేదరికం సహజాతంగా వస్తున్నది కాకుండా విధానాల లోపాల వల్ల విస్తృతమవుతోంది. ముప్ఫై సంవత్సరాల సంస్కరణల్లో మొదటి దశలో ఉపాధి కోల్పోయిన వాళ్లు, ప్రభుత్వరంగ సంస్థల్లో నుంచి తొలగించబడిన వాళ్లు కోట్లాది మంది రోడ్డున పడ్డారు. ఈ సంఖ్య కనీసం రెండు కోట్లు ఉండవచ్చని అంచనా. కంపెనీలు మూసివేసిన తరువాత ఎంతోకొంత పరిహారం చెల్లించి చేతులు దులుపుకున్న ప్రభుత్వం వాళ్లను అలా గాలికి వదిలేసింది. మరోవైపు కొత్త నిరుద్యోగులూ పెరుగుతున్నారు. ఉద్యోగ అవకాశాలు విస్తృతంగానే ఉన్నా అభివృద్ధి, పెట్టుబడులు అన్ని ప్రాంతాల్లో సమానంగా లేక, అట్లా అభివృద్ధి చెందిన ప్రాంతాలకు వలస వెళ్లే స్వేచ్ఛ లేక నిరుద్యోగుల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. చైనాలో నిరుద్యోగం కనీసం పది శాతం ఉంటుందని, అదే సంఖ్యలో బలవంతంగా పనిలోంచి తొలగించబడిన కార్మికులు ఉంటారని అంచనాలు చెపుతున్నాయి. వీరిలో ఎక్కువమంది మహిళలే ఉన్నారు. ప్రభుత్వ రంగంలో దుస్తుల తయారీ, బొమ్మల తయారీ వంటి కంపెనీల్లో చాలామంది మహిళలే ఉండేవాళ్లు. కంపెనీలు లాకౌట్ చేసిన తరువాత లక్షలాదిమంది మహిళలు ఉపాధి కోల్పోయారు. కొత్తగా వచ్చిన సెజ్‌లు, వాటిలోని దుస్తులు, బొమ్మలు తయారు చేసే కంపెనీలు అవివాహితుల్ని, మహిళల్ని, 17-20 సంవత్సరాల లోపు వయసున్న వాళ్లను మాత్రమే పనిలోకి తీసుకోవడంతో ఎంతోమంది నైపుణ్యత ఉండి కూడా పనిలేని స్థితిలో మగ్గుతున్నారు.

ఇక కొత్త కంపెనీలు, సెజ్‌లు పెట్టే పనిహింస భరించలేక రోజూ వందలాది మంది పనివదిలేసి పారిపోతుంటారు. ఈ సెజ్‌లలో వారానికి 90 గంటలు (చట్టబద్ధంగా అయితే 45 గంటలే) అంటే రోజుకు 15 గంటలు పనిచేయాలి. కంపెనీ క్వార్టర్ పేరుతో ఇచ్చే డార్మెటరీలలో ఉండాలి. పది చదరపు మీటర్లుండే ఒక్కొక్క గదిలో ఎనిమిది మంది నివసించాల్సి ఉంటుంది. పనిలో కనీస విశ్రాంతి దొరకదు. సెలవులు తీసుకునే వీలు ఉండదు. ఈ అసంతృప్తి తరుచూ పారిశ్రామిక నగరాల్లో ప్రదర్శనల్లో వ్యక్తమవుతూంటుంది.

ఈ సంపద వరదలో పడి చైనా పాలకులు మారుమూల ప్రాంతాల్లోని ఆదివాసులను, గిరిజనులను, మైనారిటీ జాతులను మరిచిపోయారు. మావో కాలంలో (జనచైనా నిర్మించే క్రమంలో) చాలా వరకు స్వతంత్రంగా ఉన్న ఈ ప్రాంతాలను ప్రత్యేక ప్రతిపత్తి కలిగిన ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తామన్న హామీతో చైనాలో విలీనం చేయించారు. టిబెట్, సుశాంత్‌బన్నా వంటి ప్రాంతాలు అలా చైనాలో చేరినా, 'ప్రత్యేక ప్రతిపత్తి' కాగితానికే పరిమితమైందని, ఈ ప్రాంతాల్లో వనరులు, వ్యాపారాలు అన్నీ మెయిన్‌లాండ్ చైనాకు చెందిన వాళ్ల చేతుల్లోనే ఉన్నాయని స్థానికులు అంటున్నారు. చైనాలో అధికారికంగా మతానికి గుర్తింపు లేకున్నా బహుళజాతి కంపెనీలు, విదేశీ వ్యాపారాలు నడిచే ప్రాంతాల్లో, మహానగరాల్లో క్రైస్తవ మతం విస్తరిస్తుండగా, స్థానిక మత సంప్రదాయాలు, తెగల అస్తిత్వాలు, కొండ ప్రాంత ప్రజల అభివృద్ధి ఆకాంక్షలు అణచివేతకు గురి అవుతున్నాయన్న విమర్శ తీవ్రంగా ఉంది. ఇది తరచూ జాతుల తిరుగుబాట్ల రూపంలో వ్యక్తమవుతోంది కూడా.

'అసమానతలు, వివక్ష, కుల వ్యవస్థ మీద నిర్మితమైన మీ దేశంలోనే లేవు; అంతకంటే కఠినమైన నియమాలు, నిషేధాలు హూకో రూపంలో మా దేశంలో ఉన్నాయి. ఇక్కడ ఒక ప్రాంతం వారికి ఇంకో ప్రాంతం వారు, నగర వాసికి, గ్రామస్తులు అంటరానివారే' అని ఒక జర్నలిస్ట్ వాపోయాడు. సంపద పెరిగిన కొద్దీ ఈ అసమానతలు ఇంకా పెరిగిపోతున్నాయి. ఒకరకంగా చూస్తే అసంతృప్తిలో ఉన్న గ్రామీణ రైతులు, అన్యాయంగా ఉపాధి కోల్పోయిన ప్రభుత్వరంగ ఉద్యోగులు, అమానవీయ పరిస్థితుల్లో పనిచేస్తున్న సెజ్ కార్మికులు, అట్టడికి పోతున్న మైనారిటీ తెగలు చైనాలో అతి పెద్ద అణగారిన వర్గంగా తయారయ్యింది. అలాగే ప్రాంతీయ అసమానతలు, నగరాలు - గ్రామాల మధ్య జీవన ప్రమాణాల్లో వ్యత్యాసాలు చైనా 'అభివృద్ధి నమూనా'కు పెను సవాలు కానున్నాయి.

అయితే చైనా సమస్య మూలాలు వెతుకకుండా, తప్పులు సవరించుకోకుండా మొత్తం దేశాన్నే సమస్యాత్మకం చేసే పనిలో ఉంది. గ్రామాలు కాపాడాలని, వ్యవసాయాన్ని ఆదుకోవాలని ప్రజలు కోరుకుంటుంటుంటే అసలు వ్యవసాయంతో పనిలేని పట్టణ సమాజం నిర్మించే భారీ కార్యక్రమానికి చైనా శ్రీకారం చుట్టింది. రాబోయే కాలంలో మరికొన్ని మహానగరాలు నిర్మించాలని కనీసం 35 కోట్ల మంది గ్రామీణుల్ని ఈ పట్టణాలకు తరలించాలని భావిస్తోంది. సంస్కరణలు ప్రారంభించే నాటికి చైనా పల్లెల్లో 80 శాతం జనాభా ఉండేది. ఇప్పుడు అది 50 శాతానికి తగ్గింది. వచ్చే పది పదిహేనేళ్లలో గ్రామీణ జనాభా 20-30 శాతానికి తగ్గించాలన్నది చైనా సంకల్పం. దీనికి సంబంధించిన మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో అక్కడి ప్రభుత్వం తలమునకలై ఉంది.

'చైనా సంస్కరణలు సంపదను సృష్టించినట్టే ఒక సంకుచిత 'శిష్టవర్గాన్నీ' సృష్టించాయి. కమ్యూనిస్టు పార్టీలో అధికారం అనుభవించిన రాజకీయ నాయకులు, వాళ్లద్వారా లబ్ధిపొందిన వ్యాపారులు, ఈ ఇద్దరి విధానాలకు వత్తాసు పలుకుతూ కీర్తించే మేధావి వర్గం (అధ్యాపకులు, కవులు, కళాకారులు), ఈ శిష్టత్రయం పెట్టుబడి చేతిలో కీలుబొమ్మలై ప్రపంచాన్ని రంజింపజేస్తున్నాయి' అని పెకింగ్ విశ్వవిద్యాలయానికి చెందిన ఒక ప్రొఫెసర్ దుయ్యబట్టారు. అయితే ఈ నాటకం ఇంకెంతో కాలం రక్తికట్టదని కూడా ఆయన అంటున్నారు.

చైనా గురించి చెప్పే వాళ్లు చాలామంది ఒకప్పుడు జనచైనాలో యూనివర్సిటీ ప్రొఫెసర్‌కు, టాక్సీ డ్రైవర్‌కు ఒకే ఆదాయం లభించేదని చెపుతుంటారు. కానీ ఇప్పుడు ప్రొఫెసర్లు లక్షాధికారులైపోతే, టాక్సీ డ్రైవర్లు మాత్రం షాంఘైలో టూరిస్టుల కోసం రిక్షాలు తొక్కుతున్నారు. ఈ పరిణామాలు గమనిస్తూ ఇంకా స్పృహలో ఉన్నవాళ్లు మాత్రం సంపద సృష్టిస్తున్న ఈ సందడి కంటే సమానత్వమే నయమని నమ్ముతున్నారు. వీ

ప్రైవేటీకరణ ఉక్కుపాదం కింద నలిగిపోతున్న కార్మికులకు బతుకు, భద్రత, భరోసా ఇవ్వని చైనా బొగ్గు గనుల స్థితిగతులను వివరిస్తున్నారు **పిట్టల రవీందర్**

చైనా బొగ్గు గనులు మృత్యు లోగిళ్లు

మీడియాలో మనకు చైనా గురించిన ప్రస్తావన వచ్చిన ప్రతి సందర్భంలోనూ అక్కడి బొగ్గుగనుల్లో జరిగే ఘోరమైన ప్రమాదాలు, ఆ ప్రమాదాల్లో మృత్యువాతకు గురయ్యే వందలాదిమంది గని కార్మికులకు సంబంధించిన విషాదకరమైన సంఘటనలే గుర్తుకు వస్తుంటాయి. అయితే ఇందుకు సంబంధించిన వాస్తవాలనుగానీ, మరింత లోతైన అధ్యయనం కోసం తగిన సమాచారాన్నిగానీ సంపాదించడం అంత సులువైన పనికాదని వారం రోజులనుండి కొనసాగిస్తున్న నిరంతర ప్రయత్నం ద్వారా నాకు అనుభవంలోకి వచ్చింది. ఇందుకు అక్కడి ప్రభుత్వం అనుసరిస్తున్న కఠినమైన వైఖరులే కారణమని వేరే చెప్పాల్సిన పనిలేదు. అందువల్ల చైనా దేశంలోని బొగ్గుగనుల్లో మగ్గుతున్న లక్షలాదిమంది గనికార్మికులకు సంబంధించిన పనిపరిస్థితులను, ప్రమాదాలకు సంబంధించిన వివరాలను, వారి జీవన విధానాలను, జీతభత్యాలకు సంబంధించిన వివరాలను, కార్మిక చట్టాల అమలు తీరును, కార్మిక సంఘాల పనితీరును అధ్యయనం చేయడం దుస్సాధ్యమైన పనిగానే కనిపిస్తున్నది. అయితే గడచిన అరవై సంవత్సరాల జనచైనా దేశం ఆలింగనం చేసుకున్న ప్రపంచీకరణ ఇక్కడి అన్నివర్గాలతోపాటుగా బొగ్గు ఉత్పత్తి రంగంపై కూడా తీవ్రమైన ప్రభావాలనే చూపుతున్నది.

ప్రపంచంలో అత్యధికంగా బొగ్గునిల్వలను కలిగిఉన్న దేశంగానే కాకుండా, అగ్రస్థానంలో బొగ్గును ఉత్పత్తి చేస్తున్న దేశంగానూ, అత్యధికంగా బొగ్గును వినియోగిస్తున్న దేశంగా కూడా చైనా ప్రాధాన్యతను సంతరించుకున్నది. చైనా ఆర్థిక శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం 'ప్రపంచంలోనే అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో చైనా ప్రథమ స్థానంలో నిలవడానికి ఇక్కడి ప్రకృతి ప్రసాదించిన నేలబొగ్గు నిల్వలే ముఖ్య కారణం.' అయితే ఈ నేలబొగ్గును వెలికితీసే క్రమంలో నేలరాలుతున్న గని కార్మికుల త్యాగాలకు విలువనివ్వడంలో మాత్రం ఈ దేశాధినేతలు ఏ మాత్రం చొరవచూపడంలేదన్నది బేషరతుగా ఒప్పుకోవాల్సిన సత్యంగా కనిపిస్తున్నది. చైనా దేశంలోని బొగ్గుగనుల నిర్వహణను గమనిస్తే ఇది కమ్యూనిస్టు దేశమేనా అనే అనుమానాలు కలుగుతాయి. చైనా దేశంలోని మొత్తం 28వేల బొగ్గుగనుల్లో కేవలం రెండువేల బొగ్గుగనులు మాత్రమే ప్రభుత్వ రంగసంస్థల నిర్వహణలో ఉన్నాయి. మిగిలిన బొగ్గుగనులన్నీ ప్రైవేటు వ్యక్తుల ఆధ్వర్యంలోనూ, కమ్యూనిస్టుపార్టీకి చెందిన స్థానిక నాయకుల ఆధీనంలోనూ, పలుకుబడి కలిగిన మాఫియా ముఠాల నేతృత్వంలోనూ పూర్తి చట్ట విరుద్ధంగా నిర్వహించబడుతున్నాయి. చట్టవిరుద్ధంగా ప్రైవేటు వ్యక్తుల నిర్వహణలో నడుస్తున్న 20వేల బొగ్గుగనులను మూసివేయాలని చైనా ప్రభుత్వం 2005లో నిర్ణయించుకున్నది. కానీ ఈ దేశంలో పెరిగిపోయిన అవినీతి కారణంగా 2005 నుండి ఇప్పటివరకూ 11,155 ప్రైవేటు చిన్నచిన్నగనులను మాత్రమే మూసివేసారు. దేశంలోని మొత్తం బొగ్గుగనుల్లో 80శాతం బొగ్గుగనులు ఇంకా చట్టవిరుద్ధంగానే నడుస్తున్నట్లు లెక్కలు సూచిస్తున్నాయి. అయితే గత సంవత్సరం మరో 1054 గనులను మూసివేయగా, ఇంకా ఈ దేశంలో 16వేల బొగ్గుగనులు చట్ట విరుద్ధంగా నిర్వహిస్తున్నట్లు తెలుస్తున్నది. ఇందుకు సంబంధిత శాఖల అధికారుల అలసత్వం, అవినీతి, అక్రమాలే కారణమని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

చైనాలో జరిగే బొగ్గుగని ప్రమాదాలకు సంబంధించిన అనేక వాస్తవాలు వెలుగులోకి రాకుండా మరుగున పడిపోతున్నాయి. గనిప్రమాదంలో మృతిచెందిన కార్మికుల మృతదేహాలు కూడా బయటకు తీసుకురాకుండానే ఆ గనిని శాశ్వతంగా మూసివేసిన సంఘటనలు వేలసంఖ్యలో వెలుగుచూసాయి. చైనా దేశంలో అమలు జరుపుతున్న కార్మిక చట్టాల ప్రకారం బొగ్గుగని ప్రమాదంలో కార్మికుడు చనిపోతే నష్టపరిహారంగా రెండు లక్షల 'యెన్' (చైనాదేశపు కరెన్సీ)లు చెల్లించాల్సి

గడచిన తొమ్మిది సంవత్సరాలలో చైనా బొగ్గుగనుల్లో జరిగిన ప్రమాదాలు, వాటిల్లో మృతి చెందిన కార్మికుల సంఖ్య

సంవత్సరం	ప్రమాదాలు	మృతుల సంఖ్య
2000	2863	5798
2001	3082	5670
2002	4344	6995
2003	4143	6434
2004	3639	6027
2005	3341	5986
2006	2945	4746
2007	2679	3786
2008	2102	3209
మొత్తం	**16,383**	**24,575**

ఉంటుంది. ఇది మన దేశపు కరెన్సీ ప్రకారం 12లక్షలకు సమానం. అయితే నష్టపరిహారం చెల్లింపుల నుండి తప్పించు కోవడానికి గనులను నిర్వహించే యజమానులు అమానవీయమైన పద్ధతులను అనుసరిస్తుంటారు. గని ప్రమాదంలో మృతిచెందిన కార్మికులకు సంబంధించిన కుటుంబ సభ్యులతో లోపాయికారీగా ఒప్పందాలను కుదుర్చుకుంటారు. ప్రమాదం జరిగిన రోజున ప్రమాదంలో మృతిచెందిన కార్మికుడు పనికి హాజరుకాలేదంటూ కుటుంబ సభ్యులనుండి ధృవీకరణ పత్రం రాయించుకుంటారు. ఇందుకు వారికి కొంత సొమ్మును ముట్టజెప్పుతారు. చైనాలో బొగ్గుగనిలో ప్రమాదం జరిగితే సంబంధిత మైనింగ్ అధికారిపై ప్రభుత్వం కేసు నమోదు చేస్తుంది. గని యాజమాన్యంపై చర్య తీసుకుంటుంది. అందువల్ల మైనింగ్ అధికారులు, గని యాజమాన్యం ప్రమాదాలకు సంబంధించిన వివరాలను బయటకు పొక్కకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటారు. గని ప్రమాదాలపై మీడియాగానీ, హక్కుల సంఘాలుగానీ, కార్మిక సంఘాలుగానీ స్వతంత్రంగా విచారణ నిర్వహించేందుకు చైనాలో అవకాశం లేకపోవడంతో గని ప్రమాదాలకు సంబంధించిన వాస్తవాలు వెలుగుచూసేందుకు ఏ మాత్రం అవకాశాలు ఉండవు.

అయితే గని ప్రమాదాలకు సంబంధించి మాత్రం చైనా ప్రభుత్వం అత్యంత తీవ్రమైన చట్టాలనే అమలు జరుపుతున్నది. బొగ్గుగనిలో ప్రమాదం జరిగిన వెంటనే గనిలో బొగ్గు ఉత్పత్తిని నిలిపివేస్తారు. గని అధికారులపై కేసు నమోదు చేస్తారు. ప్రాథమిక విచారణ అనంతరం సంబంధిత మైనింగ్ అధికారులను అరెస్టు చేస్తారు. భారీ మొత్తంలో జరిమానాలను సైతం విధిస్తారు. 2008 ఆర్థిక సంవత్సరంలో చైనా బొగ్గుగనుల్లో అధికారిక లెక్కల ప్రకారం మొత్తం 2102 గని ప్రమాదాలు జరిగి, 3200మంది గని కార్మికులు చనిపోయారు. ఈ సంఘటనలపై విచారణ నిర్వహించిన ప్రభుత్వ అధికారులు 3500మంది అధికారులపై విచారణ జరిపి, ఇందులో డ్యూటీలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే కారణంతో 425మంది మైనింగ్ అధికారులపై కేసులు నమోదు చేసి అరెస్టు చేసారు. ప్రమాదం జరిగిన కేవలం 60రోజుల్లోనే ఈ చర్యలన్నీ తీసుకున్నారు.

మరోవైపున చైనాలో బొగ్గుగనులను ప్రైవేటీకరించే ప్రయత్నాలు ముమ్మరమవుతున్నాయి. గని కార్మికులకు ఉద్యోగ భద్రత లేకపోవడంతో కార్మికులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. బొగ్గు ఉత్పత్తి రంగంలో సంస్కరణల ఫలితంగా లక్షలాదిమంది గని కార్మికులు తమ ఉద్యోగాలను కోల్పోతున్నారు. చట్ట విరుద్ధంగా నిర్వహిస్తున్న వేలాది బొగ్గుగనులను మూసివేయడం, ప్రభుత్వ రంగంలో నిర్వహిస్తున్న బొగ్గుగనుల్లో అత్యాధునిక యంత్రాలను ప్రవేశ పెట్టడంలాంటి పరిణామాలు గని కార్మికులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. గడచిన ఐదు సంవత్సరాల కాలంలోనే చైనాలో సుమారు 20లక్షల మంది గని కార్మికులు తమ ఉద్యోగాలను కోల్పోయారు. అయితే చైనా ప్రభుత్వం అమలు జరుపుతున్న సామాజిక భద్రత కారణంగా వీరిలో చాలామంది వస్తు ఉత్పత్తి రంగంలోనూ, వ్యవసాయరంగంలోనూ పునరావాసం పొందగలిగారు. చైనాలో ప్రభుత్వం అక్కడి కార్మికుల హక్కులను ఏ మాత్రం గుర్తించదు. కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేసుకునేందుకు కార్మికులు చేసే ప్రయత్నాలను తీవ్రంగా అణచివేస్తారు. కార్మికుల సమస్యలపైగానీ, గనుల్లో జరిగే ప్రమాదాలపైగానీ ప్రభుత్వ ఆధీనంలో పనిచేసే మీడియా ఏ మాత్రం పట్టించుకోదు. గని ప్రమాదాలపై ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసే ప్రకటనను మాత్రమే బయటి ప్రపంచానికి తెలియ జెప్పేందుకు వీలున్నది. గని ప్రమాదాలు జరిగిన సందర్భాలలో ప్రమాద స్థలాన్ని మీడియా ప్రతినిధులు సందర్శించేందుకు ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతి లభించదు.

ఇటీవల చైనా ప్రభుత్వం నాలుగు బొగ్గుగనులను ప్రైవేటు సంస్థకు అప్పగించేందుకు నిర్ణయం తీసుకున్నది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈ నాలుగు గనులకు చెందిన సుమారు ఐదు వేలమంది కార్మికులు ఆగస్టు 22 నుండి నిరవధికంగా సమ్మె చేస్తున్నారు. కానీ ఈ సంఘటన ఇంతవరకూ బయటిప్రపంచానికి తెలియలేదు. ఇది చైనాలోని ప్రచార మాధ్యమాల పనితీరుకు అద్దం పడుతుంది. చైనా ప్రభుత్వం చట్టం ప్రకారం బాలకార్మిక వ్యవస్థను నిషేధించినప్పటికీ ఇక్కడి ప్రైవేటు బొగ్గు గనుల్లో బాలకార్మికుల వెట్టిచాకిరీ తీవ్రమైన సమస్యగా పరిణమించింది.

కాగా, చైనాలోని బొగ్గుగనుల్లో తరచూ జరిగే ప్రమాదాలకు ప్రత్యేక కారణాలు ఉన్నాయని అధికారులు చెబుతారు. చైనాలో జరిగే బొగ్గుగని ప్రమాదాల్లో గనుల్లోకి వరదలు రావడం, హఠాత్తుగా భారీ విస్ఫోటం జరగడం, గని పైకప్పుకూలడం లాంటి కారణాలే అధికంగా ఉంటాయి. బొగ్గుగనుల్లో కార్బన్-డై-ఆక్సైడ్ కంటే ఇరవై రెట్లు అధిక ప్రమాదకరమైన మిథేన్ వాయువు ఎక్కువ మోతాదులో ఉండటంవల్లనే గనుల్లో భారీ విస్ఫోటనాలు జరిగి, వందలాదిమంది కార్మికులు మృత్యువాతపడుతుంటారు. చైనాలోని చిన్న, చట్టవిరుద్ధంగా నిర్వహించే ప్రైవేటు బొగ్గుగనుల్లోనే ఎక్కువ శాతం ప్రమాదాలు, కార్మికుల మరణాలు సంభవిస్తుంటాయి. గడచిన ఐదు సంవత్సరాల కాలంలో ఇట్లాంటి చట్టవిరుద్ధమైన బొగ్గుగనుల నిర్వహణపై నియంత్రణకు నడుం బిగించడంతో గని ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గినట్లు బ్రిటిష్ బ్రాడ్ కాస్టింగ్ కార్పోరేషన్ (బిబిసి) ఇటీవల నిర్వహించిన సర్వేలో అభిప్రాయపడింది.

ప్రపంచ వ్యాపితంగా ఉత్పత్తి అవుతున్న బొగ్గులో ఒక్క చైనాలోనే అత్యధికంగా 35శాతం బొగ్గును ఉత్పత్తి చేస్తున్నారు. అయితే ఇక్కడి భూభౌతిక పరిస్థితులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఈ దేశంలోనే తయారు చేసుకుంటారు. ముఖ్యంగా 95శాతం బొగ్గును అండర్‌గ్రౌండ్ గనుల విధానంలో 'లాంగ్‌వాల్' పద్ధతిని ఉపయోగించి ఉత్పత్తి చేస్తారు. ఓపెన్‌కాస్ట్ విధానాన్ని చైనా పూర్తిగా వ్యతిరేకిస్తుంది. చైనాలో సహజవాయువు, చమురు నిక్షేపాలు పరిమితంగా లభ్యమవుతున్న కారణంగా 'కోల్-టు-లిక్విడ్స్' విధానాన్ని అనుసరించడం ద్వారా బొగ్గు నుండి పెట్రోలియం ఉత్పత్తులను తయారుచేసే ప్రక్రియకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నారు. అంతేకాకుండా బొగ్గునుండి సహజవాయువులను ఉత్పత్తి చేసే రీతిలో 'కోల్ బెడ్ మిథేన్' (సి.బి.యం), 'కోల్ మైన్ మిథేన్' (సి.యం.యం.) లాంటి పద్ధతులను ప్రయోగాత్మకంగా అమలుజరుపుతున్నారు.

గత సంవత్సరం చైనాలో 2700 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసి, అందులో సగానికిపైగా దేశంలోనే వినియోగించుకున్నారు. అందువల్ల ప్రపంచంలో అత్యధికంగా పర్యావరణానికి నష్టం కలిగిస్తున్న

ఆధునిక విద్యావ్యవస్థలోని బ్రిటిష్ వలస మూలాలను, సామాజిక అసమానతలను మరింత పెంచేదిగా ఉన్న విద్యా హక్కు బిల్లులోని లోపాలను వివరిస్తున్నారు **ఎ. నర్సింహారెడ్డి**

విద్యా హక్కు బిల్లు - 2008

సామాజిక పరివర్తన ధ్యేయంగా, జాతీయ ప్రయోజనాలే లక్ష్యంగా, రాజ్యాంగ విలువల పరిరక్షణ పరమావధిగా రూపుదిద్దుకోవాల్సిన విద్యలో వ్యాపార ధోరణులు పెరిగి విలువలు పతనం అవుతున్నాయి. సామాజిక చింతన లోపిస్తోంది. అవకాశాల్లో అసమానతలు పెరిగిపోవడంతో అట్టడుగు సామాజిక వర్గాలు వనరులతో పాటు జ్ఞానావకాశాలు కూడా కోల్పోతుండడం ఒక విచారకర పరిణామం. ఆదర్శాలు వల్లించినంతగా పాలకులు ఆచరించరని, ప్రజలకు ఒకటి చెప్పి మరొకటి చేస్తారన్న పాలకవర్గ స్వభావం, 'విద్యా హక్కు బిల్లు-2008' బట్టబయలు చేసింది. ప్రజావసరాలను, ఆకాంక్షలను, ప్రజా ప్రయోజనాలను పణంగా పెట్టి దేశీయ, విదేశీయ బడా కార్పొరేట్ వాణిజ్య వేత్తల ప్రయోజనాలు కాపాడడానికే చట్టాలు రూపొందించబడుతున్నాయన్న యదార్థానికి 'విద్యా హక్కు బిల్లు-2008' సజీవ సాక్ష్యంగా నిలుస్తుంది. నయా ఉదారవాద ఆర్థిక సంస్కరణల క్రమంలో విద్యను ప్రైవేటీకరణ చేసే ప్రక్రియ వేగవంతమవుతూ చట్టబద్ధతను సంతరించుకుంటున్న క్రమాన్ని, విద్య సమానంగా అందరికీ అందకుండా పోయే ప్రమాదాన్ని గుర్తించడం ఈ వ్యాస ఉద్దేశ్యం.

మన దేశంలో కొన్ని సామాజిక వర్గాలకు వేల సంవత్సరాలుగా విద్య నిరాకరించబడింది. పారిశ్రామిక విప్లవంతోబాటు పాఠశాల విద్యకు అంకురార్పణ బ్రిటన్‌లో మొదటగా జరిగింది. ఈస్టు ఇండియా కంపెనీ, క్రిస్టియన్ మిషనరీలు, కొన్ని ధార్మిక సంస్థలు 17, 18వ శతాబ్దాలలో నియత విద్యాలయాలను మన దేశంలో ఆరంభించాయి. చార్లెస్ గ్రాంట్ ప్రప్రథమంగా 1813లో ప్రాథమిక విద్యకు ప్రభుత్వ నిధులు సమకూర్చాడు. మెకాలే 1835లో చేసిన ప్రతిపాదనలను గవర్నర్ జనరల్ బెంటింగ్ ఆమోదించడంతో భారతదేశ ఆధునిక విద్యా చరిత్రలో నూతన అధ్యాయం మొదలైంది. బ్రిటిష్ ప్రభుత్వం విద్యపై పెట్టే ఖర్చంతా ఇంగ్లిష్ విద్యకే పెట్టడం మొదలైంది. ఇంగ్లిష్ పాఠశాలలో చదివిన వారికే ఉద్యోగాలు దొరికాయి. స్వదేశీ విద్యా సంస్థలు బలహీనపడ్డాయి. విద్య గరపడం ఉద్యోగం కొరకేనన్న భావన ఏర్పడింది. వలస ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం పట్ల భారతీయ విద్యావేత్తల్లో నిరసన ప్రబలింది. ఈ నేపథ్యంలో బ్రిటిష్ ప్రభుత్వం మరలా విద్యా విధానాన్ని పున: పరిశీలించమని చార్లెస్ ఉడ్‌ను కోరింది. 1844లో ఉడ్స్ డిస్ప్యాచ్‌తో పాఠశాలల గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఆరంభమైంది. భారతదేశంలో విద్యా వ్యాప్తికి బ్రిటిష్ ప్రభుత్వం బాధ్యత వహించాలని, ప్రతి రాష్ట్రంలో విద్యా శాఖను ఏర్పరచాలని, బొంబాయి, మద్రాస్, కలకత్తా నగరాలలో విశ్వ

దేశాలలో కూడా దేశమే అగ్రభాగాన నిలుస్తున్నది. ఇక్కడి అండర్‌గ్రౌండ్ గనుల్లోని దుర్భరమైన పనిపరిస్థితులు, గనుల్లో కార్బన్-డై-ఆక్సైడ్, మిథేన్ వాయువులు మోతాదును మించడం, తీవ్రమైన దుమ్ము, ధూళి తదితర కారణాలవల్ల ఇక్కడి బొగ్గుగనుల్లో పనిచేసే కార్మికుల్లో చాలామంది 'న్యూమోకోనియోసిస్' (బ్లాక్‌లంగ్) (మనదేశంలో దీనిని మైనర్స్ అస్తమా అని పిలుస్తున్నారు) లాంటి ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్నారు. ఇప్పటికే ఈ వ్యాధితో బాధపడుతున్న వారి సంఖ్య ఆరు లక్షలకు చేరుకోగా, ప్రతియేటా కొత్తగా మరో 70వేలమంది చేరుతున్నట్లు అక్కడి ఆరోగ్య నివేదికలు చెబుతున్నాయి.

చైనాలో ప్రభుత్వరంగంలో నిర్వహిస్తున్న బొగ్గుగనుల్లో మూడు స్థాయిల్లో స్థానిక సంస్థల ప్రమేయం ఉంటున్నది. కేంద్రప్రభుత్వ ఆధీనంలో 47.6 శాతం, రాష్ట్ర స్థాయిలో 13.6శాతం, పట్టణ లేదా గ్రామ స్థాయి స్థానిక సంస్థల ఆధ్వర్యంలో 38.8 శాతం గనులను నిర్వహిస్తున్నారు. ఈ కారణంగా స్థానిక సంస్థలకు స్థానికంగా లభ్యమయ్యే వనరులపై అధికారం, భాగస్వామ్యం లభిస్తున్నది. ఈ వనరుల ద్వారా వచ్చే లాభాలు స్థానిక ప్రజల సంక్షేమానికి సైతం ఉపయోగపడుతున్నాయి. కేవలం అండర్‌గ్రౌండ్ గనుల నిర్వహణ వల్ల స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సైతం లభిస్తున్నాయి. ఈ కారణంగానే చైనాలో గనుల నిర్వహణపై ఇంతవరకూ స్థానిక ప్రజలనుండి ఎలాంటి వ్యతిరేకత వెల్లువెత్తడంలేదు. ఏదిఏమైనా చైనా బొగ్గుగనుల్లో యేటా వేలసంఖ్యలో మృత్యువాతకు గురవుతున్న గని కార్మికుల దుస్థితిపై ప్రపంచవ్యాపితంగా ఆందోళన కలిగిస్తున్నది మాత్రం వాస్తవం.

ఉపయుక్త గ్రంథాలు / నివేదికలు

1. స్టేట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ వర్క్ సేఫ్టీ (ఎస్.ఎ.డబ్ల్యు.ఎస్.)
2. ఎ కోల్ డిపెండెంట్ ఫ్యూచర్ బై సూసాన్ వాట్స్, బి.బి.సి. న్యూస్ నైట్, సైన్స్ ఎడిటర్
3. కాంగ్రెషనల్ ఎక్జిక్యూటివ్ కమిషన్ ఆన్ చైనా: 2005 సంవత్సర నివేదిక
4. ది ఆల్ చైనా ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (ఎ.సి.ఎఫ్.టి.యు.)
5. ఆన్‌లైన్ రిపోర్ట్స్ ఫ్రం చైనా డేలీ, జిన్‌హువా
6. ఆన్‌లైన్ రిపోర్ట్స్ ఫ్రం చైనా డాట్ ఒఆర్‌జి డాట్ సిఎన్
7. బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (బిబిసి) రిపోర్ట్స్ ఆన్ చైనా కోల్

వీ

విద్యాలయాలు స్థాపించాలని, విద్యా సంస్థలలో తటస్థ మత విధానాన్ని అనుసరించాలని, స్త్రీ విద్యకు కృషి చేయాలని ఉడ్స్ సూచించాడు. కాని ఆయన చేసిన సిఫారసులనేకం అమలులోకి రాలేదు. ప్రజల విద్యావసరాలు నిర్లక్ష్యం చేయబడ్డాయి. ఉడ్స్ సిఫారసులు సక్రమంగా అమలు చేయడానికి ఏ చర్యలు తీసుకోవాలో సూచించమని హంటర్ అధ్యక్షతన 1882లో ఒక కమిషన్‌ను అప్పటి గవర్నర్ రిప్పన్ నియమించాడు. దీన్ని భారతీయ తొలి విద్యా కమిషన్ అని అంటారు. 1882లో విద్యా విధాన రూపకల్పనకు బ్రిటిష్ ప్రభుత్వం నియమించిన హంటర్ కమిషన్‌కు జ్యోతిబాపూలే సార్వత్రిక విద్య ఆవశ్యకతను తెలియపరిచాడు. స్వదేశీ పాఠశాలలను ప్రోత్సహించాలని, ప్రాథమిక విద్యా నిర్వహణ బాధ్యతను స్థానిక సంస్థలు చేపట్టాలని, ప్రాథమిక పాఠశాలల్లో బోధనా భాషగా మాతృభాష ఉండాలని, పాఠశాలలకు ప్రభుత్వం ఆర్థికసహాయం చేయాలని, సెకండరీ ఉన్నత విద్యను ప్రైవేట్ రంగానికి విడిచిపెట్టాలని, వాటికి గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఇవ్వాలని హంటర్ కమిషన్ సూచించింది. 1911లో గోఖలే ప్రాథమిక విద్యను సార్వత్రికం చేసే ప్రైవేట్ బిల్లును బొంబాయి అసెంబ్లీలో ప్రవేశపెట్టాడు. భూస్వాములు, పెట్టుబడిదారులు వ్యతిరేకించడంతో అదీ తిరస్కరించబడింది. 1937లో వార్ధాలో కాంగ్రెస్ పార్టీ జరిపిన సదస్సులో గాంధీ బేసిక్ విద్యను కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో అమలు చేయాలని తీర్మానం చేయించాడు. అదీ నిధుల లేమి సాకుతో అమలులోకి రాలేదు. 1944లోనే సార్జంట్ కమిటీ 3-6 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలబాలికల పూర్వ ప్రాథమిక విద్య ఆవశ్యకతను నొక్కి చెప్పింది.

1947లో అధికార మార్పిడి జరిగి 1950లో రాజ్యాంగాన్ని అమలులోకి తెచ్చుకొని ఆరు దశాబ్దాలు గడిచినా అందరికీ విద్య అందలేదు, వలసకాలం నాటి విధానాలే మనం ఇప్పటికీ అనుసరిస్తున్నాం. ఏ దేశ ప్రగతి అయినా ఆ దేశం అందించే విద్యా విధానంపై ఆధారపడి ఉంటుంది. ఆధునిక ప్రపంచంలో అన్ని దేశాల సామాజిక వ్యవస్థలలో విద్యారంగం ఒక ప్రధానమైన ఉప వ్యవస్థగా గుర్తించబడింది. ఒక దేశంలో అమలులో ఉండే విద్యా విధానం ఆ దేశ చరిత్రను, సంస్కృతిని ప్రతిబింబిస్తుంది. మన దేశం విభిన్న జాతుల, మతాల, సంస్కృతుల నిలయం. వివిధ ప్రాంత ప్రజల భౌగోళిక పరిస్థితులు ఆ ప్రాంత ప్రజల అవసరాలను నిర్దేశిస్తాయి. ఆ వైవిధ్యాని కనుగుణంగా, ఆయా ప్రాంత మౌలికావసరాల కనుగుణంగా విషయ పరిజ్ఞానాన్ని అందివ్వడం ద్వారా ఆ ప్రజలకు విద్య పట్ల ఆసక్తిని కల్గించగలం. అయితే దేశమంతా ఒకేరకమైన విద్యా ప్రణాళిక రూపొందించి మూస పద్ధతిలో అమలు చేస్తున్నారు. పాఠ్య ప్రణాళిక తయారీలో విభిన్న ప్రాంతాల ప్రజల చారిత్రక, భౌగోళిక, సాంస్కృతిక అంశాల ప్రత్యేకతను పరిగణనలోకి తీసుకోలేదు. ప్రజల ఆశయాలను, ప్రజల అవసరాలను విద్యా విధానం నిర్లక్ష్యం చేస్తే రాజ్యాంగం ఆశించిన ఆదర్శాలను, లక్ష్యాలను చేరుకోలేదు. జనవరి 1948లో ఒక సదస్సులో మాట్లాడుతూ నెహ్రూ మన విద్యా విధానంలో ప్రజావసరాలు, ఆకాంక్షలకనుగుణమైన, మౌలికమైన మార్పులు తీసుకురావలసిన అవసరముందన్నాడు. రాజ్యాంగంలోని 45వ అధికరణ 14 సంవత్సరాలలోపు బాలబాలికలందరికీ ఉచితంగా నిర్బంధంగా ఎలిమెంటరీ విద్యను అందజేయడం ప్రభుత్వ బాధ్యత అని చెబుతోంది. పదేళ్ల కాలంలో పిల్లలందరినీ అక్షరాస్యులుగా చేయాలని గడువు నిర్ణయించింది. 1960 నాటికి పదేళ్ల గడువు పూర్తయింది. ఆరు దశాబ్దాలు గడిచినా సార్వత్రిక విద్య సాధ్యం కాలేదు. కాలంతోపాటు గడువు పొడిగిస్తూ పోతున్నారు. పాఠ్య ప్రణాళిక రూపకల్పనలో, బోధనా పద్ధతుల్లో, మూల్యాంకన విధానాల్లో ఇసుమంతైనా మార్పు రాలేదు. నేటి చదువులు విద్యార్థులను పుస్తకాల పురుగులుగా, కేవలం విషయాలను వల్లె వేసే విధంగా మారుస్తున్నాయి తప్ప వారిలోని నైపుణ్యాలను వెలికి తీసేవిగా లేవు. ఇప్పటివరకు జాతీయ కమిషన్‌ల నియామకాలు సమస్య పరిష్కారం కొరకు గాకుండా, సమస్యల్ని దాటవేయడానికి లేదా కాలయాపన చేయడానికి దోహదపడ్డాయి. విద్యా వ్యవస్థ పునఃనిర్మాణానికి, విస్తరణకు సంబంధించి నియమించిన కమిషన్‌ల సూచనలు ఏ ఒక్కటి ఆచరణలోకి పాలకులు తీసుకురాలేదు. కనీసం చర్చకు కూడా పెట్టకుండానే ప్రభుత్వాలు తమకు తోచిన రీతిలో అమలు చేస్తూ వచ్చాయి. రాజ్యాంగ ఆదర్శాల సాధన కోసం విద్యను ఒక ఏజన్సీగా రూపొందించాలన్న భావనకు, రాజ్యాంగ విలువలకు భిన్నంగా అనేక సందర్భాలలో వాటికి విఘాతం కలిగించే విధంగా విద్యా విస్తరణ జరిగింది. సమాన విద్యావకాశాల కల్పన అన్న విలువ కనుమరుగైంది. సామాన్య పాఠశాలలు ఏర్పాటు చేయాలన్న డా.కొఠారీ సూచన ప్రకారం పార్లమెంట్ 1968లో తీసుకున్న నిర్ణయం అటకెక్కింది. విద్యార్థులకు అందించే విద్యలోని అంతరాలు, కలిగించే సౌకర్యాలలో గల తేడాలు పేద, సంపన్న పిల్లల మధ్య పెరుగుతున్న వివక్షతను గ్రహించిన డా. కొఠారీ అందుకు నివారణగా సమాజంలోని అన్ని వర్గాల పిల్లలందరికీ ఒకే విధమైన పాఠశాల, ఒకే విధమైన సిలబస్, ఒకే విధమైన అవకాశాలు కల్పించాల్సిన అవసరంతోనే ఉమ్మడి పాఠశాల విధానాన్ని ప్రతిపాదించాడు. అయినప్పటికీ, అంతరాలను నివారించాల్సిన విద్య అంతరాలను స్థిరీకరించే రకరకాల పాఠశాలల ద్వారా అందించబడుతున్నది. వివిధ యాజమాన్యాలలో కొనసాగుతున్న పాఠశాలలు సమాజంలో ఉన్న అంతరాలను తొలగించేందుకు దోహదం చేయకపోగా, ఆ అంతరాలను మరింత పెంచేందుకు దోహద పడుతున్నాయి. పాఠశాల విద్య క్రమంగా వ్యాపారీకరణ చెంది అంగట్లో సరుకై లాభసాటి వ్యాపారంగా మారింది. ఆరు దశాబ్దాలుగా సార్వత్రిక విద్యను సరిగా అమలు చేయకపోవడం వలన 2001 జనాభా లెక్కల ప్రకారం మనదేశంలో అక్షరాస్యత 65.38 శాతం. అందులో 75.85 శాతం పురుషులు కాగా, 54.16 శాతం స్త్రీలు అక్షరాస్యులుగా ఉన్నారు. పట్టణాలలో అక్షరాస్యత 76.39 శాతం కాగా, గ్రామీణ ప్రాంతాల్లో 55.33 శాతం అక్షరాస్యులున్నారు. షెడ్యూల్డ్ తరగతుల అక్షరాస్యత 54 శాతం మాత్రమే. అందులో పురుషులు 66 శాతం కాగా స్త్రీలు 41 శాతం అక్షరాస్యులుగా వున్నారు. షెడ్యూల్డ్ తెగలలో అక్షరాస్యత 47 శాతం. అందులో పురుషులు 59 శాతం కాగా స్త్రీలు 34 శాతం అక్షరాస్యులున్నారు. ముస్లిం మైనారిటీల అక్షరాస్యత షెడ్యూల్డ్ జాతుల వారికంటే తక్కువ. నేడు మన జనాభాలో మూడవ వంతు నిరక్షరాస్యులు. మహిళల్లో 50 శాతం నిరక్షరాస్యులున్నారు. ప్రాథమిక విద్యకు ఆర్థికాభివృద్ధికి. పేదరికానికి, బాల కార్మికతకు సంబంధముందని ఎంతోమంది సామాజిక శాస్త్రవేత్తలు ఏనాటినుండో ఘోషిస్తున్నా, పాలకులు విద్య ప్రాధాన్యతను ఒక సామాజిక అంశంగా, ప్రధాన అంశంగా గుర్తించడం లేదు. విద్యను సామాజిక మార్పుకు, సమాన

అవకాశాల సాధనకు ఒక సాధనంగా గుర్తించడంలో పాలకుల్లో లక్ష్యశుద్ధి, చిత్తశుద్ధి కొరవడినందున విద్యకు బడ్జెట్ కేటాయింపుల్లో సముచిత వాటా దక్కలేదు. ఫలితంగా 30 శాతం మించి పదో తరగతి పూర్తి చేయలేకపోతున్నారు.

రాజ్యాంగంలోని 21వ అధికరణలో ఉన్న జీవించే హక్కును, 45వ అధికరణలోని విద్యా హక్కుతో కలిపి చూడాలని, అంతేగాకుండా పూర్వ ప్రాథమిక విద్యతోపాటు ఎలిమెంటరీ విద్య (3-14)ను ఎట్టి పరిస్థితుల్లో సామాజిక, ఆర్థిక కారణాలతో పదునాలుగేళ్ల లోపు పిల్లలు చదువుకు దూరమయ్యే పరిస్థితులు కొనసాగించవలదని 1993లో సర్వోన్నత న్యాయస్థానం ఉన్ని కృష్ణన్ కేసులో స్పష్టమైన తీర్పు ఇచ్చింది. అర్థవంతమైన జీవితాన్ని పొందడానికి విద్యను హక్కుగా భావించి 14 సంవత్సరాల లోపు బాలలకు ఉచితంగా, నిర్బంధంగా విద్యను అందించ వలసిన బాధ్యత ప్రభుత్వాలదే అనడంతో, ప్రభుత్వాలపై ఒత్తిడి పెరిగింది. ఆనాటినుండి విద్యాహక్కును నీరుగార్చే ప్రయత్నాలు మొదలు పెట్టారు. విద్యార్థులు బడిలో చేరకపోవడానికి, చేరినా మధ్యలో బడి మానివేయడానికి గల సామాజిక, ఆర్థికాంశాలను విస్మరించి ప్రపంచబ్యాంకు నిర్దేశంతో విదేశీ నిధులతో 1993-94 నుండి 'జిల్లా ప్రాథమిక విద్యా కార్యక్రమం', 2000-2001 నుండి 'సర్వశిక్షా అభియాన్' పేరుతో మభ్యపెట్టే సంస్కరణలు చేపట్టింది. అవి - ఒకటి, యాజమాన్య సంబంధాలలో మార్పు (ప్రైవేటీకరణ) రెండు, బోధనా భ్యసన పద్ధతుల్లో మార్పు (విద్యార్థి కేంద్రంగా విద్య, ఆటపాటలతో విద్య, బరువు లేకుండా బడికి, ఇంటి పనిలేకుండా ఇంటికి) మూడు, నియత విద్య స్థానంలో అనియత విద్య, (మళ్లీ బడికి, ప్రత్యామ్నాయ పాఠశాల) మొత్తంగా విద్య అంటే అక్షరాస్యతగా కుదించబడింది. ఈ క్రమంలోనే 2002లో ఎన్.డి.ఎ. ప్రభుత్వం 86వ రాజ్యాంగ సవరణ తీసుకువచ్చింది. ఈ సవరణ ద్వారా 21వ అధికరణకు అదనంగా 21 ఎ చేర్చడమైనది. ఈ అధికరణ 0-14 సంవత్సరాల బాలబాలికలందరికీ విద్యాహక్కు కాకుండా 6-14 వయో పరిమితికి వర్తించేటట్లు కుదించింది. అంటే 3-5 సంవత్సరాల బాలబాలికలకు పూర్వ ప్రాథమిక విద్యను నిరాకరించింది. ఈ సవరణ వాస్తవానికి 45వ అధికరణ భావాన్ని కుదించింది. మరోవైపు అందరికీ విద్య ప్రాథమిక హక్కు అని పేర్కొంది. అందరికీ ఒకేరకమైన విద్యను కాకుండా రాజ్యం శాసనం ద్వారా నిర్ణయించుకున్న మేరకు విద్యను అందిస్తామని రాజ్యాంగ సవరణ పేర్కొంది. ఈ సవరణ ద్వారా విద్యలో 'వివక్ష'కు చట్టబద్ధత కల్పించింది. సామాజిక న్యాయానికి తిలోదకాలు ఇచ్చింది. మరోవైపు 1992లో యునెస్కో ఆధ్వర్యంలో జరిగిన 'బాలల హక్కుల సదస్సు' 18 సంవత్సరాల వయస్సు వచ్చేవరకు విద్య అందించవలసిన బాధ్యత ప్రభుత్వాలదేనని తీర్మానించింది. ఇందుకు నిధుల కొరత చూపకూడదని పేర్కొంది. ఈ తీర్మానంపై భారత్ కూడా సంతకం చేసింది. అయితే 86వ రాజ్యాంగ సవరణలో 6-14 సంవత్సరాలు మాత్రమే హక్కుగా గుర్తించింది.

అందరికీ విద్య ఒక ఆశగానే మిగిలి ఉన్న సందర్భంలో 2002లో ఎలిమెంటరీ విద్యను 6-14 సంవత్సరాల వయసుగల బాలబాలికలకు ప్రాథమిక హక్కుగా గుర్తించడం వలన దాన్ని ఆచరణీయం చేయడానికి 'బాల బాలికల ఉచిత, నిర్బంధ విద్యా హక్కు బిల్లు 2008' ను అప్పటి కేంద్ర మానవవనరుల శాఖ మంత్రి అర్జున్‌సింగ్ 2008 డిసెంబర్ 15న రాజ్యసభలో ప్రవేశపెట్టారు. అయితే ఈ బిల్లు ప్రజల ఆకాంక్షలకు, రాజ్యాంగ పీఠికలోని ఆదర్శాలకు భిన్నంగా ఉందని ప్రముఖ విద్యావేత్తలు, న్యాయమూర్తులు భావించారు. ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు గత కొంతకాలంగా బిల్లులో సవరణల తేవాలని ఆందోళనలు చేస్తూనే ఉన్నాయి. ఇవేమీ ప్రభుత్వం పట్టించుకోకుండా ఆదరా బాదరాగా బిల్లును ఆమోదించడం విడ్డూరంగా ఉంది. ఈ బిల్లుకు 20 జూలై 2009న రాజ్యసభ, 4 ఆగస్ట్ 2009న పార్లమెంట్ ఆమోదం పొందింది. ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న విద్యా హక్కు బిల్లు 26 ఆగస్ట్ 2009న రాష్ట్రపతి ఆమోదం కూడా పొందింది. ఈ బిల్లు రాజ్యసభలో చర్చకు వచ్చినపుడు 54/200 సభ్యులున్నారు. పార్లమెంట్‌లో చర్చకు వచ్చినపుడు 85/540 మంది సభ్యులు ఉన్నారు. వామపక్షాలు కూడా ఈ బిల్లులోని లోపాలను, ప్రభుత్వపు దగాకోరుతనాన్ని ప్రశ్నించకపోవడం శోచనీయం. ఈ బిల్లు కొండనాలుకకు మందువేస్తే ఉన్న నాలుక పోయిన చందంగా ఉంది. అంతర్జాతీయ ఒప్పందాలకు, రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా, సామాజిక న్యాయానికి విరుద్ధంగా ఈ బిల్లు రూపొందిందనటంలో ఏమాత్రం సందేహం లేదు.

ఈ బిల్లు రావడానికి చాలాకాలం ముందునుండే ప్రభుత్వాలు పాఠశాల విద్యలో ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తూ వస్తున్నాయి. పర్యవసానంగా రకరకాల పేర్లతో, ప్రమాణాలతో పాఠశాలలు నడుస్తున్నాయి. ఈ క్రమంలోనే ప్రభుత్వ పాఠశాలలు ప్రభుత్వ నిరాదరణకు గురవుతున్నాయి. ప్రభుత్వ - ప్రైవేట్ రంగంలో విద్య 'విద్యా హక్కు బిల్లు - 2008' తర్వాత కూడ కొనసాగడంతో కొందరికి నాణ్యమైన విద్య, మరికొందరికి నాసిరకం విద్య అందడంతో రకరకాల పాఠశాలల్లో చదువుకొనే విద్యార్థుల మధ్య అంతరాలు మునుపటిలాగే కొనసాగే పరిస్థితిని ఈ బిల్లు ద్వారా కొనసాగిస్తూ వివక్షకు చట్టబద్ధత కల్పించినట్లు కావడం లేదా?

విద్యా హక్కు బిల్లు - 2008ని పరిశీలిస్తే మనం గమనించే లోపాలు 1) పూర్వ ప్రాథమిక విద్యను నిరాకరించింది. ఆధునిక కాలంలో పాఠశాల విద్యకు సన్నద్ధం చేసే పూర్వ ప్రాథమిక విద్యకు చాలా ప్రాధాన్యత పెరిగింది. బాలల మేధో వికాసం వేగంగా వికాసం చెందేది 3-6 సంవత్సరాల వయస్సులోనే అనేది మనో విజ్ఞాన శాస్త్రవేత్తల భావన. 2) సెకండరీ విద్య (9-12 తరగతులు) కు సంబంధించిన ప్రస్తావన లేదు, ఆధునిక కాలంలో ఉపాధి సంపాదించాలంటే కనీసం ఇంటర్ విద్యార్హత ఉండాలి. 3) హక్కుగా ప్రకటించిన ఎలిమెంటరీ విద్య (1-8 తరగతులు)కు సంబంధించి నాణ్యత గల విద్యకు హామీ లేదు, 4) బడిలో చేరనివారు ఒకవైపు, చేరినా మధ్యలో బడి మాని వేసేవారు మరోవైపు ఉన్నారు. ఇందుకు పేదరికం, పాఠశాల ఆకర్షణీయంగా లేకపోవడం, పాఠ్యాంశాలు జీవితాలని ప్రతిబింబించక పోవడం కారణాలుగా అనేక నివేదికలు పేర్కొన్నాయి. అయినా ఈ బిల్లులో విద్యకు పేదరికం అడ్డురాకుండా మద్దతు ఇచ్చే ఎటువంటి చర్యలను ప్రతిపాదించలేదు, 5) కనీసం పాఠశాల విద్యలోనైనా ప్రైవేటీకరణను నిరోధించే చర్యలు లేవు, 6) ప్రైవేట్ పాఠశాలలో ఫీజులపై ఎటువంటి పరిమితులు, నియంత్రణ చర్యలు లేవు, స్పెషల్ మోడల్ స్కూళ్ళకు ఇచ్చిన నిర్వచనం సమస్యాత్మకంగా ఉంది. అది పేద విద్యార్థుల పట్ల మరింత వివక్ష చూపేందుకు దారితీయనుంది. పిల్లలందరికీ ఉచితంగా, నాణ్యంగా, సమానంగా విద్యనందించే లక్ష్యాన్ని దెబ్బతీస్తుంది.

రాజ్యాంగంలో ఉచిత నిర్బంధ విద్యకు చేసిన వాగ్దానం నీరుగారుతుంది. 7) బోధనా పద్ధతులపై ఎటువంటి నిబంధనలు విధించలేదు, 8) ఒకేరకమైన పాఠశాల, ఒకేరకమైన విద్య అన్న మాటలకు బిల్లులో చోటులేదు, 9) ఈ బిల్లు కొఠారీ సూచించిన ఉమ్మడి పాఠశాల ప్రస్తావన తేకపోవడమే కాక కనీసం ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపరిచే చర్యలుగాని, ప్రైవేట్ పాఠశాలలను నియంత్రించే చర్యలుగాని ఏమీ పేర్కొనలేదు. 10) ఈ బిల్లులో ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంతో పాఠశాలలు నెలకొల్పడం, మరియు అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం పేద విద్యార్థులకు సీట్లు కేటాయింపు, అందుకు అట్టి విద్యార్థుల ఫీజును ప్రభుత్వమే యాజమాన్యాలకు చెల్లించుతుందని పేర్కొనడం జరిగింది. అంటే ప్రజా ధనాన్ని ప్రభుత్వ పాఠశాలల బాగు కొరకు కాకుండా ప్రైవేట్ యాజమాన్యాల ప్రయోజనాలకు ధారాదత్తం చేయనుంది. అంతేగాకుండా ప్రభుత్వం చెల్లించేది కేవలం బోధనా ఫీజు మాత్రమే. ప్రైవేట్ పాఠశాలలు వసూలు చేసే ఫీజుల్లో ఎక్కువ భాగం బోధనేతర ఫీజులే. ఇలాంటి పరిస్థితుల్లో పేద విద్యార్థులు వాటినెలా చెల్లిస్తారు ? అంతేగాకుండా అరకొర వసతులతో నాసిరకంగా నడిచే ప్రైవేట్ పాఠశాలలకు చేయూతనిచ్చినట్లు కాదా? 11) వీధి బాలలను, అనాథ పిల్లలను బడుల్లో చేర్పించిన తరువాత వారిని ఎలా చూడాలనేది బిల్లులో స్పష్టం చేయలేదు, 12) వికలాంగులైన పిల్లలకు విద్య అందించే విషయంలో కూడా బిల్లులో స్పష్టత లేదు.

మాతృభాషలో విద్యా బోధన, ఉపాధ్యాయ - విద్యార్థి నిష్పత్తి, బాలల వ్యక్తిత్వ వికాసం లాంటి ప్రకటనలన్నీ ఉత్తమాటలే. ప్రజల ఆకాంక్షలు, అవసరాలు తీర్చేవిధంగా, దేశాన్ని స్వావలంబన దిశలో పయనించేందుకు అనువైన విద్యా లక్ష్యాలు - వాటిని సాధించే విధానాలు కొరవడినాయి. మాతృభాషలో చదివే విద్యార్థి అనేక అంశాలను సరిగ్గా అర్థం చేసుకోగలడు, విశ్లేషించగలడు, విద్యార్థి స్వయంగా ఆలోచించే క్రమంలోనే సృజనాత్మక శక్తులు వికసిస్తాయి. ఈ వాస్తవాల్ని మన నాయకులు, విద్యాధికారులు, విధాన నిర్ణేతలు గ్రహించడం లేదు. ఉపాధి ఆశతో కొంత సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించి దేశీయ, విదేశీ బడా పెట్టుబడిదారులకు మానవ వనరులు అందించేదిగా ప్రాథమిక విద్య నుండి ఉన్నత విద్య వరకు విద్యా రంగాన్ని అతుకుల బొంతగా చేసిన క్రమాన్ని కప్పి పుచ్చుకోవడానికే 'విద్యా హక్కు బిల్లు - 2008' తెచ్చినట్లుగా భావించవలసి వస్తుంది. ఎందుకంటే ఇప్పుడున్న విద్యారంగం మరింత భ్రష్టు పట్టే అవకాశాలు అధికంగా బిల్లులో చోటు చేసుకున్నాయి. ఈ బిల్లు తర్వాత విద్యాహక్కు ఎలా అమలు చేస్తారన్న జవాబుదారీతనం నిర్దిష్టంగా లేదు. అలాగే నిధులు ఎలా సమకూరుస్తారో తెలుపలేదు. జాతీయ బాలలహక్కుల పరిరక్షణ సమితి (ఎన్.సి.పి.సి.ఆర్) కి విద్యా హక్కును అమలు చేసే, పర్యవేక్షించే బాధ్యత అప్పగించారు. ఇప్పటికీ అనేక రాష్ట్రాలలో దీని శాఖలు లేవు. ఇది కేంద్ర మానవ వనరుల శాఖ కింద లేని స్వతంత్ర సంస్థ. కాని దీనికున్న పరిమిత యంత్రాంగం పర్యవేక్షణ జరపగలదా? అన్నది సందేహమే. ప్రభుత్వ పాఠశాలల్లో ఫీజులుండవు, కానీ ఇతర ఖర్చులన్నింటినీ తల్లిదండ్రులే భరించాలి. దీన్ని ఉచిత విద్య అని ఎలా అనగలం? ఉచిత విద్య అంటే కేవలం ట్యూషన్ ఫీజు లేకుండా విద్య అన్నట్లు ప్రభుత్వం భావిస్తుంది. ఉచిత విద్య హక్కును కల్పించడమంటే ఉన్నత ప్రమాణాలతో కూడిన చదువును అందరికీ అందుబాటులోకి తీసుకు రావడమని, సంపన్న - పేద, పట్టణ - గ్రామీణ, స్త్రీ-పురుష తేడాలు లేకుండా అందరినీ కలుపుకొని పోగల సమ విద్యను ఇవ్వడమన్నది విద్యా వేత్తల, ప్రజాస్వామిక వాదుల, ప్రగతి కాముకుల ఆకాంక్ష. డా. కొఠారీ 1966లో సూచించిన కామన్ స్కూల్ విధానం ద్వారా మాత్రమే విద్యలో సమన్యాయం సాధ్యమవుతుంది. కెనడా, అమెరికా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, ఇజ్రాయిల్, రష్యా, చైనా లాంటి దేశాలలో సామాజిక విద్యాలయాలు ఉన్నాయి. ధనిక - పేద అన్న భేదాలతో నిమిత్తం లేకుండా అందరికీ ఒకేరకమైన చదువును అందజేస్తున్నారు. ఈ తరహా విధానాలు అమలు చేయడానికి మన దేశంలో ఉన్న అడ్డంకులేమిటి? అందరూ సమాన అవకాశాలతో చదువుకునే హక్కును నిరాకరించడం సామాజిక వివక్ష కాదా? అనేక సామాజిక ఆర్థిక కారణాల వలన ఏడవ తరగతి కూడా పూర్తి చేయకుండా బడులు మానివేస్తున్న వారిలో 82 శాతం షెడ్యూలు తెగలవారు, 73 శాతం షెడ్యూలు జాతులవారు ఉన్నారు. ఇప్పటికీ బడి బాట పట్టని వారు 6 కోట్లు ఉన్నారు. బడి ఈడు (6-14) వయో పరిమితివారిలో వీరి శాతం 30 వరకు ఉంటుంది. బడుగు బలహీనవర్గాలకు నాణ్యమైన విద్య అవసరం లేదా?

'ట్యూషన్ ఫీజు' లేకుండా చదువును అందించడమే విద్యా హక్కును అమలు చేయడమని కపిల్ సిబాల్ కొత్త భాష్యం చెబుతున్నారు. ప్రభుత్వం పాఠశాలలకు తగినన్ని నిధులు మంజూరి చేయకుండా, తగినంతమంది ఉపాధ్యాయులను నియమించకుండా ఇన్నాళ్లు కాలం వెళ్లదీయడంతో పిల్లలందరూ ప్రైవేట్ పాఠశాలలవైపు మొగ్గేలా చేసింది. ప్రాథమిక స్థాయి నుండే విద్యను వ్యాపారంగా మార్చేయడం, ఉన్నత విద్యను పూర్తిగా వాణిజ్యీకరించడం వంటి చర్యలు విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించుతున్నాయి.

ప్రాథమిక విద్య దశలో పేదపిల్లలు మధ్యలో బడి మానివేయడానికి అసలు కారణం అసమ ఆర్థిక వ్యవస్థ, వివక్షాపూరితమైన సామాజిక పరిస్థితులు. ఈ పరిస్థితులను పూర్తిగా ప్రక్షాళణ చేయడానికి, దోపిడీని నిరోధించడానికి ఏలాంటి చర్యలు తీసుకోకుండా సంపూర్ణ అక్షరాస్యత సాధించడం సాధ్యమవుతుందా? పేదప్రజల విద్యా ఆకాంక్షల పట్ల పాలకులకు చిత్తశుద్ధి లేదనే విషయం 'విద్యా హక్కు బిల్లు-2008' ద్వారా స్పష్టమౌతుంది. సార్వత్రిక విద్య సాఫల్యం కావాలంటే, ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, ఆకర్షణీయమైన పాఠశాల, శిక్షితులైన ఉపాధ్యాయులు, ప్రతి ఆవాసంలో పాఠశాల, సరైన వనరులు సమకూర్చాలి. అలా చేస్తేనే చదువు సవ్యంగా సాగుతుంది,

ప్రభుత్వ అనుచిత విధానాలకు అడ్డుకట్ట వేయకుండా దేశంలోని అన్ని వర్గాలకు, ప్రాంతాల వారికి విద్యా గంధం అందించడం సాధ్యం కాదు. విద్య ప్రజాస్వామికీకరించబడాలి. వర్గభేధాలు లేని రీతిలో అందరికీ సమాన విద్యావకాశాలు కల్పించబడాలి. అలా చేస్తేనే సమాజం పురోగమిస్తుంది. వ్యక్తి వికాసం అభివృద్ధి చెందుతుంది. సృజనాత్మక వ్యవస్థ ఏర్పడుతుంది. విద్యాభిమానులు, ప్రజాస్వామికవాదులు సమాన విద్యావకాశాల కొరకు, అందరికీ విద్యావకాశాల కొరకు తదనుగుణమైన చట్ట సవరణ కోసం పోరాడవలసిన అవసరం నేడు మరింతగా పెరిగింది. వీ

దేశ ప్రజలకు బహుళ ప్రయోజనాన్ని అందించగల గుర్తింపు కార్డు అవసరాన్ని, ప్రాధాన్యతను వివరిస్తున్నారు

కొండోజు ప్రసన్నకుమార్, తాళ్లపల్లి సదయ్య

జాతీయ గుర్తింపు కార్డు పథకం

దేశంలో ప్రజలందరికి బహుళ ప్రయోజనాలు కలిగించే ఒక విధమైన పౌర గుర్తింపు కార్డులు మంజూరు చెయ్యాలని ఆరేళ్లుగా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఎట్టకేలకు ఈ ఆలోచన ఒక రూపు దాల్చబోతోంది. 2011 నాటికల్లా దేశంలో ప్రతి ఒక్కరికి గుర్తింపు కార్డులందించాలని తాజాగా ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. అందుకోసం యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా అనే సంస్థను ఏర్పాటు చేసింది. ఈ పౌర విశేష గుర్తింపు కార్డు ప్రాధికార సంస్థకు ఇన్ఫోసిస్ కో–చైర్మన్ సి.ఎం.డి. నీలేకని ని అధ్యక్షుడిగా భారత ప్రభుత్వం నియమించి ఆయనకు క్యాబినెట్ మంత్రి హోదా కల్పించింది. దేశంలోని పౌరులందరికి గుర్తింపు కార్డులు మంజూరు చేయడం ప్రజలకూ, ప్రభుత్వానికి కూడా బహుశా ప్రయోజనకారిగా ఉంటుందని నిలేకని తాను రాసిన 'ఇమేజినింగ్ ఇండియా ఐడియాస్ ఫర్‌ది న్యూ సెంచరీ' అనే పుస్తకంలో కులంకషంగా చర్చించారు. అందులో ఆయన అభిప్రాయాలకూ, ఐ.టి. రంగంలో అత్యద్భుత విజయాలకు విలువనిచ్చి ప్రభుత్వం ఆయనను ఈ గుర్తింపు కార్డు ప్రాజెక్ట్‌కు అధ్యక్షుడిగా నియమించింది. ఈ ప్రాధికార సంస్థ కేంద్ర ప్రణాళికా సంఘం నేతృత్వంలో నడుస్తుంది. ఇందులో అధికారులు, సిబ్బంది కలిసి 115 మంది ఉంటారు.

బహుళ ప్రయోజనాన్ని అందించగల ఒక గుర్తింపు కార్డును పౌరులకు అందించాలని 2002లో అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న సమయంలో ఎన్.డి.ఎ. ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యంగా అక్రమ చొరబాటుదార్ల సమస్య తీర్చాలన్నది అప్పటి ప్రధాని ఉద్దేశం. తరువాత ఇందులో అనేక మార్పులు చేసి బహుళ ప్రయోజనాలు గల గుర్తింపు కార్డుగా తీర్చిదిద్దారు. ఈ అంశం మీద ఏర్పరిచిన ప్రణబ్ ముఖర్జీ కమిటీ 4 నవంబర్ 2008న ఈ కార్డుల జారీకి ఆమోదం తెలిపింది. ఆ ఏడాది దీన్ని ప్రయోగాత్మకంగా కొన్ని చోట్ల జారీ చేశారు. దేశంలోని 12 రాష్ట్రాల్లోని 13 జిల్లాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో 18 సంవత్సరాలు నిండిన 12 లక్షల మందికి ఈ కార్డులు జారీ చేశారు.

తరువాత దీన్ని దేశంలో పౌరులందరికి అందించేందుకు పౌరసత్వ చట్టం 195కు 14ఎ అనే నిబంధనను కొత్తగా చేర్చారు. తరువాత 2009లో ఈ గుర్తింపు కార్డుల జారీకి ఒక ప్రాధికార సంస్థను ఏర్పాటు చేయడం జరిగింది. దశలవారీగా ఈ సంస్థ దేశంలో అందరికీ కార్డులు జారీ చేస్తుంది. తొలిదశలో గుజరాత్, మహారాష్ట్ర, గోవా, కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోని తీర ప్రాంత ప్రజలకు, దాద్రా–నాగర్ హవేలీ, లక్షద్వీప్, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ – కేంద్ర పాలిత ప్రాంతాల ప్రజలకు వీటిని ఇస్తారు. 2010 ప్రారంభానికి తొలి దశ పూర్తి చెయ్యాలని ఆశిస్తున్నారు. దేశంలో ప్రజలందరికీ ఈ గుర్తింపు కార్డులు అందజేయడానికి పదివేల నుంచి పదిహేను వేల కోట్ల ఖర్చు అవుతుందని ప్రాథమిక అంచనా.

చైనాలో పదహారు ఏళ్లు నిండిన వారందరికీ 18 అంకెల నంబరున్న గుర్తింపు కార్డు (బయోమెట్రిక్) ఇస్తారు. ఇజ్రాయెల్‌లో పౌరుల ప్రత్యేక గుర్తింపు నెంబర్‌ను మిస్పార్ జెహత్‌గా పిలుస్తారు. దేశంలో ఆసుపత్రులకు కొన్ని నెంబర్లు ప్రభుత్వం జారీ చేస్తుంది. ప్రతి బిడ్డకు పుట్టిన వెంటనే ఒక నంబర్‌ను కేటాయిస్తారు. పాకిస్తాన్‌లో జననాల రిజిస్ట్రేషన్ సమయంలో జాతీయ గుర్తింపు కార్డును జారీ చేస్తారు.

శ్రీలంకలో పదహారు ఏళ్లు నిండిన పౌరులంతా గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకుని దాన్ని పొందాలి. బల్గేరియా దేశంలో 10 అంకెల నంబర్‌ను ప్రతి పౌరుడికీ ఇస్తారు. దీని ద్వారా ఆ వ్యక్తి ఆడా, మగా పుట్టిన తేదీ తదితర వివరాలు తెలుస్తాయి. మొత్తం మీద ప్రపంచ వ్యాప్తంగా వంద దేశాలు జాతీయ గుర్తింపు కార్డులు ఏదో ఒక రూపంలో జారీచేస్తుండగా, 56 దేశాల్లో ఇవి కచ్చితంగా అమల్లో ఉన్నాయి.

కార్డ్‌లో దేశంలోని ప్రతి వ్యక్తికీ ప్రత్యేక గుర్తింపు నెంబర్ ఉంటుంది. ఇందులో 16 అంకెలుంటాయి. ఈ సంఖ్య శాశ్వతంగా, జీవిత కాలంపాటు ఉంటుంది. ఇందులో మైక్రోప్రాసెసర్ చిప్ ఉంటుంది. ప్రతి వ్యక్తి ఫొటోతో పాటు బయోమెట్రిక్ విధానంలో వేలిముద్ర, డిజిటల్ సంతకం ఉంటాయి. కార్డుదారుని పుట్టిన తేదీ, ప్రాంతం వంటి వివరాలను ఇందులో పొందుపర్చడం జరుగుతుంది.

అమెరికా సోషల్ సెక్యూరిటీ నెంబర్ తరహాలో పుట్టుకొచ్చిందే ఈ జాతీయ గుర్తింపు కార్డు. చిన్న పిల్లలు మొదలు వృద్ధుల వరకు ప్రతి పౌరునికి 16 అంకెల ఓ గుర్తింపు సంఖ్యను ఇవ్వడం జరుగుతుంది. పౌరులు ప్రభుత్వం నుంచి భిన్న సేవలు పొందడం కోసం ప్రస్తుతం అనేక పత్రాలు సమర్పించాల్సి వస్తోంది. విద్య, వైద్యం, పాస్‌పోర్ట్‌లు, డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఓటరు గుర్తింపు కార్డులు వంటి వాటితో సహా మరే ఇతర సదుపాయాలు పొందాలన్నా ఇకపై ఈ నెంబర్ తప్పనిసరి అవుతుంది. ఈ కార్డులుంటే చాలు ఈ సదుపాయాలన్నింటిని ఇకపై చాలా సులభంగా పొందవచ్చు. తొలివిడతలో ఓటు హక్కు ఉన్న వారికి

అట్టడుగు వర్గాల నుంచి ఉన్నత స్థానాలకు ఎదిగి, వివిధ బాధ్యతలలో ప్రజలకు సేవలందించిన పి. సుబ్రమణ్యం ఆలోచనల గురించి, జీవితం గురించి వివరిస్తున్నారు **సి.ఎచ్. శ్రీనివాస్**

సుబ్రహ్మణ్యం మరో హేమెన్‌డార్ఫ్

విసిరి వేయబడిన రాయి ఇంటికి తలరాయి (పునాదిరాయి) అయ్యిందన్నట్లుగా దశాబ్దాల తరబడి ఊరికీ, సమాజానికీ దూరంగా విసిరివేయబడ్డ సామాజిక వర్గం నుండి, నిరుపేద దళిత కుటుంబం నుండి, మట్టి మనుషుల మధ్య నుండి మొగ్గతొడిగిన కలువపువ్వే నేడు ఆంధ్రదేశానికి తలమానికగా నిలిచి, పునాది రాయిగా మారిన మనిషి డా.పి. సుబ్రహ్మణ్యం. నెల్లూరు జిల్లా మారుమూల గ్రామమైన గుడిపల్లి పాడు వ్యవసాయ కూలీ కుటుంబంలో పొంతగుంట ఓబయ్య, వెంకట సుబ్బమ్మల నాల్గవ సంతానంగా 7 జూన్ 1953న జన్మించారు.

డా. పి. సుబ్రహ్మణ్యం జీవితం చాలామంది లాగా వడ్డించిన విస్తరి కాదు. చిన్నతనం నుండీ అనేక ఆర్థిక, సామాజిక ఆటుపోట్లను ఎదుర్కొన్న వ్యక్తి. చిన్న వయస్సులోనే తండ్రిని కోల్పోయారు. కటిక పేదరికాన్ని అనుభవించారు. తల్లి, అక్కల సహకారంతో జీవితంలోని ప్రతి అడ్డంకినీ తన అభివృద్ధికి ఒక మెట్టుగా మల్చుకొని పేదరికాన్ని జయించారు. నెల్లూరులో ఇంటర్మీడియట్ చదువుతూ ప్రతి శనివారం సాయంత్రం గుడిపల్లిపాడు వెళ్లి ఆదివారం వరినాట్లకు, ట్రాక్టర్ పనికి వెళ్లి వారం గడిపేవారు. అలా ఆరు రోజులు విద్యార్థిగా, ఆదివారం కూలీగా మారే వారు. తన చదువును కొనసాగిస్తూ ప్రగతిశీల భావాలకు నిలయమైన కావలి జవహర్ భారతి కళాశాలలో పిజి చేసి శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ పరిధిలో ఎకనామిక్స్‌లో బంగారు పతకం సాధించి మట్టిలో మాణిక్యం అనిపించుకున్న వ్యక్తి సుబ్రహ్మణ్యం.

ఊరికి దూరంగా విసిరివేయబడ్డ పీడిత జన బిడ్డలు కారే ఐ.ఎ.ఎస్.కి అర్హులు అని 1983 సివిల్స్‌లో జాతీయస్థాయిలో టాప్ 10లో నిలిచి ఆంధ్ర కేడర్‌గా ఎంపికైన సుబ్రహ్మణ్యం నేటి తరానికి స్ఫూర్తి ప్రదాత. ఐ.ఎ.ఎస్.గా తన ఉద్యోగ ధర్మాన్ని పాటిస్తూ, మరోవైపు ఈ దేశ ఆర్థిక వ్యవస్థ పట్టుగొమ్మైన గ్రామీణ ఆర్థిక వ్యవస్థమూలాలను శోధించాలనే లక్ష్యంతో ఉద్యోగానికి తాత్కాలిక విరామం ప్రకటించి గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై లోతైన పరిశోధన చేసి ఉత్తమ స్కాలర్‌గా పేరుపొంది 1992లో డాక్టరేట్ పొందారు.

ఒక అర్థశాస్త్ర పరిశోధకుడిగా, మార్క్స్‌ను, షూమేకర్‌ను అర్థం చేసుకున్న మేధావిగా ఈ వ్యవస్థ అభివృద్ధికి భూస్వామ్య పెత్తందారీ రాజకీయ వ్యవస్థే అభివృద్ధి నిరోధకమైనదని నిక్కచ్చిగా ప్రకటించిన వ్యక్తి ఆయన. రిటైర్డ్ ఐ.ఎ.ఎస్. అధికారి ఎస్.ఆర్. శంకరన్ ప్రభావం సుబ్రహ్మణ్యంపై ఎంతో ఉంది. తన భావాలను శంకరన్‌తో ఉత్తరాల ద్వారా పంచుకునేవారు. ఇటీవల ఒక పత్రికకు శంకరన్ సుబ్రహ్మణ్యంను గురించి రాస్తూ తనకు రాసిన ఉత్తరంలోని వాక్యాలు ఉటంకిస్తూ ఈ వ్యవస్థ పట్ల సుబ్రహ్మణ్యం అభిప్రాయాన్ని ప్రస్తావించారు. అది 'ఒక సమాజంలో కలిగే విప్లవాత్మకమైన మార్పులు ఆ ప్రభుత్వం వర్గ స్వభావంపై ఆధారపడి ఉంటాయి. దాని వర్గ స్వభావం ఆ సమాజంలోని ఉత్పాదకత, ఉత్పత్తికి దోహదం చేసే శక్తుల, వాటి సాంఘిక సంబంధ బాంధవ్యాలపై ఆధారపడి ఉంటాయి. ప్రస్తుతం వ్యవసాయ ఆధారిత

ఈ కార్డుల్ని అందచేస్తారు. తరువాత దశలవారీగా అందరికి అందేలా చర్యలు తీసుకుంటారు. ప్రభుత్వ పథకాలను లక్షిత వర్గాలు సక్రమంగా అందుకునేందుకు వీలవుతుంది. మోసాలు, అనర్హులు పొందడాన్ని సులువుగా నివారించేందుకు వీలుపడుతుంది. ప్రభుత్వం మంజూరు చేసే పథకాలు ప్రస్తుతం లక్షిత వర్గాలకు సక్రమంగా చేరడం లేదు. గుర్తింపు కార్డు ఉంటే లబ్ధిదారుడు ఎక్కడున్నా ఆ ప్రయోజనాలను అందించేందుకు వీలవుతుంది. ప్రతి పౌరుడు తన ఉనికి కాపాడు కునేందుకు, దేశ పౌరునిగా తన హక్కును పొందేందుకు ఉపయోగ పడుతుంది.

దేశంలో ప్రతి పౌరుడికి ఒకే రకమైన గుర్తింపు కార్డులను జారీ చేయడం చాలా సంక్లిష్టమైన పని. అందుకు అనేక సవాళ్లు ఎదుర్కోవలసి ఉంటుంది. ముఖ్యంగా నిర్ణీత గడువులోగా అంటే 2011లోగా దీన్ని పూర్తి చెయ్యడం చాలా కష్టసాధ్యం. 10 నుంచి 15 వేల కోట్ల రూపాయలు ప్రాథమిక అంచనా అయినా, ఇది తరువాత బాగా పెరగవచ్చు. జాతీయ జనాభా లెక్కలు కచ్చితంగా ఉండాలి. పౌరులందరి వ్యక్తిగత వివరాల్ని తప్పులు లేకుండా సేకరించగలగాలి. భారీ ఎత్తున మౌలిక, సాంకేతిక సదుపాయాలు అవసరం. సాంకేతికంగా పలు సవాళ్లు ఎదురవ్వచ్చు. వీటి తయారీ కోసం పనిచేసే సంస్థలు, కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు, వాటి సంబంధిత విభాగాలు సమన్వయంతో కలిసి పనిచేయాలి. వంద కోట్లకు పైబడి జనాభా కలిగిన భారతదేశంలో ప్రజల గుర్తింపు అరకొర విధానాలు, సాధనాలు ఉన్నాయి. కాని సమస్యలు లేని ఒక సమగ్ర ప్రజా గుర్తింపు కార్డు పథకం అవసరాన్ని గుర్తించిన ప్రభుత్వం దానికి నాంది పలికింది. అదే జాతీయ ప్రత్యేక గుర్తింపు కార్డు పథకం. వీ

వ్యవస్థ కలిగిన భారత దేశంలో భూస్వాములు బలమైన రాజకీయ శక్తిగా ఎదిగి ఉన్నారు. ఈ నేపథ్యంలో భారతదేశ రాజ్యాంగ శక్తి భూసంస్కరణలను అమలు చేసినట్లయితే ఇతర రాజకీయ శక్తులను నిలువరించగలం' అని విస్పష్టమైన తన అభిప్రాయాన్ని వెల్లడించడం ఆయన చైతన్యానికి, ప్రగతిశీల భావాలకు నిదర్శనం.

నిజాయితీ కలిగిన, మచ్చలేని అధికారిగా రాష్ట్రంలోనూ, దేశంలోనూ మంచిపేరు ప్రతిష్టలను గడించడమే కాకుండా, ఉద్యోగ ధర్మాన్ని సామాజిక కోణంలో నిర్వర్తించిన వ్యక్తి ఆయన. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరులో ఐ.టి.డి.ఎ. ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా అటవీ ప్రాంతంలోని గోండులు, కోలాంలు మొదలైన ఆదివాసీ తెగల ప్రజలను వారి కట్టు బానిసత్వం నుండి, మధ్యవర్తుల దోపిడీ నుండి కాపాడడానికీ, వారిలో సాంస్కృతికమైన మార్పు తీసుకుని రావడానికి ఆయన అనుసరించిన మార్గం ఎంతో గొప్పది. మైదానం నుండి ఎవరు వెళ్లినా తమ శత్రువుగా భావించి, దరిదాపులకు కూడా రానివ్వని పరిస్థితులలో వారిలో నమ్మకాన్ని, విశ్వాసాన్ని కల్పించడానికి, వారి సమస్యలను లోతుగా అర్థం చేసుకోవడానికి లిపిలేని గోండు భాషను నేర్చుకున్నారు. వేషధారణ వారికి తగినట్లుగా మార్చుకున్నారు. అధికారిగా కాక ఒక సామాన్యమైన వ్యక్తిగా వారితో సహజీవనం చేసారు. ఆయన మరణానంతరం ఉట్నూరు ప్రాంత గిరిజనులు ప్రత్యేకంగా సంతాప సభ జరపడంలో ఒక అధికారిగా కాకుండా ప్రజల జీవితాల్లో కలిసిపోయి ఎంత గుర్తింపు సాధించారో అర్థమవుతుంది. మధ్యవర్తుల దోపిడీ నుండి కాపాడి వారిని రుణ విముక్తులను చేయాలంటే పంటరాని వేసవి కాలంలో ప్రభుత్వమే వారికి తగిన తిండి గింజలు సరఫరా చేయాలని సూచించి ఆచరణలో పెట్టారు.

మహబూబ్‌నగర్, విజయనగరం జాయింట్ కలెక్టర్‌గా ఉండి ఆ ప్రాంత లంబాడీల అభివృద్ధికి ప్రత్యేకమైన కృషి చేసారు. ఖమ్మం జిల్లా కలెక్టరుగా ఆ ప్రాంతంలోని ప్రత్యేక సమస్య అయిన జోగినీ వ్యవస్థ (కొన్ని ప్రాంతాలలో మాతంగులు) నిర్మూలనకు ప్రత్యేక శ్రద్ధ వహించి అంతవరకూ ఏ అధికారి గాని, ఏ రాజకీయ నాయకుడు గాని సందర్శించని గిరిజన గూడేలను ఆయన సందర్శించారు. దళారీ వ్యవస్థ రద్దుకు, అటవీ జాతుల హక్కుల పరిరక్షణకు కృషి చేశారు. వారికి రాత్రి పాఠశాలలు ఏర్పాటు చేసి తనే స్వయంగా బోధించారు. జీవితంలో కలెక్టరు బంగళా మెట్లెక్కని వారిని తన చాంబరులో దర్జాగా కూర్చునే విధంగా మార్పు తీసుకొచ్చి మరో హేమెన్‌డార్ఫ్‌గా గిరిజనుల గుండెల్లో గూడుకట్టిన వ్యక్తి సుబ్రహ్మణ్యం.

స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్‌గా, ఇంటర్‌బోర్డ్ డైరెక్టర్, కమిషనర్‌గా పనిచేస్తూ కార్పొరేట్ విద్యాసంస్థల ఆట కట్టించాడు. ప్రశ్నా పత్రాల లీకేజిని అరికట్టడానికి మూడుసెట్ల విధానాన్ని తెచ్చి పరీక్ష రోజు ఉదయాన్నే డ్రా తీసి ఆ రోజు రాయవలసిన ప్రశ్నాపత్రాన్ని ప్రకటించే పద్ధతిని ప్రవేశపెట్టి పరీక్షల నిర్వహణలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి పేద విద్యార్థుల జీవితాలను కాపాడిన వ్యక్తి ఆయన. ఢిల్లీలో యు.ఎన్.ఒ. ఏర్పాటు చేసిన ఒక అంతర్జాతీయ సమ్మేళనంలో పాల్గొని గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ఆయన సమర్పించిన పత్రం అందరినీ ఆకర్షించింది. ఆ తరువాత యు.ఎన్.ఒ. ప్రతినిధిగా బంగ్లాదేశ్, నేపాల్, మలేషియా, శ్రీలంక లాంటి తృతీయ ప్రపంచ దేశాలలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థను అధ్యయనం చేసి అనేక అంతర్జాతీయ సెమినార్లలో విలువైన పత్రాలను సమర్పించారు. ఈ అధ్యయనమే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శిగా అనేక జన సంక్షేమ పథకాల రూపకల్పనకు ఉపయోగపడింది. మిగులు భూముల పంపిణీ, ఆసైన్డ్ భూములను లబ్ధిదారులకు అప్పగించడం, మహిళలకు పావలా వడ్డీ పథకం, రెండోసారి ముఖ్యమంత్రి అయిన తరువాత చేపట్టిన 'గిరిజనులకు భూమి పంపిణీ' లాంటి పథకాల రూపశిల్పి ఆయన. సచివాలయంలోని ఆయన పేషీ సామాన్యుల సమస్యలు విన్నవించుకొనే రచ్చబండ లాంటిది. అర్జీలు కొంతమందికి కేవలం కాగితాలే. కాని అవి మనసున్న సుబ్రహ్మణ్యం చూపులో కాగితాలు కావు. అందులో ఎన్నో జీవితాలు ఉన్నాయన్న విషయమెరిగిన వ్యక్తి ఆయన.

అనేక పదవులలో ఆయన ఎంత ఉన్నతస్థానంలో ఉన్నా తన గత జీవితాన్ని గురించి మాట్లాడడానికి జంకేవాడు కాదు. 'నా ఎదుగుదలకు నా పేదరికమే ఒక ముఖ్యకారణం. ఆనాటి ఆర్థిక పరిస్థితిని సామాజిక ప్రతికూల పరిస్థితులను తట్టుకోలేక, కూలీలుగా మిగిలిపోయిన స్నేహితులు మా చిన్ననాటి దుర్భర జీవితానికి చేదు గుర్తులుగా మిగిలిపోయారు' అని ఆయన గుర్తు చేసుకుంటూ ఉండేవారు. ప్రధానంగా సంపద సృష్టిలో మాత్రమే భాగస్వామ్యం తప్ప వినియోగించు కోవడంలో వేరుపడ్డ విస్తరిలాంటి సామాజిక వర్గాలున్నాయనీ, ఈ వ్యత్యాసాన్ని ఇంకా పెంచి పోషిస్తున్నారనే భావన ఆయనది.

ఈ అసమాన సమాజంలో ఉన్న వ్యత్యాసాలను తొలగించాలంటే ఏదో ఒక కృషి చేయాలనే తపన ఆయనది. వృత్తి ధర్మాన్ని సామాజిక సేవతో సమన్వయం చేసుకున్నప్పుడే మన బాధ్యత నేరవేర్చినట్టు అవుతుందని భావించేవారు. ఆర్థికంగా పేదవాళ్లమైనా, సమాజ సేవలో తోటివారికి సహాయ పడడంలో పేదవాళ్లం కాకూడదని భావించే వారు. 'మనం మన కోసమే కాదు జనం కోసం కూడా' అనే దిశగా తన స్నేహితులతో కలిసి బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ (బి.ఎఫ్.ఎ.) ని స్థాపించి ప్రధానంగా నెల్లూరు జిల్లా అంతటా, గ్రామీణ ప్రాంతాలలో విద్య, వైద్య రంగాలలో ప్రత్యేక కృషి చేసి పేదల మన్ననలను పొందారు. నేడు మనకందుతున్న గౌరవాన్ని, వైభవాన్ని మనకు కట్టబెట్టడంలో శ్రమించిన ప్రతి సామాజిక సందర్భాన్ని పరిపుష్టం చేయడం మన బాధ్యత అంటూ మిత్ర బృందానికి కర్తవ్యబోధ చేసిన వ్యక్తి డా. పి. సుబ్రహ్మణ్యం.

అతి తక్కువ కాలంలోనే మంచి ఆఫీసరుగా, మానవతా వాదిగా గుర్తింపు పొంది, స్నేహం కోసం ఎన్ని మెట్లైనా దిగి రాగలిగిన సుబ్రహ్మణ్యం అందనంత ఎత్తుకు అకాలంగా వెళ్లిపోవడమే విషాదం. సుబ్రహ్మణ్యం మరణించి తన జ్ఞాపకాలను వదిలి మనందరి హృదయాలలో సజీవంగానే ఉన్న అమరజీవి. ప్రజాసేవకు, త్యాగానికి మన ముందొక కర్తవ్య ప్రమాణాన్ని విడిచి వెళ్లిన డా. సుబ్రహ్మణ్యం ఎల్లకాలాలకు ప్రేరణగా నిలుస్తారు. వీ

సిద్ధాంతం, ఆచరణ ఒక దానిని మరొకటి ప్రభావితం చేసుకుంటాయనీ, క్షేత్రపరిశోధనతోనే సైద్ధాంతిక అవగాహన రాటుదేలుతుందనీ చెబుతూ తన క్షేత్రపరిశోధనా అనుభవాలను వివరిస్తున్నారు **పి.సి. జోషి**

క్షేత్రపరిశోధన అనుభవం - పునస్సమీక్ష

(గత సంచిక తరువాయి..)

గ్రామీణ సమాజాలకు కచ్చితమైన నమ్మకాల వ్యవస్థ ఒకటి ఉన్నదనీ, ఆ వ్యవస్థను చెదరగొట్టడానికి వారికి ఆసక్తి లేదనీ, చెదరగొట్టడమంటే వారికి వ్యతిరేకత అనీ ఉన్న అభిప్రాయం పూర్తిగా తప్పు. ఉత్తరప్రదేశ్‌లోని విభిన్న ప్రాంతాలలో గ్రామస్థులు తీవ్రమైన మానసిక ఘర్షణలో ఉండడం నాకు గుర్తుంది. ఇళ్లలో, పొలాలలో, నూర్పిళ్ల దగ్గర, బావుల దగ్గర, రచ్చబండల దగ్గర, వ్యాపార కేంద్రాల దగ్గర, న్యాయస్థానాలలో, పండుగలలో, శవయాత్రలలో – ఏ సందర్భమైనా అవనివ్వండి, స్త్రీలు, పురుషులు, పెద్దలు, యువకులు కలుసుకున్నపుడల్లా వాడివేడి సంభాషణలు జరుగుతుండడం నేను చూశాను. వాళ్లు ఇటు ఆచరణ సమస్యలను, అటు తాత్విక సమస్యలను అన్ని ముఖ్యమైన సమస్యలను చర్చించారు. తమ దృక్పథాన్ని పునర్నిర్మించుకునే ఒక నిరంతర ప్రక్రియ, సొంత అనుభవాన్నీ, సామూహిక అనుభవాన్నీ ఎప్పటికప్పుడు మళ్లీ మళ్లీ మదింపు వేసే నిరంతర ప్రక్రియ వారి మధ్య జరుగుతూ ఉంది. వాళ్లు కొత్త భావాలను, కొత్త విషయాలను, ఎందుకు అంగీకరిస్తారో, ఎందుకు తిరస్కరిస్తారో దానికి ప్రత్యేకమైన తర్కం ఉంది.

గ్రామీణ మార్పుల గురించి బయటి నుంచి వారికి అందే అవగాహనలలోని కొన్ని అంశాలను గ్రామీణులు ఎందుకు స్వాగతించరో నాకు ఉత్తరప్రదేశ్‌లోని వేరు వేరు ప్రాంతాలలో, గ్రామీణ ప్రజల మధ్య క్షేత్రపరిశోధన ద్వారా అర్థమయింది. అటువంటి కార్యక్రమాలు అనేక కారణాల వల్ల విఫలమవుతుంటాయని నాకు అర్థం కావడం మొదలయింది. స్వార్థ ప్రయోజన శక్తుల కుట్రలు, గ్రామీణ ప్రజల అజ్ఞానం, అమాయకత్వం, అత్యధిక సంఖ్యాక గ్రామీణుల ప్రయోజనాలను కొత్త కార్యక్రమాలు దెబ్బతీస్తాయేమోననే అనుమానం వంటి అనేక కారణాల వల్ల ఈ వైఫల్యం జరుగుతుంది. ఆ కార్యక్రమాలు అరకొరగా సాగినప్పుడూ, చిత్తశుద్ధి లేకుండా సాగినప్పుడూ గ్రామీణ ప్రజలకు లాభం కన్న నష్టమే ఎక్కువ జరిగింది. భారతీయ గ్రామాలలో, ఆమాటకు వస్తే ఆసియా మొత్తంలోనే ఉన్న ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో మొత్తం గ్రామ భద్రతను పెంపొందించే సమగ్ర చర్యలు చేపట్టడం ఉచితం కాని, ఇప్పటివరకూ గ్రామస్తులు అనుభవిస్తున్న భద్రతను కూడా దెబ్బతీసే చిన్న చిన్న మార్పులు ప్రవేశపెట్టడం హానికరం.

నా క్షేత్రపరిశోధనా అనుభవాన్ని ఇప్పుడు పునఃపరిశీలిస్తే గ్రామీణ ప్రజలు సహజంగానే అభివృద్ధి నిరోధకులనే భావన పూర్తిగా తప్పుకాక పోయినా, ఎంత అతిశయోక్తో నాకు అర్థమవుతోంది. ఈ భావనను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించినప్పుడు నాకు భద్రత అనే సూత్రమే మౌలికాంశమని అనిపించింది. ఆ దృష్టితో చూసినప్పుడు మాత్రమే మనకు ఒక విషయం అర్థమవుతుంది. గ్రామీణ సామాజిక చట్రంలో చిన్న మార్పులను గానీ, కొన్నిసార్లు ఆశ్చర్యకరమైన విశాలమైన మార్పులను గానీ అంగీకరించకుండా ఉండే, అభివృద్ధినిరోధకంగా ఉండే రైతులే, మరికొన్ని సందర్భాలలో అతివిశాలమైన, లోతైన సామాజిక, రాజకీయ మార్పులకు ఎలా నాయకత్వం వహిస్తారో అర్థమవుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే భారతీయ రైతాంగానికి రెండు పార్శ్వా లున్నాయని, ఒకటి, మితవాద పార్శ్వమూ, మరొకటి విప్లవ పార్శ్వమూ అని నాకు నా క్షేత్రపరిశోధనే తెలియజెప్పింది.

సాంస్కృతిక మార్పుల చలన సూత్రాల గురించి చాలాకాలం క్రింద సామాజిక శాస్త్రవేత్త మాలినోవిస్కీ చేసిన సూత్రీకరణ రైతాంగ స్వభావపు సారాంశాన్ని తెలియజెపుతుంది: 'మనుషులు ఎప్పుడైనా అతిఘోరమైన పరిస్థితి నుంచి ఘోరమైన పరిస్థితికి మారడానికే ఆసక్తి చూపుతారు. అంతేకాదు, ఆ మార్పు పెద్ద ఘర్షణ లేకుండా సాపేక్షికంగా తక్కువ కాలంలో వచ్చేదైనప్పుడు మాత్రమే ఆసక్తి చూపుతారు' అని ఆయన అన్నాడు. అయితే మార్పు అంటే మరొక అర్థం కూడా ఉండొచ్చు. మనుషులు అతిఘోరమైన స్థితి నుంచి ఘోరమైన స్థితికి మారుతున్నామని అనుకుంటుండగానే వాస్తవంగా అతిఘోరమైన స్థితి నుంచి ఇంకా భయంకరమైన స్థితికి దిగజారుతూ ఉండవచ్చు. అలాగే ఊహించినది జరగనప్పుడు కలిగే నిరాశ అసాధారణమైన వ్యతిరేకతను కూడా కలిగించవచ్చు.

ఈ పై అంశంలో ఉత్తరప్రదేశ్‌లోని పశ్చిమ ప్రాంతంలోని రైతాంగానికి, తూర్పు ప్రాంతంలోని రైతాంగానికి మధ్య తేడా ఉంది. పైపైన చూసినప్పుడు తూర్పు ఉత్తరప్రదేశ్ రైతాంగం కన్న పశ్చిమ ఉత్తరప్రదేశ్ రైతాంగం ఎక్కువ చలనశీలనమైన వాళ్లని అనిపించవచ్చు. ఎందుకంటే తూర్పు ప్రాంత రైతాంగం భూస్వామ్య దోపిడీ నుంచి పశ్చిమ ప్రాంతం రైతాంగం కన్న సాపేక్షికంగా విముక్తమై ఉంది. కాని, నాకనిపించిందేమంటే తూర్పు ఉత్తరప్రదేశ్‌లోని రైతాంగానికి ఒకరకంగా తమ బంధనాలు తప్ప పోయేదేమీ లేదు. కనుక, అప్పటికే ఎదుర్కొంటున్న అభద్రత వల్ల వాళ్లు సంక్షోభ సమయాలలో ఉన్నతమైన విప్లవ పటిమను

ప్రదర్శించారు. మరొకపక్క పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో రైతాంగానికి అప్పటికే ఎంతో కొంత భద్రత ఉంది గనుక అభివృద్ధి నిరోధకులుగా, మితవాదులుగా కనబడ్డారు. రెండు వేరువేరు నేపథ్యాలలో రైతాంగపు ప్రవర్తన విభిన్నంగా ఉండడానికి కారణాలను అన్వేషిస్తున్నప్పుడు ఫ్రెంచ్ రైతాంగ – యజమానులకూ, జపనీస్ కౌలుదార్లకూ మధ్య తేడా గురించిన పరిశీలనలు గుర్తుకొచ్చాయి. జపాన్ రైతుకు, ఫ్రెంచ్‌కు రైతుకు తెలిసినంతగా స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి సిద్ధాంతాలు తెలియవు. కేవలం భూదాహం ఉంది. ఎక్కువ కౌలు రేట్ల వల్ల పొందిన అసంతృప్తి ఉంది. కష్టభరితమైన పన్నుల విధానం ఉంది. అందువల్ల ఎక్కువ విప్లవకరంగా ప్రవర్తించగలిగారు. మరొక పక్క ఆ సిద్ధాంతాలు తెలిసిన రైతులు స్వతంత్ర చిన్న కమతాలు కలిగి ఉండి ఎటువంటి విప్లవ ప్రవర్తనను చూపలేదు.

అలాగే గ్రామీణ ప్రజల ప్రవర్తనలో అటు చలనశీలమైన కార్యాచరణవాదానికీ, ఇటు ఏది జరగవలసి ఉంటే అది జరుగుతుందనే నిష్క్రియావాదానికీ మధ్య విచిత్రమైన సమన్వయం ఉంది. వాళ్లు దాదాపు ప్రతి ఒక్క సందర్భంలోనూ విధిని నమ్మి, ప్రారబ్ధం అనో, భాగ్యమనో, కర్మ అనో సరిపెట్టుకున్నారు. అదే సమయంలో వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించడానికీ వీలయిన, సమర్థమైన ప్రయత్నాలు అన్నీ చేశారు. ఉదాహరణకు, ఒక రైతు కుటుంబంలోని సభ్యులు జబ్బు పడినప్పుడు ఆ రైతు ఒకవైపు పాశ్చాత్య మందులూ వాడతాడు, కులదైవానికి కోపం వచ్చిందేమోనని శాంతపర్చడానికీ ప్రయత్నిస్తాడు. దీన్ని బట్టి తేలేదేమంటే భారతీయ రైతు సాంప్రదాయిక నమ్మకాల మీదా, ఆచార వ్యవహారాల మీదా తన విశ్వాసాన్ని సంపూర్ణంగా వదులుకోకుండానే, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అమోదించడం మొదలుపెట్టాడు.

నుదుటి మీద రాసిందే జరుగుతుందనే వాదన మానవ చొరవను రద్దు చేసేది కాదు. ఏయే అవకాశాలు ఉన్నాయో వెతకకుండా ఊరుకునేది కాదు. తన ముందున్న చేయగల ప్రయత్నాలు చేయకుండా ఉండేది కాదు. కొన్ని సందర్భాలలో మానవ ప్రయత్నానికి ఉండే నిష్ఫలత్వాన్ని, లేదా పరిమితులను గుర్తించడానికి మాత్రమే అది పనికొస్తుంది. అలాగే ఒక నిర్దిష్ట పరిస్థితిలో మనుషులకు అందే అవకాశాలు, అసలే లేకుండా ఉండకపోయినా, అతి తక్కువ అని ఈ వాదన నమ్ముతుంది. ఇటువంటి విధి నిర్ణాయక వాదంలో ఆత్మనింద లేదు, తన మీద తాను జాలిపడడం కూడా లేదు. చుట్టూ ఉన్న పరిస్థితుల పట్ల సరైన అంచనా మాత్రమే ఉంది. గ్రామాలలో క్షేత్రపరిశోధన చేసే క్రమంలో నేను ఈ విధి నిర్ణాయక వాదానికి తక్షణ కారణం ఏమిటా అని పరిశోధించవలసి వచ్చింది. వ్యవసాయ సమాజాలలో ఈ విధి నిర్ణాయక దృక్పథం పై ప్రకృతి ప్రభావం ఏమిటో అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాను. ఆ తరువాత గ్రామస్థాయిని దాటి, ప్రకృతి క్రమాల ప్రభావాన్ని దాటి వలసవాదం, ఇతర మానవ ప్రేరిత మార్పుల వంటి సామాజిక క్రమాల ప్రభావం ఏమిటో అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాను.

వివిధ ప్రాంతాలలో కనబడే విధి నిర్ణాయకవాదం మీద ఆ ప్రాంతపు ప్రకృతి పర్యావరణ వైవిధ్యం ఎట్లా ప్రభావం చూపుతుందో మొట్టమొదట వివరించనివ్వండి. ఉత్తరప్రదేశ్‌లోని కుమావున్‌లోనూ, తూర్పు ప్రాంతాలలోనూ రైతులలో కనబడే దృక్పథాన్ని, పశ్చిమ ప్రాంతాల రైతులలో కనబడే దృక్పథాన్ని పోల్చి చూసినప్పుడు, సాధారణంగా చెప్పాలంటే విధి నిర్ణాయకవాదం విభిన్నంగా ఉంది. తూర్పు ప్రాంతాలలోని వర్షాధార, సారవంతమైన మైదానాలలో ప్రకృతి ఒకప్పుడు అతివృష్టికీ, మరొకప్పుడు అనావృష్టికీ మధ్య ఊగిసలాడేటప్పుడు విధిని నమ్మడం చాలా ఎక్కువగా ఉంది. అలాగే ఉత్తరప్రదేశ్‌లోని కొండ ప్రాంతాలలో ప్రజల మీద ప్రకృతి నిర్దాక్షిణ్యంగా ఉన్నప్పుడు విధిని నమ్మడం ఎక్కువగా ఉంది. ఇక తూర్పు ప్రాంతాలలోనేమో నేల సారవంతమైనది గనుక మానవ కృషికి పెద్ద పాత్రలేదు. కొండ ప్రాంతాలలో మనిషి ఎంత ప్రయత్నించినా ప్రకృతి అవరోధాలు పరిమితులు విధించాయి. అందువల్ల వేరువేరు రూపాల్లో అయినప్పటికీ ఈ ప్రాంతాలలో విధి మీద నమ్మకం చాలా లోతుగా ఉంది.

ఉతరప్రదేశ్ తూర్పు ప్రాంతాలలోనూ, కుమావున్‌లోనూ గ్రామస్తులు కర్మను నమ్మడానికి నేనెక్కువగా గమనించాను. 'ఇది సంపూర్ణంగా అన్నిటినీ వదులుకునే నిర్వాణం లాంటిది కాదు. మానవ ప్రయత్నం కన్న ఎక్కువ సమర్థవంతమైనవని నమ్మే చర్యల మీద ఎక్కువ నమ్మకం ఉంచడం మాత్రమే' అని మార్క్ బ్లాక్ ఈ విధి నిర్ణాయకవాదాన్ని మరొక సందర్భంలో సూత్రీకరించాడు. దాని అర్థమేమంటే గ్రామీణ ప్రజానీకపు మానసిక శక్తులను సాంకేతిక పరిజ్ఞాన రంగంలోనూ, ఉత్పత్తి రంగంలోనూ సృజనాత్మక కృషి వైపు మళ్లించడం జరగలేదన్న మాట. దాని బదులు ఆ శక్తులను మూఢాచారాలలోకి, మంత్రశక్తులలోకి మళ్లించడం జరిగిందన్న మాట. అందుకే కుమావున్‌లోనూ తూర్పు ప్రాంతాలలోనూ జీవితంలోని ప్రతి రంగాన్ని, ప్రతి సందర్భాన్ని మతం, మంత్ర శక్తులు ముంచెత్తాయి. ఆచార వ్యవహారాల మీద ఎక్కువ శ్రద్ధ పెట్టడం అంటే మరొక అర్థం బ్రాహ్మణ పూజారి కులం మామూలు కన్న ఎక్కువ ప్రాధాన్యతను సంతరించుకోవడం. నిజంగానే ఈ ప్రాధాన్యత ఈ ప్రాంతాలలో పశ్చిమ ప్రాంతాల కన్న ఎక్కువగా ఉంది. అన్ని వ్యవసాయ సమాజాలలోనూ లోతైన మతవిశ్వాసాలు ఉంటాయి గాని, కొన్ని ప్రాంతాలలో అవి ఎక్కువగానూ, మరింత లోతుగానూ ఉండవచ్చు.

తూర్పు ప్రాంతాలలోనూ, కుమావున్‌లోనూ కూడా ఉన్న మతం రెండు ప్రధాన ప్రవాహాల సమ్మేళనంగా ఉంది. ఒకటి, ఆదివాసుల, మూలవాసుల జానపద మతం. రెండు, అగ్రవర్ణాల బ్రాహ్మణీయ మతం. ప్రజల మత మనస్తత్వం ఇటు స్థానిక, ప్రాచీన గాథలను, అటు హిందూ మత గాథలను కలగలపుకొని ప్రతిఫలించింది. ప్రకృతి మీద మానవ సంకల్పాన్ని ఆపాదించడం, మానవ ప్రయత్నం ద్వారా ప్రకృతి శక్తుల మీద అదుపు సంపాదించడం అనే చర్యలకు అవకాశాలు పరిమితం అయినప్పుడు అటు స్థానిక పురాణ గాథలయినా, ఇటు హిందూ పురాణ గాథలయినా విపరీతంగా వ్యాపిస్తాయి. అంటే, కాడ్వెల్ చెప్పినట్టుగా, భౌతిక వాస్తవికతను అర్థం చేసుకొని, దాన్ని మార్చే శాస్త్రీయ పద్ధతి ద్వారా ప్రకృతి శక్తుల మీద అదుపు సాధించే అవకాశం లేని మనిషి, భౌతిక వాస్తవికతకు తగినట్టుగా తన మానసిక వైఖరిని మార్చుకొనే ప్రయత్నం చేస్తాడు. అంటే, ఒక వాస్తవం మీద తన భ్రమను ఆపాదిస్తాడు. తద్వారా తాను భద్రంగా ఉన్నాననీ, ఆత్మసంతృప్తితో ఉన్నాననీ భావిస్తాడు. ఈ ప్రాంతాలలో నేను చూసిన, విన్న లెక్కలేనన్ని జానపద గాథలూ, పురాణాలూ, పాటలూ, వీరగాథలూ, మంత్ర తంత్రాలూ, నాట్యాలూ

మనిషిలో అధిభౌతిక శక్తుల పట్ల ఉండే అపారమైన భయాన్ని తగ్గిస్తాయి. అవి మనిషిని మనుగడ కోసం పోరాటానికి సంసిద్ధం చేస్తాయి.

మనుషులు ఎందుకు విధిని నమ్మే ఆలోచనలు చేస్తారు అని ఇప్పుడు వెనక్కి తిరిగి ఆలోచిస్తే నాకు ఒక విషయం అర్థమవుతోంది. ఆ మనుషులను లోపలి నుంచి అర్థం చేసుకునే అవకాశం దొరకకపోయినట్టయితే ఈ విషయంలో నా అవగాహన పాక్షికంగానే ఉండి ఉండేది. నేను ఈ వాస్తవాలన్నిటినీ బయటి నుంచి మాత్రమే అధ్యయనం చేసి ఉన్నట్టయితే మనుషులను వెనుకబాటుతనంలో ఉంచడంలో కర్మ సిద్ధాంతం పాత్రను ఎక్కువ చేసి చూసేవాడిని. దానివల్లనే వాళ్లు తక్కువ స్థాయి మనుగడలో కొనసాగుతున్నారని సూత్రీకరించేవాడిని. కర్మ సిద్ధాంతంతో ప్రభావితులైన ప్రజలు తమ వెనుకబాటుతనానికి, తమ మీద సాగుతున్న దోపిడీకి తామే ఎట్లా కారణమవుతున్నారో నొక్కి చెప్పి ఉండేవాడిని. కాని నాకు ఆ ప్రాంతాల సమాజ జీవనంతో అత్యంత సన్నిహితమైన సంబంధమూ, పరిజ్ఞానమూ వచ్చాయి. నేను ముందే ఏర్పర్చుకున్న సాధారణీకరణలను, అభిప్రాయాలను తీవ్రంగా సందేహించడం మొదలుపెట్టాను. మొత్తం పరిస్థితి ఎంత తీవ్రమైనదో అర్థం చేసుకోవడం మొదలుపెట్టాను. కర్మ సిద్ధాంతం అనేది కేవలం ఒక మానసిక పెడధోరణి కాదనీ, ఒకానొక పరిస్థితికి మనుషుల ప్రతిస్పందనగా అది ఉందనీ నాకర్థమయింది. అందువల్ల మానవ ప్రవర్తనలోని సంక్లిష్టతల గురించి, వైచిత్రుల గురించి నా అవగాహన పెరుగుతూ వచ్చింది. ఏకకాలంలో మనుషులలో సంకుచితత్వమూ – ఇచ్చిపుచ్చుకునే ధోరణీ, జడత్వమూ – చొరవా, ఆధ్యాత్మిక ఆలోచనలూ – ఈలోకపు ఆచరణా ఎలా సహజీవనం చేస్తాయో నాకర్థమయింది. అందువల్ల గ్రామీణ ప్రజానీకంతో నా సంబంధమూ, సంభాషణా వారి గురించి నా అభిప్రాయాలలో లోతైన మార్పుకు దారితీశాయి. నేను కొన్ని ఉదాహరణలు ఇవ్వదలిచాను.

గ్రామం లోపల ప్రజలు ఏ విషయానికీ పెద్దగా ప్రతిఘటన తెలపకుండా ఉన్నట్టూ, ఆచారాలనూ, సంప్రదాయాలనూ ఉల్లంఘించడానికి ఇష్టపడనట్టూ కనిపించింది. కాని అవసరం వచ్చినప్పుడు వారు గ్రామం నుంచి బయటికి ఉద్యోగం కోసమో, యాత్రల కోసమో, అంగడి కోసమో, జాతర కోసమో తరలివెళ్లారు. గ్రామం బయట అతి సాంప్రదాయిక రంగాలలో కూడా వారిలో మార్పు వచ్చే అవకాశం ఉందని కనబడింది. బ్రాహ్మణుల ఆధిపత్యం ఉన్న గ్రామాలలో ఒకవైపు ఈ ప్రపంచంతో నిర్లిప్తంగా ఉండాలని బోధించే పూజారులే, పూజ చేసినందుకు తమకు రావలసిన ప్రతిఫలం గురించి గ్రామ ఆసాములతో వేడి వాడి తగాదా పడడం చూశాను. తక్కువ కులాల వారితో అంటూ ముట్టూ పాటించడంలో అతి శ్రద్ధ చూపిన అగ్రకులాల వాళ్లే, కింది కులాల స్త్రీలతో లైంగిక సంబంధాల విషయంలో అటువంటి పట్టింపు ప్రదర్శించలేదు. అగ్రకులాల ఇళ్లలో పని మనుషులుగా ఉన్న కింది కులాల స్త్రీ పురుషులు వంటగదులలోకి కూడా వెళ్లడం కనబడింది. అంటే, జీవితంలోని ఆచరణాత్మకమైన అవసరాలు మత గ్రంథాలలోని ప్రబోధాల కంటే భిన్నంగా ఉంటాయి.

ముందే ఏర్పర్చుకున్న అభిప్రాయం ప్రకారం అయితే నేను ఒక గ్రామీణ సమాజం అంటే తెగ, కులం, వర్గం, మతం అనే పునాది మీద శకలాలుగా విడిపోయి ఉన్నదనీ, ఒక ఉమ్మడి ప్రమాదానికి వ్యతిరేకంగా ఈ శకలాలన్నీ కలిసి పనిచేసే అవకాశమే లేదనీ భావించి ఉండేవాడిని. కాని, మంటలు చెలరేగినప్పుడో, వరద వచ్చినప్పుడో మొత్తం గ్రామమంతా ఒక్క మనిషిలాగా కలిసి పనిచేయడం నేను చూశాను. గ్రామీణ సంఘీభావం, కొన్ని సందర్భాలలో ఇరుగు పొరుగు గ్రామాల సంఘీభావం కూడా ఎంత అనూహ్యమైన నిలువగా ఉన్నదో అర్థమయింది.

గ్రామాల గురించిన నా పరిజ్ఞానం పెరుగుతూ వచ్చిన కొద్దీ గ్రామీణుల మాటలనూ, చేతలనూ ఆయా నిర్దిష్ట స్థల, కాల పరిస్థితుల నేపథ్యంలో అర్థం చేసుకోవలసి ఉంటుందని స్పష్టమయింది. అందువల్లనే ఆహారం, సాంఘిక కట్టుబాట్లు, స్త్రీ పురుష సంబంధాలు, పని, వృత్తి వంటి విషయాలు, విధి నిషేధాల ప్రకటనలు గ్రామంలో సరిపోయినట్టు కనబడుతాయి కాని పట్టణంలో సరిపోవు. చివరికి గ్రామంలో కూడా కుటుంబంలో అనారోగ్యమో, అటువంటి మరో సంక్షోభమో లేదా గ్రామం మొత్తాన్ని చుట్టబెట్టిన ఉత్పాతమో జరిగినప్పుడు ఆ ఆంక్షలన్నీ సడలిపోతాయి. చివరికి వారి వర్గప్రయోజనాల విషయంలో కూడా మనుషుల దృక్పథాలు ఆయా పరిస్థితుల మీద ఆధారపడి విభిన్నంగా ఉండడం కనబడుతుంది. అందువల్లనే ఉదాహరణకు అల్మోరా జిల్లాలో ఒక పెద్ద భూస్వామి దగ్గర కౌలుదార్లుగా ఉన్న బృందంతో మాట్లాడుతూ, 'ఏ భూస్వామికీ తన కుటుంబ శ్రమతో సాగుచేయగలిగిన దానికన్న ఎక్కువ భూమి ఉండగూడదు' అని నేను అన్నప్పుడు వాళ్లు నా మీద తీవ్రంగా విరుచుకుపడ్డారు. 'ఈ ఊర్లో మేమందరం సన్నకారు మనుషులం. దొరగారు కూడ మా స్థాయికే దిగజారిపోతే, అవసరం వచ్చినప్పుడు మేం ఎవరి దగ్గరకు పోవాలి? బయటి వాళ్ల నుంచి మమ్మల్ని ఎవరు రక్షిస్తారు?' అని వాళ్లు నన్నడిగారు. ఈ జవాబు విని గ్రామస్తులకు దొర అంటే భయం ఉందనీ, వాళ్ల వెనుకబాటుతనం వల్లనే ఈ జవాబు చెప్పారనీ నేను అనుకున్నాను. కాని, గ్రామీణ జీవితం గురించి నా అవగాహన విస్తృతం అయినకొద్దీ వాళ్ల జవాబు వాస్తవికమైనదని నాకు తెలిసివచ్చింది. ఎందుకంటే అప్పటివరకు గ్రామస్తులకు అందుబాటులో ఉన్న మరొక ప్రత్యామ్నాయ సహాయ వనరు ఏదీ లేదు. అదే సమయంలో భూస్వామి ఏది చేస్తే దాన్ని అంగీకరిద్దామని కూడా గ్రామస్తులు అనుకోలేదు. అతని ప్రవర్తన తక్కువ మొరటుగా ఉండడానికి అవసరమైన ఒత్తిడి తెచ్చారు. తద్వారా నా క్షేత్రపరిశోధన రైతుల గురించి నాకు అప్పటికే పుస్తకాల అధ్యయనం ద్వారా ఏర్పడిన దృశ్యంకన్న భిన్నమైన దృశ్యాన్ని అందించింది.

ఈ సందర్భంలో నేను మరొక విషయం కూడా స్పష్టం చేయాలి. గ్రామీణ సమాజాలను అర్థం చేసుకోవడంలో తులనాత్మక పరిశీలనా దృక్పథం చాలా ప్రాముఖ్యత వహిస్తుంది. ఉత్తరప్రదేశ్‌లోని మూడు ప్రధాన ప్రాంతాలలో నా క్షేత్రపరిశోధన ప్రతి ప్రాంతంలోని వర్గ వ్యవస్థలోనూ, సంస్కృతిలోనూ ఉన్న గుణాత్మకమైన కొత్త అంశాలను కనిపెట్టే నైపుణ్యాన్ని నాకందజేసింది. మానవ స్పందనలలోని సమానాంశాలను, భిన్న అంశాలను కూడా గుర్తించగలిగే నేర్పును నాకిచ్చింది. నేను గనుక ఇన్ని ప్రాంతాలలో క్షేత్రపరిశోధన చేసి ఉండనట్టయితే భారతదేశపు విస్తృతి గురించి నా అవగాహన పెరిగి

ఉండేది కాదు. అలాగే భారతదేశపు విస్తృతిని అర్థం చేసుకోవడానికి మన దగ్గర ఉన్న భావనలు సంపూర్ణంగా సరిపోవని కూడా నాకర్థమయ్యేది కాదు. భారతదేశం సంగతి వదిలి పెట్టండి. చివరికి ఉత్తరప్రదేశ్‌ను అర్థం చేసుకోవడానికి కూడా ఒకే ఒక ఆర్థిక వ్యవస్థ, సమాజం, సంస్కృతి అనే నమూనా సరిపోదు. నిర్దిష్ట భౌగోళిక పరిస్థితులు, చారిత్రక ప్రభావాలు, ప్రతి ప్రాంతంలోనూ బాహ్య, అంతర్గత కారణాల పరస్పర సంబంధాలు ఉండగా వాటికి ప్రతిగా ఉత్తరప్రదేశ్‌లోని ప్రతి ప్రాంతంలోనూ విభిన్న ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక క్రమాలు రూపొందాయనే వాస్తవాన్ని నేను క్షేత్రపరిశోధన ద్వారానే గ్రహించాను. మనుషుల ప్రవర్తన గురించి అఖిల భారత స్థాయిలో స్థూలంగా ఒకే రకమైన సాధారణీకరణలను చేయడం ఎంత అనుమానాస్పదమో నాకు క్షేత్రపరిశోధన అనుభవం తెలియజేసింది. ఉత్తర్‌ప్రదేశ్ అనే ఒక్క రాష్ట్రంలోనే ప్రజల స్పందనలు అన్ని చోట్లా ఒకేరకంగా లేవు. ఇదివరకే ప్రస్తావించినట్టు మీరట్ పరిసర జాట్ ఆధిపత్య గ్రామాలలో మానవ శ్రమ గురించి ఎంత సానుకూలమైన అంచనా ఉన్నదో, సరిగ్గా వ్యతిరేకంగా గోరఖ్‌పూర్, అల్మోరా ప్రాంతాలలోని అగ్రవర్ణ ఆధిపత్య గ్రామాలలో విధి ముందర మనుషుల నిస్సహాయత గురించి అటువంటి అంచనానే ఉంది. మీరట్ చుట్టు పక్కల గ్రామాలలో మనుషులు 'మన జీవితాన్ని మనం ఏమైనా చేసుకోగలం' అన్నట్టు కనబడ్డారు. లోకంలో అన్నీ ఉన్నాయి, కాని కదలని వాడికి ఏమీ దొరకవు అనే సామెత వాళ్లు చెప్పారు. మరొకపక్క గోరఖ్‌పూర్, అల్మోరా గ్రామాలలో ఏమి చేసినా సరే, నుదుటి మీద బ్రహ్మ రాసిన రాతను దాటడం కష్టం అని జనం అనుకున్నారు. రాముడేది తలిస్తే అదే జరుగుతుంది అని సామెత చెప్పారు. ఉత్తరప్రదేశ్ తూర్పు భాగంలోనూ, కుమావున్ లోనూ జాట్ రైతులు పనికి ప్రాధాన్యత ఇవ్వడం, ఆర్థిక మనస్తత్వాన్ని కలిగి ఉండడం ఒకపక్కన ఉండగా, అందుకు పూర్తిగా భిన్నంగా బ్రాహ్మణ భూస్వాములలో ఆచారాలూ, తంతులూ ప్రధాన పాత్ర వహించాయి.

తులనాత్మక పరిశీలనతో క్షేత్రపరిశోధన చేయడం విభిన్న ప్రాంతాలలోని ప్రజల దృక్పథాలు విభిన్నంగా ఉంటాయని గుర్తించడానికి మాత్రమే కాదు. ఆ భిన్నాభిప్రాయాల కారణాలేమిటని ఆలోచించడానికి కూడా నన్ను పురికొల్పింది. క్షేత్రపరిశోధన క్రమంలోనే కొన్ని తక్షణ సమాధానాలు కూడా దొరికాయి. మానసిక ధోరణులలో భేదానికి, ఆర్థిక పరిస్థితులలోని భేదానికి సన్నిహిత సంబంధం ఉంది. తూర్పు ప్రాంతంలోనూ, కుమావున్‌లోనూ వనరుల పరిమితులు మనుషులలో నిస్సహాయతను సృష్టించాయి. ఈ ప్రాంతాలలో కర్మ సిద్ధాంతం వేళ్లూనుకోడానికి మంచి అవకాశం ఉంది. ఇక్కడే జనసాంద్రత హెచ్చుగా ఉంది. వ్యవసాయం లోపల గాని, బయటగాని ఇతర అవకాశాలేమి లేవు. వ్యవసాయ శ్రమ కష్టతరమైనది, అతి తక్కువ ఫలితాన్నిచ్చేది. ఆ స్థితిలో ఉత్పత్తి శక్తులు పెద్ద ఎత్తున సమీపంలోని పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లడం మినహా మనుగడకు మరొక దారిలేదు. భూస్వామ్య విధానం, అధిక వడ్డీ, భూతగాదాల మీద ఆధారపడే న్యాయవాదులు వగైరా సాంఘిక, ఆర్థిక పరాన్నభుక్కులు ఈ పరిస్థితులలో పెట్రేగి పోయారు. ఒక విస్తరించే ఆర్థిక వ్యవస్థలో ఉపయోగపడే శక్తులన్నీ నిలువనీరయిన, కుంచించుకుపోయే ఆర్థిక వ్యవస్థలో ప్రత్యక్ష, పరోక్ష దోపిడీకే దారితీస్తాయి అని ఆండ్రెస్కీ అన్న మాట అక్షరాలా నిజం.

ఇందుకు భిన్నంగా మీరట్ ప్రాంతంలో పనికి, మానవ ప్రయత్నానికి చాలా ప్రాముఖ్యత ఉంది. అక్కడ ఉన్న సానుకూలమైన ఆర్థిక పరిస్థితుల వల్ల పనికి, మానవ ప్రయత్నానికి ప్రతిఫలం చాలా ఎక్కువగా ఉంటుంది. సమీపంలోని మోడీ నగర్, మురాద్‌నగర్ పారిశ్రామిక పట్టణ ప్రాంతంలో ఉద్యోగావకాశాలు ఉండడం వల్ల ఇక్కడ జనసాంద్రత కూడా తక్కువ. అందువల్ల భూ కమతాలు గిట్టుబాటు స్థాయిలోనే ఉన్నాయి. కాలువల వ్యవసాయం రావడం, చెరకు వంటి వాణిజ్య పంటల సాగు జరగడం వల్ల వ్యవసాయంలో అధిక ఫలసాయం ఉంది. దానితో రైతులు సొంత వ్యవసాయం మీద భూమి అభివృద్ధి కోసం పెట్టుబడులు పెట్టడం మీద శ్రద్ధ చూపుతున్నారు. పట్టణీకరణ, వ్యాపారీకరణ స్థాయి హెచ్చుగా ఉండడం వల్ల వ్యవసాయోత్పత్తులకు పట్టణాలలో ఎక్కువ గిరాకీ ఉంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని అంది పుచ్చుకునే రైతులకు ఎక్కువ అవకాశాలున్నాయి. ఇంకా చెప్పాలంటే తూర్పు ప్రాంతంలో జరిగినట్టుగా భూయాజమాన్యం అగ్రవర్ణ భూస్వాముల చేతుల్లో కేంద్రీకృతమై లేదు. బలశాలురైన రైతాంగ కులం జాట్‌ల చేతిలో ఉంది. ఈ అన్ని కారణాలు కలగలిసి ఈ ప్రాంతంలో ప్రజల మనోభావాలను కర్మసిద్ధాంతం నుంచి బయటికి లాగాయి. పరాన్నభుక్కు జీవన విధానం నుంచి బయటికి లాగాయి. మొత్తంగా చెప్పాలంటే ఉత్తరప్రదేశ్‌లోని తూర్పు ప్రాంతమూ, పశ్చిమ ప్రాంతమూ ఆర్థిక పరిణామంలో రెండు భిన్న ప్రక్రియలకు నిదర్శనంగా నిలుస్తాయి.

క్షేత్రపరిశోధన క్రమంలో నేను పొందిన అనుభవాల వివరణలు ఉత్తరప్రదేశ్‌లోని విభిన్న ప్రాంతాలలో ఆర్థిక, సాంస్కృతిక పరిణామం గురించి ఆసక్తికరమైన ప్రశ్నలు లేవనెత్తాయి. ఈ రెండు ప్రాంతాలలో ఆర్థిక పరిణామం భిన్న మార్గాలను ఎందుకు అనుసరించింది? ఒకటేమో పశ్చిమ ప్రాంతంలో లాగా ఎక్కువ చలనశీలతకూ, అభివృద్ధికీ, సౌభాగ్యానికీ దారితీయగా, మరొకటి తూర్పులోనూ, కుమావున్‌లోనూ లాగా స్తబ్దతకూ, జనాభా వలసపోవడానికీ, దారిద్ర్యానికీ ఎందుకు దారితీశాయి? రెండు ప్రాంతాలలోనూ డబ్బు, మార్కెట్ ఆర్థిక వ్యవస్థ ప్రవేశం అనే వ్యాపారీకరణ పరస్పర వ్యతిరేక ఫలితాలకు దారితీసింది.

మీరట్ ప్రాంతంలో వ్యాపారీకరణ వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి ప్రోత్సాహం దొరికితే, తూర్పు ప్రాంతంలో అదే వ్యాపారీకరణ కొత్త ఆర్థిక అవకాశాలు తలెత్తకుండానే సాంప్రదాయిక ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేయడం జరిగిందని క్షేత్రపరిశోధన రుజువు చేసింది. అంటే, తూర్పు ప్రాంతం సుదీర్ఘమైన వలసవాద పాలనా కాలంలో వ్యాపారీకరణ వల్ల ప్రతికూల ప్రభావాన్ని అనుభవించింది. వ్యాపారీకరణ, భూయాజమాన్య, భూమి శిస్తు విధానాలలో మార్పులు, అదనపు ఉత్పత్తిని పెద్ద ఎత్తున కొల్లగొట్టడం, ప్రజోపయోగ పెట్టుబడులు పెట్టకపోవడం వంటి వలసపాలన ప్రవేశపెట్టిన ఆర్థిక ప్రక్రియలు, జనాభా పెరుగుదల వంటి సహజ ప్రక్రియలు కలిసి ఇక్కడి సాంప్రదాయిక జీవనం మీద ప్రతికూల ఫలితాలకు దారితీశాయి. ఆ మార్పులు గ్రామానికీ, పట్టణానికీ, ఒక గ్రామానికీ మరొక గ్రామానికీ మధ్య ఉండే విభజనను పెంచాయి. భూస్వామి, వడ్డీ వ్యాపారి, వ్యాపారి అనే పరాన్నభుక్కు త్రయం ఇక్కడ లేచినిలిచింది. ఈ త్రిమూర్తులు డానియల్ థార్నర్ వ్యాఖ్యానించినట్టుగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో అంతర్గతమైన అభివృద్ధి నిరోధకులుగా తయారయ్యారు.

ఈ మార్పులే తూర్పు ప్రాంతంలోని గ్రామీణ ప్రజలకు ఇవి ఏవో అతీత శక్తుల కార్యక్రమాలుగా, వాటిని మార్చే శక్తి తమకు లేనట్టుగా, తాము నిస్సహాయులైనట్టుగా కనబడ్డాయి. పాత జీవితానికి ఉండిన ఆర్థిక పునాది ధ్వంసం అయిపోవడం వారికి ఒక దిగ్భ్రాంతికరమైన అనుభవం. ఈ పరిణామాన్ని అర్థం చేసుకోవాలంటే ఉన్నతస్థాయి చైతన్యం అవసరమవుతుంది. లేదా, సాంప్రదాయిక భావనల నుంచి స్పష్టమైన తెగతెంపులు జరగవలసి ఉంటుంది. అది గ్రామం లోపలి నుంచి వచ్చే అవకాశం లేదు. బయటి నుంచే రావలసి ఉంటుంది. అతి వేగంగా మారుతున్న ఆర్థిక పరిస్థితి మీద ఒక కొత్త దృక్పథం లేకుండా పోయినప్పుడు ప్రజలు ఆత్మ రక్షణకో, లేదా అరకొరగా తిరుగుబాటు ప్రదర్శించడానికో పరిమితం కావడంలో ఆశ్చర్యం లేదు. సవ్యంగా జీర్ణం చేసుకోకుండా సాగిన ఈ అనుభవం కర్మ సిద్ధాంతపు భావజాలాన్ని బలోపేతం చేసింది. అయితే ఈ కర్మ సిద్ధాంతపు స్వభావం పూర్తిగా భిన్నమైనది. పాత కర్మ సిద్ధాంతం ప్రకృతి శక్తులకు స్పందనగా వచ్చినది కాగా, ఇది సామాజిక శక్తులకు స్పందనగా వచ్చినది. కుమావున్ వంటి సాపేక్షికంగా మారు మూల ప్రాంతంలో గ్రామీణ సమాజాలలో కర్మ సిద్ధాంతాన్ని నెలకొల్పడంలో ప్రకృతి పాత్ర గురించి నేను ఇదివరకే వివరించాను. కాని, ఇటీవలి చరిత్రలో ఉత్తరప్రదేశ్ తూర్పు ప్రాంతంలో కర్మ సిద్ధాంతాన్ని, విధి నిర్ణాయక వాదాన్ని మనుషుల మీద రుద్దడంలో వలస పాలన విధానాలు మరింత ఎక్కువ పాత్ర వహించాయి. ఈ కొత్త కర్మ సిద్ధాంతాన్ని గ్రామస్థాయిలోనే ఎదిరించడం సాధ్యంకాదు. దీన్ని ఎదిరించాలంటే మొత్తం సామాజిక, ఆర్థిక వ్యవస్థనే మార్చడానికి పోరాడే విశాల శక్తులతో గ్రామీణ ప్రజలు ఐక్యం కావలసి ఉంటుంది.

గ్రామాలలో నిశితమైన క్షేత్రపరిశోధన చేయడం విధి నిర్ణాయక వాదం గురించి, సామాజిక ఆర్థిక క్రమాలతో దాని సంబంధం గురించి ప్రశ్నలు లేవనెత్తడానికి నాకు ఉపయోగపడింది. కాని, ఆ ప్రశ్నలకు పూర్తి జవాబు కనుక్కోవడానికి ఉపయోగ పడలేదు. ఆ ప్రశ్నలు లేవనెత్తడంతోనే క్షేత్రపరిశోధన పరిమితి చేరినట్టు అయింది. ఇటువంటి ప్రశ్నలతో వ్యవహరించడానికి క్షేత్రపరిశోధన కన్న మించినది ఏదో కావాలి. అంటే, గ్రామానికి బయటి విషయాలేవో విశ్లేషించవలసి ఉంటుంది. గ్రామానికీ, బయట ఉన్న ఆర్థిక వ్యవస్థకూ, సమాజానికీ, రాజకీయ వ్యవస్థకూ ఉన్న పరస్పర సంబంధాలు, చరిత్రలో సాగిన ఘటనలు, సమకాలీనంగా జరిగే అనేక క్రమాల అనేక కోణాలను అధ్యయనం చేసినప్పుడే ఆ జవాబులు దొరుకుతాయి.

కేవలం దస్తావేజులు, కాగితాలు, అంకెలలో సమాచారం మాత్రమే అధ్యయనం చేస్తే నాకు ప్రజల గురించి తెలిసి ఉండేది కాదు. క్షేత్రపరిశోధన ద్వారానే ప్రజల అంతరంగాన్ని నేను కనుక్కోగలిగాను. భూస్వాముల ప్రాబల్యం ఉన్న గ్రామాలలో తమ కళ్లముందరే పాత సమాజ నిర్మాణాలు కుప్పకూలిపోతుంటే, కొత్త సమాజం ఇంకా ఆవిర్భవించనప్పుడు ఆ ప్రజలలో కనబడిన పరాయీకరణ భావనను నేను కళ్లారా చూసాను. ప్రత్యేకించి తూర్పు ప్రాంతంలోనూ, కుమావున్ లోనూ గ్రామీణ ప్రజల ముఖాల మీద ఎల్లప్పుడూ కనబడే విషాదానికి మూలం అదే. తమ విషాదానికి మూల కారణాలేమిటో అర్థం చేసుకోగల భావనలు వాళ్లకింకా అందలేదు. పాత ఆలోచనా పద్ధతులకు, కొత్త సవాళ్లకు మధ్య ఘర్షణ పెరుగుతున్నప్పుడు వారిలో భావజాల పరమైన శూన్యం నెలకొని ఉంది. గ్రామాలలోని పాత తరం మనుషులు ఈ మార్పులను సత్యయుగం అంతమనీ, కలియుగాంతమనీ అభివర్ణించారు. పాత విలువల స్థానంలో కొత్త విలువలు రావడం మొదలయింది. సామూహికత్వం స్థానంలో వ్యక్తివాదం, పోషణ స్థానంలో దోపిడీ మొదలయ్యాయి. సమూహం మధ్య తరతరాలుగా కొనసాగుతూ వస్తున్న బంధనాలు బలహీనపడుతూ సంస్థాగత శూన్యం కూడా ఏర్పడుతున్నట్టుంది. తత్ఫలితంగా మారుతున్న కొత్త పరిస్థితుల నుంచి ప్రజలు తమను తాము రక్షించుకోవడానికే ప్రయత్నిస్తారు గాని, సృజనాత్మకంగా ఉండడానికి ప్రయత్నించజాలరు. తమ సమస్యలు, గ్రామం లోపలే తమకు తెలిసినట్టుగానే ఉండే రోజులు తమకు తెలిసిన పరిష్కారాలు కనిపెట్టగలిగే రోజులు గతించిపోయాయని ఒక అస్పష్టమైన అభిప్రాయమే వారికి కలుగుతుంది. గ్రామానికి ఉన్న సార్వభౌమాధికారం రద్దయి పోయిందని, బయట ఉన్న బలోపేతమైన శక్తుల ఇష్టారాజ్యానికి గ్రామం బలి అవుతుందని ఒక అభిప్రాయం వారికి కలుగుతుంది. ఈ బయటి ప్రభావాల పట్ల ప్రతిస్పందిద్దామనే సానుకూలత, సాంప్రదాయిక మూలాల నుంచి దూరమయిపోయామనే ప్రతికూలత ఏకకాలంలో కనబడతాయి.

గ్రామీణ ప్రజానీకం ఇటువంటి మార్పుల, కల్లోలాల కొత్త దశలోకి ప్రవేశిస్తున్న 1950ల తొలి రోజుల్లో నేను నా క్షేత్రపరిశోధన ముగించాను. దాని తర్వాత ఉత్తరప్రదేశ్ జమిందారీ రద్దు చట్టం వచ్చింది. సామాజిక అభివృద్ధి కార్యక్రమం వచ్చింది. పంచాయితీ రాజ్, వయోజన ఓటు హక్కు వచ్చింది. గ్రామీణ విద్యా వ్యవస్థ మొదలయింది. అస్పృశ్యతా నిరోధ చట్టం వచ్చింది. రాజకీయ పార్టీల కార్యక్రమాలు మొదలయ్యాయి. పంచాయత్ మొదలయింది. కిసాన్ సభ వచ్చింది. కొత్త అధికారులు వచ్చారు. సాంకేతిక నిపుణులు వచ్చారు. గ్రామీణ పాఠశాల వచ్చింది. ఎన్నెన్నో మార్పులు జరిగిపోయాయి. నా గ్రామాలు నేను మరొక సారి వెళ్లి చూస్తే గుర్తు పట్టలేనంత మారిపోయాయి.

ఆ క్షేత్రపరిశోధన అనుభవం తరువాత నేను కూడా అంతకు ముందరి మనిషిని కాను. నేను ఏ ప్రజల మధ్య జీవించానో, ఎవరి ఆనందాలతో, విషాదాలతో నాకు ప్రత్యక్ష అనుభవం కలిగిందో ఆ ప్రజలు నన్ను వెంటాడుతూ వచ్చారు. ఇప్పటికీ నేను వెంటాడబడుతున్న మనిషినే. ఇప్పుడు కూడా నా గ్రామాల గురించి ఆలోచించినప్పుడు మార్పుల గురించి నాకు ఆశా కలుగుతుంది, భయమూ కలుగుతుంది. ఎందుకంటే మార్పు అనేది ఇప్పుడు నాకు సంబంధంలేని వస్తుగత ప్రక్రియ కాదు. దానితో నాకు వ్యక్తిగత సంబంధం ఉంది. మార్పు అనేది నాకు సన్నిహితంగా తెలిసిన మనుషుల సంతోషాలకూ, విచారాలకూ, ఆశకూ, నిరాశకూ ఒక వనరు.

(అయిపోయింది)

(ప్రొఫెసర్ పి.సి. జోషి, ఢిల్లీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనమిక్ గ్రోత్ పూర్వ సంచాలకులు. 1979 లో అచ్చయిన 'ది ఫీల్డ్ వర్కర్ అండ్ ది ఫీల్డ్ : ప్రాబ్లమ్స్ అండ్ చాలెంజెస్ ఇన్ సోషియోలాజికల్ ఇన్వెస్టిగేషన్' పుస్తకం నుంచి)


వీ

జన్యువులోని మార్పులకు వివిధ ప్రాంతాలలోని భౌతిక, వాతావరణ పరిస్థితులు ఏ విధంగా తోడ్పడ్డాయో వివరిస్తున్నారు **డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్**

సంచార జీవితం, జన్యువుల మార్పులు

చరిత్రను విజ్ఞానశాస్త్ర పద్ధతిలో అధ్యయనం చేస్తున్నప్పుడు చరిత్ర మొదలవని యుగాల్లో భూగోళమంతటా ప్రజలు ఎటువంటి ప్రస్థానాలు చేశారో తెలుసుకోవడం వీలవుతోంది. ప్రపంచంలో ఈ రోజుల్లో ప్రతిచోటా ప్రజలు నివసిస్తున్నప్పటికీ మొదటి ఆధునిక మానవులు ఆఫ్రికాలో ఆవిర్భవించి, ఆ తరవాత క్రమంగా ఇతర ప్రాంతాలకు వెళ్ళి స్థిరపడ్డారని చాలామంది శాస్త్రవేత్తలు నమ్ముతున్నారు. మొదట్లో అందరూ ఒక జాతివారైనప్పటికీ స్థానిక పరిస్థితులవల్ల వివిధ ప్రాంతాల్లోని ప్రజల జన్యువుల్లో కొన్ని వ్యత్యాసాలు ఏర్పడసాగాయి. వీటిలో శారీరక లక్షణాలుగా కనబడేవి కొన్ని మాత్రమే. తక్కినవన్నీ 1980ల తరవాత జరుగుతూవస్తున్న శాస్త్రీయ పరిశోధనల్లో మాత్రమే బైటపడతాయి. మనుషుల్లో మగవారికి తల్లినుంచి వచ్చే ఎక్స్, తండ్రి నుంచి వచ్చే వై క్రోమొసోమ్‌లూ, స్త్రీలకు రెండు వైపుల నుంచీ వచ్చే తలొక ఎక్స్ క్రోమొసోమ్ ఉంటాయనేది తెలిసినదే. మనుషులందరిలోనూ ప్రతి జీవకణంలోనూ ఎక్స్ క్రోమొసోమ్ ఉంటుంది. ఈ కారణంగా మనకు తల్లి తాలూకు జన్యు లక్షణాలు తప్పనిసరిగా ఉంటాయి. అలాగే మగవారికి తండ్రి నుంచి వచ్చే వై క్రోమొసోమ్‌లు ప్రత్యేకం. తల్లినుంచి మాత్రమే అందరికీ సంక్రమించే మైటోకాండ్రియల్ జన్యు చిహ్నాలూ, తండ్రి నుంచి కొడుకులకు మాత్రమే సంక్రమించే వై క్రోమొసోమ్ లక్షణాలూ అన్నీ ఒక్కొక్కరినీ ప్రాంతాలవారీగా గుర్తించడానికి పనికొస్తాయి. ఈ చిహ్నాలను హేప్లోగ్రూప్‌లుగా గుర్తిస్తారు.

సుమారు పదివేల ఏళ్ళ కొకటి చొప్పున మైటోకాండ్రియల్ జన్యు చిహ్నాల్లో తేడాలు కలుగుతాయి. కాలం గడుస్తున్న కొద్దీ ఈ తేడాలు అంచెలంచెలుగా పెరుగుతాయి. దీనర్థం ఏమిటంటే మనుషుల జన్యువుల్లోని క్రోమొసోమ్‌లలో కొన్ని ప్రత్యేక స్థానాల్లో కొన్ని రకాల కణసముదాయాలు కనబడతాయి. వీటికి గుర్తులుగా కొన్ని సంకేతాలను ఉపయోగిస్తారు. పశ్చిమ యూరేషియాలో కనబడే గ్రూపులు ఎచ్, టీ, యూ, వీ, ఎక్స్, కె, ఎన్, ఐ, జె వగైరాలు. అలాగే సహారాకు దక్షిణాన ఎల్, ఎల్1, ఎల్2, ఎల్3 వగైరా గ్రూపు మనుషులుంటారు. తూర్పు



ప్రపంచవ్యాప్తంగా మనుషుల ప్రస్థాన మార్గాలు, జన్యువుల్లో వ్యత్యాసాలు

ఆసియావాసులవి ఎ, బి, సి, డి, ఇ, ఎఫ్, జి వగైరా గ్రూపులు. వీటిలో సి, డి, ఇ, జి లను ఎం అనే పెద్ద గ్రూప్‌గా పరిగణిస్తారు. అమెరికా ఆదిమ తెగలన్నీ ఎ, బి, సి, డి, (ఒక్కొక్కప్పుడు ఎక్స్) గ్రూపులకు చెందినవి.

యాదృచ్ఛికంగానో, బాహ్యప్రేరణలవల్లనో జన్యువుల్లో కలిగే మార్పులన్నీ ఇతరులతో సంబంధం తెగిపోయిన పరిస్థితిలో ఒక్కొక్క మానవ సముదాయంలోనూ ఒక్కొక్క దిశగా కొనసాగుతాయి. మొదట్లో ఉండిన వైవిధ్యం కొంత తగ్గుతుంది. ఏనాడో మొదటిసారిగా ప్రస్థానాలు సాగించిన మానవ బృందాలు వివిధ ప్రాంతాల్లో నివసించడం మొదలెట్టారు. చాలాకాలం పాటు ఈ బృందాలన్నీ విడివిడిగానే నివసిస్తూ ఒక్కొక్క ప్రాంతానికీ ప్రత్యేకమనిపించే శారీరక, జన్యు లక్షణాలను సంతరించుకున్నాయి. ఈ బృందాల మధ్య సంపర్కం ఏర్పడటానికీ, లైంగిక సంబంధాల ద్వారా సంకరజాతి సంతతి పుట్టడానికీ అవకాశాలు వేల సంవత్సరాల తరువాతగాని కలగలేదు.

కాలక్రమాన మొదట్లో ప్రాంతాలవారీగా ప్రత్యేకమనిపించిన జన్యు చిహ్నాలన్నీ కలగాపులగం అవుతూవచ్చాయి. అయినప్పటికీ ఆధునిక యుగంలో జరిపే జన్యు పరీక్షల ద్వారా ఏ వ్యక్తిలోనైనా ఏ రకమైన చిహ్నాల కలయిక కనబడుతోందో, ఆ వ్యక్తి వారసత్వం ఎటువంటిదో, ప్రతివారిలోనూ ఏయే గతకాలపు జనసముదాయాల ప్రభావం ఎంతవరకూ ఉందో తెలుసుకోవచ్చు. ఈ రోజుల్లో మనుషుల బాహ్యరూపాల్లో ఎంత వైవిధ్యం కనబడుతుందంటే ఒకే దేశానికీ, రాష్ట్రానికీ, ప్రాంతానికీ, కులానికీ, కుటుంబానికీ చెందిన వ్యక్తుల రూపురేఖల్లోనే ఎన్నో తేడాలు స్పష్టంగా కనబడుతూ ఉంటాయి. అమెరికా వంటి దేశాల్లో తెల్లవారి మీద జన్యుపరీక్షలు జరిపినప్పుడు వారిలో కొందరి విషయంలో కొంత నీగ్రో, లేదా అమెరికన్ ఆదిమ తెగల జన్యువుల ప్రభావం ఉందని బైటపడింది. చూడటానికి అటువంటిదేమీ కనబడకపోయినా జన్యువులను బట్టి ఇటువంటివి తెలుసుకోవచ్చు. మన జన్యువుల వారసత్వం ఎటువంటిదో తెలుసుకోవడంవల్ల పెద్దగా ఉపయోగమేమీ ఉండదు కాని, ప్రాచీనకాలంలో మనుషులు ఎప్పుడెప్పుడు, ఏయే మార్గాల వెంబడి ప్రయాణించి ప్రపంచంలోని నలుమూలలకూ చేరుకున్నారో చెప్పడం మాత్రం వీలవుతోంది. ప్రయాణ సాధనాలేవీ లేని యుగాల్లో కాలినడకనా, చిన్న చిన్న తెప్పల్లోనూ ఆదిమానవులు ఎన్నో కష్టాలను భరిస్తూ ప్రయాణాలు చేశారు. ఆఫ్రికాలో మొదలైన జన్యుజాతులు ఎక్కడెక్కడికి వెళ్ళి ఎలా రూపాంతరం చెందాయో ప్రపంచ పటంలో చూడవచ్చు.

మైటోకాండ్రియల్ జన్యుపరీక్షలద్వారా తేలినదేమిటంటే మానవ జాతికి జన్మనిచ్చిన "ఆదిమాత" తూర్పు ఆఫ్రికాలోనో, దక్షిణ ఆఫ్రికాలోనో సుమారు లక్షన్నర సంవత్సరాల కిందట జీవించింది. దాదాపు లక్ష, 80 వేల సంవత్సరాల క్రితం హోమో సేపియన్స్ జాతిలో మూడు ఉపశాఖలు మొదలయాయి. ఈ సంగతి మైటోకాండ్రియల్, వై క్రోమొసోమ్ పద్ధతులు రెండిటిలోనూ తెలియవచ్చింది. మైటోకాండ్రియల్ విశ్లేషణను బట్టి ఎల్1, ఎల్2, ఎల్3 జన్యుచిహ్నాలు ఈనాడు ఆఫ్రికన్లలో 29, 34, 37 శాతం కనబడతాయి. ఎల్1 బృందాలు దక్షిణాఫ్రికాకూ (కేపాయిడ్ లేక బుష్‌మెన్ జాతుల పూర్వీకులు), ఎల్2 చిహ్నాలు గలవారు మధ్య, పశ్చిమ ఆఫ్రికాలకూ తరలివెళ్ళారు. ఎల్3 జాతి మటుకు తూర్పు ఆఫ్రికాలోనే కొనసాగిన తరవాత వారిలో కొందరు, సుమారు 70, 60 వేల సంవత్సరాల క్రితం, తూర్పుగా వెళ్ళి, పశ్చిమాసియాలో ప్రవేశించారు. వీరికి గత హిమయుగంలో ఆసియా, ఆస్ట్రేలియా, యూరప్ తదితర ప్రదేశాల్లో స్థిరపడే అవకాశాలు కలిగాయి. కాలక్రమేణా సహజంగా జన్యువుల్లో ఎవరికైనా మార్పులు కలగడం మామూలే. తమ పూర్వీకుల నుంచి వేరుపడి వలసవెళ్ళిన ఈ ప్రజలకు క్రమంగా ఎం, ఎన్ జన్యు చిహ్నాలు ఏర్పడ్డాయి. వీరి సంతతి మళ్ళీ కొత్త ప్రాంతాలకు వెళ్ళినప్పుడు జన్యుపరమైన మార్పులు మరికొన్ని జరిగాయి. ఇలా ప్రతి కొత్తతరానికీ తమ పూర్వీకులతో పోలిస్తే భిన్నమైన జన్యు నిర్మాణం ఏర్పడుతూ వచ్చింది. దీన్నిబట్టి జరిగిన ప్రస్థానాల గురించిన సరైన అవగాహన లభిస్తోంది.

ఆఫ్రికానుంచి వలసవెళ్ళినవి చాలా చిన్న సముదాయాలని తెలియవస్తోంది. వీరిలో తూర్పుగా నడుస్తూ, తీరప్రాంతాల వెంబడి ఆస్ట్రేలియా, పపూవా న్యూగినీ మొదలైన సుదూర ప్రదేశాలకు కొందరు శీఘ్రంగానే ప్రయాణించారు. ఉత్తరదిశగా వెళ్ళినవారికి మాత్రం చలి కారణంగా గడ్డు పరిస్థితులు ఎదురయ్యాయి. నియాండర్తాల్ జాతి ప్రజల ప్రతిఘటన కూడా ఉండేదేమో. ఈనాటి యూరప్‌లో "ఎం" జన్యువులు కనబడవు. 25 వేల సంవత్సరాల క్రితం హిమయుగం కారణంగా సముద్ర మట్టం ఇప్పటికన్నా 120 మీటర్లు తక్కువగా ఉండేదట. శీతల స్థితిలో హెచ్చుతగ్గులు కలుగుతూ ఉండిన ఆ యుగంలో మనుషులు కొత్తకొత్త నివాసస్థలాలు వెతుక్కుంటూ వెళ్ళారు. సుమారు 20 వేల సంవత్సరాల క్రితం చలి విపరీతంగా పెరిగినప్పుడు స్పెయిన్ వంటి కొన్ని ప్రాంతాల్లో ప్రజలు కదలకుండా చాలాకాలం ఉండిపోవలసి రావడంతో అక్కడ ఎచ్, వీ రకం జన్యు లక్షణాలు పెరిగాయి. ఆసియా వాసులలో 77 శాతం ఎం చిహ్నాలు కనబడతాయి. మన దేశంలో ఎం3, ఎం4 రకాలు ఉంటాయి. ఈ రకం డిటెక్టివ్ పరిశీలన ద్వారా ప్రపంచంలోని వివిధ ప్రదేశాల్లో జనసంచారం ఎప్పుడెప్పుడు ఎలా జరిగిందో కొంతవరకూ అర్థమౌతోంది. వీ


వచ్చే సంచికలలో...

- **ఫోకస్ - నవంబర్ 2009 : వీక్షణం నూరవ సంచిక - ప్రజా జీవన స్థితిగతులు - రావలసిన మార్పులు**
- **ఫోకస్ - డిసెంబర్ 2009 : ఇరవై అయిదేళ్ల భోపాల్ దురంతం - బహుళజాతి సంస్థలపై పోరాటం**
- **వాతావరణ సంక్షోభం - క్యోటో ఒప్పంద రాజకీయాలు - కె. నరేంద్రమోహన్**
- **గుజరాత్ మారణకాండ - రెండు సినిమాలు - ఒక నవల - పి.వి. రమణ**
- **'జన తెలంగాణ' రాష్ట్రం ఏర్పాటు - టి. శ్రీరామమూర్తి**
- **నయా ఉదారవాదం - సంక్షోభంలో ఆర్థికరంగం - ఆర్.వి. రమణమూర్తి**

వివిధ సామాజిక, రాజకీయార్థిక అంశాలపై వ్యాఖ్యలు, విశ్లేషణలతో కూడిన వి. హనుమంతరావు వ్యాస సంకలనాన్ని పరిచయం చేస్తున్నారు **విద్యాభూషణ్**

ఆర్థికరంగ అంతరార్థాలకు దర్పణం

సంస్కరణల అమలు ఊపందుకున్న నేపథ్యంలో, దేశ ఆర్థికరంగంలో అనూహ్య మైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అంతర్జాతీయ ఆర్థిక మాంద్యం జాతీయ స్థాయిలోనూ తన పంజా విసురుతోంది. 'జీ హుకుం' అని పాలకులు అమలు పర్చాల్సిన ప్రపంచబ్యాంక్ విధానాల ఫలితాన్ని దేశ ప్రజలంతా చవి చూస్తూనే ఉన్నారు. ఆకలి, దారిద్ర్యం విలయతాండవం చేస్తుంటే, పెరుగుతున్న ధరలతో పాటు ఆహార భద్రతా సమస్యలు సరిజోడీగా వంత పాడుతున్న సందర్భం ఇది. కరువు కరాళ నృత్యానికి అన్నదాతలు రోజువారీ పదుల సంఖ్యలో ఆత్మార్పణ చేసుకుంటున్నా, ఇదంతా మీడియా సృష్టే తప్ప మరేమీ కాదంటూ, 'అంతా సవ్యంగానే ఉంది. అభివృద్ధి దిశగా దేశం దూసుకుపోతూ ఉంద'ని పాలకులు బుకాయిస్తున్నారు. 'రేపటి వెలుగు'ని ఆసరా చేసుకుని బతకాలనుకుంటున్న సామాన్యునికి కీలకమైన సందర్భం, సంధివేళా ఇది. ఈ సందర్భంలో వెలుగుచూసిన 'మీరు-నేను-ఆర్థికం' అన్న వ్యాస సంకలనం నిజంగానే రేపటి వెలుగుల్ని ఉదయిస్తుంది. ఈనాటి వివత్కర పరిస్థితికి మూలకారణాలనూ మన ముందుంచుతుంది.



మీరు - నేను - ఆర్థికం - వి. హనుమంతరావు - వీక్షణం పబ్లికేషన్స్ - 215 పేజీలు, 1/8 డెమీ, రు. 60, ప్రతులకు : మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500029. ఫాక్స్, ఫోన్ : 040-66843495

సీనియర్ పాత్రికేయులుగా, అర్థశాస్త్ర విశ్లేషకులుగా లబ్ధప్రతిష్ట పొందిన డేటా హనుమంతరావు వ్యాస సంకలనం ఇది. వీటిలో ప్రభుత్వ విధానాలు విశ్లేషణలు, విమర్శనాత్మక వివరణలు, ప్రత్యామ్నాయా విధాన ప్రతిపాదనలు ఉన్నాయి. సాధారణంగా బడ్జెట్లు, వాటిలో ప్రతిపాదనలు, కేటాయింపులు, విడుదలలు వంటి అంశాలు ఒక పట్టాన అర్థంకావు. అలాగే ద్రవ్యోల్బణం, ద్రవ్యలోటు వంటి అంశాలు సాధారణ బుద్ధిజీవులకే కొరుకుడు పడని బ్రహ్మ పదార్థాలు. వీటన్నింటినీ అత్యంత సరళంగా విశ్లేషించి అందించారు వి. హనుమంతరావు.

'కేటాయింపులు కొండంత, విడుదల పిసరంత' వ్యాసంలో తొమ్మిది - పదో ప్రణాళికల్లో గిరిజన సంక్షేమం కోసం కేంద్రం నూటికి నూరు శాతం నిధులు కేటాయిస్తున్నా ఖర్చులు తగ్గుతూ వచ్చిన వైనాన్ని గణాంకాలతో సైతం రుజువు చేశారు. జనాభా శాతాన్ని బట్టి ఆయా శాఖల ప్రణాళికా నిధుల కేటాయింపులు ఉండాలన్న కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు ఏ తీరున బుట్టదాఖలయ్యాయో సైతం సోదాహరణంగా వివరించారు. కడకు తేల్చి చెప్పిన విషయం ఏంటంటే, కేటాయింపులు ఘనం - విడుదలలు ఆవగింజంత కాగా, వాస్తవంలో ఖర్చును మీ అంచనాలకే వదిలయేడం సందర్భోచితం.

ఇదే తరహాలో 'గ్రామీణాభివృద్ధికి ఏది ప్రాతిపదిక?' అన్న వ్యాసంలో నిజమైన 'అభివృద్ధి'ని వివరిస్తూనే, పాలకులు ఏ తరహాలో శాశ్వత నివారణ పథకాలను నీరుగార్చి, ఆషామాషి టుమ్రీ పథకాలను అమలు పరుస్తున్న వైనాన్ని విడమర్చారు. దళితులు, వెనుకబడిన తరగతులు, గిరిజనులకు కలిపి మొత్తం సామాజిక, గ్రామీణాభివృద్ధికై బడ్జెట్‌లో కేంద్రం చేసిన ఖర్చు 0.2 శాతం మాత్రమే నని లెక్క తేల్చి చెప్పారు. ఇది 2003-04 ఆర్థిక సంవత్సరంలో. ఈ లెక్కన సంపూర్ణ గ్రామీణాభివృద్ధికి ఎన్నేళ్లు పడుతుందో మనల్నే ఊహించుకోమంటారు.

రాష్ట్రంలో 'వ్యవసాయ రంగం' అవసానదశకు చేరుకునేందుకు ప్రధాన కారణంగా, పాలకులు చేపడుతున్న అస్తవ్యస్త విధానాలేనని చెప్తూ, ఆధునిక సేద్యాన్ని మోన్‌శాంటోకు ధారాదత్తం చేసేశారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నడూ లేంది, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ రంగం గురించి తీర్మానించడం మొదలుకొని రెండో సస్య విప్లవం అవసరమని దేశ ప్రధాని పిలుపు ఇవ్వడం వరకూ, రైతాంగాన్ని వంచించే యత్నమేనని 'మోన్‌శాంటోకు వ్యవసాయం ధారాదత్తం' అన్న వ్యాసంలో విశ్లేషించారు.

ప్రభుత్వం ప్రకటించిన పారిశ్రామిక విధానంలో - గత అనుభవాలను సమీక్షించుకుని, నూతనంగా ఏయే రంగాల మీద దృష్టి కేంద్రీకరించాల్సి ఉందో చెప్తూ, అందుకు అనునయంగా సబ్సిడీలు, ప్రోత్సాహకాలను ప్రకటించడం ఆనవాయితీ అంటారు. మరి 1 ఏప్రిల్ 2005న ప్రకటించిన పారిశ్రామిక విధానంలో మొదటి అంశాన్ని గాలికొదిలేసి, రెండో అంశానికే పరిమితమయ్యిందంటారు. ఈ నూతన పారిశ్రామిక విధానంలో పెట్టుబడిలో ఐదు శాతం సబ్సిడీ, ఎస్.సి. మహిళలకు మరో ఐదు శాతం, స్టాంపు డ్యూటీ తిరిగి చెల్లింపు వంటి ప్రోత్సాహకాలు ప్రైవేట్ రంగానికే తప్ప, ప్రభుత్వరంగ ప్రస్తావన లేదంటారు. వెరసి ప్రపంచబ్యాంక్ ఆదేశాల మేరకే ఈ నిర్ణయమనీ తేల్చి చెప్పారు 'ప్రణాళిక లేని పారిశ్రామికీకరణ' వ్యాసంలో.

ఇలా ఆర్థిక, సామాజిక విషయ వివరణలతో సుమారు యాభై వ్యాసాలు ఈ సంపుటిలో చోటు చేసుకున్నాయి. వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగం, సహకార రంగం, చేనేత, విద్య, పరిపాలన, నిరుద్యోగం, ఉపాధి, సంస్కరణలు, ప్రజా ఉద్యమాలు మొదలైన అంశాలన్నీ ఈ వ్యాసాల్లో ఉన్నాయి. ప్రస్తుత క్లిష్ట సామాజిక పరిస్థితుల పట్ల సదవగాహనకు ఈ సంపుటి ఎంతో దోహదపడుతుంది. సకాలంలో ఈ వ్యాస సంపుటిని అందజేసిన వీక్షణం పబ్లికేషన్స్‌కు అభినందనలు. వీ

ఇష్రత్ ఎన్‌కౌంటర్‌పై తమాంగ్ నివేదిక

ముఖ్యమంత్రి నరేంద్రమోడిని హత్యచేయడానికి వచ్చిన నలుగురు ఉగ్రవాదులు ఎన్‌కౌంటర్‌లో మరణించారంటూ గుజరాత్ పోలీసులు 2004 జూన్‌లో ఒక కథనం వినిపించారు. వాస్తవాలేమిటో అహ్మదాబాద్ మెట్రొపాలిటన్ మెజిస్ట్రేట్ తమాంగ్ ఇటీవలే సమర్పించిన దర్యాప్తు నివేదికలో స్పష్టం చేశారు. తమాంగ్ నివేదికలో పేర్కొన్న 21 మంది పోలీసుల పేర్లున్నాయి. ఇష్రత్ ఉగ్రవాది కాదని బిఎస్‌సి రెండవ సంవత్సరం విద్యార్థిని అనీ, తండ్రి మరణించిన నేపథ్యంలో ట్యూషన్లు చెబుతూ కుటుంబ పోషణ చూసుకుంటోందని తెలిసింది.

మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు

పంచాయితీ పదవులలో మహిళల రిజర్వేషన్‌ను 50 శాతానికి పెంచాలన్న ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. ప్రధానమంత్రి అధ్యక్షతన ఆగస్ట్ 27న కేంద్ర మంత్రివర్గ సమావేశం రాజ్యాంగంలోని 243 (డి) అధికరణను సవరిస్తూ బిల్లు తేవాలని, దాంతో పంచాయతీలలో ఇప్పుడున్న మూడోవంతు నుండి 50 శాతానికి పెంచాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని సమాచార, ప్రసారాల శాఖ మంత్రి అంబికాసోనీ వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ రాజ్యాంగ సవరణకు బిల్లు ప్రవేశపెడుతుందని చెప్పారు. ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఎన్నుకునే పదవులు, చైర్‌పర్సన్ల కార్యాలయాలు, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వుచేసిన పదవులతో సహా అన్నింటికీ ఇది వర్తిస్తుంది.

బూటకపు ఎన్‌కౌంటర్ కేసు

బూటకపు ఎన్‌కౌంటర్‌కు కారకులుగా 17 మంది పోలీసులపై ముంబైలో కేసు నమోదైంది. హైకోర్టు ఆదేశాల మేరకు డిస్మిస్ అయిన ఎస్సై ప్రదీప్ శర్మతో సహా అందులో పాల్గొన్న పోలీసులపై వర్సోవా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ముంబైకి చెందిన రాంనారాయణ్ 11 నవంబర్ 2006న పోలీసు కాల్పుల్లో మరణించారు. ఆయన చోటా రాజన్ ముఠా సభ్యుడని, ఎదురుకాల్పుల్లో ఆయన మరణించాడని పోలీసులు వాదించారు. రాంనారాయణ్ మృతిపై ఆయన సోదరుడు రాంప్రసాద్ గుప్త ఫిర్యాదు చేశాడని, విచారణ చేపడతామని డిసిపి కెఎంఎం ప్రసన్న తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు పోలీసులపై కిడ్నాప్, హత్య నేరం కింద కేసు నమోదు చేశామని చెప్పారు.

దక్షిణాది సినిమాకు జాతీయ పురస్కారాలు

జాతీయ సినీ అవార్డుల తెరపై దక్షిణాది ప్రభ ఒక్కసారిగా వెలిగింది. తమిళ, కన్నడ, మలయాళ చిత్రాలు ముందంజలో ఉన్నాయి. 2007 సంవత్సరానికి గాను జాతీయ సినీ పురస్కారాలు సెపెంబర్ 7న ప్రకటించారు. ఉత్తమ చిత్రంగా 'కాంజీవరం' (తమిళం), ఉత్తమ దర్శకుడిగా ఆదూర్ గోపాల కృష్ణన్ (నాలు పెనుంగళ్ – మలయాళం), ఉత్తమ నటుడిగా ప్రకాష్‌రాజ్ ('కాంజీవరం' – తమిళం), ఉత్తమ నటిగా ఉమశ్రీ ('గులాబీటాకిస్' – కన్నడ) ఎంపికయ్యారు. ఇంకా వివిధ కేటగిరీలకు అవార్డులు ప్రకటించారు.

వర్షాలు - వరదలు

ఉత్తరాదిన వర్షాలు, వరదలకు సెప్టెంబర్ రెండవ వారం నాటికి 19 మంది మరణించారు. దేశ రాజధాని ఢిల్లీతో సహా పలు రాష్ట్రాల్లో జనజీవనం అస్తవ్యస్తమైంది. పశ్చిమ బెంగాల్‌లో వరద ఉధృతికి ముగ్గురు, మధ్యప్రదేశ్‌లో ఆరుగురు, ఉత్తరప్రదేశ్‌లో పదిమంది చనిపోయారు. రాకపోకలు నిలిచిపోయాయి.

బి.జె.పి. లో ముసలం

మాజీ కేంద్ర మంత్రి జస్వంత్‌సింగ్ తాను రాసిన 'జిన్నా: ఇండియా పార్టిషన్ – ఇండిపెండెన్స్' పుస్తకంలో వ్యక్తం చేసిన అభిప్రాయాల కారణంగా బి.జె.పి. నుంచి బహిష్కరణకు గురయ్యారు. బహిష్కరణకు గురయ్యాక జస్వంత్‌సింగ్ పార్టీపై తన విమర్శలకు మరింత పదును పెట్టారు. బి.జె.పి.ది జాత్యహంకార ధోరణి అని పేర్కొన్నారు. బి.జె.పి.ని అమెరికా శ్వేత జాతీయుల వర్గం 'క్లూ క్లక్స్ క్లాన్' తో పోల్చారు. జిన్నా గురించి తాను వ్యక్తం చేసిన అభిప్రాయాలు గతంలో ఆర్.ఎస్.ఎస్. నేతలు సుదర్శన్, శేషాద్రిలు వ్యక్తం చేసినవే కదా అని ప్రశ్నించారు. జస్వంత్‌సింగ్ బహిష్కరణ తదనంతర పరిణామాలు బి.జె.పి.లో అసమ్మతికి ఆజ్యం పోసాయి. సుధీంద్ర కులకర్ణి, అరుణ్ శౌరి లాంటి పలువురు నేతలు తమ అసంతృప్తిని వ్యక్తం చేసారు. వారిలో కొందరిని కూడా పార్టీ సభ్యత్వం నుంచి బి.జె.పి. బహిష్కరించింది.

లొంగిపోతే వేతనం

మావోయిస్ట్‌ల కోసం రూపొందించిన 'లొంగుబాటు – పునరావాస' విధానానికి కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్ 7న ఆమోదం తెలిపింది. ఇప్పటివరకు వివిధ రాష్ట్రాల్లో వేరువేరుగా ఉన్న సరెండర్ పాలసీ స్థానంలో అన్ని నక్సల్స్ ప్రభావిత రాష్ట్రాలలో ఒకే విధానాన్ని అవలంబించే పద్ధతికి అంగీకారం తెలిపింది. లొంగిపోయిన మావోయిస్ట్ పేరు మీద వెంటనే రు. 1.5 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలన్నది కొత్త విధానం. మూడేళ్లపాటు ప్రతి నెలా రు. 2000 స్టై ఫండ్ చెల్లిస్తారు. నడవడికను బట్టి మూడేళ్ల తరువాత ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను వారికి అందజేస్తారు.

కులాల జనాభా

జనాభా సేకరణలో కులం వివరాలను కూడా చేర్చాలంటు కేంద్ర న్యాయశాఖ మంత్రి వీరప్ప మొయిలీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు లేఖ రాశారు. దీని సంబంధించి చర్చ మళ్లీ మొదలయింది. 2001లో జనాభా లెక్కల సేకరణ జరగనున్నందున కేంద్రం త్వరలో ఈ విషయమై నిర్ణయం తీసుకోక తప్పదు. బ్రిటిష్ పాలనలో 1931లో జరిపిన జనాభా లెక్కల సేకరణలో కులం కూడా ఒక అంశంగా ఉంది. ఈ లేఖలో వీరప్ప మొయిలీ తాను కర్ణాటక ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఒ.బి.సి., ముస్లిం జనాభా వివరాలు సేకరించి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన అనుభవాన్ని వివరించారు. వీ

జపాన్‌లో కొత్త ప్రభుత్వం

జపాన్‌లో యాభై నాలుగేళ్లుగా సాగుతున్న లిబరల్ డెమోక్రటిక్ పార్టీ (ఎల్.డి.పి.) మితవాద రాజకీయాధికార గుత్తాధిపత్యానికి వ్యతిరేకంగా ప్రజలు తీర్పు చెప్పారు. ప్రధాని తారో అసో తన ఓటమిని అంగీకరించారు. మొత్తం 480 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో ప్రధాన విపక్షమైన డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ జపాన్ (డిపిజె)కి 308 స్థానాలు గెలుచుకుంది. ఎల్.డి.పి. కేవలం 119 స్థానాలే దక్కాయి.

అణు కార్యక్రమం ఆపేది లేదు

తమ అణు కార్యక్రమాన్ని నిలిపివేసే ప్రసక్తే లేదని ఇరాన్ సెప్టెంబర్ 7న ప్రకటించింది. ఇరాన్‌కు గడువు విధిస్తూ అగ్రరాజ్యాలు హెచ్చరిక చేయడమే కాకుండా అంతర్జాతీయ అణుశక్తి సంస్థ ఐ.ఎ.ఇ.ఎ.కు చెందిన సభ్య దేశాలు వియన్నాలో సమావేశం ప్రారంభించిన నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు మహ్మద్ అహ్మదీ నెజాద్ ఈ ప్రకటన చేశారు.

శ్రీలంక సైన్యం దురాగతాలు

శ్రీలంక సైన్యం ఈ ఏడాది జనవరిలో ఎల్.టి.టి.ఇ.పై విజయవంతంగా సాగించిన యుద్ధంలో పట్టుపడ్డ ఎల్.టి.టి.ఇ. కార్యకర్తలను అతి దారుణంగా కాల్చి చంపిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. కిల్లినోచ్చి సైన్యం వశమయ్యాక ఒక సైనికుడు తన సెల్‌ఫోన్ కెమేరాలో ఆ వీడియోను చిత్రీకరించాడు. బందీలను నగ్నంగా కట్టేసి అతి సమీపం నుంచి కాల్చిచంపారని ఆ వీడియోలో కనిపించింది. శ్రీలంక జర్నలిస్ట్ ఫర్ డెమోక్రసీ అనే సంస్థ ఈ వీడియోను తమకు అందజేసిందని చానల్ 4 అనే సంస్థ తెలిపింది. ఓటమి అంగీకరించి తెల్లజెండా పట్టుకుని లొంగిపోవడానికి వస్తున్న ఎల్.టి.టి.ఇ. కార్యకర్తలను కాల్చి చంపినట్టుగా వార్తలు కూడా వచ్చాయి.

ప్రైవేట్ విద్యకు వ్యతిరేకంగా

ప్రైవేట్ ప్రాథమికోన్నత పాఠశాలల సంఘం ప్రథమ వార్షికోత్సవంలో పాల్గొనేందుకు సెప్టెంబర్ 13న నేపాల్ ప్రధాని మాధవ్ కుమార్ నేపాల్ తూర్పు నేపాల్‌కు బయలుదేరారు. అక్కడ విమానాశ్రయంలో దిగారు కాని, సమావేశ వేదిక వద్దకు వెళ్లేదారిని మావోయిస్టులు గంటకు పైగా దిగ్బంధించారు. విద్య ప్రైవేటీకరణను నిరసిస్తు కొన్ని నెలలుగా జరుగుతున్న ఆందోళనలను మరింత ముమ్మరం చేశారు.

కుప్పకూలుతున్న బ్యాంకులు

అమెరికాలో ఆర్థిక మాంద్యం కారణంగా బ్యాంకుల పతనం కొనసాగుతూనే ఉంది. ఈ సంవత్సరం జనవరి నుంచి సెప్టెంబర్ వరకు సగటున నెలకు పది చొప్పున మొత్తం 94 బ్యాంకులు కుప్పకూలాయి. అమెరికాలోని నష్టాల్లో ఉన్న బ్యాంకులను ఆదుకునే ఫెడరల్ డిపాజిట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎఫ్‌డిఐసి) కి ఇప్పటివరకు 2.5 బిలియన్ డాలర్ల నష్టం చవిచూసింది. ఈ సంవత్సరం ఆఖరుకు ఇంకా 419 బ్యాంకులు నష్టాలు చవిచూసే అవకాశాలు ఉన్నాయని ఎఫ్‌డిఐసి తెలిపింది.

జైదీ విడుదల

అమెరికా మాజీ అధ్యక్షుడు జూనియర్ బుష్ పైకి బూటు విసిరిన ఇరాకీ పాత్రికేయుడు ముంతజర్ ఆల్ జైదీ జైలు నుంచి సెప్టెంబర్ 15న విడుదలయ్యారు. మూడేళ్ల జైలు శిక్షను అతని అభ్యర్థన మేరకు ప్రభుత్వం ఏడాదికి తగ్గించింది. అయితే సత్ప్రవర్తన కారణంగా ఆయనను తొమ్మిది నెలలకే విడుదల చేశారని అతని న్యాయవాది తెలిపారు. విడుదల అనంతరం విలేకరుల సమావేశంలో జైదీ మాట్లాడుతు జైలులో తనను కొట్టడంతోపాటు ఎలక్ట్రిక్ షాక్ ఇచ్చేవారని, అమెరికా గూఢచార సంస్థ నుంచి తనకు ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

వివాదస్పదమైన అఫ్ఘనిస్తాన్ ఎన్నికలు

అఫ్ఘనిస్తాన్‌లో అధ్యక్ష ఎన్నికలు వివాదాస్పదంగా మారాయి. ఎన్నికల్లో పోలైన 92 శాతంలో ప్రస్తుత అధ్యక్షుడు హమీద్ కర్జాయ్ 54.1 శాతం ఓట్లు లభించాయి. అధ్యక్ష పదవి మళ్లీ చేపట్టేందుకు కావల్సింది 51 శాతం ఓట్లు. ఈ ఎన్నికల్లో అక్రమాలు జరిగినట్లు ఐక్యరాజ్య సమితి మద్దతున్న ఎన్నికల ఫిర్యాదుల కమిషన్ (ఇసిసి) ధ్రువీకరించింది. పోలింగ్ కేంద్రాలలో పోలైన ఓట్లను తిరిగి లెక్కించాలని ఆదేశించింది. రీకౌంటింగ్‌కు మరో రెండు నుంచి మూడు నెలల సమయం పట్టే అవకాశం ఉంది.

అసహజ మరణాల సూచి

సంకలనం : రాంకి, వై. రామచంద్రం


మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్ధాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషులకోసం ఇంకాస్త బాధ్యతగానూ, జాగ్రత్తగానూ వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(21 ఆగస్ట్ 2009 నుండి 20 సెప్టెంబర్ 2009 వరకు అసహజ మరణాల పాలైన వారి సంఖ్య – 1988)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు: వ్యవసాయ రంగం	ఆత్మహత్యలు: చేనేత రంగం	ఆత్మహత్యలు: ఇతరాలు స్త్రీ	ఆత్మహత్యలు: ఇతరాలు పు.	చికిత్స అందక, అనారోగ్యం: స్త్రీ	చికిత్స అందక, అనారోగ్యం: పు.	చికిత్స అందక, అనారోగ్యం: పి.	గుర్తు తెలియని: స్త్రీ	గుర్తు తెలియని: పు.	హత్యలు: స్త్రీ	హత్యలు: పు.	ప్రమాదాలు: పనిచేసే స్థలంలో	ప్రమాదాలు: కరెంట్	ప్రమాదాలు: రహదారి	ప్రమాదాలు: ఇతరాలు	పోలీసు కాల్పుల్లో: ఉద్యమ కారులు	పోలీసు కాల్పుల్లో: ఇతరులు	పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)	(20)	(21)	(22)
ఆదిలాబాద్	1	10	–	15	30	17	6	13	–	3	2	3	2	9	12	47	–	–	–	–	1
హైదరాబాద్	–	–	–	8	6	–	1	–	–	5	3	6	1	3	19	19	–	–	–	13	–
కరీంనగర్	1	15	6	19	33	9	26	1	13	2	3	9	9	8	19	16	–	–	–	3	1
ఖమ్మం	–	7	–	12	26	17	45	15	–	5	4	4	6	5	32	2	2	1	–	–	2
మెదక్	–	10	2	8	3	6	9	5	2	4	1	2	3	12	26	8	–	–	–	–	5
నిజామాబాద్	1	5	–	15	25	1	2	–	–	4	–	–	5	5	9	5	–	–	–	–	–
రంగారెడ్డి	–	9	–	6	17	6	16	6	7	8	1	1	12	5	23	9	–	–	–	–	2
వరంగల్	–	11	–	7	22	18	52	13	1	6	5	–	–	9	24	13	–	–	–	–	2
అనంతపురం	–	11	2	–	53	–	14	–	–	8	–	8	3	–	26	28	–	–	–	3	–
చిత్తూరు	–	1	–	–	19	–	16	–	–	8	–	6	4	–	18	–	–	–	–	–	–
కడప	వివరాలు అందలేదు																				
కర్నూలు	–	14	–	20	24	7	26	4	3	10	2	6	5	11	31	82	–	–	–	8	4
తూర్పు గోదావరి	వివరాలు అందలేదు																				
గుంటూరు	1	1	–	8	11	–	–	1	2	7	10	7	5	4	25	19	–	–	–	4	–
కృష్ణా	–	6	–	–	26	–	3	–	–	4	–	14	2	–	26	25	–	–	–	–	3
ప్రకాశం	వివరాలు అందలేదు																				
శ్రీకాకుళం	–	2	–	–	6	–	8	–	–	2	–	6	4	–	12	5	–	–	–	–	2
విశాఖపట్నం	–	–	–	–	11	–	3	–	–	3	–	1	2	–	17	3	–	–	–	–	1
విజయనగరం	–	1	–	8	15	5	3	1	3	2	4	–	1	–	14	15	–	–	–	–	2
మొత్తం	**4**	**103**	**10**	**126**	**327**	**86**	**230**	**59**	**31**	**81**	**35**	**73**	**64**	**71**	**333**	**296**	**2**	**1**	**–**	**31**	**25**

అందిస్తున్నవారు : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; హైదరాబాద్ – డి. విజయభాస్కర్; కరీంనగర్ – ఎల్. సంతోష్; ఖమ్మం – సి.ఎచ్. కృష్ణ; మెదక్ – ఎన్. భగవాన్‌రెడ్డి; నిజామాబాద్ – ఎం. నర్సయ్య; రంగారెడ్డి – శంకరయ్య, వరంగల్ – ఎ.కుమార్; అనంతపురం – ఎం. ఆదిశేషయ్య; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – బి. దస్తగిరి; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – మహమ్మద్ ఇబ్రహీమ్ సాహెబ్; గుంటూరు – బి. అంజమ్మ ; కృష్ణా – బి. రమేష్‌బాబు; ప్రకాశం – కె. మల్లికార్జున్; శ్రీకాకుళం – జి. సుధీర్; విశాఖపట్నం – కె.వి. రమణ; విజయనగరం – డి. సుధాకర్

గమనిక : ఈసారి స్త్రీలు, పురుషులు వేరు వేరుగా నమోదు చేయడం ప్రారంభించాం. కొన్ని జిల్లాల్లో ఆ సమాచారం లభించలేదు. లభించిన సమాచారాన్ని పురుషుల కాలంలో చేర్చి చూపాం.



మీరు చదివారా ?

సామ్రాజ్యవాద కుట్ర గురించి
జాన్ పెర్కిన్స్ సాధికారిక కథనం

ఒక దళారీ పశ్చాత్తాపం

8వ ముద్రణ

వెల : రు. **50**

ప్రతులకు, వివరాలు :
వీక్షణం పబ్లికేషన్స్
మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3,
హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029.
ఫాక్స్, ఫోన్ : 040-66843495


స్వేచ్ఛా సాహితి ప్రచురణగా
'అందరికీ విజ్ఞానం' సిరీస్‌లో
మొదటి పుస్తకం

కొడవటిగంటి రోహిణీప్రసాద్

విశ్వాంతరాళం

వెల : రు. **70**

ప్రతులకు, వివరాలకు :
స్వేచ్ఛా సాహితి
జి1, మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3
హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029.
ఫోన్ : 040-27263261




Advt.


• RNI Regn.No.APTEL/2003/11482• Published on 29/9/2009 • Postal Regn. No. LII/RNP/HD/1100/2008-10

వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగం, ఆర్థిక వ్యవహారాలు,
ఉపాధి, పాలన, ప్రాంతీయ అసమానతలు,
ప్రజా ఉద్యమాలు, తదితర అంశాలపై

వి. హనుమంతరావు
వ్యాసాల సంకలనం
మీరు - నేను - ఆర్థికం

రు. 60





110 ఏళ్లలో 14 దేశాలపై అమెరికా దురాక్రమణల చరిత్ర

స్టీఫెన్ కింజర్

'ఓవర్ త్రో' కు
కొణతం దిలీప్ తెలుగు అనువాదం

కుట్రాజకీయం

అమెరికా దుర్మార్గాల శతాబ్ది


రు. 40

యాభై సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్ సాధించిన అభివృద్ధి - వెనుకబాటుతనం,
విజయాలు - వైఫల్యాలు, రాజకీయార్థిక, సామాజిక పరిణామాలు,
వాస్తవాలు - విశ్లేషణలు, గణాంకాలు నలభై వ్యాసాల సమగ్ర సంకలనం (ఇంగ్లీష్)

సంపాదకులు : ఆర్.ఎస్. రావు, వి. హనుమంతరావు, ఎన్. వేణుగోపాల్

ఫిఫ్టీ ఈయర్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్

సాదా ప్రతి : రు. 225



ప్రతులకు, వివరాలకు:

వీక్షణం

మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3 హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495,
ఇమెయిల్ : veekshanam2003@gmail.com, reachcdrc@yahoo.com
సర్క్యులేషన్ మేనేజర్ : 9949391028

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Charitha Impressions, 1-9-1126/B, Azamabad, Hyderabad - 500 020
and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao